


సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00 | సంపుటి: 18 సంచిక: 174

SUNDAY Special | ఆదివారం 14-9-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



సూపర్ స్పోర్ట్స్ సండే

క్రికెట్: ఆసియా కప్ టి20 టోర్నీ (భారత్ ✗ పాకిస్తాన్) - రాత్రి 8 గంటల నుంచి
మహిళల వన్డే సిరీస్ (భారత్ ✗ ఆస్ట్రేలియా) - మధ్యాహ్నం గం. 1:30 నుంచి
హాకీ: ఆసియా కప్ మహిళల ఫైనల్ (భారత్ ✗ చైనా) - సా.గం. 5:30 నుంచి
బాక్సింగ్: ప్రపంచ చాంపియన్ షిప్ ఫైనల్ -
మీనాక్షి హుడా (భారత్) ✗ కిజైబే నజీమ్ (కజకిస్తాన్) - సా.గం. 4:30 నుంచి
బ్యాడ్మింటన్: హాంకాంగ్ ఓపెన్ డబుల్స్ ఫైనల్ - మ. గం. 12:30 నుంచి
సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి (భారత్) ✗ లియాంగ్-వాంగ్ (చైనా)
సింగిల్స్ ఫైనల్ - లక్ష్య సేన్ (భారత్) ✗ లీ షి ఫెంగ్ (చైనా) - మ.3 గంటల నుంచి

14లో

రాణాలో టోకెన్లు!

క్యూలో ఘర్షణలు పెరగడంతో క్విక్ రియాక్ట్ టీంల పహారా, పోలీసు స్టేషన్లలో రైతులకు యూరియా టోకెన్లు

- కామారెడ్డి, మెదక్, కరీంనగర్, నల్లగొండ జిల్లాల్లో కొరత తీవ్రం
- వరి పొట్ట దశకు రావడంతో అన్నదాతల్లో ఆందోళన
- సమయానికి యూరియా వేయకుంటే పంట పోయినట్టే
- 9.91 ఎల్ఎంటీకి ఇప్పటివరకు 7 ఎల్ఎంటీ మాత్రమే రాక
- ప్రస్తుతం అందుబాటులో 23 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే



శనివారం కామారెడ్డి జిల్లా బీబీపేట పోలీసు స్టేషన్ ముందు కూర్చున్న వీరంతా అన్నదాతలు. బీబీపేట రైతు వేదికలో 600 బస్తాల యూరియా అందుబాటులో ఉండగా రైతులు భారీగా తరలిరావడంతో టోకెన్ల కోసం ఘర్షణలు జరుగుతాయని భయపడ్డ వ్యవసాయ అధికారులు వారిని పోలీసుస్టేషన్‌కు తరలించి పోలీసులతోనే టోకెన్లు ఇప్పించారు.

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో యూరియా పంపిణీ పోలీసుల చేతుల్లోకి వెళ్తోంది. పంటల అదును దాటిపోతోందన్న బాధతో రైతు వేదికల ముందు యూరియా కోసం పడిగాపులు పడుతున్న రైతులు.. ఎలాగైనా యూరియా దక్కించుకోవాలన్న ఆశతో పరస్పరం దాడులకు దిగుతున్నారు. దీంతో చాలాచోట్ల రైతులను అదుపు చేసేందుకు సాయుధ పోలీసులను మోహరిస్తున్నారు. వ్యవసాయ సహకార సొసైటీలకు వస్తున్న యూరియా తక్కువగా ఉండటం, రైతులు అధిక సంఖ్యలో లైన్లలో వేచిచూస్తుండటంతో అధికారులు టోకెన్ల పంపిణీకి జంకుతున్నారు. ఆ బాధ్యతను కూడా పోలీసులకే అప్పగిస్తున్నారు.

తరుముతున్న కాలం..

రాష్ట్రంలో వానాకాలం వరి పంట చాలా జిల్లాల్లో పొట్టదశకు వచ్చింది. గింజ గట్టి పడేందుకు, మొక్కకు బలాన్నిచ్చేందుకు ఇప్పుడు యూరియా వాడకం మిగతా 5వ పేజీలో ▶

ప్రజాస్వామ్య పునాదులపై దాడి

పాత్రికేయుల గొంతు నొక్కే ఇలాంటి చర్యలను ఖండిస్తున్నాం


- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చట్టపరమైన భద్రత కల్పించాలి
- కేసులు, దాడులు, వేధింపులకు పాల్పడ్డ వారిపై కఠినచర్యలు తీసుకోవాలి

'సాక్షి' మీడియా సంస్థ, వారి జర్నలిస్టులకు వేధింపులపై ఐఎన్ఎస్ ఆగ్రహం

సాక్షి, న్యూఢిల్లీ: జర్నలిస్టులు, మీడియా సంస్థలపై పెరుగుతున్న దాడులను ది ఇండియన్ న్యూస్ పేపర్ సొసైటీ (ఐఎన్ఎస్) తీవ్రంగా ఖండించింది. 'సాక్షి'మీడియా సంస్థ, వారి జర్నలిస్టులపై జరుగుతున్న దాడులు, వేధింపులపై ఐఎన్ఎస్ తీవ్ర ఆందోళన వ్యక్తంచేసింది. ఈ మేరకు ఐఎన్ఎస్ అధ్యక్షుడు ఎం.వి. శ్రేయామ్స్ కుమార్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పత్రికా రంగంపై జరుగుతున్న ఈ దాడులను ప్రజాస్వామ్య పునాదులు, పత్రికా స్వేచ్ఛపై జరిగిన దాడిగా ఐఎన్ఎస్ అభివర్ణించింది. ఆంధ్రప్రదేశ్‌లో 'సాక్షి'జర్నలిస్టులపై పలుమార్లు దాడులు జరగడంతో పాటు, కక్ష సాధింపు చర్యల్లో భాగంగా వారిపై అక్రమ కేసులు బనాయించి, విచారణల పేరుతో వేధిస్తున్నారని ఐఎన్ఎస్ దృష్టికి వచ్చిందన్నారు. మీడియా కార్యాలయాలు, సాక్షి ఎడిటర్ నివాసంలో సోదాలు నిర్వహించడం వంటి చర్యలకు రాష్ట్ర ప్రభుత్వం పాల్పడినట్లు తమ దృష్టికి వచ్చిందని ఆ ప్రకటనలో ఆయన పేర్కొన్నారు.

స్వతంత్ర జర్నలిజాన్ని అణచివేసే ధోరణి..

ప్రజా ప్రయోజనాల కోసం పనిచేసే జర్నలిస్టుల గొంతు నొక్కే ఇలాంటి మిగతా 2వ పేజీలో ▶



ప్రభుత్వం పత్రికా స్వేచ్ఛను హరిస్తోంది

కక్ష సాధింపులు, బెదిరింపు ధోరణి మానుకోవాలని జర్నలిస్టు సంఘాలు, రాజకీయ నేతల హితవు 2లో

న్యూస్‌రీల్

ఈవీఎంలను మ్యానిపులేట్ చేయలేరని చెప్పలేం



ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎం)ను మ్యానిపులేట్ చేసే అవకాశాలను తోసిపుచ్చలేమని కేంద్ర ఎన్నికల సంఘం మాజీ కమిషనర్ అశోక్ లావాసా అన్నారు. అయితే దేశంలో ఈవీఎంలను మ్యానిపులేట్ చేస్తున్నట్లు తాను భావించడం లేదన్నారు.

- వివరాలు 16లో▶

రెండు వాగులు.. ఆరు ప్రాణాలు!



కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలం చికిలివాగులో ఖాళీ యూరియా సంచులు కడుగుతూ నీటమునిగి నలుగురు మృతిచెందగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం కావడిగుండ్లలో వాగు దాటుతూ ఇద్దరు గల్లంతయ్యారు.

- వివరాలు 5లో▶

సింగిల్ డిజిట్ శిక్షలేనా ?



'ప్రతిరోజూ అక్రమ మద్యం, గంజాయి, డ్రగ్స్ పట్టుకొని కేసులు నమోదు చేస్తున్నారు. కానీ ఈ కేసుల్లో నిందితులకు శిక్షలు పడట్లేదేం? శిక్షలు సింగిల్ డిజిట్‌కే పరిమితమా?' అని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ప్రశ్నించారు.

- వివరాలు 3లో▶

రష్యా నుంచి చమురు కొనే దేశాలపై టారిఫ్‌లు వేయండి

జీ7 దేశాలను కోరిన అమెరికా

- వివరాలు 6లో▶

విశ్వాస వారధి నిర్మించాల్సిందే



- మణిపూర్‌లో కొండ ప్రాంతాలు, లోయ మధ్య సోదరభావం నెలకొనాలి
- రాష్ట్రంలో అన్ని జాతులు కలిసికట్టుగా జీవనం సాగించాలి
- హింసను విడనాడి అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలి
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు
- ఇంఫాల్, చురాచాంద్‌పూర్‌లో బహిరంగ సభల్లో ప్రసంగం

"మణిపూర్‌లో శాంతిని బేరసారాలు, బలప్రయోగంతో సాధించలేం. సుహృద్భావ వాతావరణంలో సంప్రదింపులు, ప్రజల ఐక్యతతోనే అది సాధ్యం. మణిపూర్ శక్తివంతమైన, సుందరమైన రాష్ట్రం. కానీ, ఇక్కడి సామాజిక జీవనాన్ని హింసాకాండ బలహీనపర్చింది. శాంతి, సామరస్యంతోనే తూర్పు భారతదేశ కీర్తికిరీటంలో తన స్థానాన్ని మణిపూర్ తిరిగి పొందుతుంది. మణిపూర్‌లోనే మణి ఉంది. ఈశాన్య భారత దేశంలో ఈ మణి గొప్పగా ప్రకాశించబోతోంది. - మోదీ

6లో

గ్రోత్ ఇంజన్ 'ఈశాన్యం'

- గతంలో ఓటు బ్యాంకు రాజకీయాల వల్ల తీవ్ర అన్యాయం
- మేము వచ్చాక ఈశాన్య రాష్ట్రాలకు ప్రాధాన్యమిస్తున్నాం
- మిజోరంలో ప్రధాని మోదీ

6లో

కృష్ణా జలాల్లో 904 టీఎంసీలే లక్ష్యం

- 23, 24, 25 తేదీల్లో ట్రిబ్యునల్ ముందు బలంగా తెలంగాణ వాదన వినిపించాలని న్యాయ నిపుణులకు సీఎం సూచన
- మంత్రి ఉత్తమ్‌తో కలిసి సమీక్ష
- అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులు, ఉమ్మడి ఏపీలో ఇచ్చిన జీవోలను ట్రిబ్యునల్ ముందుంచాలని ఆదేశం



నీటిపారుదలశాఖపై సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: కృష్ణా జలాల్లో తెలంగాణకు 904 టీఎంసీల నీటిని సాధించడమే లక్ష్యంగా వాదనలు వినిపించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి న్యాయ నిపుణులు, నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. కృష్ణా జలాలపై ఈ నెల 23, 24, 25 తేదీల్లో బ్రిజేష్ ట్రిబ్యునల్ వద్ద వాదనలు వినిపించాల్సి ఉన్న నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డితో కలిసి ఇంటిగ్రేటెడ్ పోలీస్ కమాండ్ కంట్రోల్ కేంద్రంలో సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సీఎస్ వైద్యనాథన్, కేంద్ర జల సంఘం మాజీ చైర్మన్ ఎస్‌కే వోహ్రా, ప్రభుత్వ నీటిపారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్‌దాస్, ఆ శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్‌బొజ్జా, కార్యదర్శి పీజీ పాటిల్, చీఫ్ ఇంజనీర్లతో శనివారం సమీక్షించి, వారికి దిశానిర్దేశం చేశారు. కృష్ణానదిలో నికర జలాలైనా, మిగులు జలాలైనా, వరద జలాలైనా సరే.. తెలంగాణకు చెందాల్సిన నీటి వాటాలో ఒక చుక్క నీరు కూడా వదులుకునేది లేదని సీఎం చెప్పారు. న్యాయ నిపుణులకు అవసరమైన ఆధారాలన్నీ ఇవ్వాలని నీటిపారుదల శాఖ అధికారులను సీఎం ఆదేశించారు. స్వయంగా మంత్రి ఉత్తమ్ ఢిల్లీకి వెళ్లి ఈ విచారణలో పాల్గొంటారని ముఖ్యమంత్రి తెలిపారు. ఉమ్మడి రాష్ట్రం నుంచి ఇప్పటి వరకు కృష్ణానదిపై ఉన్న ప్రాజెక్టులు, నిర్మించ తలపెట్టిన మిగతా 3వ పేజీలో ▶

రాజీనామాలు చేయించు.. ఎన్నికలకు రా..



గద్వాల జిల్లా కేంద్రంలో జరిగిన సభలో ప్రసంగిస్తున్న కేటీఆర్

- సీఎం రేవంత్‌కు కేటీఆర్ సవాల్
- పార్టీ ఫిరాయింపులపై సుప్రీంకోర్టు సీరియస్‌గా ఉంది
- 9 నెలల్లో కచ్చితంగా ఉప ఎన్నికలు వస్తాయి
- ఎవరి సత్తా ఏమిటో ప్రజలే తేలుస్తారని ధ్వజం
- గద్వాలలో బీఆర్ఎస్ గర్జన సభ

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: 'నాడు పార్టీ మారిన ఎమ్మెల్యేలను రాళ్లతో కొట్టండని చెప్పింది సీఎం రేవంత్‌రెడ్డే. నేడు పది మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను తనవైపు లాగేసుకున్నాడు. దమ్ముంటే వారి చేత రాజీనామా చేయించి ఉప ఎన్నికలకు రావాలి. ఎవరి సత్తా ఏమిటో ప్రజలే తేలుస్తారు' అని సీఎం రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ విసిరారు. జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన బహిరంగసభలో చేరికల అనంతరం ఆయన మాట్లాడారు. 'కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 22 నెలలు గడిచింది. ఆడబిడ్డలకు రూ.2,500, రైతుబంధు, దళితబంధు, ఆసరా పింఛన్లు, రైతు రుణమాఫీ ఇలా ఏ పథకాన్ని కాంగ్రెస్ పక్కాగా అమలు చేసింది? ఈ జిల్లాకు, ఈ నియోజకవర్గానికి ఏమి ఇచ్చాడని.. ఏ అభివృద్ధి చేశాడని ఇక్కడున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డి సంకలో కూర్చున్నాడు. మళ్లీ బీఆర్ఎస్‌లోనే ఉన్నానని సన్నాయి నొక్కులు నొక్కుతున్నాడు. నీ నియోజకవర్గ అభివృద్ధి కోసమా.. నీ అభివృద్ధి కోసమా దొంగల ముఠాలో చేరింది' అని అన్నారు. ఇంకా కేటీఆర్ ఏమన్నారో ఆయన మాటల్లోనే..

9 నెలల్లో ఉప ఎన్నికలు వస్తాయి..: 'పార్టీ మారి కాంగ్రెస్‌లో చేరిన పది మంది ఎమ్మెల్యేల చేత రేవంత్‌రెడ్డి రాజీనామా చేయించి మిగతా 12వ పేజీలో ▶

ఇదండీ సంగతి



... మనం ఇక్కడ 'ఏసీ'కే తావులేకుండా చేయాలి!

చదువుకోనాల్సిందే!

ప్రభుత్వ పాఠశాలలకంటే ప్రైవేటులో ప్రియం
ప్రాంతం ఏదైనా ఫీజుల్లో ఎన్నో రెట్ల తేడా
ఖరీదైన వ్యవహారంగా కిండర్‌గార్టెన్ విద్య

2లో

గుర్తుంచుకోండి

వయసు పెరిగేకొద్దీ తరిగిపోయే జ్ఞాపకశక్తి
కాస్త కష్టపడితే మెమొరీ పవర్ మీ సొంతం
ప్రపంచ వ్యాప్త అధ్యయనాల సారాంశం ఇదే

- వివరాలు 16లో

చర్చలతో లాభం లేదు

మావోయిస్టులు కాలయాపన కోసం వేసే ఎత్తుగడ అది

- మావోల విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానం ఒకటే
- అజ్ఞాతం వీడి జనజీవనంలోకి రావాలని పిలుపు
- డీజీపీ సమక్షంలో లొంగిపోయిన మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యురాలు సుజాత



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీజీపీ జితేందర్. చిత్రంలో ఎస్ఐబీ చీఫ్ బి.సుమతి, లొంగిపోయిన మావోయిస్టు సుజాత

సాక్షి, హైదరాబాద్: మావోయిస్టులతో చర్చలు జరపడం వల్ల ఫలితం ఏమీ ఉండదని డీజీపీ జితేందర్ అభిప్రాయపడ్డారు. '2004లోనూ మావోయిస్టులతో జరిపిన చర్చల సందర్భంగా ఫలితమేమీ రాలేదు. చర్చలు అనేది మావోయిస్టులు తమను తాము కాపాడుకునేందుకు, కాలయాపన చేసేందుకు వేసే ఒక ఎత్తుగడ మాత్రమే' అని ఆయన పేర్కొన్నారు. చర్చలకు తాము సిద్ధమని మావోయిస్టులు చేస్తున్న ప్రకటనలపై రాష్ట్ర ప్రభుత్వ వైఖరి ఏమిటని మీడియా అడిగిన ప్రశ్నకు డీజీపీ ఈ విధంగా స్పందించారు. మావోయిస్టుల విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల్లో ఎలాంటి మార్పు లేదని స్పష్టం చేశారు. లొంగిపోవడమే మావోయిస్టులకు ఉత్తమ మార్గమని తెలిపారు. మార్చి 31, 2026 వరకు మావోయిస్టులను పూర్తిగా నిర్మూలించాలన్నది అంతిమ లక్ష్యమని.. అది లొంగుబాట్లు కావచ్చు, లేదా ఎన్‌కౌంటర్ ద్వారా కావొచ్చు.. అని పేర్కొన్నారు. అజ్ఞాతం వీడి జనజీవన స్రవంతిలోకి రావాలని మావోయిస్టులకు డీజీపీ మిగతా 5వ పేజీలో ▶



స్కూల్లోని ఓ గదిలో ఉన్న ఆల్ప్రాజోలం తయారీ కేంద్రం

పగలు తరగతులు.. రాత్రి ఆల్ప్రాజోలం తయారీ

పాఠశాలలో మత్తుమందు తయారీ యూనిట్ గుట్టురట్టు

- మత్తు మందును తీసుకెళ్తుండగా పట్టుకున్న ఈగల్ టీం
- రూ.50 లక్షల విలువైన ఆల్ప్రాజోలం స్వాధీనం
- సికింద్రాబాద్‌లోని మేధా హైస్కూల్ కరస్పాండెంట్ అరెస్ట్

15లో

చట్టసభలు ప్రజాస్వామ్యంలో దేవాలయాల వంటివి


సీపీఏ ఇండియా రీజియన్ సదస్సులో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్



సాక్షి, హైదరాబాద్: చట్టసభలు ప్రజాస్వామ్యంలో దేవాలయాల వంటివని, ఇక్కడ జరిగే చర్చలు ప్రజల ఆకాంక్షలకు ప్రతీకగా, సభ్యుల నైపుణ్యానికి వేదికగా నిలుస్తాయని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ పేర్కొన్నారు. బెంగళూరులో జరుగుతున్న 11వ కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ (సీపీఏ) ఇండియా రీజియన్ సదస్సులో 'ప్రజల నమ్మకాన్ని పెంపొందించడం, ప్రజా ఆకాంక్షలను నెరవేర్చడం'అనే అంశంపై స్పీకర్ ప్రసంగించారు. 'తెలంగాణ శాసనసభ ప్రజా సమస్యలపై నిర్మాణాత్మక చర్చలకు ప్రాధాన్యమిస్తూ, సభ్యులకు తగిన సమయం కేటాయిస్తుంది. నూతన సభ్యులకు శిక్షణ తరగతులు నిర్వహించడం, సభా సమావేశాలను ప్రత్యక్ష ప్రసారం చేయడం ద్వారా పారదర్శకతను పెంపొందిస్తున్నాం. గతంలో అర్ధరాత్రి వరకు సమావేశాలు నిర్వహించిన సందర్భాలు కూడా ఉన్నాయి'అని ప్రసాద్‌కుమార్ తెలిపారు. 'శాసనసభల పనితీరు మెరుగుపరిచేందుకు ఏడాదిలో కనీస సమావేశ రోజులను నిర్ణయించడంతో పాటు క్రమశిక్షణ కోసం నియమావళిని రూపొందించాలి. చట్టాల రూపకల్పనలో భాగస్వామ్యం కావడం ద్వారా ప్రజాస్వామ్య బలోపేతానికి, రాజ్యాంగ విలువల సంరక్షణకుశాసనసభ కృషి చేస్తోంది'అని వెల్లడించారు. సదస్సులో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ పాల్గొన్నారు.

పంచాయతీ ఏర్పాటుకు 500 జనాభా తప్పనిసరి

- 317 మందితో వందూర్‌గూడ ఎలా ఏర్పాటు చేశారన్న హైకోర్టు
- తప్పుడు గణాంకాలు చెప్పిన వారిపై చర్యలు తీసుకోండి
- ప్రభుత్వాన్ని ఆదేశించిన జస్టిస్ టి.మాధవీదేవి



సాక్షి, హైదరాబాద్: ప్రత్యేక గ్రామ పంచాయతీని ఏర్పాటు చేయాలంటే కనీస జనాభా 500 తప్పనిసరిగా ఉండాలని, మీ ఇష్టం వచ్చినట్లు ఏర్పాటు చేయడం కుదరదని హైకోర్టు స్పష్టం చేసింది. ఆ మేరకు జనాభా లేకుండానే తప్పుడు గణాంకాలతో మంచిర్యాల జిల్లాలో వందూర్‌గూడను ఎలా ఏర్పాటు చేశారని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. 317 మంది జనాభా ఉన్నట్లు ప్రభుత్వ న్యాయవాది దాఖలు చేసిన మెమోను పరిగణనలోకి తీసుకుని.. అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసింది. వెంకటాపూర్ గ్రామ పంచాయతీని విభజించి వందూర్‌గూడను ఏర్పాటు చేయడాన్ని పునఃపరిశీలించాలని పీఆర్ అండ్ ఆర్‌డీ ముఖ్యకార్యదర్శిని ఆదేశించింది. ప్రభుత్వానికి, శాసనసభకు తప్పుడు సమాచారం అందించడానికి కారణమైన అధికారులను గుర్తించి, వారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని ప్రధాన కార్యదర్శికి స్పష్టం చేసింది. వందూర్‌గూడ విభజన చట్టవిరుద్ధమంటూ మోకాసి దౌలత్ రావు హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ టి.మాధవీదేవి విచారణ చేపట్టారు. 2011 జనాభా లెక్కల ఆధారంగా కొత్త పంచాయతీ ఏర్పాటైందని జీపీ నివేదించారు. విభజన నాటికి కొత్త పంచాయతీ జనాభా 613గా చూపినట్లు చెప్పారు. అయితే అధికారులు కోర్టుకు సమర్పించిన మెమోలో జనాభా 317గా పేర్కొనడంపై న్యాయమూర్తి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్కోసారి ఒక్కోరకమైన గణాంకాలు ఎలా చెబుతారని మందలించారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. గ్రామసభ నిర్వహించకుండా, పంచాయతీ ప్రజల అనుమతి లేకుండానే కొత్త గ్రామాన్ని ఏర్పాటు చేశారన్నారు. తప్పుడు గణాంకాలపై అధికారుల తరఫున జీపీ క్షమాపణ చెబుతూ.. పంచాయతీ ఏర్పాటుపై పునఃపరిశీలన చేస్తామని హామీ ఇచ్చారు.

చదువుకొనాల్సిందే!

ప్రభుత్వ పాఠశాలలకంటే ప్రైవేటులో ప్రియం | ప్రాంతం ఏదైనా ఫీజుల్లో ఎన్నో రెట్ల తేడా | ఖరీదైన వ్యవహారంగా కిండర్‌గార్టెన్ విద్య



స్కూల్ ఫీజు అనగానే సగటు జీవి బెంబేలెత్తిపోతున్నాడు. ప్రభుత్వ పాఠశాలలు అయితే పెద్దగా భారం అనిపించదు. సమస్యల్లా ప్రైవేటు స్కూళ్లతోనే. ఎందుకంటే అక్కడ చదువు'కొనాల్సిందే'. ఇది జగమెరిగిన సత్యం. దేశవ్యాప్తంగా ప్రభుత్వ బడులతో పోలిస్తే ప్రైవేటు పాఠశాలల్లో ఒక్కో విద్యార్థికి ఏటా అవుతున్న సగటు ఖర్చుల్లో తేడా ఎన్నో రెట్లు ఉంటోంది. పట్టణాలే కాదు గ్రామీణ ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి.

దేశంలో కిండర్‌గార్టెన్ (కేజీ) విద్య.. అంటే నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ చదువుకు ఏటా అయ్యే ఖర్చు ప్రైవేటు పాఠశాలల్లో అధికంగా ఉంది. ప్రీ-ప్రైమరీ స్థాయిలో ప్రభుత్వ బడులతో పోలిస్తే ప్రైవేటు స్కూళ్లలో ఒక్కో విద్యార్థికి ఏటా అయ్యే వ్యయం.. గ్రామీణ ప్రాంతాల్లో 21.8 రెట్లు, పట్టణ ప్రాంతాల్లో 16.1 రెట్లు అధికంగా ఉంది. 9, 10వ తరగతులు (సెకండరీ), 11, 12 తరగతుల (హయ్యర్ సెకండరీ) విషయంలో ఈ వ్యత్యాసం తక్కువగా ఉంది. కేంద్ర గణాంక శాఖ 2025 ఏప్రిల్–జూన్ మధ్య చేపట్టిన సర్వే ఆధారంగా రూపొందించిన 'కాంప్రహెన్సివ్ మాడ్యులర్ సర్వే: ఎడ్యుకేషన్ 2025' నివేదికలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. వ్యయం అంటే.. స్కూల్లో అడ్మిషన్ ఫీజు, ట్యూషన్ ఫీజు, పరీక్ష ఫీజు, డెవలప్‌మెంట్ ఫీజు, ఇతరత్రా కార్యక్రమాలకోసం చేసే ఖర్చు; రవాణా, పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, స్టేషనరీ.. ఇలా విద్యార్థి చదువు కోసం చేసిన మొత్తం ఖర్చు.

సాక్షి, స్పెషల్ డెస్క్



ప్రీప్రైమరీలో..

అధికవ్యయం అవుతున్న టాప్ 5 రాష్ట్రాలు

దేశ సగటు	9,807
ఢిల్లీ	24,730
పంజాబ్	22,777
తమిళనాడు	18,245
కేరళ	17,677
హరియాణా	15,272
తెలుగు రాష్ట్రాల్లో ఇలా..	
ఆంధ్రప్రదేశ్	12,086
తెలంగాణ	13,767

ప్రైమరీలో (1-5)

దేశ సగటు	10,662
హరియాణా	23,429
పంజాబ్	23,185
తెలంగాణ	20,703
తమిళనాడు	19,987
ఢిల్లీ	18,077
ఆంధ్రప్రదేశ్	14,850

మిడిల్ క్లాసెస్ (6-9)

దేశ సగటు	12,422
హరియాణా	29,983
పంజాబ్	23,544
తమిళనాడు	20,627
ఆంధ్రప్రదేశ్	19,782
తెలంగాణ	17,933

అంకెలు రూపాయల్లో..

సెకండరీ

దేశ సగటు	14,781
ఢిల్లీ	26,307
హరియాణా	24,723
ఆంధ్రప్రదేశ్	24,685
పంజాబ్	23,502
తమిళనాడు	23,143
తెలంగాణ	21,179

హయ్యర్ సెకండరీ

దేశ సగటు	20,133
హరియాణా	37,099
తెలంగాణ	30,326
కర్ణాటక	28,565
తమిళనాడు	27,839
గుజరాత్	25,414
ఆంధ్రప్రదేశ్	24,775

అన్ని స్థాయిల్లో..

దేశ సగటు	12,616
హరియాణా	25,720
పంజాబ్	22,692
తమిళనాడు	21,526
తెలంగాణ	20,590
కర్ణాటక	18,756
ఆంధ్రప్రదేశ్	18,479

ప్రభుత్వం పత్రికా స్వేచ్ఛను హరిస్తోంది

టీడీపీ కూటమి ప్రభుత్వ తీరు అప్రజాస్వామికం

సాక్షి ఎడిటర్, జర్నలిస్టులను కేసుల పేరుతో వేధించడంపై సర్వత్రా ఆగ్రహం

కక్షసాధింపులు, బెదిరింపు ధోరణి మానుకోవాలని జర్నలిస్టు సంఘాలు, రాజకీయ నేతల హితవు

సాక్షి నెట్‌వర్క్: సాక్షి దినపత్రిక ఎడిటర్, పలువురు జర్నలిస్టులపై టీడీపీ కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు అప్రజాస్వామికమని.. అది సంపాదక స్వేచ్ఛను హరించడమేనని ప్రజాస్వామ్య వాదులు, జర్నలిస్టు సంఘాల నేతలు, రాజకీయ నాయకులు మండిపడ్డారు. కేసుల పేరుతో ఇటీవల వారిని విచారణ నిమిత్తం పోలీసుస్టేషన్లకు పిలిపించడం.. గంటల తరబడి విచారించడం దారుణమన్నారు. పోలీసు కేసులతో సంపాదక స్వేచ్ఛను కట్టడి చేయాలని చూడటం సరికాదని చెప్పారు. ఎవరెవరు ఏమన్నారంటే..





సాక్షి ఎడిటర్‌పై కేసులు దుర్మార్గమైన చర్య..

సాక్షి ఎడిటర్ ధనంజయరెడ్డిపై కేసులు పెట్టి వేధింపులకు దిగడం దుర్మార్గమైన చర్య. ఆయన ఇంట్లో సోదాలు నిర్వహించడం.. విచారణ పేరుతో వేధించడం సరికాదు. ఇటీవల రాష్ట్రంలో ఆరు ప్రాంతాల్లో జర్నలిస్టులపై పోలీసులు వ్యవహరించిన తీరు అభ్యంతరకరంగా ఉంది. అలాగే, పలువురు విలేకరులను పోలీస్‌స్టేషన్‌కు పిలవడం, నోటీసులతో బెదిరించే ప్రయత్నాలు చేశారు. జర్నలిస్టులను భయపెట్టి కట్టడి చేయాలనే చర్యలు తగదు. ఇలాంటి చర్యలను ఏపీడబ్ల్యూజేఎఫ్ తీవ్రంగా ఖండిస్తోంది.

\- ఆంజనేయులు, ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించడం తగదు..

పత్రికా స్వేచ్ఛకు పాలకవర్గాలు భంగం కలిగించడం తగదు. ఆంధ్రప్రదేశ్‌లో సాక్షి దినపత్రికపై దాడులు చేయడం సరికాదు. పత్రికలో విభిన్నమైన వార్తలు ప్రచురిస్తే రాష్ట్ర, నేషనల్ ప్రెస్‌కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్లాలిగానీ.. ప్రత్యక్ష దాడులకు పాల్పడటం, కక్షసాధింపు చర్యగా పాత్రికేయులపై అక్రమ కేసులు బనాయించడం తగదు.

\- సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

సంపాదక స్వేచ్ఛను దెబ్బతీయడమే..



ఇటీవల సాక్షి ఎడిటర్ ధనంజయ రెడ్డి ఇంట్లో పోలీసులు సోదాలు నిర్వహించడం, పోలీస్‌స్టేషన్‌కు పిలిచి విచారించడం వంటి చర్యలు సంపాదక స్వేచ్ఛను దెబ్బతీసేలా ఉన్నాయి. పత్రికలో కంటెంట్‌ను కంట్రోల్ చేయాలని ఏ ప్రభుత్వం కూడా అనుకోకూడదు. అలా ప్రయత్నిస్తే అది ముమ్మాటికి పత్రికా స్వేచ్ఛను హరించమే అవుతుంది. పాలక పక్షానికి సాక్షి యాజమాన్యంతో ఉన్న రాజకీయ వైరాన్ని సాక్షి జర్నలిస్టులపై చూపడం తగదు. టీడీపీ కూటమి ప్రభుత్వం అటువంటి చర్యలకు స్వస్తి పలికి పత్రికా స్వేచ్ఛను కాపాడాలి. పోలీసు కేసులతో సంపాదక స్వేచ్ఛను కట్టడి చేయాలని చూడటం సరికాదు.

\- సోమసుందర్, ఐజేయూ జాతీయ కార్యదర్శి

జర్నలిస్టుల పట్ల సర్కారు తీరు బాధాకరం



టీడీపీ కూటమి ప్రభుత్వం 'సాక్షి' ఎడిటర్, జర్నలిస్టులపట్ల వ్యవహరిస్తున్న తీరు, వారి నోరు నొక్కడానికి పోలీసు యంత్రాంగాన్ని వినియోగిస్తున్న తీరు చాలా బాధాకరం. ప్రభుత్వాలకు, ప్రజలకు మధ్య పత్రికలు వారధిలా పనిచేస్తాయి. ప్రభుత్వంలో జరిగే లోపాల్ని, తప్పొప్పుల్ని పత్రికలూ ఎత్తిచూపుతాయి. అది వాటి బాధ్యత. తమకు వ్యతిరేకంగా వార్తలు రాసిన పత్రికల నోరు నొక్కుతామని ప్రభుత్వం అనుకుంటే చివరికి అదెక్కడికి దారితీస్తుందో ఆలోచించుకోండి. రాజకీయ పార్టీలు తమతమ కోణాల్లో రాజకీయాలు చేసుకోవాలి తప్ప, మీడియా సంస్థలను, జర్నలిస్టులను వేధించడం తగదు.

\- ధర్మాన ప్రసాదరావు, మాజీ మంత్రి

ప్రజాస్వామ్యానికే ముప్పు..



3మీడియా సంస్థల గొంతు నొక్కడం ప్రజాస్వామ్యంపై దాడే. పత్రికా స్వేచ్ఛను పాలక వర్గాలు పరిరక్షించినప్పుడే పాత్రికేయులు నిజాలను నిర్భయంగా వెలికితీయగలరు. దాన్ని అణగదొక్కే ఏ ప్రయత్నమూ సమర్థనీయం కాదు. 'సాక్షి'లో పోలీసు అధికారుల పదోన్నతులు, బదిలీలపై కథనం ప్రచురితమైందని ఎడిటర్ ఆర్. ధనంజయరెడ్డి, మరో ఇద్దరు పాత్రికేయులను గంటల తరబడి విచారణ పేరుతో వేధించడం ప్రజాస్వామ్య సూత్రాలకు విరుద్ధం. ఇది కూటమి ప్రభుత్వ పాలకుల కక్ష సాధింపులకు నిదర్శనం. కేసులు పెట్టి పాత్రికేయులను బెదిరించడం ప్రజాస్వామ్య వ్యవస్థను అపహాస్యం చేయటమే.

\- తమ్మినేని సీతారాం, మాజీ స్పీకర్

ప్రజాస్వామ్య పునాదులపై దాడి

▶ మొదటి పేజీ తరువాయి

చర్యలను సొసైటీ తీవ్రంగా ఖండిస్తోందని ఐఎన్ఎస్ తెలిపింది. ఈ దాడులు స్వతంత్ర జర్నలిజాన్ని అణచివేసే ఒక ఆందోళనకరమైన ధోరణిలో భాగమని శ్రేయామ్స్ కుమార్ అభిప్రాయపడ్డారు. జర్నలిస్టులు ఎలాంటి భయం, బెదిరింపులు, హింసకు గురికాకుండా తమ వృత్తిపరమైన బాధ్యతలను నిర్వర్తించగలగాలని సూచించింది. దేశంలో పత్రికా రంగం శత్రువు కాదని.. ప్రజాస్వామ్య జవాబుదారీతనాన్ని బలోపేతం చేసే మిత్రపక్షమని ఐఎన్ఎస్ పేర్కొంది.

మీడియా ప్రతినిధులకు భద్రత కల్పించాలి..

ఇక ఈ దాడులకు పాల్పడిన వారిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని, మీడియా ప్రతినిధుల రక్షణకు తగిన చట్టపరమైన భద్రత కల్పించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఐఎన్ఎస్ డిమాండ్ చేసింది. బెదిరింపులు, హింసను ఎదుర్కొంటున్న జర్నలిస్టులు, మీడియా సంస్థలకు తాము అండగా నిలుస్తామని సొసైటీ పునరుద్ఘాటించింది. రాజ్యాంగం కల్పించిన పత్రికా స్వేచ్ఛ కోసం తమ పోరాటం కొనసాగుతుందని ఐఎన్ఎస్ సెక్రటరీ జనరల్ మేరీ పాల్ కూడా తెలిపారు.

విడాదాలకు సామరస్య పరిష్కారం

టీజీఎల్ఎస్ఏ సేవలు అభినందనీయమన్న జస్టిస్ శామ్‌కోషి




లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న జస్టిస్ శామ్‌కోషి. జస్టిస్ మౌషుమి భట్టాచార్య

సాక్షి, హైదరాబాద్/నిర్మల్‌టౌన్: వివాదాలను సామరస్య పూర్వకంగా పరిష్కరించుకునే వేదిక లోక్ అదాలత్ అని తెలంగాణ రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ (టీజీఎల్ఎస్ఏ) ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ శామ్‌కోషి పేర్కొన్నారు. అథారిటీ సేవలు అభినందనీయమని, వాటిని పేద, మధ్యతరగతి ప్రజలు వినియోగించుకొని లబ్ధిపొందాలని పిలుపునిచ్చారు. శనివారం నిర్మల్ జిల్లాలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న జస్టిస్ శామ్‌కోషి జాతీయ లోక్ అదాలత్‌ను ప్రారంభించారు. శనివారం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌కు కక్షిదారుల నుంచి విశేష స్పందన వచ్చిందని అథారిటీ సభ్య కార్యదర్శి సీహెచ్.పంచాక్షరీ వెల్లడించారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో ఒకేరోజు 11,06,347 కేసులను పరిష్కరించారు. వీటిలో ప్రి-లిటిగేషన్ కేసులు 3,63,156, వివిధ కేటగిరీల్లోని పెండింగ్ కేసులు 7,43,191 ఉన్నాయి. లబ్ధిదారులకు రూ.595 కోట్ల పరిహారం చెల్లింపులకు ఉత్తర్వులు జారీ చేశారు. జస్టిస్ శామ్‌కోషి, జస్టిస్ మౌషుమి భట్టాచార్య మార్గదర్శకాల మేరకు లోక్ అదాలత్‌ను నిర్వహించారు.

హైకోర్టు ఆధ్వర్యంలో..

హైకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ జస్టిస్ మౌషుమి భట్టాచార్య ఆధ్వర్యంలో జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో విశ్రాంత న్యాయమూర్తులు జస్టిస్ జీవీ సీతాపతి, జస్టిస్ శ్రీదేవి పాల్గొన్నారు. హైకోర్టులో 180 కేసులు పరిష్కారం కాగా, వీటిలో 36 ప్రీలిటిగేషన్, 144 పెండింగ్ కేసులున్నాయి. రూ.12.16 కోట్లను 1,100 మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు. వాహన ప్రమాదంపై న్యూ ఇండియా అస్యూరెన్స్ కంపెనీకి సంబంధించిన ప్రీ లిటిగేషన్ కేసులో లబ్ధిదారు బీటెక్ విద్యార్థి పవన్‌కుమార్‌కు రూ.1.2 కోట్ల చెక్కును జస్టిస్ మౌషుమి భట్టాచార్య అందజేశారు.

సమాజంలో మార్పులకు అనుగుణంగా కొత్త చట్టాలు

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్



మాట్లాడుతున్న జస్టిస్ కె.లక్ష్మణ్

వరంగల్ లీగల్: సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ప్రభుత్వాలు నూతన చట్టాలు రూపొందిస్తున్నాయని, ఆ కోవలోకి వచ్చిందే అవినీతి నిరోధక చట్టం అని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ అన్నారు. శనివారం హనుమకొండ డీసీసీబీ భవనంలో న్యాయవాద పరిషత్ ఆధ్వర్యంలో అవినీతి నిరోధక చట్టంపై జరిగిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అవినీతి అనేది సామాజిక రుగ్మతగా మారిందన్నారు. ప్రధానంగా ఉద్యోగవర్గాలు అవినీతి సొమ్మును కుటుంబ సభ్యుల ద్వారా తీసుకున్నా నేరంగా పరిగణిస్తామని స్పష్టం చేశారు. అతి తక్కువగా 31 సెక్షన్లతో మాత్రమే ఉన్న అవినీతి నిరోధక చట్టంపై న్యాయవాదులు నిరంతరం అధ్యయనం చేయాలని సూచించారు. ప్రతి సెక్షన్‌పై ఉన్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టు తీర్పులు సైతం ఉన్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాద పరిషత్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ప్రభాకర్‌రెడ్డి, సంసాని సునీల్, ఉభయ బార్ అసోసియేషన్ అధ్యక్షులు సుధీర్, సత్యనారాయణ, హైకోర్టు న్యాయవాది కర్రూర్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పీజీయే బెటర్!

- ట్రెండ్ మారుస్తున్న బీటెక్ విద్యార్థులు
- యూఎస్‌లో ఇటీవలి పరిణామాల ఫలితం
- పీజీ కోర్సులకు పెరుగుతున్న దరఖాస్తులు
- నౌకరీ డాట్ కామ్ సర్వేలో వెల్లడి



సాక్షి, హైదరాబాద్: విద్యార్థుల్లో ఇటీవలి కాలంలో ఇంజనీరింగ్ తర్వాత ఏం చేయాలనే ఆలోచన ఎక్కువైంది. కొందరైతే కన్సల్టెన్సీలను ఆశ్రయిస్తున్నారు. వివిధ రకాల ఆన్‌లైన్ ప్లాట్ ఫాంల్లోనూ వివరాలను రాబడుతున్నారు. రెండేళ్ల క్రితం వరకైతే కొంత స్పష్టత ఉండేది. ఏదో ఒక సాఫ్ట్‌వేర్ ఉద్యోగంలో చేరిపోవడం లేదా ఎమ్మెస్ కోసం అమెరికా లాంటి దేశాలకు వెళ్లిపోవడం చేసేవారు. క్యాంపస్ నియామకాలపై పెద్ద ఎత్తున ఆశలు పెట్టుకునే వాళ్ళు. రాకపోతే ఏదైనా కొన్ని కోర్సులు నేర్చుకుని ఆఫ్ క్యాంపస్‌లో ఉద్యోగాలు సంపాదించాలనే బలమైన అభిప్రాయంతో ఉండేవాళ్ళు. అయితే ఇటీవలి పరిణామాల నేపథ్యంలో ముఖ్యంగా, అమెరికాలో ట్రంప్ ఆంక్షల నేపథ్యంలో విద్యార్థుల ఆలోచన విధానంలో భారీ మార్పు వచ్చినట్టు నౌకరీ డాట్ కామ్ ఇటీవలి సర్వేలో వెల్లడైంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వచ్చిన తర్వాత ఇంజనీరింగ్ నేపథ్యంతో ఉద్యోగాలు వేగంగా దొరికే అవకాశం కన్పించడం లేదనే అభిప్రాయంతో పీజీ విద్య వైపు మొగ్గు చూపేవారి సంఖ్య క్రమంగా పెరుగుతున్నట్టు తేల్చింది.

పెరుగుతున్న పోటీ

పోస్టు గ్రాడ్యుయేట్ కోర్సులకు ఈ ఏడాది నిర్వహించిన ఉమ్మడి ప్రవేశ పరీక్షలో దరఖాస్తుల సంఖ్య గతంతో పోల్చుకుంటే పెరిగింది. 2021లో 23,187 మంది దరఖాస్తు చేస్తే, ఈ ఏడాది ఈ సంఖ్య 25,334కు చేరింది. ఎంటెక్, ఎం ఫార్మసీ వంటి కోర్సుల్లో చేరేందుకు విద్యార్థులు ఇష్టపడుతున్నారు. ఎక్కువమంది బీటెక్ విద్యార్థులు ప్రధానంగా ఎంబీఏని ఎంచుకుంటున్నారు. సాఫ్ట్‌వేర్ కంపెనీలతో పాటు బహుళజాతి సంస్థల్లో వస్తున్న మార్పులకు అనుగుణంగా వ్యాపార నేపథ్యమున్న ఉద్యోగాలు లభిస్తాయనే విశ్వాసంతో ఉన్నారు.

అమెరికా కన్నా ఇదే బెటర్

ఏఐ రాకతో సాఫ్ట్‌వేర్ రంగం ప్రస్తుతం పూర్తిగా మారిపోయింది. ఫలితంగా యూఎస్ వెళ్ళినా పార్ట్‌టైం ఉద్యోగాలు చేయడం కుదిరే పనికాదని విద్యార్థులు భావిస్తున్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి అమెరికా వెళ్ళే విద్యార్థుల్లో స్కిల్ ఉద్యోగాలు పొందుతున్న వారు 8 శాతం కూడా ఉండటం లేదని తేలింది. పార్ట్‌టైం ఉద్యోగాలు చేసే వెసులుబాటు లేకపోవడంతో అక్కడికెళ్లి అప్పుల పాలయ్యేకన్నా ఇండియాలో మంచి కాలేజీలో పీజీ చేయాలనే ఆలోచనతో విద్యార్థులున్నట్టు తెలుస్తోంది.

పీజీ ప్రవేశ పరీక్షకు పెరిగిన దరఖాస్తులు

సంవత్సరం	దరఖాస్తులు
2021	23,187
2022	14,921
2023	16,563
2024	22,712
2025	25,334

రంగంలోకి కన్సల్టెన్సీలు

విద్యార్థుల ట్రెండ్ మారడంతో కన్సల్టెన్సీలు రంగంలోకి దిగుతున్నాయి. ఇంజనీరింగ్ పూర్తయిన వారిని అమెరికా పంపేందుకు వలవేసే కంపెనీలు ఇప్పుడు భారత్‌లో పలు పీజీ కోర్సుల్లో చేర్చేందుకు పోటీ పడుతున్నాయి. ముంబై, చెన్నై, ఢిల్లీ ప్రాంతాల్లోని ఎంబీఏ, ఎంటెక్, ఇతర అడ్మినిస్ట్రేషన్ కోర్సులు నిర్వహించే సంస్థలు సీట్లు పెంచుకున్నాయి. వీటి భర్తీ కోసం ఏజెంట్లను, కన్సల్టెన్సీలను రంగంలోకి దించుతున్నాయి. బీటెక్ పూర్తి చేసిన విద్యార్థులను ఏరికోరి టార్గెట్ చేస్తున్నాయి. పీజీ కోర్సుల్లో సరికొత్త అంతర్జాతీయ టెక్నాలజీని మార్పుగా చూపించి విద్యార్థులను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నాయి. పీజీలో విద్యార్థుల చేరికలను ఆహ్వానించదగ్గ పరిణామమే అయినప్పటికీ, కన్సల్టెన్సీల మోసాలకు బలికావద్దని విద్యారంగ నిపుణులు సూచిస్తున్నారు.

నిల్వ ఉన్న దొడ్డుబియ్యం అమ్మకానికి ఈ-వేలం

పౌరసరఫరాల శాఖ నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన గిడ్డంగులు, ఎంఎల్ఎస్ పాయింట్లు, నిత్యావసర దుకాణాల్లో నిల్వ ఉన్న 1.40 లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డుబియ్యంను విక్రయించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు పౌర సరఫరాల శాఖ తాజాగా ఉత్తర్వులు జారీచేసింది. ఈ బియ్యం విక్రయానికి ప్రభుత్వం నిర్ణయించిన ప్రాథమిక ధర కిలోకు రూ. 24గా ఉండగా, ఈ-ఆక్షన్ ద్వారా విక్రయం జరగనుంది. గిడ్డంగుల్లో ఎక్కువ కాలం నిల్వ ఉండటం వల్ల నిల్వ బియ్యం నాణ్యత దెబ్బతినకుండా ఉండటం, అనవసరమైన గిడ్డంగి చార్జీలు, నిల్వ నష్టాలు తప్పించుకోవడం, అలాగే తక్షణం బియ్యం ధరను వసూలు చేసుకోవడం లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం స్పష్టంచేసింది. నిల్వ ఖర్చు తగ్గించి, వడ్డీ భారాన్ని తగ్గించుకోవడం కోసం ఈ-ఆక్షన్ ద్వారా 1.40 లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డుబియ్యం విక్రయానికి అనుమతిచ్చినట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది.

క్లుప్తంగా...

నిరుద్యోగులు దీక్షకు దిగక ముందే నోటిఫికేషన్లపై ప్రకటన ఇవ్వాలి

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు



సాక్షి, హైదరాబాద్: నిరుద్యోగులు ఆమరణ నిరాహార దీక్షకు దిగకముందే, రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ నోటిఫికేషన్ల విషయంలో స్పష్టమైన ప్రకటన ఇవ్వాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు డిమాండ్ చేశారు. గ్రూప్–1, గ్రూప్–2 పరీక్షలు పూర్తి పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలన్నారు. శనివారం రాంచందర్‌రావు మీడియాతో మాట్లాడుతూ వేలాది మంది నిరుద్యోగులు హైదరాబాద్ అశోక్‌నగర్ లైబ్రరీ, వివిధ శిక్షణా సంస్థల వద్ద రాత్రీపగలు చదువుతూ, ఉద్యోగ అవకాశాల కోసం వేచి చూస్తున్నారని తెలిపారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వకుండా, స్పష్టత లేకుండా వ్యవహరిస్తోందని విమర్శించారు. అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావొస్తున్నా.. యువత ఎదుర్కొంటున్న సమస్యను స్పష్టమైన వైఖరితో పరిష్కరించే చర్యలేవీ తీసుకోవడం లేదన్నారు. ఇప్పటి దాకా 35 వేల ఉద్యోగాలు, లక్ష జాబ్‌లు ఇచ్చామంటూ గొప్పలు చెప్పుకోవడం తప్ప ఎన్ని ఉద్యోగాలు భర్తీచేశారనే దానిపై వాస్తవ లెక్కలు చూపడం లేదని రాంచందర్‌రావు పేర్కొన్నారు. యూపీఎస్సీ తరహాలో తెలంగాణ పబ్లిక్ కమిషన్ కూడా పరీక్షలు సమయానికి నిర్వహించాలని డిమాండ్ చేశారు.

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో పోటీ చేస్తా..!

- కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్



సాక్షి, హైదరాబాద్: 'రాష్ట్ర మంత్రివర్గంలో హైదరాబాద్‌తో పాటు యాదవ సామాజికవర్గం నుంచి ప్రాతినిధ్యం లేదు. మంత్రివర్గంలో స్థానం కోసమే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో పోటీ చేస్తా'అని మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ తన అభిప్రాయాన్ని వెల్లడించారు. శనివారం హైదరాబాద్ ఎమ్మెల్యే క్వార్టర్‌లోని తన క్యాంప్ ఆఫీస్‌లో మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్ చేశారు. సికింద్రాబాద్ పార్లమెంట్ స్థానానికి రెండు పర్యాయాలు ప్రాతినిధ్యం వహించానని, దాని పరిధిలోకి వచ్చే అన్ని సెగ్మెంట్లతోపాటు జూబ్లీహిల్స్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో కూడా కోట్లాది రూపాయల విలువగల అభివృద్ధి పనులు చేపట్టానని గుర్తు చేశారు. అసెంబ్లీ నియోజకవర్గంలో గట్టిపట్టుతోపాటు వ్యక్తిగతంగా అన్ని వర్గాలతో సత్సంబంధాలు ఉండటంతో ఉపఎన్నికల్లో పోటీ చేయాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. పార్టీ అధిష్టానం తన సేవలు గుర్తించి టికెట్ ఇస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీ అధికారంలో లేనప్పుడు వెన్నంటి ఉన్నాను కాబట్టి అధికారంలో వచ్చిన తర్వాత ఆ ఫలాలు అనుభవించాలి కదా అన్నారు. సికింద్రాబాద్ స్థానంనుంచి ఎంపీగా ఎన్నికైన ప్రతిఒక్కరూ కేంద్రమంత్రి అయ్యారని, తాను రెండుసార్లు ప్రాతినిధ్యం వహించానని, దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి బతికుంటే తాను కేంద్ర మంత్రిని అయ్యేవాడినని అంజన్‌కుమార్ పేర్కొన్నారు.

ఫీజు బకాయిలు విడుదల చేయాలి: లింగంగౌడ్

సాక్షి, హైదరాబాద్: కాలేజీ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేసి విద్యార్థుల భవిష్యత్తు నాశనం కాకుండా చూడాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన తప్పిదాలను ఈ ప్రభుత్వం చేయొద్దని, బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా కాళేశ్వరం, మిషన్ భగీరథ పథకాలకే రూ.వేల కోట్లు ఖర్చు చేశారని, తెలంగాణ సొమ్ము అంతా కాంట్రాక్టర్లకే దోచి పెట్టారని ఆరోపించారు. సకాలంలో ఫీజు నిధులు అందకపోవడంతో విద్యార్థులకు కాలేజీ యాజమాన్యాలు ధ్రువపత్రాలు ఇవ్వకుండా అడ్డుపడుతున్నాయని, దీంతో వారి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోందని లింగంగౌడ్ ఆందోళన వ్యక్తం చేశారు.

విద్యార్థులను విద్యకు దూరం చేస్తారా?: దూదిమెట్ల



సాక్షి, హైదరాబాద్: పేద విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకుండా విద్యకు దూరం చేసే కుట్ర జరుగుతోందని గొర్రెల, మేకల కార్పొరేషన్ మాజీ చైర్మన్ దూదిమెట్ల బాలరాజ్ యాదవ్ ఆరోపించారు. శనివారం తెలంగాణ భవన్‌లో బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద పటేల్, కార్పొరేషన్ మాజీ చైర్మన్ వాసుదేవరెడ్డిలతో కలిసి మీడియాతో మాట్లాడారు. బకాయిలు చెల్లించడం లేదని యాజమాన్యాలు కళాశాలలు మూసేస్తామంటుంటే విద్యాశాఖ మంత్రిగా ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలని, హాస్టళ్లలో వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. పెద్ద కాంట్రాక్టర్ల బిల్లులు చెల్లిస్తున్న ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడం ఏమిటని శుభప్రద పటేల్ ప్రశ్నించారు. యూరియా, గ్రూప్–1 పరీక్షలపై ప్రభుత్వాన్ని బీజేపీ ఎందుకు ప్రశ్నించడంలేదని వాసుదేవరెడ్డి విమర్శించారు.

చంద్రుడిపైకి మీ పేరు!

- జాబిల్లి చుట్టిరానున్న ఎస్‌డీ కార్డ్
- ఈ కార్డులో సామాన్యుల పేర్లు
- ఆర్టెమిస్–2 మిషన్‌లో నాసా అవకాశం



చందమామ రావే.. జాబిల్లి రావే అని పాడుతుంటాం. జాబిల్లి ఎలాగూ మన దగ్గరకు రాదు. పోనీ చంద్రమండలం మీద అడుగుపెడదామన్నా అందరికీ సాధ్యం కాదు. భూమిని వదిలి వెళ్ళకుండానే చంద్రుని చుట్టూ ప్రయాణించాలనుకుంటున్నారా? అంతరిక్ష పరిశోధనలో తదుపరి పెద్ద ముందడుగు వేయడానికి సిద్ధమవుతున్న అమెరికా అంతరిక్ష పరిశోధనా కేంద్రం నాసా.. సామాన్యులనూ భాగస్వాములను చేసేందుకు మరోసారి ఓ వినూత్న ఆలోచనకు శ్రీకారం చుట్టింది.

2026 ఏప్రిల్‌లోగా ప్రారంభం కానున్న ఆర్టెమిస్–2 మిషన్‌లో భాగంగా ఓరియన్ అంతరిక్ష పరిశోధన నౌకలో వ్యోమగాములు రీడ్ వైజ్‌మన్, విక్టర్ గ్లోవర్, క్రిస్టినా కోచ్, జెరెమీ హాన్సెన్ చంద్రుని చుట్టూ ప్రదక్షిణ చేయనున్నారు. వారితోపాటు ఓ మెమరీ కార్డు సైతం జాబిల్లిని చుట్టి రానుంది. ఈ మెమరీ కార్డ్‌లో చేర్చడానికి తమ పేర్లను సమర్పించాల్సిందిగా ప్రజలను నాసా ఆహ్వానిస్తోంది. చంద్రుడికో నూలుపోగు మాదిరిగా చంద్రుడి మీదకో 'పేరు' అన్నమాట. చరిత్రలో భాగం కావడానికి ఇది ఒక గొప్ప అవకాశం.

– సాక్షి, స్పెషల్ డెస్క్

డిజిటల్ బోర్డింగ్ పాస్

ఆసక్తిగలవారు ఉచితంగా తమ పేరును జోడించి తక్షణమే డిజిటల్ 'బోర్డింగ్ పాస్' పొందగలిగేలా నాసా ఒక ప్రత్యేక పేజీని ఏర్పాటు చేసింది. సేకరించిన పేర్లన్నీ ఓరియన్ లోపల ఇన్‌స్టాల్ చేసే ఎస్‌డీ కార్డ్‌లో నిక్షిప్తం చేస్తారు. మొదటిసారిగా సిబ్బందితో కూడిన ఆర్టెమిస్ మిషన్‌లో వ్యోమగాములతోపాటు మీ పేరూ జాబిల్లిని చుట్టి వస్తుందన్నమాట. సో, సరదాగా గుర్తిండిపోయేలా మీ పేరుతో డిజిటల్ బోర్డింగ్ పాస్ చేజిక్కించుకునేందుకు మీరూ దరఖాస్తు చేసుకోండి. చివరి తేదీ 2026 జనవరి 21. ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు చేపట్టినప్పుడు సామాన్యులనూ భాగస్వాములను చేయడం నాసా ప్రత్యేకత.

కీలకమైన అడుగు

10 రోజుల పాటు సాగే ఈ ప్రయాణంలో నాసా కొత్త స్పేస్ లాంచ్ సిస్టమ్, ఓరియన్ అంతరిక్ష నౌక పనితీరును అధ్యయనం చేస్తారు. వ్యోమగాములు భూమి నుండి 2,30,000 మైళ్ల కంటే ఎక్కువ దూరం ప్రయాణించి.. తిరుగు ప్రయాణంలో చంద్రుని అవతలి వైపు చుట్టూ తిరుగుతారు. ఈ దశాబ్దం చివర్లో చంద్రుని ఉపరితలంపై వ్యోమగాములను దింపడం, అలాగే మానవులను అంగారక గ్రహానికి పంపాలన్న నాసా ప్రయత్నంలో ఇది ఒక కీలకమైన అడుగు.



కృష్ణా జలాల్లో 904 టీఎంసీలే లక్ష్యం

▶ మొదటి పేజీ తరువాయి

ప్రాజెక్టులు, అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులు, నిర్లక్ష్యంగా వదిలేసిన ప్రాజెక్టుల వివరాలన్నీ ట్రిబ్యునల్ ముందు ఉంచాలని చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలో జారీ చేసిన జీవోలు, మెమోలు, డాక్యుమెంట్లన్నీ సిద్ధంగా ఉంచుకోవాలని, అప్పటి నుంచి ఇప్పటివరకు ఉన్న ప్రాజెక్టుల వివరాలన్నీ ట్రిబ్యునల్‌కు అందించాలని తెలిపారు.

గత ప్రభుత్వంలో అన్యాయం...

గత ప్రభుత్వం కృష్ణా జలాల్లో రావాల్సిన నీటి వాటాను సాధించకపోగా, ఏపీకీ 512 టీఎంసీలు కట్టబెట్టి, 299 టీఎంసీల వాటాకు ఒప్పుకొని తెలంగాణకు తీరని అన్యాయం చేసిందనే చర్చ ఈ సమీక్షలో వచ్చింది. అప్పటి సీఎం కేసీఆర్ 299 టీఎంసీల వాటాకు ఒప్పుకున్న విషయాన్ని ఏపీ ఇప్పుడు ట్రిబ్యునల్‌ముందుకు తెచ్చిందని న్యాయ నిపుణులు సీఎం రేవంత్‌కు ఈ సందర్భంగా వివరించారు. గడిచిన పదేళ్లలో అధికారంలో ఉన్న కేసీఆర్ ప్రభుత్వం కృష్ణా జలాల్లో న్యాయపరంగా రావాల్సిన నీటి కోటాను సాధించటంలో దారుణంగా విఫలమైందన్నారు. కృష్ణానదిపై తలపెట్టిన పాలమూరు నుంచి డిండి వరకు ప్రాజెక్టులన్నింటినీ పెండింగ్‌లో పెట్టిందని చెప్పారు. నీటి వాటాల విషయంలో తీరని ద్రోహం చేసిందన్నారు. దిగువ రాష్ట్రాల హక్కులతోపాటు నదీ వాటాల పంపిణీ న్యాయ సూత్రాల ప్రకారం కొత్తగా ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రానికి కృష్ణాలో 904 టీఎంసీల నీటి వాటా రావాల్సి ఉందని, అందుకు అనుగుణంగా వాదనలు సిద్ధం చేయాలని సీఎం స్పష్టం చేశారు.

ఏపీ అక్రమంగా నీటిని తరలించిన విషయంపై ...

ఏపీ ప్రభుత్వం కృష్ణా జలాలను అక్రమంగా తరలించుకుపోయిందని, ఆ విషయాన్ని ట్రిబ్యునల్‌ముందుకు తీసుకురావాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. శ్రీశైలం రిజర్వాయర్ నిండకముందే, పోతిరెడ్డిపాడు నుంచి రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్‌స్కీమ్‌ద్వారా రోజుకు పది టీఎంసీల నీటిని ఏపీ మళ్లిస్తుందని, ఇతర బేసిన్లకు తరలించుకుపోతోందన్నారు. ఎక్కడ పడితే అక్కడ కాల్వల సామర్థ్యం పెంచుకోవటంతోపాటు పట్టిసీమ, పులిచింతల, చింతలపాడు వరకు ఏపీ అక్రమంగా నీటిని తరలిస్తున్న అంశాలన్నీ ఆధారాలతో సహా ట్రిబ్యునల్‌కు నివేదించాలని, అందుకు సన్నద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. కృష్ణా నీటిని ఏపీ అక్రమంగా మళ్లించటంతో శ్రీశైలం, నాగార్జునసాగర్‌తో పాటు పులిచింతల వద్ద ఉన్న జల విద్యుత్ ప్రాజెక్టులు మూతపడే ప్రమాదం ముంచుకొచ్చిందన్నారు. ఈ విషయాలన్నీ ట్రిబ్యునల్ ఎదుట వినిపించాలని సీఎం ఆదేశించారు.



మాట్లాడుతున్న సీఎం రేవంత్, చిత్రంలో మంత్రి ఉత్తమ్

తెలంగాణకు అన్ని అర్హతలు....

కొత్తగా ఏర్పడిన రాష్ట్రం కావటంతో తెలంగాణకు రావాల్సిన హక్కులు, నీటి వాటాలను సాధించుకునేందుకు అన్ని అర్హతలున్నాయని సీఎం అన్నారు. సాగునీటి, తాగునీటి అవసరాలతోపాటు మెట్ట ప్రాంతం, కరువు ప్రాంతమైన ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాలకు కృష్ణా జలాలు తప్ప గత్యంతరం లేదనే విషయాన్ని ట్రిబ్యునల్ దృష్టికి తీసుకువెళ్లాలని చెప్పారు. ఇప్పటి వరకు తెలంగాణలో తలపెట్టిన ప్రాజెక్టులు పూర్తి చేయకపోవడం వల్లనే కృష్ణా జలాశయాలను రాష్ట్రం వినియోగించుకోలేకపోయిందని గుర్తు చేయాలన్నారు. తెలంగాణ తరఫున వాదనలను వినిపించేందుకు ఇదే సరైన అవకాశమని సీఎం చెప్పారు.

చుక్క నీటినీ వదులుకోం: మంత్రి ఉత్తమ్

కృష్ణా జలాల్లో రాష్ట్రానికి రావాల్సిన వాటాలో చుక్క నీటిని కూడా వదులుకునే ప్రసక్తే లేదని మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల పంపిణీపై ఈ నెల 23 నుంచి 25 వరకు ఢిల్లీలో జరగనున్న విచారణలో అవలంబించాల్సిన వ్యూహంపై శనివారం ఆయన జలసౌధలో న్యాయ నిపుణులు, నీటిపారుదల రంగ నిపుణులతో సమీక్షించారు. ఈ అంశంపై ఒత్తిడి తెచ్చేందుకు సీఎం రేవంత్‌రెడ్డి అన్ని కార్యక్రమాలు రద్దు చేసుకొని ఢిల్లీకి వచ్చి సమీక్షిస్తారన్నారు. ట్రిబ్యునల్ ఎదుట బలమైన వాదనలు వినిపించేందుకు అధికార యంత్రాంగాన్ని సర్వసన్నద్ధం చేశామని చెప్పారు.

904 టీఎంసీల వాటా ఇలా....

- → పాత ప్రాజెక్టులకు 303.54 టీఎంసీలు
- → నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులకు 287.04 టీఎంసీలు
- → భవిష్యత్‌లో కట్టే ప్రాజెక్టులకు 289.5 టీఎంసీలు
- → తాగునీటి అవసరాలకు 15 టీఎంసీలు
- → పారిశ్రామిక అవసరాలకు 9.29 టీఎంసీలు

బీజేపీలో బీఆర్‌ఎస్ విలీనంలో భాగంగానే కాళేశ్వరం విచారణ ఆగిపోయింది

- 48 గంటల్లో కేసు మొత్తం తేల్చేస్తామన్న కిషన్‌రెడ్డి ఎక్కడ?
- బీజేపీ మెప్పు కోసమే రాహుల్‌గాంధీపై కేటీఆర్ విమర్శలు
- టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: బీజేపీలో బీఆర్‌ఎస్‌ను విలీనం చేయడంలో భాగంగానే కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ విచారణ ఇంకా ప్రారంభం కాలేదని తాము భావిస్తున్నామని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి. మహేశ్‌కుమార్‌గౌడ్ వ్యాఖ్యానించారు. కాళేశ్వరం అవినీతి కేసును సీబీఐకి అప్పగిస్తే మొత్తం కేసును 48 గంటల్లో తేల్చేస్తామని ప్రగల్భాలు పలికిన బీజేపీ నేత కిషన్‌రెడ్డి ఇప్పుడెక్కడ ఉన్నారని ప్రశ్నించారు. శనివారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే జీవన్మార్, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, కాంగ్రెస్ నేతలు రోహిణ్‌రెడ్డి, కోట నీలిమ, ఆలమ్‌ఖాన్, సామా రామ్మోహన్‌రెడ్డి, బొజ్జా సంధ్యారెడ్డిలతో కలిసి మహేశ్‌గౌడ్ మాట్లాడారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తన స్థాయికి మించి మాట్లాడుతున్నాడని, దేశం కోసం సర్వం త్యాగం చేసిన గాంధీ కుటుంబం గురించి మాట్లాడే స్థాయి ఆయనకుందా అని ప్రశ్నించారు. రాహుల్‌గాంధీపై కేటీఆర్ విమర్శల వెనుక బీజేపీ ఉందని ఆరోపించారు. ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో జస్టిస్. సుదర్శన్‌రెడ్డికి మద్దతు ఇవ్వకపోవడంతోనే బీఆర్‌ఎస్ వైఖరి ఏంటో బట్టబయలైందని, ఎన్డీయేకు పరోక్షంగా మద్దతిచ్చిన బీఆర్‌ఎస్, బీజేపీలను వేరుగా చూడలేమన్నారు.

కాంగ్రెస్ పార్టీకి యువతరమే ఆస్తి

కాంగ్రెస్ పార్టీలో సభ్యులుగా ఉండడం ఒక అదృష్టం అని, భవిష్యత్ అంతా యువ నేతలదేనని టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. గాంధీభవన్‌లో శనివారం జరిగిన టీపీసీసీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి యువతరమే ప్రధాన ఆస్తి అని చెప్పారు. యువతకు అవకాశాలు రావడానికి ముఖ్య కారణం రాహుల్ గాంధీ అని, ఆయన ప్రధాని కావడమే ఎజెండాగా పనిచేయాలన్నారు. రాష్ట్రం నుంచి యువకుడైన అనిల్‌కుమార్ యాదవ్‌కు రాజ్యసభ సభ్యుడు, అద్దంకి దయాకర్, శంకర్ నాయక్ ఎమ్మెల్సీలుగా రావడానికి ప్రధాన కారణం వారికున్న ఎన్ఎస్‌యూఐ బ్యాక్ గ్రౌండ్ అని చెప్పారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి కూడా యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్‌గా పనిచేశారని గుర్తు చేశారు. యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంలో యూత్ కాంగ్రెస్ కీలకపాత్ర పోషించిందన్నారు.

కోరినచోట డిప్యుటేషన్..!

- ఎస్సీ గురుకుల సొసైటీలో జోనల్ ఆఫీసర్లదే రాజ్యం
- కోరిన వెంటనే డిప్యుటేషన్ పద్ధతిలో సొంత జిల్లాల్లో విధులు
- గత కార్యదర్శి విధుల నుంచి రిలీవ్ అయినప్పటికీ పాత తేదీల్లో ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ (టీజీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్)లో జోనల్ ఆఫీసర్ల హవా నడుస్తోంది. నెలన్నర క్రితం ఈ సొసైటీ పరిధిలో డిప్యుటేషన్లన్నీ రద్దు చేస్తున్నట్లు అప్పటి కార్యదర్శి అలగు వర్షిణి ఉత్తర్వులు జారీ చేయడంతో పాటు పలువురు టీచర్లను వారికి నిర్దేశించిన చోట విధుల్లో చేరాలని తేల్చి చెప్పారు. అప్పట్లో ఈ అంశంపై సొసైటీలో తీవ్ర దుమారం రేగింది. కానీ ఇప్పుడు జిల్లా స్థాయి అధికారులుగా వ్యవహరించే నలుగురు జోనల్ ఆఫీసర్లు ఇబ్బడిముబ్బడిగా డిప్యుటేషన్లు పొందారు. అందులోనూ వారి సొంత జిల్లాల్లోనే పోస్టింగ్ పొందగా... సొసైటీ కార్యదర్శి బాధ్యతల నుంచి రిలీవ్ అయి వెళ్లిపోయిన తర్వాత అలగు వర్షిణి పేరిట పాత తేదీల్లో ఈ ఉత్తర్వులు వెలువడటంపై ఇప్పుడు సొసైటీ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

ఇలా విన్నపం... అలా ఆమోదం...

సాధారణంగా ప్రభుత్వ శాఖల్లో డిప్యుటేషన్ పద్ధతిలో బదిలీలు కోరుకోవడంలో ఎక్కువగా కుటుంబ సమస్యలు, ఇతర అనారోగ్య సమస్యలను కారణంగా చూపుతుంటారు. అలాంటి అంశాలను సుదీర్ఘంగా పరిశీలించి నిర్ధారించుకున్న తర్వాత ఉన్నతాధికారుల ఆమోదంతో డిప్యుటేషన్ అంశాన్ని ఖరారు చేస్తారు. ఎస్సీ గురుకుల సొసైటీలో ఈ కోవకు చెందిన విన్నపాలు వందల సంఖ్యలో ఉన్నాయి. ఇదివరకు డిప్యుటేషన్ పద్ధతిలో పనిచేస్తున్న చాలామంది టీచర్లను సొసైటీ అధికారులు రాత్రికిరాత్రే షిఫ్ట్ చేసిన సందర్భాలున్నాయి. కానీ తాజాగా డిప్యుటేషన్ పొందిన నలుగురు జోనల్ ఆఫీసర్లకు సంబంధించి ఎలాంటి కారణాలు లేకుండానే కథ ముగించారు. తమను ఆయా జోన్లకు పంపించాలని కోరిన వెంటనే సొసైటీలో అకడమిక్ విభాగం జాయింట్ సెక్రటరీ ఫైలు చకచకా కదిపారు. ఆగస్టు 30వ తేదీన వారు వినతిపత్రాలు సమర్పించడం తరువాయి... వెనువెంటనే ఫైలు తయారీ పూర్తయింది. గత నెలాఖరుతో కార్యదర్శి పదవి నుంచి రిలీవ్ అయినప్పటికీ... రెండ్రోజుల క్రితం గురుకుల సొసైటీ నుంచి డిప్యుటేషన్ ఉత్తర్వులు సెప్టెంబర్ ఒకటో తేదీనాటితో వెలువడ్డాయి. ఒకవైపు డిప్యుటేషన్లు రద్దు చేస్తున్నట్లు ఉత్తర్వులు ఇవ్వడం, జిల్లా ఆఫీసర్ స్థాయి అధికారి సొంత జిల్లాలో పనిచేయకూడదనే నిబంధనలేవీ పట్టించుకోకుండా ఏకపక్షంగా ఉత్తర్వులు జారీ చేశారంటూ సొసైటీలోని టీచర్లు ఇప్పుడు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒకట్రెండు రోజుల్లో ఎస్సీ అభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శికి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఫిర్యాదు చేసేందుకు యూనియన్ ప్రతినిధులు సిద్ధమవుతున్నారు.

సిమీ, పీఎఫ్ఐ, ఐసీఎస్‌కు అడ్డాగా నిజామాబాద్

కాంగ్రెస్ హయాంలో లా అండ్ ఆర్డర్ బాగాలేదు: ఎంపీ అర్వింద్

ఖలీల్‌వాడి: సిమీ, పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా, ఐసీఎస్‌కు నిజామాబాద్ అడ్డాగా మారిందని ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. జిల్లా కేంద్రంలోని డీఐజీ కార్యాలయంలో శనివారం సీపీ పోతరాజు సాయిచైతన్యతో ఎంపీ సమావేశమయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలో శాంతిభద్రతలు బాగా లేవన్నారు. వినాయక నిమజ్జనానికి సంబంధించిన ఫొటోను సోషల్ మీడియాలో పోస్టు చేసిన యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారని తెలిపారు. అదే సమయంలో ఓ వర్గానికి చెందిన 400 మంది బైక్ ర్యాలీ నిర్వహించి, హారన్ కొడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తే మాత్రం కేసు నమోదు చేయలేదన్నారు. హిందువుల పండుగలకు ఆంక్షలు ఎక్కువయ్యాయని, తప్పుచేసిన వారి విషయంలో మత ప్రస్తావన ఎందుకని ప్రశ్నించారు. 'మార్వాడీ గో బ్యాక్' కాదని, ఇక్కడున్న బంగ్లాదేశ్, మయన్మార్, టర్కీ దేశాల వారిని వెళ్లగొట్టాలని సూచించారు.

ఉమ్మడి కుటుంబ వ్యవస్థను కాపాడుకోవాలి

- పొన్నం సత్తయ్య వర్ధంతి సభలో మంత్రి తుమ్మల
- అంపశయ్య నవీన్, రమాదేవికి 'పొన్నం సత్తయ్య' పురస్కారాల ప్రదానం



రచయిత అంపశయ్య నవీన్‌ను సన్మానిస్తున్న మంత్రులు తుమ్మల, జూపల్లి, పొన్నం తదితరులు

గన్‌ఫౌండ్రీ (హైదరాబాద్): ప్రస్తుత సమాజంలో దూరమవుతున్న ఉమ్మడి కుటుంబ వ్యవస్థను కాపాడుకోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శనివారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో పొన్నం సత్తయ్య 15వ వర్ధంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ రచయిత అంపశయ్య నవీన్, ప్రముఖ జానపద గాయని అంతడ్పుల రమాదేవికి పొన్నం సత్తయ్య జీవన సాఫల్య పురస్కారం, రూ.51 వేల నగదు, మెమెంటోలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ పొన్నం సత్తయ్య భూమిని నమ్ముకుని ఎంతో కష్టం చేసి పిల్లలను ప్రయోజకుల్ని చేశారని తెలిపారు. మంత్రి జూపల్లి మాట్లాడుతూ రైతుల ఆత్మహత్యలకు ప్రధాన కారణం ఉమ్మడి కుటుంబాలు లేకపోవడమేనని, ఇది మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం చెప్పిన మాట అని గుర్తుచేశారు. పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ పొన్నం సత్తయ్య పేరిట ఏటా పురస్కారాలను అందజేస్తున్నామన్నారు. అంపశయ్య నవీన్, రమాదేవి.. పొన్నం సత్తయ్య పురస్కారం రావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం పొన్నం సత్తయ్య జీవిత చరిత్రపై రూపొందించిన పాటల సీడీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీ సురేశ్ షెట్కార్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మాజీ ఎమ్మెల్యే మోహన్, టీపీసీసీ లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్, రచయిత పొన్నం రవీంద్ర, పలు కార్పొరేషన్ చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు.

సింగిల్ డిజిట్ శిక్షలేనా ?

కేసులు నమోదు చేస్తున్నా.. శిక్షల శాతం ఎందుకు పెరగడం లేదు?

- ఒక లైసెన్సు తీసుకొని మూడు బార్లు నడిపిస్తుంటే మీ నిఘా ఏమైనట్టు?
- ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సమీక్షలో మంత్రి జూపల్లి ప్రశ్నల పరంపర
- పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌తో సరిపెట్టి నీళ్లు నమిలిన యంత్రాంగం
- కింగ్‌పిన్‌లను గుర్తించి పీడీ చట్టం పెట్టండి
- అవసరమైతే ఆయుధాలిస్తాం... ఉక్కుపాదం మోపాలని మంత్రి ఆదేశాలు



ఎక్సైజ్ శాఖ సమీక్షలో వివరాలు తెలుసుకుంటున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

సాక్షి, హైదరాబాద్: 'ప్రతిరోజూ అక్కడో ఇక్కడో దాడి చేసి అక్రమ మద్యం, గంజాయి, డ్రగ్స్ పట్టుకుంటున్నారు. కేసులు నమోదు చేస్తున్నారు. ఇటీవలి కాలంలో ఈ దాడులు కొంత ఎక్కువగానే కనిపిస్తున్నాయి. కానీ, మరి ఈ కేసుల్లో నిందితులకు శిక్షలెందుకు పడడం లేదు ? శిక్షలు సింగిల్ డిజిట్‌కే పరిమితమా? శిక్షల శాతం గతం కంటే ఎందుకు పెరగడం లేదు'అని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ప్రశ్నించారు. 'మహారాష్ట్ర పోలీసులు ఇక్కడకు వచ్చి డ్రగ్స్ రాకెట్‌ను ఛేదించేంతవరకు సమాచారం మీకెందుకు రాలేదు? మీ నిఘా ఏం చేస్తున్నట్టు? ఒక్క బార్‌షాప్ కోసం లైసెన్స్ తీసుకొని అదే లైసెన్స్ మీద రెండు, మూడు బార్లు నడిపిస్తుంటే మీ నిఘా ఏమైంది? వైన్ షాపులు, బార్లపై నిఘా ఎందుకు తగ్గిపోయింది'అని ఆయన నిలదీశారు. శనివారం నాంపల్లిలోని తెలంగాణ ఆబ్కారీ భవన్‌లో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎస్టీఎఫ్, డీటీఎఫ్ అధికారుల పనితీరుపై మంత్రి సమీక్షించారు. అక్రమ, కల్తీ మద్యం, కల్లు, డ్రగ్స్, గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల విక్రయం, రవాణా, వినియోగం, నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ (ఎన్‌డీపీఎల్), డ్రగ్స్ ముడిసరుకు తయారీ, కేసుల పురోగతి, శిక్షల నిష్పత్తి, పాత నేరస్తులపై నిఘా తదితర అంశాలపై ఆయన సుదీర్ఘంగా ఉన్నతాధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యకలాపాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించిన యంత్రాంగం మంత్రి అడిగిన ప్రశ్నలకు మాత్రం నీళ్లు నమిలినట్టు తెలిసింది. అవసరమైతే ఆబ్కారీ పోలీసులకు కూడా డెడికేటెడ్ ఆయుధాలను ఇస్తామని, అక్రమ మద్యం వ్యవహారాలు, గంజాయి, డ్రగ్స్ అమ్మకాలపై ఉక్కుపాదం మోపాలని మంత్రి జూపల్లి వెల్లడించారు. దేశవ్యాప్తంగా ఎలాంటి విధానం అమల్లో ఉంది? అనే అంశాలపై అధ్యయనం చేసి సాధ్యాసాధ్యాలను పరిశీలించి నివేదిక ఇవ్వాలని, దీనిపై సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు.

మనమెందుకు బ్రాండింగ్ చేయకూడదు?

'గోవాలో ఫెన్నీ, మధ్యప్రదేశ్‌లో మహువా (ఇప్పసారా)ను బ్రాండింగ్ చేసి అమ్ముతారు. మన రాష్ట్రంలో కూడా ఈత, తాటి కల్లును బాట్లింగ్ చేసి విక్రయిస్తే గీత కార్మికులకు ఉపాధి పెరుగుతుంది. కల్తీ కల్లు నివారించొచ్చు. రాష్ట్రంలో టాడీ నేచురల్ బ్రూవరీ ఏర్పాటుపై అధ్యయనం చేయండి. నివేదిక ఇస్తే సీఎంతో మాట్లాడతా.'అని మంత్రి జూపల్లి చెప్పారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడుల్లో భాగంగా స్వాధీనం చేసుకున్న నల్లబెల్లాన్ని వృథాగా పారబోయకుండా రైతులకు విక్రయించే అంశాన్ని పరిశీలించాలని మంత్రి జూపల్లి సూచించారు. ఎన్‌డీపీఎల్ మద్యాన్ని కూడా ధ్వంసం చేయకుండా, నాణ్యతను పరీక్షించి తిరిగి విక్రయించేందుకు గల అవకాశాలను కూడా అధ్యయనం చేయాలని చెప్పారు.

సమన్వయం ముఖ్యం

చర్లపల్లిలోని రసాయనిక పరిశ్రమలో డ్రగ్స్‌కు అవసరమైన రసాయనాలు తయారు చేస్తుంటే ఎందుకు నిఘా వర్గాలు గుర్తించలేకపోయాయని మంత్రి జూపల్లి ప్రశ్నించారు. నేరాల నియంత్రణకు ఇతర రాష్ట్రాల అధికారులతో సమన్వయం ముఖ్యమని సూచించారు. గంజాయి, డ్రగ్స్ కేసుల్లో కింగ్‌పిన్‌లను గుర్తించి వారిపై పీడీ యాక్టులను నమోదు చేయాలని, పాత నేరస్తుల కదలికలను ఎప్పటికప్పుడు గమనించి యువత భవిష్యత్‌ను నాశనం చేస్తున్న డ్రగ్స్, సింథటిక్ డ్రగ్స్ వినియోగాన్ని నియంత్రించాలని ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి సయ్యద్ అలీ ముర్తుజా రిజ్వీ, కమిషనర్ సి.హరికిరణ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసిం, అదనపు కమిషనర్ సయ్యద్ యాసిన్ ఖురేషీలతో పాటు అన్ని జిల్లాల అధికారులు పాల్గొన్నారు.



మూగవారికిని, దిక్కులేనివారందరికిని న్యాయము జరుగునట్లు నీ నోరు తెరువుము.
– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, భాద్రపద మాసం, **తిథి:** బ.సప్తమి ఉ.8.56 వరకు, తదుపరి అష్టమి, **నక్షత్రం:** రోహిణి ప.1.18 వరకు, తదుపరి మృగశిర, **వర్జ్యం:** రా.6.32 నుండి 8.02 వరకు, **దుర్ముహూర్తం:** సా.4.25 నుండి 5.14 వరకు, **అమృత ఘడియలు:** ఉ.10.16 నుండి 11.46 వరకు, **భాను సప్తమి.**

సూర్యోదయం : 5.48
సూర్యాస్తమయం : 6.13
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

మల్లికార్జున్ ఖర్గే (కాంగ్రెస్)
రాయని డైరీ

మాధవ్ శింగరాజు

తెలిసిన పదాలకే అర్థాలు వెతుక్కుంటున్నాను నేను! రాహుల్ గురించి నాకేం తెలియదని?!

ఆయన నాతో ఒక్క నవ్వును మించి ఎక్కువ మాట్లాడరు. ఆ నవ్వుకు "నమస్తే ఖర్గేజీ" అని అర్థం; ఎక్కడికి వెళుతున్నదీ చెప్పరు. "నా కోసం చూడకండి" అని అర్థం; ఎందుకు వెళుతున్నదీ చెప్పరు. "ఎక్కువగా ఆలోచించ కండి" అని అర్థం; ఎప్పుడు వచ్చేదీ చెప్పరు. "రావాలని నాకూ ఉంటుంది" అని అర్థం; ఏం చేయబోయేది చెప్పరు. "నాకైనా ఎలా తెలుస్తుంది?" అని అర్థం; ఎవరి గురించి, ఏం మాట్లాడబోయేదీ చెప్పరు. "మాటలు మనకు చెప్పి వస్తాయా ఖర్గేజీ?!" అని అర్థం.

రాహుల్ మళ్లీ ఇవాళ కొన్ని గంటలుగా కనిపించటం లేదు! ఆయన కనిపించక పోవటానికి – కనిపించకపోవటానికి మధ్య ఆయన కనిపించే నిడివి ఈ మధ్య కాస్త ఎక్కువగా తగ్గుతున్నట్లు నాకు అనిపిస్తోంది!

"మీకేమైనా సమాచారం ఉందా వేణుగోపాల్?" అని అడిగాను. పార్టీ ఆఫీస్‌లో నేను, వేణుగోపాల్ మాత్రమే ఉన్నాం. ఏఐసీసీ జనరల్ సెక్రెటరీ ఆయన.



'మీకు తెలియకుండా నాకు తెలుస్తుందా ఖర్గేజీ!' అన్నట్లుగా... నిస్సహాయంగా నా వైపు చూశారు వేణుగోపాల్. ఆయన్నిక ఎక్కువ సంఘర్షణకు గురి చేయదలచుకోలేదు నేను.

"సరే! తాళం వేసుకుని మీరు వెళ్లండి" అని పైకి లేచాను. నాతో పాటే వేణుగోపాల్ కూడా పైకి లేచి, "ఖర్గేజీ! మీతో ఒక మాట" అన్నారు!!

'చెప్పండి వేణు...' అన్నాను.

"ఖర్గేజీ! మీరీ మధ్య ఒకే మాటను రెండు అర్థాలు వచ్చేలా మాట్లాడుతున్నారు. లేదా, మీరు మాట్లాడుతున్న ఒకే మాట రెండు అర్థాలు వచ్చేలా ఉంటోంది..." అన్నారు వేణుగోపాల్.

"ఏమిటా 'ఒక మాట – రెండర్థాలు' వేణుగోపాల్?!" అన్నాను.

"ఖర్గేజీ! జునాగఢ్‌లో మీరు – "మొత్తం పెట్టె కుళ్లిపోక ముందే, చెడిపోయిన మామిడి పండ్లను తొలగించాలి..." అని అన్నారు. వెంటనే టీవీ ఛానెళ్ల వాళ్లు, 'కాంగ్రెస్‌లో ఎవరా చెడిపోయిన మామిడి పండ్లు?!' అని డిబేట్ మొదలు పెట్టేశారు. ఇప్పుడేమో, 'తాళం వేసుకుని మీరు వెళ్లండి' అని నాతో అన్నారు. అదృష్టవశాత్తూ ఇది టీవీ వాళ్లకు తెలిసే అవకాశం లేదు కనుక – 'తాళం వేయమంటే ఏమిటర్థం? పార్టీ ఆఫీస్‌కు తాళం వేసేద్దాం అనేనా ఖర్గే అంటున్నది...' అని డిబేట్ పెట్టే ప్రమాదం తప్పిపోయింది..." అన్నారు వేణు!

"నిజమే కానీ వేణుగోపాల్, ఒక మాటను పది మంది పది రకాలుగా అర్థం చేసుకునే అవకాశం ఉందని చెప్పి, ఆ పది మందికీ ఒకే రకంగా అర్థం అయ్యేలా మాట్లాడాలంటే... ఒక్క మౌనంతో మాత్రమే కదా అది సాధ్యం అవుతుంది?" అన్నాను.

అలా అంటున్నప్పుడు నాకు రాహుల్ గుర్తొచ్చారు. బహుశా అందుకేనా రాహుల్ నాతో గానీ, పార్టీలో మరొకరితో కానీ తక్కువ మాట్లాడి, ఎక్కువ మౌనంగా ఉంటారు?!

"సీఆర్పీఎఫ్ వాళ్లు లెటర్ పంపించారు వేణుగోపాల్. సెక్యూరిటీకి ఇన్ఫార్మ్ చేయకుండా రాహుల్ బయట తిరుగుతున్నారని కంప్లైంట్. ఈ తొమ్మిది నెలల్లోనే ఇటలీ, వియత్నాం, ఖతార్, లండన్, దుబాయ్ మలేసియా ట్రిప్పులు వేశారట! హై రిస్క్ కేటగిరీలో ఉన్న వీఐపీలు ప్రోటోకాల్‌ని వయలేట్ చేస్తే ఎలా?' అంటున్నారు" అన్నాను.

వేణుగోపాల్ మౌనంగా ఉన్నారు! బహుశా అది, వివేచనతో కూడిన మౌనం కావచ్చు.

"మీరు వెళ్లండి వేణుగోపాల్! నేను కాసేపు ఉండి వస్తాను' అన్నాను, తిరిగి కూర్చుంటూ.

ఆయన వెళ్లిపోయారు. నా చేతిలో సీఆర్పీఎఫ్ వాళ్లు పంపిన లెటర్ ఉంది.

"మీ అబ్బాయి మాట వినటం లేదు" అని స్కూల్ హెడ్ మాస్టర్, పేరెంట్స్‌కి లెటర్ రాయగలరు. "మా అబ్బాయి మాట వినటం లేదు..." అని పేరెంట్స్ ఎవరికి లెటర్ రాయగలరు?!

రాహుల్ సీఆర్పీఎఫ్‌కే కాదు, సీడబ్ల్యూసీకి చెప్పి వెళ్లటం లేదని నేనెవరితో చెప్పుకోగలను?! ఎవరికి లెటర్ రాయగలను?

ప్రజారోగ్యం లూటీ!

జనతంత్రం




వర్ధెల్లి మురళి

వీళ్ల పాలకులేనా? భారత రాజ్యాంగం స్ఫూర్తితో ఎన్నికైన ప్రజా ప్రతినిధులేనా? ఇంతటి విశృంఖల అవినీతి గతంలో ఎప్పుడైనా ఉన్నదా? గజ్జెల మల్లారెడ్డి పద్యాన్ని కొద్దిగా మార్చి 'తెలుగు నాట అవినీతి తెప్పలుగా పారుతోంది. డ్రైనేజీ స్కీము లేక డేంజర్‌గా మారింద'ని చదువుకోవాలి. ఆంధ్రప్రదేశ్ పాలక కూటమి పల్లకీని మోసే డ్యూటీలో ఉన్న యెల్లో బోయీలు కూడా అవినీతి ప్రవాహంపై మాట్లాడక తప్పని దురవస్థ దాపురించింది. కాకపోతే వారి ఎజెండా వేరు. వారికో డైవర్షన్ స్కీమున్నది. అవినీతి హెడ్‌క్వార్టర్స్‌పై ముసుగు కప్పి ప్రవహిస్తున్న మురుగంతా క్షేత్రస్థాయి, ద్వితీయ శ్రేణి నేతల మురికేనని చెప్పాలి. అదే చెబుతున్నారు. 'ఎమ్మెల్యే సారూ... తగ్గాలి మీరు' అనే పతాక శీర్షికలతో అవినీతి కథనాల సీరియల్స్ నడుపుతున్నారు. మంత్రుల పీఏలు, ఓఎస్డీలు తెగబడుతున్నారని రాస్తున్నారు. ప్రతి పనికీ రేటు పెట్టి వసూలు చేస్తున్నారని స్థానిక నేతలపై వాపోతున్నారు.

జడలు విరబోసుకొని నడివీధుల్లో నర్తిస్తున్న అవినీతి భూతాన్ని దాచిపెట్టలేరు గనుక డైవర్షన్ వ్యూహాలపై తెలివితేటల్ని ఖర్చు చేస్తున్నారు. సాధారణ పరిపాలన శ్రుతి తప్పితే అధికారుల తప్పు. లా అండ్ ఆర్డర్ అదుపు తప్పితే పోలీసుల తప్పు. ఇదీ, యెల్లో మీడియా వరుస. అదునులోగా రైతుకు అందవలసిన యూరియా ఎరువును కూడా అవినీతి భూతం పరపర నమిలేస్తుంటే గద్దె మీదనున్న పెద్దలకు ఏ పాపం తెలియదని యెల్లో బోయీలు నమ్మబలుకుతున్నారు. ఇతరుల ఖాతాల్లో పడేయడానికి వీలు కాని ముఖ్య భాగోతాలను మాత్రం అభివృద్ధి కోణంలో ఆవిష్కరిస్తున్నారు. ప్రజారోగ్యాన్ని ప్రైవేట్ వ్యాపారుల చేతుల్లో పెట్టడంలో అవినీతి లేదట! అభివృద్ధికి అదే అర్థమట! జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా ప్రభుత్వ రంగంలో 17 మెడికల్ కాలేజీలకు అనుమతులు తెచ్చి భూసేకరణ చేసి నిర్మాణాలు ప్రారంభించారు. ఆయన హయాంలోనే ఐదు కాలేజీలు ప్రారంభమయ్యాయి.

ఎన్నికలు ముగిసిన వెంటనే పాడేరు కాలేజీ కూడా ప్రారంభమైంది. దాంతోపాటు అనుమతులొచ్చిన పులివెందుల కాలేజీకి మాత్రం బాబు అడ్డు చక్రం వేశారు. అడ్డుకోవడానికి అసలు కారణం, ఇప్పుడు తేటతెల్లమైంది. పులివెందుల కాలేజీతోపాటు పది కాలేజీలను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించాలని నిర్ణయం తీసుకున్నారు. అయితే, దీన్ని ప్రైవేటీకరణ అనగూడదని సర్కార్ వాదిస్తున్నది. పిల్లి కాదు మార్జాలమట! ఈ మార్జాలం మర్మమేమిటో తెలుసుకోవాలంటే ప్రభుత్వం తరఫున ఏపీఎమ్ఎస్ఐడీసీ తయారుచేసిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ కొంతమేరకు ఉపయోగపడుతుంది. ఈ పది మెడికల్ కాలేజీల్లో అసలు పనులేమీ జరగలేదనీ, కేవలం పునాదుల్లోనే అవి ఆగిపోయాయని మంత్రులు, ముఖ్యమంత్రి వాదిస్తుండటాన్ని మనం చూస్తున్నాము.

పులివెందుల కాలేజీని తీసుకుంటే అక్కడ ఇప్పటికే 418 కోట్ల 20 లక్షల రూపాయలను నిర్మాణం కోసం ఖర్చుపెట్టినట్టు ఆ పీపీటీలో ప్రభుత్వం అంగీకరించింది. క్యాంపస్ విస్తీర్ణం 47.58 ఎకరాలని అందులో పేర్కొన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఉన్న కాలంలోనే అక్కడ ఎకరా రెండు కోట్ల దాకా ఉన్నదని సమాచారం. మెడికల్ కాలేజీ, అనుబంధ ఆస్పత్రి పని చేయడం ప్రారంభిస్తే ఈ భూమి ధర శరవేగంగా పెరిగే అవకాశముంటుంది. దీన్ని ఏటా ఎకరాకు 100 రూపాయల చొప్పున 66 ఏళ్లపాటు లీజుకు ఇస్తారు. అంటే పులివెందుల కాలేజీ లీజుకు తీసుకునేవారు ఏడాదికి 4,758 రూపాయలు చెల్లిస్తే చాలు. వందకోట్ల విలువైన (ప్రస్తుత ధర) భూమితోపాటు 420 కోట్లతో చేసిన నిర్మాణం 66 ఏళ్లపాటు వారికి సొంతమవుతుంది. ఈ కాలేజీకి కేటాయించిన 150 అండర్‌గ్రాడ్యుయేట్ సీట్లలో 50 శాతం మేనేజ్‌మెంట్ కోటా కింద కేటాయిస్తారు. 15 శాతం ఆలిండియా సీట్లు పోను 35 శాతం సీట్లు రాష్ట్ర విద్యార్థులకు అందుబాటులో ఉంటాయి.



జగన్‌మోహన్‌రెడ్డి సర్కార్ ప్రభుత్వరంగంలో ప్రారంభించిన కాలేజీల్లో సగం సీట్లను కాలేజీల నిర్వహణ కోసం సెల్ఫ్ ఫైనాన్స్ కోటా కింద పెట్టింది. అప్పటి ప్రతిపక్షం దీనిపై గగ్గోలు పెట్టి తాము అధికారంలోకి వస్తే ఆ కోటా ఎత్తివేస్తామని చెప్పిన సంగతి గుర్తుండే ఉంటుంది. ప్రభుత్వ నిర్వహణలో ఉన్న కాలేజీల్లో సెల్ఫ్ ఫైనాన్స్ సీట్లకు ప్రభుత్వం నిర్ధారించిన ఫీజు చెల్లిస్తే సరిపోతుంది. కానీ ప్రైవేట్ యాజమాన్యంలో అది కుదరదు. ప్రభుత్వం నిర్ధారించిన ఫీజుతోపాటు దొడ్డిదారి డొనేషన్లు, డొంకదారి వసూళ్లు చాలా ఉంటాయన్న సంగతి మనకు అనుభవంలో ఉన్న విషయమే. ప్రారంభానికి సిద్ధంగా ఉన్న పులివెందుల కాలేజీని ఉదాహరణగా తీసుకున్నప్పటికీ మిగిలిన 9 కాలేజీల పరిస్థితి ఇంతే. వాటి నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. ఆదోని కాలేజీకి సేకరించిన స్థలం 58.44 ఎకరాలు. అక్కడ ఇప్పుడే ఎకరా 5 కోట్లు ధర పలుకుతున్నది. నిర్మాణం కూడా 70 శాతం పూర్తయింది. మదనపల్లె కాలేజీ స్థలం 95.5 ఎకరాలు. నిర్మాణం 30 శాతం పూర్తయింది. మిగిలిన కాలేజీలు కూడా 50 ఎకరాలకు తగ్గకుండా ఉన్నాయి. ఒకసారి కాలేజీ, ఆస్పత్రి పనిచేయడం ప్రారంభమైతే ఆ స్థలాల ధరలు అనూహ్యంగా పెరుగుతాయి.

మరో ముఖ్యమైన అంశం – కాలేజీలకు అనుబంధంగా ఏర్పడే ఆస్పత్రులు! 650 పడకల ఆస్పత్రులను ప్రతిపాదిస్తున్నారు. ఇందులో 30 శాతం పడకలకు ప్రైవేట్ మేనేజ్‌మెంట్ తన ఇష్టప్రకారం డబ్బులు వసూలు చేసుకోవచ్చు. మిగిలిన 70 శాతం పడకలపై మాత్రం నియంత్రణ ఉంటుంది. ప్రైవేట్ యాజమాన్యాలు ఈ నియంత్రణలను ఏమేరకు పాటిస్తాయన్నది తెలియంది కాదు. తెల్ల రేషన్ కార్డులున్న వారికి 5 శాతం ఉచిత వైద్యాన్ని రిజర్వు చేయాలన్న నిబంధనను కార్పొరేట్ ఆస్పత్రులు ఏమేరకు పట్టించుకుంటున్నాయో తెలిసిన సంగతే! అదే ప్రభుత్వరంగంలో ఉన్నట్లయితే ఇన్‌పేషెంట్లతో పాటు ఔట్ పేషెంట్లు కూడా ఉచిత ఉన్నతస్థాయి వైద్య సౌకర్యాలను పొందే అవకాశం ఉండేది. డబ్బులేని కారణంగా వైద్యవిద్యకు దూరమవుతున్న ఆసక్తి గల విద్యార్థులకు మెడికల్ సీట్లు అందుబాటులోకి తీసుకురావడం, పేద–మధ్యతరగతి ప్రజలకు చేరువలోనే ఉచితంగా స్పెషలిస్టు వైద్య సేవలను అందించడమనే జంట లక్ష్యాల సాధన కోసం జగన్ ప్రభుత్వం 17 మెడికల్ కాలేజీలను ప్రభుత్వ రంగంలో ప్రారంభించింది. ఆ ఆశయాన్ని తుంగలో తొక్కుతూ చంద్రబాబు ప్రభుత్వం ఇప్పుడు అందులో 10 కాలేజీలను ప్రైవేట్ రంగానికి కట్టబెడుతున్నది. వేల కోట్ల విలువ చేయబోయే ఆ స్థలాలను కారుచౌకగా ఏటా రూ. 5 వేలకే కట్టబెట్టడం వెనుక స్కామ్ కాకపోతే మరే కారణం ఉంటుంది?

లక్షలాదిమంది పేద మధ్యతరగతుల ప్రజలను ఉన్నత స్థాయి ఉచిత వైద్యానికి దూరం చేస్తూ, వేలాదిమంది విద్యార్థులూ, వారి తల్లిదండ్రుల డాక్టర్ చదువు కలలను భగ్నం చేస్తూ చంద్రబాబు ప్రభుత్వం ఈ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని తీసుకున్నది. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం మూడు మెడికల్ కాలేజీలకు, పది ఇంజనీరింగ్ కాలేజీలకు ప్రైవేట్‌రంగంలో అనుమతించినప్పుడు చంద్రబాబు చేసిన యాగీ, యెల్లో మీడియా పెట్టిన అల్లరి అప్పటివాళ్లకు గుర్తుండే ఉంటుంది. నాటి ముఖ్యమంత్రి జనార్దన్‌రెడ్డికి 'ధనార్జనరెడ్డి' అనే నామకరణం కూడా బాబు ముఠా చేసింది. ఇప్పుడు ఏకంగా ప్రభుత్వమే నిర్మించి ప్రైవేట్‌కు అప్పగిస్తున్న వ్యవహారాన్ని ఏమనాలి? ఈ ముఖ్యమంత్రికి ఏమని నామకరణం చేయాలి?

ప్రభుత్వ ఆధ్వర్యంలో కాలేజీలు, ఆస్పత్రుల నిర్వహణ బాగుండదని, ప్రైవేట్ యాజమాన్యమైతే సమర్థంగా ఉంటుందనే ఒక డొల్ల వాదనను కూడా ఈ ప్రభుత్వం ముందుకు తెస్తున్నది. ప్రైవేట్ మెడికల్ కాలేజీల నిర్వహణ తీరుపై ఇప్పటికే మనకు పలు అనుభవాలున్నాయి. ఉన్నతాధికారులు తనిఖీలకు వచ్చినప్పుడు దినసరి కూలీలను పేషెంట్ల రూపంలో పడుకోబెట్టడం, అద్దెకు తెచ్చిన వారికి డాక్టర్ల వేషాలు వేసి చూపించడం మీడియాలో చాలాసార్లు రిపోర్టయింది. సౌకర్యాలు లేక, సమర్థులైన సిబ్బంది లేక ప్రైవేట్ మెడికల్ కాలేజీల స్థాయి అథమస్థాయిలో ఉన్నదనే అధ్యయనాలు కూడా వచ్చాయి. వైద్యరంగంలో ప్రైవేట్ నిర్వాకం ఎట్లా ఉంటుందో తాజా ఉదాహరణను ఒకదాన్ని చెప్పుకోవచ్చు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, జిల్లా, ఏరియా ఆస్పత్రుల్లో రక్తపరీక్షలు సరిగ్గా జరగడం లేదని, 2015లో అప్పటి చంద్రబాబు ప్రభుత్వం, ఆ విభాగాన్ని మెడాల్ అనే ప్రైవేట్ సంస్థకు అప్పగించింది. ఒక్కో పరీక్షకు 235 రూపాయలు సంస్థకు చెల్లించారు. 2016 నవంబర్ ఒక్క మాసంలోనే 53 వేల డెంగీ కేసులు నమోదైనట్టు లెక్క రాసి మెడాల్ బిల్లులు క్లెయిమ్ చేసింది. ఈ విషయాన్ని 'సాక్షి' వెలుగులోకి తేవడంతో 7 వేల కేసులే నమోదైనట్టు చివరకు అంగీకరించవలసి వచ్చింది. ఈ రకమైన తప్పుడు లెక్కలతో మూడేళ్లలోనే 360 కోట్ల ప్రజాధనాన్ని ఆ సంస్థ లూటీ చేసింది.

> మరో ముఖ్యమైన అంశం – కాలేజీలకు అనుబంధంగా ఏర్పడే ఆస్పత్రులు! 650 పడకల ఆస్పత్రులను ప్రతిపాదిస్తున్నారు. ఇందులో 30 శాతం పడకలకు ప్రైవేట్ మేనేజ్‌మెంట్ తన ఇష్టప్రకారం డబ్బులు వసూలు చేసుకోవచ్చు. మిగిలిన 70 శాతం పడకలపై మాత్రం నియంత్రణ ఉంటుంది. ప్రైవేట్ యాజమాన్యాలు ఈ నియంత్రణలను ఏమేరకు పాటిస్తాయన్నది తెలియంది కాదు. తెల్ల రేషన్ కార్డులున్న వారికి 5 శాతం ఉచిత వైద్యాన్ని రిజర్వు చేయాలన్న నిబంధనను కార్పొరేట్ ఆస్పత్రులు ఏమేరకు పట్టించుకుంటున్నాయో తెలిసిన సంగతే! అదే ప్రభుత్వ రంగంలో ఉన్నట్లయితే ఇన్‌పేషెంట్లతో పాటు ఔట్ పేషెంట్లు కూడా ఉచిత ఉన్నతస్థాయి వైద్య సౌకర్యాలను పొందే అవకాశం ఉండేది. డబ్బులేని కారణంగా వైద్య విద్యకు దూరమవుతున్న ఆసక్తి గల విద్యార్థులకు మెడికల్ సీట్లు అందుబాటులోకి తీసుకురావడం, పేద-మధ్య తరగతి ప్రజలకు చేరువలోనే ఉచితంగా స్పెషలిస్టు వైద్య సేవలను అందించడమనే జంట లక్ష్యాల సాధన కోసం జగన్ ప్రభుత్వం 17 మెడికల్ కాలేజీలను ప్రభుత్వ రంగంలో ప్రారంభించింది. ఆ ఆశయాన్ని తుంగలో తొక్కుతూ చంద్రబాబు ప్రభుత్వం ఇప్పుడు అందులో 10 కాలేజీలను ప్రైవేట్ రంగానికి కట్టబెడుతున్నది. వేల కోట్ల విలువ చేయబోయే ఆ స్థలాలను కారుచౌకగా ఏటా రూ. 5 వేలకే కట్టబెట్టడం వెనుక స్కామ్ కాకపోతే మరే కారణం ఉంటుంది?

పైవారికి కమీషన్లు సమర్పిస్తున్నామన్న బరితెగింపుతో ఇటువంటి ప్రైవేట్ సంస్థలు ఇష్టారాజ్యంగా ప్రవర్తించడం మనకు కొత్త కాదు. పేదలకు అపర సంజీవనిగా భాసిల్లుతున్న 'ఆరోగ్యశ్రీ'ని కూడా ఓ ప్రైవేట్ బీమా కంపెనీ చేతిలో పెడుతున్నారు. ఆరోగ్యశ్రీ ట్రస్టు ఎక్కడ ఫెయిలైంది? బీమా కంపెనీ ఏరకంగా అంతకంటే మెరుగు? కాదేదీ కమీషన్లకనర్హమా? మానవీయ కోణంలో చూడవలసిన ప్రజారోగ్యాన్ని కూడా కమీషన్ల కోణంలో చూసే దుస్థితికి తీసుకొచ్చారు. ఇప్పటికే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు పడకేశాయి. 'ఫ్యామిలీ డాక్టర్' ఎటో వెళ్ళిపోయాడు. 108, 104 సర్వీసులు కునారిల్లుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో ప్రజారోగ్యం కుప్పకూలింది. భారత రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాల్లో భాగమైన ఆర్టికల్ 47 ప్రకారం ప్రజారోగ్యం ప్రభుత్వాల ప్రాథమిక విధి. పౌరులందరికీ ఉచితంగానే విద్య, వైద్యాలను అందజేయడం ప్రభుత్వాల ప్రాథమిక కర్తవ్యంగా నాగరిక ప్రపంచమంతా గుర్తించింది. కానీ, మనం మాత్రం విద్య, వైద్యాలను కొనుక్కోవాలనే అనాగరిక వ్యవస్థలోకి, రాజ్యాంగ విరుద్ధ పాలనలోకి జారిపోవడం మన అజ్ఞానమా... అమాయకత్వమా... ప్రశ్నించుకోవాలి.

vardhelli1959@gmail.com

సరైన సమయంలో సముచిత నిర్ణయం

అభిప్రాయం



సంజయ్‌కుమార్ అగ్రవాల్

వస్తు సేవల పన్ను మండలి (జీఎస్టీ కౌన్సిల్) 56వ సమావేశం ఇటీవల వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) వ్యవస్థలో ఆమోద ముద్ర వేసిన సంస్కరణలు దేశ పరోక్ష పన్ను వ్యవస్థ పరిణామ క్రమంలో ఓ కీలక ఘట్టం. ఈ సంస్కరణల అమలు ప్రధానంగా మూడు పరస్పర అనుసంధానిత మూల స్తంభాలు – 'సమూల సంస్కరణ, పన్ను హేతుబద్ధీకరణ, చెల్లింపుదారుల జీవన సౌలభ్యం'పై ఆధారపడి ఉంటుంది.

సమూల సంస్కరణల్లో భాగంగా – పన్ను విధింపులో అనిశ్చితి తగ్గింపు ధ్యేయంగా పన్ను శాతాల సంఖ్య కుదింపుపై సునిశిత శ్రద్ధ చూపారు. సామాన్యుల దైనందిన అవసరాలకు ఉపయోగపడే కొన్ని వస్తువులపై స్వల్ప 'మెరిట్' శాతంలోనూ– 'హానికర' (సిన్), విలాస స్వభావం గల వస్తువులపై అధిక 'ప్రత్యేక' శాతంలోనూ పన్ను విధించాలని నిర్ణయించారు. వస్తు, సేవల వర్గీకరణ, పన్నుశాతాలపై అభ్యంతరాలు, వివాదాలకు సంబంధించి అధికశాతం ఆహార, ఆటోమొబైల్ విడిభాగాల రంగాల్లోనే తలెత్తినట్లు ఒక అధ్యయనం వెల్లడించింది. మార్కెట్‌లో ఆహారోత్పత్తుల మధ్య సారూప్యం ఎక్కువగా ఉన్న ఫలితంగా వాటి వర్గీకరణ సమస్యాత్మకమైంది. అలాగే పన్ను శ్లాబుల నిర్ణయం కూడా! ప్రస్తుత సంస్కరణల్లో ఆహార రంగాన్ని ఒకే పన్ను శాతం కిందకు తేవడం ద్వారా గందరగోళం తొలగించారు. అలాగే ఆటోమోటివ్ రంగంలో కూడా... ముఖ్యంగా వాహన విడి భాగాలపై ఏకరూప పన్ను విధింపుపై తీసుకున్న నిర్ణయం ఎంతో ఉపశమనం ఇవ్వడంతోపాటు పరిశ్రమలో విశ్వాసం ఇనుమడించి, వివాదాలకు ముగింపు పలుకుతుంది.



◆ జీఎస్టీ సంస్కరణల అమలు ప్రధానంగా మూడు పరస్పర అనుసంధానిత మూల స్తంభాలు – 'సమూల సంస్కరణ, పన్ను హేతుబద్ధీకరణ, చెల్లింపుదారుల జీవన సౌలభ్యం'పై ఆధారపడి ఉంటుంది.

జీఎస్టీ వ్యవస్థలో విలోమ సుంకం పద్ధతి (ఇన్‌వర్టెడ్ టాక్స్ సిస్టమ్–ఐడీఎస్) నిరంతర సమస్యాత్మకంగా మారింది. దీనికింద వస్తు తయారీ ముడిసామగ్రిపై విధించే పన్ను, తయారైన వస్తువుపై విధించే పన్ను కన్నా ఎక్కువగా ఉంటుంది. పర్యవసానంగా 'ముడి సామగ్రిపై పన్ను వాపసు' (ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్–ఐటీసీ) మొత్తం పేరుకుపోతూ ఉంటుంది. పారిశ్రామిక రంగంలోని అనేక విభాగాలలో ముడి సామగ్రి వినియోగ స్వభావం కలిగి ఉంటుంది. వాటిపై సరైన రీతిలో విలోమ శాతం పన్ను విధించడంలో కొంత సంక్లిష్టత ఉంటుంది. అయితే, ఇప్పుడు వీలైన ప్రతి సందర్భానికీ తగినట్లు... ముఖ్యంగా ఎరువుల పరిశ్రమలో ముడి పదార్థం ప్రధానంగా ఒకే తరహా ఉత్పత్తికి ఉపయోగపడుతుంది కాబట్టి, విలోమ పన్ను విధింపు పద్ధతిని సరిదిద్దారు.

'ఎంఎస్ఎంఈ'లు ఎక్కువగా ఉన్న రంగాల్లో 'ఐడీఎస్' ప్రభావం మరింత స్పష్టంగా కనిపిస్తుంది. ఉదాహరణకు దేశంలో 4.5 కోట్ల మందికిపైగా ఉపాధి పొందే వస్త్ర పరిశ్రమకు సంబంధించి చేతితో వడికిన–నేసిన ఉత్పత్తుల నుంచి భారీ మిల్లుల ఉత్పత్తుల మధ్య వైవిధ్యం చాలా ఎక్కువగా ఉంటుంది. వాటి స్వభావం ప్రకారం దుస్తులపై సుంకం 5 శాతం వంతున... సుంకం 'మెరిట్' రేటుకు లోబడి ఉంటుంది. ఇక్కడ వస్త్ర రంగంలోని సహజ నూలు విభాగంలో విలోమం లేకపోయినా, మానవ శ్రమతో తయారైన వస్త్ర విభాగంలో ఉంటుంది. అయితే, రాబడి పరంగా చిక్కుల వల్ల వీటి మొత్తం విలువ శ్రేణిలో విలోమాన్ని సరిదిద్దడం దాదాపు అసాధ్యం. అయినప్పటికీ, ఈ వ్యత్యాసం 'ఎంఎస్ఎంఈ'లపై అనవసర భారం పడని రీతిలో ఉండేవిధంగా జాగ్రత్త వహించారు.

తాజా సంస్కరణల ప్రక్రియను సామాన్యులు, మధ్యతరగతి ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించే కసరత్తుగా తొలుత భావించారు. దీని ప్రకారం– జనసామాన్యం వాడే వస్తువులతో విలాసవంతమైనవిగా పరిగణించే కొన్ని వస్తువులపై పన్నును 'మెరిట్' శాతానికి తగ్గించారు. తద్వారా విస్తృత జనాభా కొనుగోలు శక్తి పెరుగుతుంది కాబట్టి, డిమాండ్ కూడా పెరుగుతుంది. మొత్తం మీద ఈ సూత్రాలన్నీ కలిసి పన్ను శాతాల క్రమబద్ధీకరణ కసరత్తు హేతుబద్ధతకు రూపమిచ్చాయి.

రాష్ట్రాలకు 2022 జూలై తర్వాత పరిహార సుంకం వసూళ్లలో వాటా చేరడం లేదు. కోవిడ్ మహమ్మారి సమయంలో వసూళ్ల లోటు తగ్గించే దిశగా అవి తీసుకున్న రుణానికి దీన్ని జమ చేసుకోవడమే ఇందుకు కారణం. ఇప్పుడు ఆ చెల్లింపులన్నీ దాదాపు పూర్తయ్యాయి కాబట్టి, కేంద్రంతోపాటు రాష్ట్రాలకూ 'జీఎస్టీ' వసూళ్లు పెరిగేందుకు తగిన ఆర్థిక వెసులుబాటు లభిస్తుంది.

జీఎస్టీ వ్యవస్థతో పన్ను చెల్లింపుదారుల లావాదేవీలను ప్రతి దశలోనూ సరళీకరించే మార్గదర్శక సూత్రం ఈ సంస్కరణలకు మూడో మూలస్తంభం. తదనుగుణంగా వ్యాపారాల రిజిస్ట్రేషన్, పన్ను వాపసుల అంశాన్ని ఇవి లక్ష్యం చేసుకుంటాయి. దీంతో పన్ను చెల్లింపుదారులకు విధానపరమైన ఇబ్బందుల తగ్గడంతోపాటు నిర్వహణ మూలధన సమీకరణలో అడ్డంకులు తొలగుతాయి.

ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ఇప్పటికే ఎదిగింది. ఇక ప్రస్తుత సంస్కరణల ద్వారా దేశీయ డిమాండ్ దృఢం కావడం వల్ల మరిన్ని ప్రయోజనాలు పొందుతుంది. 'స్వయం సమృద్ధ భారత్' స్వప్న సాకారం దిశగా విస్తృత జాతీయ దృక్కోణం బలపడేందుకు ఈ సంస్కరణలు ప్రధానంగా తోడ్పడతాయి.

వ్యాసకర్త కేంద్రీయ ప్రత్యక్ష పన్నులు–సుంకాల బోర్డు చైర్మన్

పోరాట రూపంలో పంటల పండుగ

ఇన్ బాక్స్



ప్రపంచవ్యాప్తంగా అంది వచ్చిన పంటలకు పండుగలు చేయడం ఏదో రూపంలో కొనసాగుతూనే ఉంది. అందులో తెలంగాణలో బొడ్డెమ్మతో మొదలై బతుకమ్మ దాకా నవధాన్యాలకు పూలతో స్వాగతమిచ్చే సద్దుల బతుకమ్మ అచ్చమైన పంటల పండుగే. 15 ఏళ్లుగా 'బహుజన బతుకమ్మ' చేసిన పరిశోధన ఈ పండుగ పంటలతో ముడివడిన వైనాన్ని చాటుతోంది. కొద్దిమందిని అంటరానివారిగా చిత్రిస్తున్న తీరును విమర్శిస్తోంది. కుల, మత పరిమితులకు అతీతంగా బతుకమ్మను ఒక లౌకిక ఉత్సవంగా తీర్చిదిద్దుతూ, బతుకమ్మను ప్రజాస్వామీకరించే కృషి చేస్తోంది. అలాగే బహుజన బతుకమ్మ కేవలం ఉత్సవమే కాదు ఉద్యమం అంటూ చాటుతోంది. ప్రతి ఏటా ఒక జ్వలిత సమస్యను పండుగకు జోడించి ప్రజలను చైతన్యవంతం చేస్తున్న విధంగానే ఈ ఏడు 'ప్రకృతి రక్షణే ప్రజల రక్షణ' అంటూ సెప్టెంబర్ 14న ఉదయం 10 గంటలకు హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్స్‌లో బహుజన బతుకమ్మ పాట ఆవిష్కరణ కార్యక్రమం ప్రారంభమవుతుంది. ఆ తర్వాత సెప్టెంబర్ 20న ఉస్మానియాలో మొదలై అక్టోబర్ 3న నిజామాబాద్ జిల్లా ముప్కాల్‌లో ముగుస్తుంది. తెలంగాణ గ్రామ లోగిళ్ళు మాతృస్వామిక ఆనవాళ్లను కలిగి ఆడబిడ్డను గౌరవించడం నేటికీ కొనసాగుతోంది. ప్రతి శుభ కార్యానికీ ముందో–వెనకో గ్రామదేవతలకు భోజనంగా వండి పెట్టడం ఆనవాయితీ. ఈ భోజనంతో కూడిన బోనాలను, 'సద్దుల బతుకమ్మ'ను తెలంగాణ ఆవిర్భావం తర్వాత రాష్ట్ర పండుగలుగా ప్రకటించుకున్నాం. ఇచ్చిపుచ్చుకునే సద్దుల్లో కులగోడలు లేకుండా సమష్టి భావన వెల్లి విరియాలి. పంటల పండుగ లౌకిక విలువలతో సాగినప్పుడు పండుగలు ప్రజాస్వామ్యీకరించబడుతాయి.

తెలంగాణ రాష్ట్ర సాధనోద్యమంలో బతుకమ్మలు కూడా ఒక పోరాట రూపమయ్యాయి. నల్లమలలో యురేనియం తవ్వకాలు వద్దంటూ, మద్యపానాలను పల్లె నుండి, ప్రజల జీవితాల నుండి తరిమెయ్యాలంటూ, పితృస్వామ్య అణిచివేతలు ఆగాలంటూ, అంటరానితనం పోవాలంటూ, ప్రకృతి వ్యవసాయం వర్ధిల్లాలంటూ ఎన్నో జన జీవిత సమస్యలపై బహుజన బతుకమ్మ పోరాట ఉద్యమాలను నిర్వహిస్తూనే ఉంది. **'అడవులన్నీ పయిలంగా/ఆపదలన్ని దూరంగా/సప్పట్లే మిరుమట్లవ్వంగా'** అంటూ బహుజన బతుకమ్మ పాటను, బహుజనుల జన జీవితాలను నిత్య నూతనంగా ఆవిష్కరించుకుందాం.

– విమలక్క । అధ్యక్షురాలు, 'బహుజన బతుకమ్మ'

సరికాని కోరిక



"అర్జునా! నిప్పులో ఎంత నెయ్యి, కట్టె వేసినా... అగ్ని ఎప్పుడూ సంతృప్తి చెందదు. పైగా, కట్టెలను వేస్తున్న కొద్దీ అది తనలోకి తీసుకుని మండుతూనే ఉంటుంది. అగ్నిని దేనితోనూ నింపలేము. అది ఏ దశలోనూ సంతృప్తి చెందదు. అదే విధంగా, 'సరి కాని కోరిక' కూడా" అని అన్నాడు శ్రీకృష్ణుడు. అగ్నిలాగా సుఖాలను మాత్రమే అనుభవించాలనే మానవునిలో సరికాని కోర్కె పెరుగుతూనే ఉంటుంది. అతను ఎప్పటికీ సంతృప్తి చెందలేడు. అది తరగని కోరిక. ఈ 'సరికాని కోరిక' జ్ఞానులకు శత్రువు.

ఎందుకంటే ఈ కోరిక విజయం సాధించాలనుకునే వారి మనస్సులలో జ్ఞానం, ఉత్సాహం, నిర్లిప్తతలను ఉండనివ్వదు. ఈ సరికాని కోరిక జ్ఞానులకు మాత్రమే కాదు, మానవులుగా జన్మించిన వారందరికీ కూడా శత్రువే! అది అతణ్ణి తన ప్రస్తుత స్థాయి నుంచి కింది స్థాయికి నెడుతుంది. జ్ఞానం లేనివాడు, సుఖాలను మాత్రమే అనుభవించాలనే మనిషి 'సరి కాని కోరిక'ను తన స్నేహితుడిగా భావిస్తాడు. జన్మ ఉద్దేశ్యం తెలియని మనిషి జ్ఞానాన్ని కాదని జీవితాన్ని వ్యర్థం చేసుకుంటాడు. జీవితాన్ని నాశనం చేసుకుంటాడు.

కోరిక నిప్పు లాంటిది. నిప్పులో నెయ్యి పోస్తే, అది మరింత ప్రకాశవంతంగా మండుతుంది. అదేవిధంగా, ఒక కోరికను నెరవేర్చుకున్న తర్వాత సంతృప్తి, అనుభూతి చెందుతున్నట్లు అనుకోవచ్చు. కానీ కోరికలు అలా ఉండనివ్వవు. ఒక కోరిక నెరవేరిన తర్వాత మరొక దానిని కోరుకుంటాం. అనంతరం ఇంకొక కోరిక. ఇలా కోర్కెలు కొనసాగుతూనే ఉంటాయి. చివరికి జీవితం ఏదీ సాధించకుండానే ముగిసిపోతుంది. కాబట్టి స్థాయిని ఎరిగి మనుగడ సాగించడం ప్రధానం.

– యామిజాల జగదీశ్

క్లుప్తంగా...

పాము కాటుతో యువ రైతు మృతి



లింగమయ్య

మంచాల: పొలంలో వ్యవసాయ పనులు చేస్తూ పాము కాటుకు గురైన ఒక యువ రైతు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. సీఐ మధు తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా మంచాల మండలం జాపాలకు చెందిన దొంతరమోని లింగమయ్య (33).. శుక్రవారం తన పొలంలో పనులు చేస్తుండగా ఎడమ కాలికి పాము కాటేసింది. వెంటనే అతన్ని ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి ఉస్మానియాకు తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం చనిపోయాడు. మృతునికి భార్య పూజ ఉంది.

కన్నతల్లిని రోడ్డుపై వదిలేసిన కూతుళ్లు



కూతుళ్లు రోడ్డుపై వదిలివేయడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్న సోమక్క

దంతాలపల్లి: కన్న తల్లిని కూతుళ్లు రోడ్డుపై వదిలేసిన హృదయ విదారక ఘటన మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం గున్నెపల్లిలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రామగిరి సోమక్క–మల్సూరు దంపతులకు ఐదుగురు కుమార్తెలు కీర్తి యాకమ్మ, ఆత్మకూరి రమాదేవి, సింగు లలిత, దీకొండ ఉమా, దీకొండ లక్ష్మి ఉన్నారు. దంపతులు కష్టపడి నలుగురు కుమార్తెల వివాహాలు చేశారు. 30 సంవత్సరాల క్రితం మల్సూరు మృతి చెందాడు. దీంతో సోమక్క కష్టపడి చిన్నకూతురు వివాహం చేయడంతోపాటు అన్నీతానై కూతుళ్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకుంది. ఇప్పుడు సోమక్క వృద్ధురాలై మంచానికే పరిమితమైంది. గ్రామంలోనే కూతుళ్లు దీకొండ ఉమా, ఆత్మకూరి రమాదేవి ఉంటున్నారు. రమాదేవి మాత్రం సంవత్సరం నుంచి తల్లికి సపర్యలు చేస్తోంది. మిగిలిన నలుగురు కూతుళ్లు పట్టించుకోకపోవడంతో తాను ఒక్కదానినే ఎన్ని రోజులు సేవలు చేయాలంటూ శనివారం సోమక్కను రమాదేవి నడిరోడ్డుపై వదిలేసింది. దీంతో దిక్కుతోచని వృద్ధురాలు రోడ్డుపై కూర్చోవడం ప్రజలను కలిచివేసింది.

తల్లిని హతమార్చిన కుమారుడు

- భార్యతో కలిసి గొంతునులిమి దారుణం
- నాగర్‌కర్నూల్ జిల్లా ఎండబెట్లలో ఘటన



అలివేలు

నాగర్‌కర్నూల్ క్రైం: కుటుంబ కలహాలతో కన్న తల్లిని ఓ కొడుకు తన భార్యతో కలిసి గొంతు నులిమి దారుణంగా హతమార్చాడు. నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీ పరిధిలోని ఎండబెట్లలో శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకున్న ఈ ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. ఎండబెట్ల గ్రామానికి చెందిన అలివేలు (50) భర్త ఏడేళ్ల క్రితం మృతిచెందాడు. ఈ నేపథ్యంలో కుమారుడు శివతో కలిసి ఉంటోంది. అయితే వీరి మధ్య చాలాకాలంగా గొడవలు జరుగుతుండటంతో కుమారుడు శివ తల్లిపై కోపం పెంచుకున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం అర్ధరాత్రి ఇంట్లో నిద్రిస్తున్న అలివేలును కుమారుడు శివ, కోడలు పద్మ ఇద్దరు కలిసి గొంతు నులిమి చంపారు. ఎవరికీ అనుమానం రాకుండా ఐతోలులోని తన అక్కకు శివ ఫోన్ చేసి అమ్మ చనిపోయిందని చెప్పడంతో అందరూ ఎండబెట్ల గ్రామానికి చేరుకున్నారు. అయితే అలివేలు గొంతుపై రక్తపు మరకలు గుర్తించి అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు వచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనరల్ ఆస్పత్రికి తరలించి అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ ఘటనపై అలివేలు కూతురు మణెమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు. కాగా అలివేలును ఆస్తి కోసమే హత్య చేసి ఉంటారని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.



సూర్యాపేట జిల్లా ఆత్మకూర్ (ఎస్) మండల కేంద్రంలోని ఏపూర్ పీఏసీఎస్ ఎదుట పోలీస్ బందోబస్తు మధ్య యూరియా కోసం నిరీక్షిస్తున్న రైతులు



మెదక్ జిల్లా చేగుంటలోని రైతువేదిక వద్దకు యూరియా కోసం శనివారం వేలాది మంది రైతులు చేరుకున్నారు. శుక్రవారం చిన శంకరంపేటలో టోకెన్ల కోసం మహిళలు చెప్పులతో కొట్టుకున్న నేపథ్యంలో పోలీసులు శనివారం అప్రమత్తమయ్యారు. జిల్లా ఎస్పీ ఏకంగా సాయుధ పోలీసు బలగాలైన 'క్విక్ రియాక్ట్ టీం'(క్యూఆర్‌టీ) బృందాలను రంగంలోకి దించారు. మెదక్ నుంచి 20 మంది క్యూఆర్‌టీ పోలీసులను చేగుంటకు రప్పించి వారితోనే రైతులకు టోకెన్లు ఇప్పించారు.

రాణాలో టోకెన్లు!

▶ మొదటి పేజీ తరువాయి

అత్యవసరం. అదును తప్పితే యూరియా వేసినా ఉపయోగం ఉండదు. దీంతో రైతులు సొసైటీ ఆఫీసులు, యూరియా దుకాణాల ముందు రాత్రీ పగలు పడిగాపులు పడుతున్నారు. రాష్ట్రంలోని 500 రైతు వేదికల వద్ద యూరియా పంపిణీ జరుపుతున్నట్లు మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ప్రకటించారు. దీంతో ఆయా క్లస్టర్ల పరిధిలోని గ్రామాల ప్రజలంతా ఉదయాన్నే రైతు వేదికల వద్దకు వచ్చి లైన్లల్లో నిలబడుతున్న దృశ్యాలు దాదాపు అన్ని జిల్లాల్లో కనిపిస్తున్నాయి. వరినాట్లు ముందుగా పడే ఉత్తర తెలంగాణ జిల్లాల్లో మలిదశ యూరియా వాడకం కోసం రైతులు పడుతున్న పాట్లు వర్ణనాతీతంగా ఉన్నాయి. 'అదను తప్పుతోంది.. ఒక్క బస్తా అయినా ఇప్పించండి' అని కామారెడ్డి, నిజామాబాద్, నల్లగొండ, కరీంనగర్, జగిత్యాల మొదలైన జిల్లాల రైతులు అధికారులను ప్రాధేయపడుతున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. యూరియా కొరత లేకుండా కేంద్రంతో మాట్లాడి తెప్పిస్తున్నట్లు మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు రోజూ ప్రకటనలు ఇస్తున్నా.. వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి.

ఉన్నది 23 వేల మెట్రిక్ టన్నులే..

రాష్ట్రానికి కేంద్రం నుంచి వస్తున్న యూరియా ఏ రోజుకు ఆరోజే అన్నట్లుగా అయిపోతోంది. నిల్వ లేకుండా డిమాండ్‌కు అనుగుణంగా వ్యవసాయ శాఖ, మార్క్‌ఫెడ్ అధికారులు యూరియాను ఆయా జిల్లాల్లో డిమాండ్ అధికంగా ఉన్న మండలాలకు పంపిస్తున్నారు. రైల్వే వ్యాగన్ల ద్వారా ప్రతీరోజు 5 వేల టన్నులకు తగ్గకుండా యూరియాను కేంద్రం నుంచి తెప్పిస్తున్నా.. అది ఏమూలకు సరిపోవడం లేదు. శనివారం ఉదయం 10 గంటలకు రాష్ట్రంలో 23 వేల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు మాత్రమే ఉన్నాయి. అందులో సొసైటీల వద్ద 6 వేల మెట్రిక్ టన్నులు, ప్రైవేటు డీలర్ల వద్ద 7 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే ఉంది. ఉదయం దుకాణాలు తెరిచిన వెంటనే టోకెన్ల ప్రకారం ఒక్కో రైతుకు ఒక బస్తా చొప్పున ఈ నిల్వల్లో 70 శాతం వరకు పంపిణీ చేసి, మిగతా నిల్వను మరుసటి రోజు కోసం దాచిపెడుతు న్నారు. మార్క్‌ఫెడ్ గోదాముల్లో ఉన్న 10 వేల మెట్రిక్ టన్నులను ఆచితూచి పంపిస్తున్నారు. వీటి కి తోడు ఆ రోజు వచ్చే రైల్వే వ్యాగన్ల లోడ్ మీదనే వ్యవసాయ శాఖ, మార్క్‌ఫెడ్ ఆధారపడుతోంది.

సరఫరా చేసింది 7 లక్షల టన్నులు..

రాష్ట్రంలో ఈ వానాకాలం సీజన్‌లో ఇప్పటివరకు సరఫరా చేసిన యూరియా 7 లక్షల మెట్రిక్ టన్నులు. రాష్ట్రంలో ఈ సీజన్‌లో 1.31 కోట్ల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. 1.32 కోట్ల ఎకరాల్లో పంటలు సాగవుతాయని అంచనా వేయగా, ఒక లక్ష ఎకరాలు తక్కువగా అంచనాలో 98 శాతం మేర సాగయ్యాయి. రాష్ట్రంలో రికార్డు స్థాయిలో సాగు విస్తీర్ణం ఉన్నది ఈ సీజన్‌లోనే. ఇందులో యూరియా అత్యధికంగా వినియోగించే వరి ఏకంగా వ్యవసాయ శాఖ అంచనాలకు మించి 104 శాతం సాగైంది. 65.52 లక్షల ఎకరాల్లో వరి పంట సాగుచేశారు. మొక్కజొన్న కూడా అంచనాకు మించి 122 శాతం.. అంటే 6.36 లక్షల ఎకరాల్లో సాగైంది. పత్తి 45.76 లక్షల ఎకరాల్లో సాగు చేశారు. ఈ మూడు పంటలకే కాకుండా ఉద్యాన పంటలకు కూడా యూరియా వినియోగం అధికంగా ఉండడంతో రైతులకు ఈ పరిస్థితి తలెత్తింది. గత సంవత్సరం కన్నా దాదాపు 10 లక్షల ఎకరాలు పంటల విస్తీర్ణం పెరగ్గా, యూరియా కేటాయింపులు మాత్రం తగ్గాయి. ఈ నెలాఖరు వరకు 9.91 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా రాష్ట్రానికి రావాల్సి ఉండగా, ఇప్పటివరకు వచ్చింది 7 లక్షల మెట్రిక్ టన్నులే. కనీసం మరో 2 లక్షల మెట్రిక్ టన్నులు వెంటనే వస్తే తప్ప రైతులకు బాధలు తప్పవు. అదను తప్పిపోయిన తరువాత యూరియా వచ్చినా ఉపయోగం లేదని రైతన్నలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఏప్రిల్ నెల నుంచే యూరియా విక్రయంలో రేషన్ పద్ధతి పాటించేలా చేయడంలో విఫలమైన అధికార యంత్రాంగం.. చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా వ్యవహరిస్తోంది. దీంతో సామాన్య చిన్న, సన్నకారు రైతులు ఒక్కో యూరియా బస్తా కోసం పడిగాపులు పడుతున్నారు.

పోలీసు స్టేషన్‌లో రైతుల బారులు

- కామారెడ్డి జిల్లా బీబీపేటలో యూరియా టోకెన్ల కోసం క్యూ
- ఫిట్స్‌తో స్పృహ తప్పి పడిపోయిన రైతు
- సూర్యాపేట జిల్లాలో వర్షంలోనే యూరియా కోసం పడిగాపులు
- మహబూబాబాద్ జిల్లాలో యూరియా దొరక్క రైతు ఆత్మహత్యాయత్నం



పీహెచ్‌సీలో రైతుకు ప్రథమ చికిత్స చేస్తున్న సిబ్బంది



స్పృహ తప్పి పడిపోయిన రైతు రేకయ్య

బీబీపేట/ఆత్మకూర్ (ఎస్) (సూర్యాపేట)/బోనకల్/ కొత్తగూడ: రాష్ట్రంలో అనేకచోట్ల యూరియా కోసం పోరాటాలు జరుగుతూనే ఉన్నాయి. కామారెడ్డి జిల్లా బీబీపేట మండల కేంద్రంలో శనివారం పోలీసుస్టేషన్‌లో రైతులకు యూరియా టోకెన్లు పంపిణీ చేయాల్సి వచ్చింది. శుక్రవారం రాత్రి ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రానికి 662 బస్తాల యూరియా రావడంతో అర్ధరాత్రి నుంచే దాదాపు వెయ్యిమంది రైతులు సొసైటీ వద్ద క్యూ కట్టారు. శనివారం ఉదయం వారికి టోకెన్లు పంపిణీ చేయటం ప్రారంభించగానే ఒకరినొకరు తోసుకున్నారు. వారిని అదుపు చేసేందుకు పోలీసులు కొందరు రైతులపై చేయి చేసుకోవటంతో రైతులు పోలీసుల పైకి రాళ్లు రువ్వారు. దీంతో కానిస్టేబుల్ నవీన్‌కు గాయాలయ్యాయి. పరిస్థితి అదుపు తప్పటంతో టోకెన్ల పంపిణీని పోలీసుస్టేషన్‌కు మార్చారు. ఎస్‌ఐ ప్రభాకర్ అధ్వర్యంలో రైతులను నాలుగు వరుసల్లో కూర్చోబెట్టి ఒక్కరికి ఒక బస్తా చొప్పున టోకెన్లను పంపిణీ చేశారు. రైతులను అదుపుచేసేందుకు దోమకొండ పోలీసుస్టేషన్ నుంచి కూడా పోలీసులను రప్పించారు. క్యూలో వేచి ఉన్న మల్కాపూర్ గ్రామానికి చెందిన రైతు గట్కు రేకయ్యకు ఫిట్స్ రావడంతో పోలీసు వాహనంలోనే ఆస్పత్రికి తరలించారు.

వర్షంలో తడుస్తూ..: సూర్యాపేట జిల్లా ఆత్మకూర్ (ఎస్) మండల కేంద్రంలోని ఏపూర్ పీఏసీఎస్ వద్ద కూడా శనివారం పోలీస్ భద్రత నడుమ యూరియా పంపిణీ చేశారు. మధ్యాహ్న సమయంలో ఒక్కసారిగా వర్షం వచ్చినా రైతులు క్యూ లైన్‌లోనే తడుస్తూ నిల్చున్నారు. ఖమ్మం జిల్లా బోనకల్ మండలం నారాయణపురంలోని పీఏసీఎస్‌కు శనివారం 600 మంది రాగా, స్టాకు 250 బస్తాలే వచ్చింది. అందులో 120 మందికి ఒక్కో బస్తా చొప్పున పంపిణీ చేశారు. ఇంకా 130 బస్తాలే ఉండడం, రైతులు 480 మంది మిగలటంతో పంపిణీని నిలిపివేశారు. ఎస్‌ఐ పొదిలి వెంకన్న ఆదివారం ఉదయం యూరియా పంపిణీ ఉంటుందని చెప్పినా ఇళ్లకు వెళ్తే ఉదయం క్యూ పెరిగి యూరియా దొరకదనే భయంతో రైతులు సొసైటీ వద్దే రాత్రి కూడా పడిగాపులు కాస్తున్నారు. యూరియా దొరకడం లేదని మనస్తాపం చెందిన మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం బూరుగు గుంపునకు చెందిన రైతు మల్లెల నర్సయ్య గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆయనను ఆస్పత్రికి తరలించారు. నర్సయ్య ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని తెలిపారు.

చర్చలతో లాభం లేదు

▶ మొదటి పేజీ తరువాయి

విజ్ఞప్తి చేశారు. మావోయిస్టు పార్టీ సీనియర్ నాయకురాలు, ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యురాలు పోతుల పద్మావతి, అలియాస్ కల్పన అలియాస్ సుజాతక్క శనివారం పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఈ సందర్భంగా డీజీపీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఇంటెలిజెన్స్ డీజీ శివధర్‌రెడ్డి, ఎస్‌ఐబీ చీఫ్ బి.సుమతిలతో కలసి డీజీపీ జితేందర్ మాట్లాడారు. ఈ ఏడాది ఇప్పటివరకు మావోయిస్టు పార్టీకి చెందిన 404 మంది సభ్యులు తెలంగాణ పోలీసుల ఎదుట లొంగిపోయారని, తెలంగాణలో జరిగిన ఎన్‌కౌంటర్లలో 10 మంది మృతి చెందారని తెలిపారు. నంబాల కేశవరావు మృతి తర్వాత మావోయిస్టు పార్టీ నాయకుడు ఎవరన్నది తెలియదని, పలు పేర్లు ప్రచారంలోకి వస్తున్నాయని పేర్కొన్నారు. ఇంటెలిజెన్స్ డీజీ శివధర్‌రెడ్డి మాట్లాడుతూ లొంగిపోయిన మావోయిస్టుల విషయంలో ప్రభుత్వం సానుభూతితోనే వ్యవహరిస్తుందని వెల్లడించారు. ఆరోగ్యపరమైన సమస్యలకు చికిత్సతోపాటు రివార్డు మొత్తాన్ని ఇస్తామని తెలిపారు. మావోయిస్టులలో తెలంగాణకు చెందిన 78 మంది దేశవ్యాప్తంగా వివిధ హోదాల్లో పనిచేస్తున్నట్టు తెలిపారు. రాష్ట్ర కమిటీలో 11 మంది తెలంగాణ వాళ్లు ఉన్నారన్నారు.

43 ఏళ్ల అజ్ఞాతం వీడిన సుజాత..

తొలుత జననాట్యమండలిలో చేరిన పోతుల పద్మావతి, అలియాస్ సుజాత 43 ఏళ్ల అజ్ఞాత జీవితంలో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యురాలి స్థాయి వరకు చేరారు. గద్వాల జిల్లా గట్టు మండలంలోని పెంచికలపాడు గ్రామానికి చెందిన ఆమె మావోయిస్టు పార్టీ అగ్రనేత మల్లోజుల కోటేశ్వరరావు అలియాస్ కిషన్‌జీని 1984లో వివాహం చేసుకున్నారు. 1989 వరకు పెరిమిలి దళంలో, తర్వాత ఎటపల్లి దళంలో పనిచేసిన సుజాత 1996లో ఉత్తర గడ్చిరోలి దేవూరి దళ కమాండర్‌గా, 1997–99 వరకు దక్షిణ బస్తర్ కమిటీ డివిజన్ కమిటీ మెంబర్‌గా, 2001లో దండకారణ్య ప్రత్యేక జోనల్ కమిటీ రాష్ట్ర కమిటీ సభ్యురాలిగా బాధ్యతలు నిర్వహించారు. 2018లో జనతన్ సర్కార్ పూర్తి బాధ్యతలు స్వీకరించారు. 2022లో గెరిల్లా స్థావరం దక్షిణ సబ్‌జోనల్ బ్యూరో కార్యదర్శిగా, 2023లో కేంద్ర కమిటీ సభ్యురాలిగా పదోన్నతి పొందారు. కోయ భాషలో వచ్చే పేతురి పత్రిక సంపాదకురాలిగా పనిచేశారు. ప్రస్తుతం సుజాత ఆరోగ్యం క్షీణించడంతో రాష్ట్ర డీజీపీ సమక్షంలో శనివారం లొంగిపోయారు. ఈ సందర్భంగా డీజీపీ జితేందర్.. ఇంటెలిజెన్స్ డీజీ శివధర్‌రెడ్డి, ఎస్‌ఐబీ చీఫ్ సుమతితో కలసి సుజాతకు రూ.25 లక్షల రివార్డు చెక్కును అందించారు.

రెండు నెలలుగా అందని జీతం..

- ఆర్థిక ఇబ్బందులతో కంప్యూటర్ ఆపరేటర్ ఆత్మహత్య



సోమిరెడ్డి

భానుపురి (సూర్యాపేట): రెండు నెలలుగా జీతం నిలిచిపోవడంతో ఆర్థిక ఇబ్బందులతో కంప్యూటర్ ఆపరేటర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం ముకుందాపురం గ్రామానికి చెందిన ఏలేటి సోమిరెడ్డి (30) ఇదే జిల్లాలోని తుంగతుర్తి ఎంపీడీవో కార్యాలయంలో 2014 నుంచి ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్నాడు. 2 నెలల క్రితమే డిప్యుటేషన్‌పై సూర్యాపేట కలెక్టరేట్‌లోని డీపీవో కార్యాలయానికి వెళ్లాడు. ఇతనికి ప్రతినెలా రూ.19,500 వేతనం రావాల్సి ఉండగా చివరగా జూలైలో పెండింగ్‌లో ఉన్న మూడు నెలల వేతనం పడింది. నాటినుంచి మరో 2 నెలల జీతం రావాల్సి ఉంది. సోమిరెడ్డి గతంలో జరిగిన ఓ రోడ్డు ప్రమాదం తర్వాత మానసికంగా కొంత ఇబ్బంది పడినట్లు తెలుస్తోంది. మానసిక ఇబ్బందులతోపాటు వేతనం పెండింగ్‌లో ఉండటంతో ఆర్థిక ఇబ్బందులతో శుక్రవారం సాయంత్రం నల్లగొండ సమీపంలో రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కాగా, సోమిరెడ్డి ఆత్మహత్యకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యానాల శేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు.

యూరియా కోసం పోలీసుస్టేషన్లకు వెళ్లాలా?

- మాజీ మంత్రి హరీశ్‌రావు



నిరుద్యోగ యువతతో మాట్లాడుతున్న మాజీమంత్రి హరీశ్‌రావు

సాక్షి, హైదరాబాద్/సిద్దిపేట జోన్: యూరియా కోసం పొలాలు వదిలి పోలీసు స్టేషన్లకు రైతులు వెళ్లి పడిగాపులు కాసే దుస్థితిని కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిందని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ నేత హరీశ్‌రావు విమర్శించారు. కామారెడ్డి జిల్లాలో రైతులను పోలీసు స్టేషన్‌కు తరలించిన ఘటనపై శనివారం ఒక ప్రకటనలో ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. నాడు భూమి కోసం పోరాడిన లగచర్ల దళిత, గిరిజన, బలహీనవర్గాల రైతులపై అక్రమ కేసులు బనాయించి సంకెళ్లు వేస్తే.. నేడు యూరియా కోసం పోలీసుస్టేషన్లకు వెళ్లేలా చేశారని మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డికి పాలన చేతగాక రైతులను అరిగోస పెడుతున్నారని, అన్నదాతలను నడిరోడ్లకు ఈడ్చి వికృతానందం పొందుతున్నారని ధ్వజమెత్తారు. రైతులను పోలీసు స్టేషన్లలో పెట్టి ఎరువులు పంపిణీ చేసే పరిస్థితులు తెచ్చిన సీఎం చరిత్రహీనుడిగా మిగిలిపోక తప్పదని అన్నారు. గ్రూప్–1 పరీక్షల నిర్వహణపై హైకోర్టు సిట్టింగ్ న్యాయమూర్తితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సిద్దిపేటలో శనివారం మెగా జాబ్‌మేళాను హరీశ్‌రావు ప్రారంభించి మాట్లాడారు. గ్రూప్–1 పరీక్షల నిర్వహణ దారుణంగా ఉందని, నిర్లక్ష్యంగా వ్యవహరించారని హైకోర్టు మొట్టికాయలు వేసినా ప్రభుత్వానికి బుద్ధిరాలేదని విమర్శించారు. గ్రూప్–1 అభ్యర్థులు ఫలానా మంత్రులు, ఫలానా అధికారులు రూ.లక్షలు అడిగారని నేరుగా ఆరోపణలు చేస్తున్నారని, దీనిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదే రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్.. రెండేళ్లయినా పది వేల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదని మండిపడ్డారు.

లొంగుబాట్లకు తెలంగాణనే సేఫ్!

- ఆపరేషన్ కగార్‌తో బస్తర్‌లో మావోలపై నిర్బంధం
- అక్కడ వరుస ఎన్‌కౌంటర్లతో రాష్ట్రంవైపు చూపు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఆపరేషన్ కగార్‌తో పెరిగిన నిర్బంధం కారణంగా మావోయిస్టులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. దీంతో వారి ప్రభావం అధికంగా ఉన్న ఛత్తీస్‌గఢ్‌లోని కేడర్, నేతలు పునరాలోచనలో పడినట్లు ప్రచారం జరుగుతోంది. ఇదేసమయంలో లొంగుబాటుకు ముందుకొస్తున్న వారు తెలంగాణవైపే మొగ్గు చూపుతున్నారు. ఛత్తీస్‌గఢ్‌లో గడిచిన పదిహేను నెలల కాలంలో 1,521 మంది మావోయిస్టులు లొంగిపోయారు. ఇక తెలంగాణలో కేవలం ఈ ఏడాదిలోనే 404 మంది మావోలు లొంగిపోయారు. ఇందులో 301 మంది భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసుల ఎదుట జనజీవన స్రవంతిలో కలిశారు. మావోయిస్టుల ప్రభావం ఎక్కువగా ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్.. ఆ తర్వాత ఏఓబీ, ఒడిశాలో ఉంది. తెలంగాణలో దాదాపుగా సాయుధ దళాలు లేవు. గతేడాది ఇక్కడ పాగా వేసేందుకు ప్రయత్నించగా భద్రాద్రి కొత్తగూడెం, ములుగు జిల్లాల్లో జరిగిన ఎన్‌కౌంటర్లతో ఆ ప్రయత్నాలు కూడా విఫలమయ్యాయి. ఇదిలా ఉండగా మావోయిస్టులు ఛత్తీస్‌గఢ్‌ను కాదని, తెలంగాణకు వచ్చి లొంగిపోతుండడం గమనార్హం. ఆపరేషన్ కగార్ మొదలయ్యాక మావోయిస్టులకు స్థానికంగా ఉండే సానుభూతిపరుల నుంచి మద్దతు లభించకపోవడంతో లొంగుబాటు తప్పడం లేదని పోలీసు వర్గాలు చెబుతున్నాయి. ఇదే సమయంలో తెలంగాణలో అమలవుతున్న లొంగుబాటు విధానం బాగుండడంతో ఇటువైపు ఎక్కువగా వస్తున్నారని తెలుస్తోంది. దీంతో దండకారణ్యంతో సరిహద్దు పంచుకుంటున్న భద్రాద్రి, ములుగు జిల్లాల్లో లొంగుబాట్లు ఎక్కువగా కొనసాగుతున్నాయని చెబుతున్నారు.

అక్కడ కనిపిస్తే..

ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ ప్రాంతంలో గడిచిన దశాబ్దం కాలంగా మావోయిస్టులు, పోలీసుల మధ్య జరిగిన దాడుల్లో ఇరువైపులా భారీగానే ప్రాణనష్టం జరిగింది. యాంటీ నక్సల్స్ ఆపరేషన్స్ కోసం అడవుల బాట పట్టిన భద్రతా దళాలకు చెందిన జవాన్లు అడుగడుగునా కష్టాలను ఎదుర్కొంటూ.. తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా ఏళ్ల తరబడి పనిచేశారు. దీంతో సాయుధ మావోయిస్టులు ఎదురైతే ఎన్‌కౌంటర్లకే మొగ్గు చూపుతున్నారు. అందుకే ఛత్తీస్‌గఢ్‌కు చెందిన సాయుధ దళాల్లో పనిచేసిన మావోలు తెలంగాణకు వచ్చి లొంగిపోతున్నారని తెలుస్తోంది. మరో పక్క ఇలావస్తూ.. ఛత్తీస్‌గఢ్‌లో కొనసాగుతున్న గాలింపు చర్యల్లో పట్టుబడి ప్రాణాలు కోల్పోయిన మావోయిస్టుల సంఖ్య కూడా పెద్దగానే ఉందని చెపుతున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణకు చెందిన అగ్రనేతల్లో చాలా మంది పక్కా ప్రణాళికతో సేఫ్‌గా లొంగిపోయేలా ప్లాన్ చేసుకుంటున్నట్టు సమాచారం.

సాయుధ విప్లవాలకు కాలం చెల్లింది

- ఆయుధాలు త్యజించి లొంగిపోండి
- మావోయిస్టులకు కేంద్ర మంత్రి బండి విజ్ఞప్తి



సాక్షి, హైదరాబాద్: ప్రస్తుతం సాయుధ విప్లవాలకు కాలం చెల్లినందున మావోయిస్టులు ఆయుధాలను త్యజించి లొంగిపోవాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ విజ్ఞప్తి చేశారు. శనివారం రాష్ట్ర పోలీసుల ఎదుట మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యురాలు సుజాత లొంగిపోయిన సందర్భంగా ఎక్స్ వేదికగా సంజయ్ స్పందించారు. మావోయిస్టు పార్టీలో 43 ఏళ్ల పాటు పనిచేసిన సుజాత లొంగిపోయారని, ఇతరులు కూడా ఆమె బాటలో నడిచి ఆయుధాలు విడిచిపెట్టాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. కాగా, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ నిరుద్యోగులు, యువతను బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు మోసం చేశాయన్నారు. ప్రభుత్వం ఫీజు బకాయిలను చెల్లించకపోవడంతో విద్యా సంస్థల యాజమాన్యాలు కాలేజీల మూసివేతకు నిర్ణయించాయన్నారు. ప్రభుత్వ వైఫల్యం కారణంగా విద్యార్థులు సర్టిఫికెట్లు పొందలేకపోతున్నారని, కాలేజీల సిబ్బందికి జీతాలు రావడం లేదని, విద్యాసంస్థలు మూతపడే పరిస్థితి తలెత్తిందని మండిపడ్డారు.

రెండు వాగులు.. ఆరు ప్రాణాలు!

- ఆసిఫాబాద్ జిల్లాలో నలుగురు మృతి...
- మృతుల్లో తల్లీకుమారుడు, మరో ఇద్దరు బాలికలు
- భద్రాద్రి జిల్లాలో ఇద్దరు కూలీల గల్లంతు



మృతదేహాల వద్ద విలపిస్తున్న బంధువులు

ఆసిఫాబాద్/అశ్వారావుపేటరూరల్: వాగు నీరు ఆరుగురిని మింగేసింది. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలం చికిలివాగులో ఖాళీ యూరియా సంచులు కడుగుతుండగా జరిగిన ప్రమాదంలో నలుగురు మృతిచెందగా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం కావడిగుండ్ల గ్రామానికి పనులకోసం వచ్చి ఇద్దరు ఏలూరు వాసులు గల్లంతయ్యారు. వివరాలు.. ఖాళీ యూరియా సంచులు కడుగుతుండగా జరిగిన ప్రమాదంలో కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలం చికిలివాగులో పడి నలుగురు మృతి చెందారు. దాబా గ్రామానికి చెందిన మోర్లె నిర్మలాబాయి, ఆమె కుమారుడు గణేశ్, మరో ఇద్దరు బాలికలు వాడై మహేశ్వరి, ఆదె శశికళ శనివారం చికిలి వాగులో ఖాళీ యూరియా సంచులు కడిగేందుకు వెళ్లారు. నిర్మలాబాయి యూరియా సంచులు కడుగుతుండగా ఒక సంచి నీటి ప్రవాహంలో కొట్టుకుపోయింది. దీంతో అక్కడే ఉన్న గణేశ్ ఆ సంచిని తెచ్చేందుకు నీటిలోకి దిగి మునిగిపోయాడు. దీంతో అతడిని కాపాడేందుకు అక్కడే ఉన్న బాలికలు శశికళ, మహేశ్వరి కూడా వాగులోకి దిగారు. వారుకూడా నీళ్లలో మునుగుతుండటం గమనించిన నిర్మలాబాయి రక్షించే ప్రయత్నంలో వారితోపాటే మునిగిపోయింది. గమనించిన నిర్మలాబాయి చిన్న కూతురు లలిత అరుస్తూ వెళ్లి చుట్టుపక్కల ఉన్న వారికి సమాచారం అందించింది. దీంతో వారంతా వాగులో గాలించగా నిర్మలాబాయి (33), గణేశ్ (12), మహేశ్వరి (10), శశికళ (8) మృతదేహాలు లభ్యమయ్యాయి. సీఐ సత్యనారాయణ, ఎస్సైలు మహేందర్, మధుకర్ ఘటన స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు.

వాగులో కొట్టుకుపోయి కూలీల గల్లంతు..

వ్యవసాయ పనులు చేసేందుకు వచ్చిన కూలీల్లో ఇద్దరు వాగు ప్రవాహంలో గల్లంతయ్యారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం కావడిగుండ్ల గ్రామానికి చెందిన రైతు కోటేశ్వరరావు పత్తి పొలంలో కలుపు తీసేందుకు కూలీలను మాట్లాడాడు. ఏపీ రాష్ట్రంలోని ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం పూచికపాడుకు చెందిన పాలడుగుల చెన్నమ్మ (60), పచ్చితల వరలక్ష్మి (55)తోపాటు మరో ఐదుగురు శనివారం వచ్చారు. అయితే, మధ్యాహ్న భోజనం తర్వాత భారీ వర్షం మొదలవడంతో కూలీలంతా ఇళ్లకు బయలుదేరారు. పొలానికి కొద్ది దూరంలోఉన్న అశ్వారావుపేట మండలం గోపన్నగూడెం–కన్నాయిగూడెం వాగు దాటుతున్నారు. ఈ క్రమంలో ఎగువ నుంచి గుబ్బల మంగమ్మ వాగు, కొండవాగు ఉధృతంగా ప్రవహించడంతో కూలీలు ఒడ్డుకు పరుగులు తీశారు. వీరిలో వెనకాల ఉన్న చెన్నమ్మ, వరలక్ష్మి మాత్రం వాగు ప్రవాహంలో కొట్టుకుపోయారు. అశ్వారావుపేట ఎస్సై యాయతీ రాజు, అగ్నిమాపక శాఖ అధికారులతోపాటు ఎన్డీఆర్‌ఎఫ్ సిబ్బంది ఘటనాస్థలి వద్ద గాలించినా రాత్రి వరకు కూలీల ఆచూకీ లభ్యం కాలేదు.

విశ్వాస వారధి నిర్మించాలి

మణిపూర్‌లో కొండ ప్రాంతాలు, లోయ మధ్య సోదరభావం నెలకొనాలి

- రాష్ట్రంలో అన్ని జాతులు కలిసికట్టుగా జీవనం సాగించాలి
- హింసను విడనాడి అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలి
- ప్రధానమంత్రి మోదీ పిలుపు
- రాష్ట్రాన్ని శాంతి, సౌభాగ్యాలకు ప్రతీకగా మారుస్తామని ప్రతిజ్ఞ
- ఇంఫాల్, చురాచాంద్‌పూర్‌లో బహిరంగ సభలు


ప్రధాని మోదీ

ఇంఫాల్/చురాచాంద్‌పూర్: మణిపూర్‌లో జాతుల మధ్య సోదరభావం నెలకొనాలని, అన్ని వర్గాల ప్రజలు శాంతి సామరస్యాలతో కలిసికట్టుగా జీవించాలని ప్రధాని నరేంద్ర మోదీ ఆకాంక్షించారు. రాష్ట్రంలో కొండ ప్రాంతాలు, లోయ మధ్య బలమైన విశ్వాస వారధిని కచ్చితంగా నిర్మించాలని తేల్చిచెప్పారు. మణిపూర్ లోయలో మైతేయీలు, కొండ ప్రాంతాల్లో కుకీలు నివసిస్తుంటారు. రాష్ట్రాన్ని శాంతి, సౌభాగ్యాలకు ప్రతీకగా మారుస్తామని ప్రధాని మోదీ ప్రతిజ్ఞ చేశారు. హింసను విడనాడి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ప్రజలకు సూచించారు. రాష్ట్రంలో ఆశ, విశ్వాసం అనే నూతన సూర్యోదయం సంభవిస్తోందని వ్యాఖ్యానించారు. ఆయన శనివారం మణిపూర్‌లో పర్యటించారు. 2023 మే నెలలో కుకీలు, మైతేయీల మధ్య ఘర్షణ మొదలైన తర్వాత రాష్ట్రంలో ఆయన అడుగుపెట్టడం ఇదే మొదటిసారి. మోదీకి ఘన స్వాగతం లభించింది. రాజధాని ఇంఫాల్‌లోని కాంగ్లా పోర్ట్, చురాచాంద్‌పూర్‌లో బహిరంగ సభల్లో ఆయన ప్రసంగించారు. మణిపూర్ ప్రజలకు తగిలిన గాయాలను నయం చేయడానికి, వారిలో విశ్వాసాన్ని పునరుద్ధరించడానికి, బాధితులందరినీ ఆదుకోవడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రకటించారు. మణిపూర్ అంటే ఒక రత్నం .. అది భరతమాత కిరీటంలో పొదిగిన రత్నమని అభివర్ణించారు. రాష్ట్రంలో హింస ఎక్కడ, ఏ రూపంలో జరిగినా ఖండించాల్సిందేనని చెప్పారు. హింస దురదృష్టకరమని, హింసాకాండకు పాల్పడడం మన పూర్వీకులకు, భవిష్యత్తు తరాలకు అన్యాయం చేసినట్లేనని పేర్కొన్నారు. మనమంతా కలిసి మణిపూర్‌ను శాంతి, అభివృద్ధి పథకంలో ముందుకు తీసుకెళ్దామని ప్రజలకు ప్రధానమంత్రి పిలుపునిచ్చారు. ఆయన ఇంకా ఏం మాట్లాడారంటే...

హింసతో సామాజిక జీవనం బలహీనం

మణిపూర్‌లో శాంతిని బేరసారాలు, బలప్రయోగంతో సాధించలేం. సుహృద్భావ వాతావరణంలో సంప్రదింపులు, ప్రజల ఐక్యతతోనే అది సాధ్యం. మణిపూర్ శక్తివంతమైన, సుందరమైన రాష్ట్రం. కానీ, ఇక్కడి సామాజిక జీవనాన్ని హింసాకాండ బలహీనపర్చింది. శాంతి, సామరస్యంతోనే తూర్పు భారతదేశ కీర్తికిరీటంలో తన స్థానాన్ని మణిపూర్ తిరిగి పొందుతుంది. మణిపూర్‌లోనే మణి ఉంది. ఈశాన్య భారతదేశంలో ఈ మణి గొప్పగా ప్రకాశించబోతోంది. రాష్ట్రంలో ఘర్షణ వల్ల నష్టపోయిన బాధితుల కోసం రాష్ట్రంలో 7,000 నూతన ఇళ్ల నిర్మాణానికి అనుమతి ఇచ్చాం. రూ.3,000 కోట్ల ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాం. బాధితులకు సాంత్వన కలిగించడమే మా లక్ష్యం. వారి జీవితాల్లో వెలుగులు నిండాలి. కేంద్రంలో మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మణిపూర్‌లో ప్రగతి వేగం పుంజుకుంది. 2014 కంటే ముందు ఇక్కడ వృద్ధి రేటు ఒక శాతం కంటే తక్కువే. ఇప్పుడు అభివృద్ధిలో ముందంజలో ఉంది. 21వ శతాబ్దం తూర్పు, ఈశాన్య భారతదేశానికే చెందుతుంది. అందుకే మణిపూర్‌కు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నాం.

'సిందూర్' విజయంలో మణిపూర్ జవాన్లు

''నేతాజీ సుభాష్‌చంద్రబోస్ మణిపూర్‌ను భారతదేశ స్వాతంత్య్రానికి ముఖద్వారంగా అభివర్ణించారు. భారత జాతీయ సైన్యం(ఐఎన్‌ఏ) త్రివర్ణ పతాకాన్ని మొదట ఇక్కడే ఎగురవేసింది. ఈ రాష్ట్రం ఎంతోమంది వీరులను దేశానికి అందించింది. వారి త్యాగాల స్ఫూర్తితోనే మేము అడుగులు ముందుకు వేస్తున్నాం. మహిళా సాధికారత మణిపూర్ సంప్రదాయం. పూర్తిగా మహిళలతోనే నడిచే మార్కెట్ ఇమా కీథెల్ ఉంది. మహిళామణుల గొప్పతనానికి అదొక ఉదాహరణ. ఆర్థిక వ్యవస్థలో తల్లులు, సోదరీమణులు ముందు వరుసలో ఉంటున్నారు. దేశ ప్రగతికి, స్వయం స్వావలంబనకు మహిళల బలమే చోదకశక్తి. ఈ స్ఫూర్తిని అందిస్తున్న రాష్ట్రం మణిపూర్. దేశ రక్షణకు మణిపూర్ సైనికులు ఎంతగానో కృషి చేస్తున్నారు. ఆపరేషన్ సిందూర్ విజయంలో అత్యంత కీలక పాత్ర పోషించారు'' అని మోదీ ప్రశంసించారు.

పలు అభివృద్ధి ప్రాజెక్టులకు శ్రీకారం

ప్రధాని మోదీ మణిపూర్‌లో పలు అభివృద్ధి ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. రాజధాని ఇంఫాల్‌లో రూ.1,200 కోట్ల విలువైన 17 ప్రాజెక్టులను ప్రారంభించారు. పోలీసు ప్రధాన కార్యాలయం, సివిల్ సెక్రటేరియట్‌కు ప్రారంభోత్సవం చేశారు. అలాగే మహిళా మార్కెట్లను, ఐదు ప్రభుత్వ కాలేజీలను, వంతెనలు, రహదారులను ప్రారంభించారు. చురాచాంద్‌పూర్‌లో రూ.7,300 కోట్ల విలువైన ప్రాజెక్టులకు మోదీ శంకుస్థాపన చేశారు.

ప్రజలందరికీ అభివృద్ధి ఫలాలు

''అభివృద్ధి జరగాలంటే శాంతియుత పరిస్థితులు నెలకొనడం తప్పనిసరి. గత 11 ఏళ్లలో ఈశాన్యంలో ఎన్నో వివాదాలు, ఘర్షణలను పరిష్కరించాం. ఇక్కడి ప్రజలు శాంతి, అభివృద్ధినే కోరుకుంటున్నారు. మీ కలలు నిజం చేసుకోవాలంటే, మీ పిల్లలకు మంచి భవిష్యత్తును ఇవ్వాలంటే శాంతి మార్గంలో నడవాలని జాతులకు సంబంధించిన అన్ని గ్రూప్‌లను కోరుతున్నా. మేము మీతోనే ఉన్నాం. మీకు సహకరిస్తాం. కేంద్ర ప్రభుత్వ చొరవతో లోయ, కొండ ప్రాంతాల మధ్య ఇటీవల చర్చలు జరగడం సంతోషంగా ఉంది. మణిపూర్ ప్రజలు ఈరోజు నాపై కురిపించిన ప్రేమాభిమానాలను ఎప్పటికీ మర్చిపోలేను'' అని ప్రధాని మోదీ అన్నారు.




నిరాశ్రయులకు మోదీ అభయం

మణిపూర్‌లో రెండు జాతుల మధ్య ఘర్షణల కారణంగా నిరాశ్రయులై, ప్రభుత్వ శిబిరాల్లో తలదాచుకుంటున్న ప్రజలను ప్రధాని మోదీ పరామర్శించారు. ఇంఫాల్‌తోపాటు చురాచాంద్‌పూర్‌లో వారిని కలుసుకున్నారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా కల్పించారు. నిరాశ్రయులు మోదీకి తమ గోడు వెళ్లబోసుకున్నారు. బోరున విలపించారు. కొందరు కన్నీళ్లు ఆపుకొనేందుకు ప్రయత్నించారు. హింసాకాండలో కుటుంబ సభ్యులను, ఆప్తులను కోల్పోయి ఒంటరిగా మిగిలిపోయామని ఆవేదన వ్యక్తంచేశారు. చిన్నారులను మోదీ పలకరించారు. ఆప్యాయంగా మాట్లాడారు. వారు ఆయనకు పుష్పగుచ్ఛం, పెయింటింగ్‌ను అందజేశారు. పక్షి ఈకలతో రూపొందించిన టోపీని ఓ చిన్నారి బహూకరించగా, మోదీ దాన్ని ధరించారు. రాష్ట్రంలో శాంతి, స్థిరత్వం నెలకొంటుందని, మీ జీవితాలు మెరుగుపడతాయని మోదీ చెప్పారు. రాష్ట్రంలో గత రెండేళ్లలో 60,000 మంది నిరాశ్రయులైనట్లు ప్రభుత్వ గణాంకాలు స్పష్టంచేస్తున్నాయి. వీరిలో కుకీలు 40,000 మంది, మైతేయీలు 20,000 మంది ఉన్నారు.

గ్రోత్ ఇంజన్ 'ఈశాన్యం'

- గతంలో ఓటు బ్యాంకు రాజకీయాల వల్ల అన్యాయం
- మేము వచ్చాక ఈశాన్య రాష్ట్రాలకు ప్రత్యేక ప్రాధాన్యం
- మిజోరంలో ప్రధాని మోదీ స్పష్టీకరణ

ఐజ్వాల్: ఈశాన్య భారతదేశం గతంలో ఓటు బ్యాంకు రాజకీయాల వల్ల ఎంతగానో నష్టపోయిందని ప్రధాని నరేంద్ర మోదీ ఆవేదన వ్యక్తంచేశారు. ఎన్డీయే ప్రభుత్వ పాలనలో నేడు అదే ఈశాన్య ప్రాంతం భారతదేశ గ్రోత్ ఇంజన్‌గా మారిందని ఉద్ఘాటించారు. ఆయన శనివారం ఈశాన్య రాష్ట్రమైన మిజోరంలో పర్యటించారు. రూ.9,000 కోట్ల విలువైన ప్రాజెక్టులు ప్రారంభించారు. మరికొన్నింటికి శంకుస్థాపన చేశారు. రాజధాని ఐజ్వాల్‌లోని లామ్మ్యువల్ గ్రౌండ్‌లో సభలో పాల్గొనాల్సి ఉండగా, భారీ వర్షం కారణంగా అక్కడికి చేరుకోలేకపోయారు. దాంతో ఎయిర్‌పోర్టులోనే అభివృద్ధి ప్రాజెక్టులను వర్చువల్‌గా ప్రారంభించారు. పలు రైళ్లకు పచ్చజెండా ఊపారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి వర్చువల్‌గా ప్రసంగించారు. గతంలో కొన్ని పార్టీలు ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడ్డాయని విమర్శించారు. కేవలం ఎక్కువ ఓట్లు, సీట్లు ఉన్న ప్రాంతాలపైనే ఆ పార్టీల దృష్టి ఉండేదని చెప్పారు. దీనివల్ల మిజోరం సహా ఈశాన్య భారతదేశంలోని రాష్ట్రాలన్నీ నిర్లక్ష్యానికి గురయ్యాయని, అభివృద్ధిలో వెనుకబడిపోయాయని అన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఈశాన్య రాష్ట్రాలకు ప్రత్యేక ప్రాధాన్యం దక్కిందని స్పష్టంచేశారు. రాష్ట్రంలో రూ.8,070 కోట్లతో నిర్మించిన బైరాబీ–సైరంగ్ రైల్వేలైన్‌ను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. 51.38 కిలోమీటర్ల ఈ లైన్ మిజోరంను దేశంలో మిగతా ప్రాంతాలతో అనుసంధానిస్తుందని చెప్పారు. రాష్ట్రానికి ఇది చరిత్రాత్మక దినమని పేర్కొన్నారు.


భూపేన్ స్మారక నాణెం విడుదల చేస్తున్న ప్రధాని మోదీ

భూపేన్ పాటలతో దేశ ఐక్యత: మోదీ

గౌహతి: భారతరత్న భూపేన్ హజారికా పాటలు దేశాన్ని ఐక్యంగా ముందుకు నడిపిస్తున్నాయని, ప్రజలకు నూతన శక్తిని ఇస్తూనే ఉన్నాయని ప్రధాని నరేంద్ర మోదీ కొనియాడారు. నేడు మన మధ్య భౌతికంగా లేకపోయినా ఆయన స్వరం వినిపిస్తూనే ఉందని, ప్రజలను ఉత్సాహపరుస్తోందని పేర్కొన్నారు. అస్సాం రాజధాని గౌహతిలో శనివారం భూపేన్ హజారికా శతజయంతి వేడుకల్లో మోదీ పాల్గొన్నారు 'ఏక్ భారత్, శ్రేష్ట భారత్'కు భూపేన్ పాటలే స్ఫూర్తి అని వివరించారు. భారతదేశ సంస్కృతి సంప్రదాయాలకు ఆయన ప్రతీక అని చెప్పారు. ఈశాన్య భారతదేశంలో హింసాకాండ, ఘర్షణలు, అశాంతి నెలకొన్న సమయంలో భూపేన్ ఐక్యతారాగం వినిపించారని, ప్రజలను జాగృతపర్చారని గుర్తుచేశారు. భూపేన్‌కు ప్రదానం చేసిన భారతరత్న పురస్కారం మొత్తం ఈశాన్య రాష్ట్రాలకు దక్కిన గౌరవమని మోదీ వ్యాఖ్యానించారు. భూపేన్ హజారియా ఆత్మకథను ప్రధానమంత్రి ఈ సందర్భంగా విడుదల చేశారు. అలాగే ఆర్‌బీఐ ముద్రించిన రూ.100 స్మారక నాణాన్ని సైతం విడుదల చేశారు. అస్సాం సంప్రదాయ వస్త్రం 'గమోసా' గురించి మోదీ ప్రస్తావించారు. స్థానిక ఉత్పత్తులను ఉపయోగించుకోవాలని ప్రజలను కోరారు. మోదీ ఆదివారం కూడా అస్సాంలో పర్యటిస్తారు.

శాసన సభలు, మండళ్లకు ర్యాంకులు

- 'నేషనల్ లెజిస్లేటివ్ ఇండెక్స్' ఏర్పాటు చేస్తాం
- లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా వెల్లడి

బెంగళూరు: రాష్ట్రాల శాసన సభలు, శాసన మండళ్లకు వాటి పనితీరు ఆధారంగా ర్యాంకులు ఇవ్వనున్నట్లు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా చెప్పారు. ఇందుకోసం 'నేషనల్ లెజిస్లేటివ్ ఇండెక్స్' ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. ప్రతిఏటా సభలు ఎన్నిసార్లు సమావేశమవుతున్నాయి? సాధించిన ఉత్పాదకత ఎంత? చర్చల్లో నాణ్యత ఎంత? టెక్నాలజీని వాడుకొనే సామర్థ్యం, వేర్వేరు కమిటీల పనితీరు తదితర అంశాల ఆధారంగా ఈ ర్యాంకులు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. శనివారం బెంగళూరులో 11వ కామన్వెల్త్ పార్లమెంటరీ–అసోసియేషన్–ఇండియా రీజియన్ సదస్సు సందర్భంగా ఓం బిర్లా మీడియాతో మాట్లాడారు. వచ్చే ఏడాది జనవరిలో యూపీ రాజధాని లక్నోలో జరిగే ఆలిండియా ప్రిసైడింగ్ ఆఫీసర్ల సమావేశంలో 'నేషనల్ లెజిస్లేటివ్ ఇండెక్స్' విధివిధానాలపై చర్చిస్తామని అన్నారు. ఈ ఇండెక్స్‌పై ప్రతిపాదనలు రూపొందించే బాధ్యతను ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్ విజేందర్ గుప్తాకు అప్పగించారు. చట్టసభల్లో జరిగే చర్చల్లో నాణ్యత ఉండేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టంచేశారు. ఈ మేరకు కొన్ని ప్రమాణాలు నిర్దేశించుకొని, కచ్చితంగా పాటించాలని సూచించారు. కర్ణాటక అసెంబ్లీ ఆధ్వర్యంలో నిర్వహించిన కామన్వెల్త్ పార్లమెంటరీ–అసోసియేషన్–ఇండియా రీజియన్ సదస్సు శనివారం ముగిసింది. 26 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి 45 మంది ప్రిసైడింగ్ అధికారులు పాల్గొన్నారు.

నేపాల్‌లో మార్చి 5న ఎన్నికలు

ఎన్నికలకు అందరూ సహకరించాలి • విపక్ష పార్టీలు, విద్యార్థులు సహా పౌరులందరికీ దేశాధ్యక్షుడు పౌడెల్ వినతి


నేపాల్ అధ్యక్షుడు పౌడెల్

కాఠ్మండు: సామాజిక మాధ్యమాలపై నిషేధం, అవినీతి, వారసత్వరాజకీయాలతో పెల్లుబికిన ప్రజాగ్రహం ధాటికి దగ్ధమైన పార్లమెంట్, సుప్రీంకోర్టు, ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తులపర్వం పరిసమాప్తి తర్వాత ఎట్టకేలకు పూర్తికాల ప్రభుత్వ ఏర్పాటు దిశగా అడుగులుపడ్డాయి. వచ్చే ఏడాది మార్చి నెల ఐదో తేదీన పార్లమెంట్ ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ మేరకు నేపాల్ అధ్యక్షుడు రామచంద్ర పౌడెల్ శనివారం ప్రకటన చేశారు. '' దేశం అత్యంత క్లిష్టమైన, భయానక దశను చవిచూసింది. ఇప్పుడు అంతా సద్దుమణిగింది. రాజ్యాంగం, పార్లమెంటరీ వ్యవస్థలే మనల్ని కాపాడాయి. సమైక్య ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యంగా ముందుకు సాగుదాం. ఆరు నెలల్లోపు పార్లమెంట్ దిగువసభకు పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించుకుని ప్రగతిశీల ప్రజాస్వామ్య పథంలో పయనించే అవకాశాన్ని ప్రజలకు కల్పిస్తున్నాం. సుస్థిరపాలనే లక్ష్యంగా తదుపరి ప్రభుత్వ ఏర్పాటు కోసం మార్చి ఐదో తేదీన ఎన్నికలు నిర్వహించబోతున్నాం. శాంతియుతంగా ఎన్నికలు జరిగేలా అందరూ సహకరించాలి. విపక్ష పార్టీలు మొదలు విద్యార్థిలోకం, పౌరసమాజం అంతా ఈ ఎన్నికల క్రతువుకు తమ వంతు సాయం అందించాలి'' అని శనివారం విడుదలచేసిన ఒక ప్రకటనలో అధ్యక్షుడు పౌడెల్ కోరారు. శుక్రవారం దేశ తాత్కాలిక మహిళా ప్రధానిగా పగ్గాలు చేపట్టిన వెంటనే సుశీల కర్కీ చేసిన సిఫార్సు మేరకు పార్లమెంట్‌ను రద్దుచేశారు. అవినీతి మురికికూపంలో పొర్లాడుతున్న ప్రభుత్వంపై విద్యార్థుల్లో గూడుకట్టుకున్న ఆగ్రహం.. హఠాత్తుగా సోషల్‌మీడియా యాప్‌ల నిషేధంతో కట్టలుతెంచుకున్న విషయం విదితమే.

24 శాఖలు ఆమె వద్దే

ఆదివారం ప్రధాని కర్కీ తన తొలి కేబినెట్ సమావేశం నిర్వహించనున్నారు. శనివారం కర్ఫ్యూ ఎత్తివేశాక దేశవ్యాప్తంగా తాజా శాంతిభద్రతల పరిస్థితిపై ఆమె సమీక్ష జరిపే వీలుంది. పలువురు మంత్రులతో ఆమె దేశ, విదేశాంగ విధానాలపై చర్చించే అవకాశముంది. హోం శాఖ, విదేశీ వ్యవహారాలు, రక్షణశాఖ వంటి కీలక 24 శాఖలను ఆమె తన వద్దే అట్టిపెట్టుకోనున్నట్లు సమాచారం. కాఠ్మండులో కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలుండే సింగ్‌దర్బార్ కాంప్లెక్స్‌లో కొత్తగా నిర్మించిన హోం మంత్రిత్వ శాఖ భవనాన్ని ప్రస్తుతానికి ప్రధాని కార్యాలయంగా మార్చనున్నారు. ప్రధాని కార్యాలయాన్ని ఇటీవల ఆందోళనల్లో విద్యార్థి నిరసనకారులు తగలబెట్టడంతో కొత్త భవనంలోకి ఆఫీసును మార్చాల్సి వస్తోంది. మరోవైపు హింసాత్మక ఘటనల్లో గాయపడిన వారిని ప్రధాని పరామర్శించారు. కాఠ్మండులోని బనేశ్వర్‌లోని పౌర ఆస్పత్రికి వెళ్లి క్షతగాత్రులతో ఆమె స్వయంగా మాట్లాడారు. తగు సాయం చేస్తామని భరోసా ఇచ్చారు. పార్లమెంట్ ప్రస్తుత కాలపరిమితిని రద్దుచేసి ఎన్నికలు నిర్వహించాలన్న అధ్యక్షుడు నిర్ణయాన్ని ప్రధాన రాజకీయపార్టీలన్నీ తప్పుబట్టాయి. నేపాల్‌కాంగ్రెస్, కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ నేపాల్(యునిఫైడ్ మార్క్సిస్ట్ లెనినిస్ట్), కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ నేపాల్(మావోయిస్ట్ సెంటర్)లు ప్రభుత్వ నిర్ణయంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశాయి. రాజ్యాంగ విరుద్ధంగా కాలావధిని కాలరాయడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు అని అన్నాయి. ఈ మేరకు దిగువసభలోని పార్టీల చీఫ్ విప్‌లు ఒక సంయుక్త ప్రకటనను విడుదలచేశాయి. దేశాధ్యక్షుడి చర్యలను తప్పుబట్టాయి.

జస్టిస్ సుశీలకు మోదీ అభినందనలు

ఇంఫాల్: నేపాల్ తాత్కాలిక ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన జస్టిస్ సుశీల కర్కీకి భారత ప్రధాని నరేంద్ర మోదీ శనివారం అభినందనలు తెలియజేశారు. ఆమె నియామకం మహిళా సాధికారతకు ఉజ్వలమైన ఉదాహరణ అని ప్రశంసించారు. మోదీ శనివారం మణిపూర్ సభలో మాట్లాడుతూ.. భారత్–నేపాల్ మధ్య సన్నిహిత సంబంధాలు ఉన్నాయని చెప్పారు. ఇరుదేశాలు చరిత్ర, విశ్వాసం, సాంస్కృతి సంబంధాలను పంచుకుంటున్నాయని వివరించారు.

ఐదు గంటల హడావుడి: ఖర్గే

న్యూఢిల్లీ: మణిపూర్‌లో ప్రధాని మోదీ పర్యటనపై కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కనీసం ఐదు గంటలు కూడా ఆయన మణిపూర్ ప్రజలతో గడపలేకపోయారంటూ మండిపడ్డారు. రాష్ట్రంలో వర్గవైషమ్యాలతో రెండేళ్లుగా ఇబ్బందులు పడుతున్న వారిని ఈ పర్యటనతో మోదీ ఘోరంగా అవమానించారన్నారు. మోదీ పర్యటనను ఆయన పిట్ స్టాప్‌గా అభివర్ణించారు. 'రెండేళ్లకుపైగా కొనసాగుతున్న హింసాత్మక ఘటనల్లో సుమారు 300 మంది చనిపోగా, 1,500 మంది గాయపడ్డారు. మరో 67 వేల మంది నిరాశ్రయులయ్యారు. ఇంత జరుగుతున్నా ఇప్పటివరకు అటువైపు కన్నెత్తి కూడా చూడని ప్రధాని మోదీ ఇప్పుడు హడావుడిగా ఇంఫాల్ నుంచి చురాచాంద్‌పూర్ వరకు రోడ్ షో చేపట్టడమేంటి?'అంటూ అభ్యంతరం వ్యక్తం చేశారు. సహాయ శిబిరాల్లోని ప్రజల మొర ఆలకించకుండా పిరికితనంతో తప్పించుకోవడానికే మోదీ షో చేపట్టారని ఎక్స్‌లో ఖర్గే వ్యాఖ్యానించారు. పర్యటనకు వెళ్లిన మోదీ ఘనమైన స్వాగత కార్యక్రమాలను ఏర్పాటు చేయించుకోవడం బాధితుల గాయాలను మరింతగా పెంచడమేనన్నారు. ఇలాంటి చర్యలతో మోదీలో పశ్చాత్తాపం గానీ, అపరాధ భావన కానీ లేవని వెల్లడవుతోందన్నారు. మణిపూర్‌లో అశాంతి కొనసాగుతున్న గత 864 రోజుల సమయంలో 46 విదేశీ పర్యటనలు చేసిన మోదీకి, మన పౌరులతో రెండు సానుభూతి మాటలు పంచుకునే తీరికే దొరకలేదా అని ప్రశ్నించారు. మణిపూర్ సంక్షోభాన్ని పరిష్కరించడంలో ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా అసమర్థత బయటపడిందన్నారు. దీన్నుంచి తప్పించుకునేందుకు మాత్రమే రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించారని ఖర్గే ఆరోపించారు. మీ రాజ్యధర్మం ఎక్కడికి పోయిందంటూ 2002లో మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి అప్పట్లో గుజరాత్ సీఎంగా ఉన్న మోదీ ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలను ఖర్గే ప్రస్తావించారు. ఇలా ఉండగా, 28 నెలలుగా ఎదురుచూస్తున్న మణిపూర్ ప్రజలతో ప్రధాని మోదీ కనీసం ఐదు గంటలైనా గడపలేదని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ వ్యాఖ్యానించారు. ప్రచారానికి, విదేశాల్లో పర్యటనలకు ఉన్న సమయం ప్రజల మధ్య గడిపేందుకు ఆయనకు దొరకలేదా అని నిలదీశారు.

వైష్ణోదేవి ఆలయ యాత్ర మళ్లీ వాయిదా

జమ్మూ: జమ్మూకశ్మీర్‌లోని ప్రఖ్యాత వైష్ణోదేవి ఆలయ యాత్ర వాయిదా పడింది. ముందుగా ప్రకటించిన ప్రకారం ఆదివారం నుంచి యాత్ర తిరిగి మొదలుకావాల్సి ఉంది. అయితే, రెండు రోజులుగా వర్షాలు ఆగకుండా కురుస్తుండటంతో యాత్రను వాయిదా వేసినట్లు శనివారం ఆలయ బోర్డు తెలిపింది. యాత్రను తిరిగి ప్రారంభించే తేదీని వాతావరణం మెరుగయ్యాక ప్రకటిస్తామని ఆలయ బోర్డు వివరించింది.ఆగస్టు 26వ తేదీన వైష్ణోదేవి ఆలయ మార్గంలో కొండచరియలు విరిగి 34 మంది భక్తులు చనిపోగా, 20 మంది గాయపడటం తెల్సిందే. అప్పటి నుంచి యాత్రను 19 రోజులుగా ఆపివేశారు.

వక్ఫ్ చట్టంపై 15న సుప్రీంకోర్టు తీర్పు

న్యూఢిల్లీ: వక్ఫ్ సవరణ చట్టం–2025 చెల్లుబాటును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్ల విచారణ ఇప్పటికే పూర్తి చేసిన సుప్రీంకోర్టు ఈ నెల 15వ తేదీన మధ్యంతర ఉత్తర్వులను జారీ చేయనుంది. వక్ఫ్ ఆస్తులను డీనోటిఫై చేసే అధికారంతో సహా మూడు కీలక అంశాలపై స్పష్టత రానుంది. రాష్ట్ర వక్ఫ్ బోర్డులు, సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్‌లో ఎక్స్ అఫీషియో సభ్యులు మినహా ముస్లిమేతరులను నియమించరాదని పిటిషనర్లు కోరారు. ఒక ఆస్తిని వక్ఫ్ బోర్డు ఆస్తిగా గుర్తించడానికి ముందుగా సంబంధిత జిల్లా కలెక్టర్ విచారణ చేయించాలనడాన్ని కూడా పిటిషనర్లు సవాల్ చేశారు. వీటన్నిటిపైనా ఏప్రిల్ 25వ తేదీన కేంద్రం 1,332 పేజీలతో కూడిన సవివర అఫిడవిట్ వేసింది. ఏప్రిల్ 5వ తేదీన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోద ముద్రతో వక్ఫ్ సవరణ చట్టం అమల్లోకి రావడం తెల్సిందే. కేసులో వాదోపవాదాలు మే 22వ తేదీతో ముగిశాయి. విచారణ చేపట్టిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ సారథ్యంలోని ధర్మాసనం తీర్పును రిజర్వ్‌లో ఉంచింది. 15వ తేదీన తీర్పు వెలువడనున్నట్లు తాజాగా సుప్రీంకోర్టు వెబ్‌సైట్ పేర్కొంది.

గాజా సిటీపై దాడులు ఉధృతం
32 మంది మృత్యువాత

గాజా సిటీ: గాజా నగరం వీడి వెళ్లిపోవాలంటూ పౌరులకు ఓ వైపు హెచ్చరికలు జారీ చేస్తూనే ఇజ్రాయెల్ ఆర్మీ వైమానిక దాడులను తీవ్రతరం చేసింది. తాజా దాడుల్లో కనీసం 32 మంది చనిపోయారని షిఫా ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. మృతుల్లో 12 మంది చిన్నారులు కూడా ఉన్నారని వెల్లడించాయి. శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు దాడులు కొనసాగాయి. షేక్ రద్వాన్ ప్రాంతంలోని ఓ నివాసంపై జరిగిన దాడిలో తల్లి, ఆమె ముగ్గురు పిల్లలు సహా కుటుంబంలోని 10 మంది మృత్యువాతపడ్డారు. ఇజ్రాయెల్ ఆర్మీ శనివారం సోషల్ మీడియా వేదికలపై మరోసారి పాలస్తీనియన్లకు హెచ్చరికలు జారీ చేసింది. హమాస్ శ్రేణులు నిఘాకు వాడుకుంటున్నాయనే సాకుతో గాజా నగరంలోని సుమారు వంద బహుళ అంతస్తులను ఇజ్రాయెల్ ఇటీవలి కాలంలో నేలమట్టం చేయడం తెల్సిందే. తక్షణమే గాజా నగరాన్ని వీడి దక్షిణ ప్రాంతానికి వెళ్లాలని అందులో అల్టిమేటం జారీ చేసింది. అయితే, చాలా మంది ఎక్కడికి వెళ్లే పరిస్థితుల్లో లేరు. అధిక రవాణా ఖర్చులు, నివాస సమస్య తీవ్రంగా ఉంది. దీంతోపాటు ఇప్పటికే పలుమార్లు ఒక చోటు నుంచి మరోచోటుకు మారుతూ వస్తున్న వారు సైతం గాజాలో ఎక్కడికి వెళ్లినా ఇజ్రాయెల్ ఆర్మీ దాడులు తప్పవనే నిస్పృహతో ఉండటం కారణాలుగా ఉన్నాయి. గాజా నగరం, చుట్టుపక్కల ప్రాంతాల్లో 10 లక్షల మందిలో ఇప్పటివరకు 2.5 లక్షల మంది దక్షిణాదిన ఏర్పాటు చేసిన మానవతా జోన్‌వైపు వెళ్లినట్లు ఆర్మీ ప్రతినిధి అవిచయ్ అడ్రీ అంటున్నారు. గాజా ప్రజలకు తాత్కాలికంగా నీడ కల్పించేందుకు ఉద్దేశించిన 86 వేల టెంట్లు, ఇతర సరఫరాలను ఇజ్రాయెల్ ఆర్మీ లోపలికి అనుమతించడం లేదని ఐరాస తెలిపింది. నెలలుగా కొనసాగుతున్న దిగ్బంధం కారణంగా 24 గంటల వ్యవధిలో పోషకాహార లోపంతో ఏడుగురు చనిపోయారని గాజా ఆరోగ్య విభాగం తెలిపింది. దీంతో, యుద్ధం మొదలయ్యాక పోషకాహార లోపం సంబంధ కారణాలతో చనిపోయిన వారి సంఖ్య 420కి చేరుకోగా, వీరిలో 145 మంది చిన్నారులే ఉన్నారని వివరించింది. 2023 అక్టోబర్ 7న హమాస్ లక్ష్యంగా గాజాపై ఇజ్రాయెల్ సాగించిన దాడుల్లో ఇప్పటివరకు 64,803 మంది చనిపోయారని గాజా ఆరోగ్య విభాగం పేర్కొంది. వీరిలో సగం మంది మహిళలు, చిన్నారులేనంది.


ఇజ్రాయెల్ దాడితో గాజా నగరంలోని ఓ భవనం నుంచి వెలువడుతున్న మంటలు, పొగ

రష్యా నుంచి చమురు కొనే దేశాలపై టారిఫ్‌లు వేయండి

జీ7 దేశాలను కోరిన అమెరికా

వాషింగ్టన్: రష్యా నుంచి భారీ స్థాయిలో ముడి చమురును కొనుగోలు చేస్తూ ఆ దేశానికి ఉక్రెయిన్ దండయాత్రలో సాయం చేస్తున్న దేశాలపై టారిఫ్‌లు విధించాలని అమెరికా జీ7 దేశాలను కోరింది. జీ7 దేశాల ఆర్థిక మంత్రుల సమావేశానికి హాజరైన అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెస్సెంట్ వాణిజ్య ప్రతినిధి జేమీసన్ గ్రీర్ ఈ మేరకు సూచించారు. ఉక్రెయిన్‌లో జరిగే యుద్ధాన్ని ఆపాలని చిత్తశుద్ధే నిజంగా ఉంటే, రష్యా నుంచి చమురును కొనుగోలు చేసే దేశాలపై టారిఫ్‌లు విధించాలని, అధ్యక్షుడు ట్రంప్ బాటలో నడవాలని పేర్కొన్నారు. కీలకమైన ఈ సమయంలో దీనిపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని జీ7 దేశాలను కోరారు. ఈ మేరకు శనివారం అమెరికా ఆర్థిక శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. అయితే, అందులో దేశాల పేర్లను మాత్రం ప్రస్తావించలేదు. రష్యా నుంచి భారీగా చమురు కొంటూ పుతిన్‌కు ఉక్రెయిన్ దండయాత్రలో సాయపడుతోందని ఆరోపిస్తూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత్‌పై అత్యధికంగా 50 శాతం మేర టారిఫ్‌లు ప్రకటించడం తెల్సిందే.

సాక్షి హైదరాబాద్

ఆదివారం । 14 । సెప్టెంబర్ । 2025



బిల్డింగ్ బైలాస్‌పై మళ్లీ మెలిక!

నగటు కంటోన్మెంట్ వాసుల చిరకాల కోరిక అయిన 'నూతన బిల్డింగ్ బైలాస్' వ్యవహారం అంతులేని కథలా సాగుతోంది. నిర్మాణదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. -10లో



చాయ్.. హాయ్

సంస్కృతి పరంగా ఎంతో గొప్పదనాన్ని కలిగిన మన నగరం, చక్కని చిక్కని చాయ్ సంస్కృతికి కూడా ప్రసిద్ధి చెందింది. రోజువారీ జీవితంలో అంతర్భాగంగా మారింది. - సిటీప్లస్‌లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 28.0/23.0

నగరంలో ఆదివారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా వర్షపు జల్లులు పడొచ్చు. గరిష్టంగా 28, కనిష్టంగా 23 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అంచనా.





పసిడి పరుగెత్తినా తగ్గేదేలే!

రేషన్ షాపులో సరుకులు తీసుకునేందుకు వచ్చినవారు కాదు వీరంతా. బంగారం కొనేందుకు వీరు ఇలా బారులు తీరారు. పసిడి 10 గ్రాముల ధర రూ.లక్ష దాటి పరుగులు తీస్తున్నా.. గిరాకీ మాత్రం తగ్గలేదనడానికి ఈ క్యూలైన్ చూస్తేనే తెలుస్తోంది. శనివారం అఫ్జల్‌గంజ్‌లోని ఓ జ్యువెలరీ షాపు ముందు బంగారం కొనుగోలు చేసేందుకు నగర వాసులు ఇలా క్యూ కట్టిన చిత్రం కనిపించింది. – సాక్షి, సిటీబ్యూరో

18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలి

- జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ప్రజలకు హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి ఆర్‌వీ కర్ణన్ పిలుపు



లక్డీకాపూల్: జులై 1, 2025 నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని జీహెచ్ఎంసీ కమిషనర్, హైదరాబాద్ జిల్లా ఎన్నిక ల అధికారి ఆర్‌వీ కర్ణన్ సూచించారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జూబ్లీహిల్స్ శాసనసభ నియోజకవర్గానికి సంబంధించి ప్రస్తుతం ప్రత్యేక సంక్షిప్త సవరణ కార్యక్రమం–2025 కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిందన్నారు. ఈ నెల 17వ తేదీ లోగా ఓటరు నమోదుకు అవకాశం ఉందంటూ ఫారం–6 ద్వారా కొత్త ఓటరుగా నమోదు కావచ్చని తెలిపారు. అలాగే ఫారం–7 ద్వారా ప్రస్తుత ఓటరు జాబితాలో పేరు చేర్చడం, తొలగించడంపై అభ్యంతరాలు తెలుపవచ్చన్నారు. ఫారం–8 ద్వారా ప్రస్తుత ఓటరు జాబితాలోనీ ఎంట్రీల సవరణలు, నివాసం మార్పు, దివ్యాంగులుగా ఎపిక్ రీప్లేస్మెంట్ చేసుకోవచ్చని చెప్పారు. ఈ క్రమంలో జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ప్రజలు ఓటర్ హెల్ప్‌లైన్ యాప్ (వీహెచ్‌ఏ) ద్వారా లేదా అధికారిక వెబ్‌సైట్లు ceotelangana.nic.in,ecinet.eci.gov.in,eci.gov.in.లలో నమోదు చేసుకోవచ్చని సూచించారు. మరింత సమాచారం కోసం సంబంధిత బూత్ లెవల్ ఆఫీసర్ (బీఎల్ఓ), ఏఈఆర్ఓ, డీఈఓలను సంప్రదించవచ్చన్నారు. 1950 టోల్–ఫ్రీ నంబర్‌కు కూడా కాల్ చేయవచ్చని ఆయన సూచించారు.

నేడు పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు

లక్డీకాపూల్: నగర ప్రజలకు ట్రాఫిక్ పోలీసులు కీలక సూచనలు చేశారు. మిలాద్– ఉన్– నబీ ఊరేగింపు సందర్భంగా ఆదివారం నగరంలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉంటాయన్నారు. మిలాద్–ఉన్–నబీ ఊరేగింపుల దృష్ట్యా ఫలక్‌నుమా, ఇంజన్ బౌలి, నాగుల్‌చింత ఎక్స్ రోడ్, హిమ్మత్‌పురా జంక్షన్, ఓల్గా, హరిబౌలి, పంచ్ మొహల్లా, చార్మినార్, గుల్జార్ హౌజ్, మదీనా జంక్షన్, పత్తర్‌గట్టి, మీరాలం మండీ, ఎతేబార్ చౌక్, అలీజా కోట్లా, బీబీ బజార్, వాల్టా హోటల్, అఫ్జల్‌గంజ్ టీ జంక్షన్, ఉస్మాన్ గంజ్, ఎంజే మార్కెట్ జంక్షన్, తాజ్ ఐలాండ్, నాంపల్లి టీ జంక్షన్, హజ్ హౌస్, ఏఆర్ పెట్రోల్ పంప్, నాంపల్లి ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు అమలు ఉంటాయని చెప్పారు. మిలాద్–ఉన్–నబీ ఊరేగింపు కారణంగా ఆదివారం ఓల్డ్ సిటీలోని పర్యాటక ప్రదేశాలను మూసివేయనున్నట్లు ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా అధికారి వెల్లడించారు. చార్మినార్‌తో పాటు పాతబస్తీలోని స్మారక చిహ్నాలు, పలు పర్యాటక ప్రదేశాలను క్లోజ్ చేయనున్నట్లు ఆయన తెలిపారు.

17న కంటోన్మెంట్‌కు రాజ్‌నాథ్ సింగ్

కంటోన్మెంట్: రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈ నెల 17న కంటోన్మెంట్‌కు రానున్నారు. తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. కేంద్ర మంత్రులు గజేంద్ర సింగ్ షెకావత్, జి.కిషన్ రెడ్డి, బండి సంజయ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో కొన్నేళ్లుగా పరేడ్ గ్రౌండ్‌లో తెలంగాణ విమోచన దినోత్సవాలను అధికారికంగా నిర్వహిస్తున్నారు. గతంలో మాదిరిగానే తెలంగాణ విమోచనానికి సంబంధించిన నమూనాలు, చిత్రపటాలతో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయనున్నారు. విమోచన దినోత్సవం అనంతరం సమీపంలోని పికెట్ పార్కులో ఏర్పాటు చేసిన దివంగత ప్రధాన మంత్రి వాజ్‌పేయి విగ్రహావిష్కరణలో మంత్రులు పాల్గొననున్నారు. ఈ మేరకు కంటోన్మెంట్ అధికారులు రక్షణ మంత్రికి ఘనంగా స్వాగత పలికేందుకు ఏర్పాట్లు ముమ్మరం చేశారు.

సిటీలో మర్డర్ చేసి.. రాంచీలో చిక్కి

రోల్డ్‌గోల్డ్‌ను అసలు బంగారంగా భావించిన నిందితులు

- లాకర్ తాళాలు ఇవ్వకపోవడంతో రేణు అగర్వాల్ హత్య
- పథకం ప్రకారమే హతురాలి ఇంట్లో పనికి చేరిన హర్ష్
- డ్రగ్స్‌కు బానిసగా మారి సోషల్ మీడియాలో రీల్స్
- పోలీసులు అరెస్టు చేసే సమయంలోనూ మత్తులోనే
- ఇతనితో పాటు మరో ఇద్దరు నిందితుల అరెస్టు
- వీడిన కూకట్‌పల్లి మహిళ హత్య కేసు మిస్టరీ
- వివరాలు వెల్లడించిన సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి



హర్ష్



రోషన్



రేణు అగర్వాల్

సాక్షి, సిటీబ్యూరో

నగరంలో సంచలనం సృష్టించిన కూకట్‌పల్లి మహిళ హత్య కేసును సైబరాబాద్ పోలీసులు ఎట్టకేలకు ఛేదించారు. హతురాలు రేణు అగర్వాల్ ఇంట్లో ఉన్న రోల్డ్ గోల్డ్ వస్తువులను నిజమైన బంగారమని భావించిన నిందితులు.. వాటిని దాచిన లాకర్ కీ ఆమె ఇవ్వకపోవడంతో హత్య చేసినట్లు పోలీసులు తేల్చారు. ఇద్దరు నిందితులు హర్ష్, రోషన్‌లతో పాటు ఝార్ఖండ్‌లో వీరికి ఆశ్రయం కల్పించిన రాజ్ వర్మను కూడా పోలీసులు అరెస్టు చేశారు. శనివారం సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి మీడియాకు వివరాలు వెల్లడించారు.

స్నేహితుడితో కలిసి..

కూకట్‌పల్లిలోని స్వాన్‌లేక్ గేటెడ్ కమ్యూనిటీలోని అపార్ట్‌మెంట్‌లో ఉండే రాకేష్, రేణు అగర్వాల్ దంపతుల ఇంట్లో ఝార్ఖండ్‌కు చెందిన రాజ్ వర్మ పని చేసేవాడు. ప్రతిరోజూ ఇంట్లో కబోర్డులు శుభ్రం చేస్తుండగా నకిలీ బంగారు ఆభరణాలను చూసి, అవి నిజమైనవిగా భావించాడు. తాను పనిచేసే ఇంట్లో భారీగా బంగారం, నగదు ఉన్నాయని స్నేహితుడు హర్ష్‌కు చెప్పాడు. వాటిని ఎలాగైనా దొంగిలించాలని భావించిన హర్ష్ పథకం వేశాడు. రేణు హత్యకు రెండు రోజుల ముందే రాజ్‌తో పని మాన్పించి, ఆ స్థానంలో తాను పనిలో చేరాడు. అదే అపార్ట్‌మెంట్‌లో 14వ అంతస్తులో ఉంటున్న రాకేష్ సోదరుడి ఇంట్లో ఝార్ఖండ్‌కు చెందిన రోషన్ పని చేసేవాడు. హర్ష్, రోషన్‌లు ఇద్దరూ స్నేహితులే.

కాళ్లు, చేతులు కట్టేసి.. 40 కత్తిపోట్లు

ఈ నెల 10న రాకేష్, అతని కుమారుడు వ్యాపారం నిమిత్తం బయటికి వెళ్లిపోయారు. రేణు అగర్వాల్ ఒంటరిగా ఉండటంతో హర్ష్, రోషన్‌లు ఇంట్లోకి చొరబడ్డారు. రేణు నోటిలో దుస్తులు కుక్కి కాళ్లు చేతులు కట్టేశారు. లాకర్ తాళాలు ఎక్కడున్నాయో చెప్పాలని, డబ్బులు, బంగారం ఎక్కడెక్కడ దాచిపెట్టారో చెప్పాలంటూ చిత్రహింసలకు గురి చేశారు. సుమారు గంటకు పైగా ఆమెను చిత్రహింసలకు గురిచేసినా చెప్పకపోవడంతో.. ఆగ్రహానికి గురైన నిందితులు వంటింట్లోని కుక్కర్‌తో ఆమె తలపై బలంగా మోదారు. ఆపై కత్తితో గొంతుకోసి.. నుదురు, చేతులు, కడుపు, మెడపై 40సార్లు పొడిచి చంపేశారు. అనంతరం ఇంట్లో ఉన్న బంగారం ఆభరణాలు, నగదు, రోల్డ్ గోల్డ్ వస్తువులు, గడియారాలను ట్రావెల్ బ్యాగ్‌లో సర్దుకున్నారు. ఈ ఇంట్లోనే స్నానం చేసి, ట్రావెల్ బ్యాగ్‌తో యజమాని స్కూటీపై పరారయ్యారు.

పోలీసులను చూసి.. ప్లాన్ మార్చి..

ఈ ముఠా నిత్యం రైళ్లలోనే ప్రయాణాలు సాగిస్తుంటుంది. హత్య చేసిన తర్వాత కూడా రైల్వే స్టేషన్‌కు వెళ్లేందుకు పయనమయ్యారు. వీరికి హఫీజ్‌పేట రైల్వే స్టేషన్ ఎక్కడుందో తెలియదు. దీంతో మార్గం మధ్యలో ఇద్దరు ముగ్గురిని అడిగి స్టేషన్‌కు దారి తెలుసుకున్నారు. స్టేషన్ బయటే స్కూటీని వదిలేసి.. లోపలికి వెళ్లి రైలు ఎక్కి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వెళ్లిపోయారు. రాంచీ వెళ్లేందుకు టికెట్లు తీసుకొని రైలు ఎక్కేందుకు స్టేషన్ లోపలికి వెళ్లిపోయారు. అప్పటికే స్టేషన్ లోపల పోలీసులు ఉండటంతో అక్కణ్నుంచి బయటికి వచ్చారు. మళ్లీ హఫీజ్‌పేట చేరుకొని.. రాత్రి 1 గంట సమయంలో క్యాబ్ బుక్ చేసుకొని, రాంచీలోని రాజు వర్మ వద్దకు వెళ్లిపోయారు.

రాంచీకి విమానంలో వెళ్లి నిందితుల పట్టివేత

సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించిన పోలీసులు పనివాళ్లే నిందితులని ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. అప్పటికే హత్య కేసు, అనుమానితుల ఊహాచిత్రాలు మీడియాలో వైరల్ కావడంతో నిందితులను రాంచీలో వదిలేసిన క్యాబ్ డ్రైవర్ దీన్ని గమనించాడు. దీంతో వెంటనే క్యాబ్ యజమాని సహాయంతో నిందితులు క్యాబ్ బుక్ చేసుకున్న విషయాన్ని సైబరాబాద్ పోలీసులకు అందించారు. వెంటనే సైబరాబాద్ పోలీసులు నిందితుల కంటే ముందే విమానంలో రాంచీకి చేరుకున్నారు. హర్ష్, రోషన్, రాజ్‌లను అరెస్టు చేసి, స్థానిక న్యాయస్థానంలో హాజరుపరిచారు. ట్రాన్సిట్ వారెంట్‌పై హైదరాబాద్‌కు తరలించారు. నిందితుల నుంచి బంగారు ఆభరణాలు, 16 వాచీలు, రెండు సెల్‌ఫోన్లు, రోల్డ్ గోల్డ్ వస్తువులను స్వాధీనం చేసుకున్నారు.

డ్రగ్స్‌కు బానిస హర్ష్..


నిందితుడు హర్ష్ డ్రగ్స్‌కు వ్యసనపరుడని విచారణలో పోలీసులు గుర్తించారు. అరెస్టు చేసే సమయంలోనూ హర్ష్ మత్తులో ఉన్నాడని కమిషనర్ అవినాష్ మహంతి తెలిపారు. కోల్‌కతాలోని ఓ రిహాబిలిటేషన్ సెంటర్‌లో అడ్మిషన్, చికిత్స చేయించుకున్న డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. హర్ష్‌పై 2023లోనే రాంచీలో మూడు కేసులు నమోదయ్యాయని చెప్పారు. స్థానికంగా జైలులో ములాఖత్‌కు వెళ్లి, బయటికి వచ్చేటప్పుడు హీరోగా రీల్స్ చేస్తూ ఉండేవాడని, అందుకోసమే చెయిన్స్, ఆయుధాలను కొనుగోలు చేశాడని సీపీ వివరించారు. కేసును చాకచక్యంగా ఛేదించిన సీపీ అవినాష్ మహంతిని, ఆయన బృందాన్ని డీజీపీ డాక్టర్ జితేందర్ అభినందించారు.



హత్య కేసు వివరాలు వెల్లడిస్తున్న సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి

కొత్త కొర్రీ!

రెండో బండి ఉంటే పన్నుల మోతే



కొద్దిరోజుల క్రితం జూబ్లీహిల్స్‌కు చెందిన ఓ వ్యక్తి కొత్త కారు నమోదు కోసం ఖైరతాబాద్ ఆర్టీఏ అధికారులను సంప్రదించారు. ఆయన పేరుతో ఇప్పటికే ఓ ద్విచక్ర వాహనం ఉందని, 2 శాతం పన్ను అదనంగా చెల్లించాలని వారు చెప్పారు. దీంతో ఆ వ్యక్తి విస్మయానికి గురయ్యారు. 33 ఏళ్ల క్రితం వినియోగించిన స్కూటర్ అది. చాలా ఏళ్ల క్రితమే అది తుక్కుగా మారింది. కనీసం ఆ వాహనానికి సంబంధించిన ఎలాంటి ఆధారాలు కూడా లేవు. కానీ.. రవాణాశాఖ రికార్డుల్లో మాత్రం నమోదై ఉండడంతో బిత్తరపోయారు. లేని వాహనం ఉన్నట్లుగా చూపడంతో పాటు రెండో బండి పేరిట కొత్తగా కొనుగోలు చేసిన వాహనంపై 20 శాతం నుంచి 22 శాతం వరకు జీవితకాల పన్ను పెంచారు. వాహనదారులపై రవాణా శాఖ గుట్టుచప్పుడు కాకుండా చేస్తున్న దోపిడీకి ఇదో తాజా ఉదాహరణ.

- లైఫ్‌ట్యాక్స్ పెంచినా యథావిధిగా ఆర్టీఏ బాదుడు
- రెండో వాహనం ఉంటే 2 శాతం అదనం
- వాహనదారులపై ఏటా రూ.150 కోట్లకుపైగా భారం

సాక్షి, సిటీబ్యూరో: కొత్తగా కొనుగోలు చేసే వాహనాలపై జీవితకాల పన్ను పెంచినప్పటికీ రెండో బండి పేరిట సాగించే ఆర్టీఏ అదనపు బాదుడు యథావిధిగా కొనసాగుతూనే ఉంది. పాత వాహనం ఉండి కొత్తగా మరో వాహనం కొనుగోలు చేసేవారు అదనంగా 2 శాతం పన్ను చెల్లించాల్సివస్తోంది. కేంద్ర ప్రభుత్వం కొత్తగా అమల్లోకి తెచ్చిన స్క్రాప్ పాలసీకి అనుగుణంగా రెండో వాహనం నిబంధనను ఎత్తివేయనున్నట్లు రవాణాశాఖ ప్రకటించింది. కానీ.. ఈ దిశగా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. పైగా కొత్త వాహనాలపై పన్నులు పెంచింది. కార్లు, తదితర నాలుగు చక్రాల వాహనాల ధరలపై 20 నుంచి 25 శాతం వరకు లైఫ్ ట్యాక్స్ విధించారు. ఒకవైపు అదనపు పన్నుల మోతను భరిస్తున్న వాహనదారులపై 'పాతబండి' పేరిట మరో 2 శాతం బాదుతున్నారు. రెండో బండి పేరిట ఏటా దాదాపు రూ.150 కోట్లకు పైగా పన్ను వసూలు చేయడం గమనార్హం.

తుక్కు విధానం ఏమైనట్లు..

కూకట్‌పల్లికి చెందిన ఓ వాహనదారుడి పాత ద్విచక్ర వాహనం ఏడేళ్ల క్రితం చోరీకి గురయింది. ఈ మేరకు పోలీస్ కేసు కూడా నమోదైంది. ఇప్పటి వరకు ఆ బండి ఆచూకీ లభించలేదు. కానీ.. సదరు వాహనదారు కొత్తగా కొనుగోలు చేసిన కారుపై 2 శాతం అదనంగా పన్ను చెల్లించాల్సి వచ్చింది. బండి అపహరణకు గురైనట్లు కేసు నమోదైనప్పటికీ కేవలం రవాణాశాఖ రికార్డుల్లో నమోదై ఉన్నందుకే అదనంగా సమర్పించుకోవాల్సి వస్తోంది. ఇలా భౌతికంగా లేని వాహనాలపై, కాలం చెల్లినవాటిపై సమగ్రమైన తుక్కు విధానాన్ని (స్క్రాప్ పాలసీ)ని రూపొందించి 2 శాతం అదనపు బాదుడు నుంచి మినహాయింపును ఇవ్వనున్నట్లు రవాణా అధికారులు ఏడాది క్రితం ప్రతిపాదించారు. గత ఆగస్టులో ఎడాపెడా జీవితకాల పన్ను పెంచినప్పటికీ ఈ రెండో వాహనం నిబంధనను తొలగించలేదు. దీంతో వాహనం ఉన్నా, లేకున్నా పెద్ద మొత్తంలో జీవితకాల పన్ను రూపంలో కోల్పోవాల్సివస్తోంది. ఇది కేవలం ఒకరిద్దరికి సంబంధించిన అంశం కాదు. గ్రేటర్‌లో లక్షలాది మంది వాహనదారులు తమ పాత వాహనాలపై రకరకాల ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. వాహనాలను విక్రయించినప్పటికీ యాజమాన్యం బదిలీ చేయకపోవడంతో కొందరు, కాలం చెల్లిన వాహనాలను రవాణా అధికారుల సమక్షంలో తుక్కుగా మార్చకపోవడంతో మరికొందరు దారుణంగా నష్టపోతున్నారు.

ద్విచక్ర వాహనం ఉన్నా..

నగరంలో వాహనాల రద్దీని నియంత్రించేందుకు, ఒక వ్యక్తి ఒకటి కంటే ఎక్కువ వాహనాలు కొనుగోలు చేయకుండా నిరుత్సాహపరిచేందుకు రవాణాశాఖ 2 శాతం అదనపు పన్ను విధానాన్ని ప్రవేశపెట్టింది. నిజానికి అప్పటికే ఒక కారు కలిగి ఉన్న వ్యక్తి అదనంగా మరో కారును కొనుగోలు చేసినప్పుడు మాత్రమే 2 శాతం అదనపు పన్ను వర్తిస్తుంది. ఒక ద్విచక్ర వాహనం ఉండి కొత్తగా కారు కొనుగోలు చేసినప్పుడు ఇది వర్తించదు. కానీ రవాణా అధికారులు ఈ నిబంధనను బేఖాతరు చేశారు. ద్విచక్ర వాహనం ఉన్నా సరే ఏకంగా రూ.లక్షల్లో అదనపు బాదుడుకు పాల్పడుతున్నారు.'కనీసం రూ.25 వేలు కూడా ఖరీదు చేయలేని డొక్కు స్కూటర్ ఉన్నందుకు రూ.లక్షల్లో అదనపు వసూళ్లకు పాల్పడుతున్నారని' ఓ వాహనదారుడు విస్మయం వ్యక్తం చేశారు. మరోవైపు ద్విచక్ర వాహనాలను ఈ నిబంధన నుంచి తొలగించాలనే ప్రతిపాదన ఉన్నా.. ఏటా రూ.150 కోట్లకు పైగా అదనపు ఆదాయం వస్తుండడంతో బాదుడు కొనసాగిస్తున్నారు.

రసూల్‌పురా రద్దీకి చెక్

ఫ్లై ఓవర్ నిర్మాణానికి జీహెచ్ఎంసీ రెడీ

- అంచనా వ్యయం రూ.150 కోట్లు
- పూర్తయితే తీరనున్న ట్రాఫిక్ ఇక్కట్లు



సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ నగరంలో ట్రాఫిక్ సమస్యలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో రసూల్‌పురా జంక్షన్ ఒకటి. ఉప్పల్, ఎల్‌బీనగర్, సికింద్రాబాద్ తదితర ప్రాంతాల నుంచి పంజగుట్ట, అమీర్‌పేట, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ తదితర ప్రాంతాలకు వెళ్లేవారు రసూల్‌పురా జంక్షన్ నుంచే వెళ్తుంటారు. ఆయా ప్రాంతాల నుంచి మినిస్టర్ రోడ్, కిమ్స్, కవాడిగూడ, ముషీరాబాద్, ట్యాంక్‌బండ్ తదితర ప్రాంతాలకు వెళ్లేవారూ ఈ జంక్షన్ నుంచే ప్రయాణిస్తారు. సికింద్రాబాద్ నుంచి బంజారాహిల్స్ వైపు ఎన్ని ఫ్లై ఓవర్లు ఉన్నా రసూల్‌పురా జంక్షన్‌లో మాత్రం ఆగిపోక తప్పడం లేదు. ట్రాఫిక్ ఇబ్బందులతో ఎంతో సమయం వృథా అవుతోంది. వాహనాలకు ఇంధన వ్యయం అధికమవుతోంది. రసూల్‌పురా జంక్షన్ వద్ద ఫ్లై ఓవర్ నిర్మిస్తే ఈ ఇక్కట్లు తగ్గుతాయని భావించిన జీహెచ్ఎంసీ సర్వే, ఇన్వెస్టిగేషన్, డీటెయిల్డ్ డిజైన్‌లతో సహా ఫ్లై ఓవర్ నిర్మాణానికి టెండర్లు ఆహ్వానించిందని సంబంధిత ఇంజినీర్లు తెలిపారు.

నాలుగు లేన్లతో..

నాలుగు లేన్లతో ప్రారంభం కానున్న ఈ ప్రాజెక్ట్ అంచనా వ్యయం రూ.150 కోట్లు. ఇందులో భూసేకరణ అంచనా వ్యయమే దాదాపు రూ.70 కోట్లు. వై ఆకారంలో రానున్న ఈ ఫ్లై ఓవర్ అప్రోచ్ మార్గం హెచ్ఎంఆర్ఎల్ బిల్డింగ్ ఉత్తరం వైపు నుంచి ప్రారంభమవుతుంది. ప్రారంభంలో నాలుగులేన్లుగా ఉండే ఫ్లై ఓవర్ క్యారేజ్‌వే 14 మీటర్లుగా ఉంటుంది. రసూల్‌పురా జంక్షన్ దగ్గర నుంచి మినిస్టర్ రోడ్‌వైపు, పాటిగడ్డ రోడ్ వైపు రెండు ఆర్మ్‌లతో వై ఆకారంలో విడిపోతుంది. మినిస్టర్ రోడ్‌వైపు వెళ్లే ఆర్మ్ మూడు లేన్లతో ఉంటుంది. దీని క్యారేజ్‌వే వెడల్పు 11 మీటర్లు, పాటిగడ్డవైపు వెళ్లే మార్గం రెండు లేన్లతో ఉంటుంది. దీని క్యారేజ్‌వే వెడల్పు 7.5 మీటర్లు.

రెండేళ్లలో పూర్తి చేయాలి..

పనులకు ఎంపికయ్యే ఏజెన్సీ పనులు రెండేళ్లలో పూర్తి చేయాల్సి ఉంటుంది. ఫ్లై ఓవర్ అందుబాటులోకి వచ్చాక వాహన ప్రయాణ వేగం కనీసం 40 కేఎంపీహెచ్ నుంచి 65 కేఎంపీహెచ్‌కు పెరగవచ్చని అధికారులు తెలిపారు. ప్రయాణ మార్గం ఒకే వైపు ఉండే ఈ ఫ్లై ఓవర్‌ను హై సిటీ (హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ అండ్ ట్రాన్స్‌ఫార్మేటివ్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్) ప్రాజెక్ట్ కింద ఈపీసీ (ఇంజినీరింగ్ ప్రొక్యూర్‌మెంట్ అండ్ కన్‌స్ట్రక్షన్) విధానంలో చేపడుతున్నారు.

మాట తప్పాడని మట్టుబెట్టారు

నమ్మినవారే నడివీధిలో పొడిచి చంపేశారు

- రూ.10 లక్షలు ఇస్తానని.. పక్కకు తప్పించాడని పగ
- రియల్టర్ హత్యోదంతంలో వెలుగులోకి పలు విషయాలు



హతుడు శ్రీకాంత్‌రెడ్డి



కాలనీవాసులకు చిక్కిన జోసెఫ్

కుషాయిగూడ: కొన్నేళ్ల పాటు తమను వెంట తిప్పుకున్నాడని.. మీ లైఫ్ సెట్ చేస్తా.. మంచి జీవితాన్ని స్తానని.. తీరా పక్కకు తప్పించాడని కక్ష పెంచుకున్నవారు శుక్రవారం నడిరోడ్డుపై ఓ రియల్టర్‌ను దారుణంగా హత్య చేసిన ఘటన కలకలం సృష్టించింది. నమ్మినవారే హత్యకు పూనుకోవడం చర్చనీయాంశంగా మారింది. హత్యకు వ్యాపార లావాదేవీలే కారణమని కొందరు, వాటాల పంచాయితీ అని మరికొందరు అంటుండగా.. అసలు విషయం మరోవిధంగా ఉన్నట్లు సమాచారం.

స్థానికులు చెప్పిన వివరాల ప్రకారం.. మీర్‌పేట్– హెచ్‌బీకాలనీ డివిజన్ పరిధిలోని మంగాపురం కాలనీలో నివసించే శ్రీకాంత్‌రెడ్డి రియల్ ఎస్టేట్‌తో పాటు వడ్డీ వ్యాపారం కూడా చేసేవారు. లాలాపేట్‌కు చెందిన ఓ రౌడీషీటర్.. శ్రీకాంత్‌రెడ్డితో కలిసి వ్యాపారం చేసేందుకు రూ.2 కోట్లు పెట్టుబడి పెట్టాడు. ఈ క్రమంలో కొంత కాలం క్రితం పెట్టుబడి పెట్టిన రౌడీషీటర్ చనిపోయాడు. దీంతో అతడి కుటుంబ సభ్యులు డబ్బుల కోసం శ్రీకాంత్‌రెడ్డిని అడగసాగారు. తనకు వ్యాపారంలో నష్టం వచ్చిందని నెట్టుకువచ్చాడు. విసిగి వేసారిపోయిన రౌడీషీటర్ సంబంధీకులు మిన్నకుండిపోయినట్లు తెలిసింది. రూ.2 కోట్ల పెట్టుబడి, మిగిలిపోయిన విషయాలు శ్రీకాంత్‌రెడ్డి వెంట ఉండే ధన్‌రాజ్, జోసెఫ్‌లకు కూడా తెలుసు. ఈ విషయంపై పలుమార్లు మాట్లాడుకున్నారు. రూ.2 కోట్లు మిగిలాయి కదా.. తమకు రూ.10 లక్షలు ఇవ్వాలని వారు అడిగినట్లు సమాచారం. ఆ సమయంలో శ్రీకాంత్‌రెడ్డి సరే అనడంతో వారు ఆశలు పెంచుకున్నారు.



శ్రీకాంత్‌రెడ్డిని కత్తితో పొడుస్తూ..

బీరు తాగించి..

రూ.10 లక్షల విషయాన్ని ధన్‌రాజ్, జోసెఫ్‌లు పలుమార్లు ప్రస్తావించడంతో విసుగు చెందిన శ్రీకాంత్‌రెడ్డి.. మీతో నాకు సంబంధం లేదంటూ వారిని పక్కకు పెట్టినట్లు తెలిసింది. దీంతో వారు పగ పెంచుకున్నారు. పది రోజుల క్రితం మరోసారి శ్రీకాంత్‌రెడ్డిని ఆశ్రయించారు. డబ్బుల కోసం వేడుకున్నారు. అయినా శ్రీకాంత్‌రెడ్డి తీరులో మార్పు రాకపోవడంతో ధన్‌రాజ్, జోసెఫ్‌లు శుక్రవారం మధ్యాహ్నం నుంచే మద్యం తాగారు. మద్యం మత్తులో హెచ్‌బీకాలనీ, మంగాపురంలోని శ్రీకాంత్‌రెడ్డి ఆఫీసుకు వెళ్లారు. వారితో పాటు తీసుకువచ్చిన బీరులోంచి ఓ గ్లాసు శ్రీకాంత్‌రెడ్డికి పోసి తాగించారు. చివరి ప్రయత్నంగా మరోసారి డబ్బులు ఇవ్వాలని బతిమిలాడారు. అప్పటికీ శ్రీకాంత్‌రెడ్డి మాట తీరులో ఏ మాత్రం మార్పు కనిపించకపోవడంతో ఆగ్రహానికి లోనై అతడి గల్లా పట్టుకొని ఆఫీసు బయటికి ఈడ్చుకు వచ్చి కాలనీలో అందరూ చూస్తుండగానే కత్తితో పొడిచి హత్య చేశారు. వీరిద్దరితో పాటు మూడో వ్యక్తి సైతం శ్రీకాంత్‌రెడ్డి ఆఫీసుకు వచ్చినట్లు తెలిసింది. ఆ మూడో వ్యక్తి ఎవరనేది ఆసక్తికరంగా మారింది.

శ్రీకాంత్‌రెడ్డి హత్య కేసు నిందితులు ధన్‌రాజ్, జోసెఫ్‌తో పాటు మరో వ్యక్తి పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం.



రాజశ్రీ

బీటెక్ విద్యార్థిని అదృశ్యం

కేపీహెచ్‌బీకాలనీ: నచ్చిన కోర్సులో సీటు రాలేదని, నచ్చని కోర్సు చదవలేనని చెప్పిన ఓ విద్యార్థిని కనిపించకుండాపోయిన సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... జగిత్యాలకు చెందిన కైతి శంకర్ కుమార్తె రాజశ్రీ(20)కి జేఎన్‌టీయూహెచ్‌లో బీటెక్ సీఎస్‌ఈ కోర్సు చదవాలని ఉంది. అయితే అందులో కాకుండా మెటలర్జీ కోర్సులో సీటు వచ్చింది. మెటలర్జీ చదవడం ఇష్టం లేకపోవడంతో విషయం తండ్రికి చెప్పింది. అయితే మరుసటి సంవత్సరం కోర్సు మార్చుకోవచ్చని, అప్పటివరకు చదవాలని చెప్పడంతో అందుకు అంగీకరించింది. శుక్రవారం సాయంత్రం తనకు మెటలర్జీ కోర్సు చదవడం ఇష్టం లేదని తోటి స్నేహితులకు చెప్పి క్యాంపస్ నుంచి బయటకు వెళ్లింది. కూతురికి ఫోన్ చేస్తే ఎలాంటి స్పందన లేకపోవడంతో వెంటనే శనివారం జేఎన్‌టీయూకు వచ్చిన ఆమె తండ్రి శంకర్ విచారించగా రాజశ్రీ ఫోన్ క్యాంపస్‌లోనే వదిలి కనిపించకుండా పోయినట్లు గుర్తించారు. దీంతో తండ్రి కేపీహెచ్‌బీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఓయూలో బీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ అరెస్టు



లాలాపేట: బీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్‌ను శనివారం ఉస్మానియా యూనివర్సిటీ ఎన్‌సీసీ గేటు సమీపంలో ఓయూ పోలీసులు అరెస్టు చేశారు. అక్కడి నుంచి అంబర్‌పేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వివరాలివీ... గ్రూప్–1 పరీక్షలో జరిగిన అవకతవకలపై ఓయూ క్యాంపస్‌లోని ఆర్ట్స్ కళాశాల వద్ద ఐక్య విద్యార్థి సంఘాలతో భవిష్యత్ కార్యాచరణపై సమావేశం నిర్వహిస్తున్న నేపథ్యంలో గెల్లు శ్రీనివాస్‌ను ఓయూలోకి రాకుండా అడ్డుకుని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల లక్షలాది మంది అభ్యర్థులు నష్టపోతున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరించకుండా వెంటనే తిరిగి గ్రూప్–1 పరీక్షను నిర్వహించాలని డిమాండ్ చేశారు.

లైట్లు వెలిగితే దోపిడీ..!



రికవరీ సొత్తును పరిశీలిస్తున్న సీపీ అవినాష్ మహంతి, చిత్రంలో రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్ తదితరులు

- శంకర్‌పల్లి రాబరీ కేసులో నిందితుల కోడ్ ఇదే
- పథకం ప్రకారమే రూ. 40 లక్షలు కొట్టేసిన నిందితులు
- నిందితుడు డ్రైవర్ మధునే ప్రధాన సూత్రధారి
- 24 గంటల్లో కేసును ఛేదించిన సైబరాబాద్ పోలీసులు

సాక్షి, సిటీబ్యూరో: శంకర్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన రూ. 40 లక్షల దారి దోపిడీ కేసును సైబరాబాద్ పోలీసులు 24 గంటల్లో ఛేదించారు. కారు బంపర్ లైట్లు వెలగడమే దోపిడీకి సిగ్నల్‌గా పెట్టుకొని రాబరీకి పాల్పడినట్లు విచారణలో పోలీసులు గుర్తించారు. ప్రధాన సూత్రధారి కార్ డ్రైవర్ మధుతో పాటు మరో ఆరుగురిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఆయా వివరాలను సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి శనివారం మీడియాకు వెల్లడించారు.

◆ హైదరాబాద్‌కు చెందిన రాకేష్ అగర్వాల్‌కు సాయిబాబా అనే వ్యక్తి మేనేజర్‌గా వ్యవహరిస్తున్నాడు. వ్యాపార అవసరాల నిమిత్తం సాయిబాబా ఎక్కడికి వెళ్లాలన్నా బీఎన్ రెడ్డి నగర్‌కు చెందిన కార్ యజమాని, డ్రైవర్ మధు కారులను సంప్రదించేవాడు. ఈక్రమంలో సాయిబాబా కదలికలను మధు గమనిస్తూ ఉండేవాడు. ఈనెల 12న రాకేష్ అగర్వాల్ వికారాబాద్‌లోని వికారాబాద్‌లోని అన్సారీ అనే కస్టమర్ నుంచి రూ. 40 లక్షలు వసూలు చేసి తీసుకురమ్మని సాయిబాబాను ఆదేశించాడు. దీంతో సాయిబాబా మధుకు ఫోన్ చేసి వికారాబాద్‌కు తన క్యాబ్ బుక్ చేసుకున్నాడు. అప్పుడే సాయిబాబా భారీ డబ్బును తీసుకొస్తాడని మధు ఊహించాడు.

దారి దోపిడీకి స్కెచ్...

పథకం ప్రకారం మధు తన స్నేహితులైన ఆర్సీపురానికి చెందిన విజయ్‌కుమార్, కాచిగూడకు చెందిన మహ్మద్ అజర్‌లకు ఈ విషయాన్ని తెలిపాడు. ఇరువురిపై గతంలో ఫోర్జరీ, డ్రగ్స్, దొంగతనాల కేసులు కూడా ఉన్నాయి. దోపిడీ చేసేందుకు విజయ్ పాత నేరస్తుడైన గచ్చిబౌలికి చెందిన హర్షవర్ధన్‌ను నియమించుకున్నాడు. నలుగురు కలిసి వికారాబాద్ నుంచి హైదరాబాద్‌కు మార్గంలో రెక్కీ నిర్వహించారు. రద్దీ తక్కువగా ఉండే ప్రాంతం, దోపిడీ తర్వాత సులువుగా తప్పించుకునే వీలున్న హుస్సేన్‌పూర్ గేట్ వద్ద దోపిడీ చేయాలని నిర్ణయించుకున్నారు.

ఎస్కార్ట్ వాహనంలో...

ఈ నెల 12న ఉదయం 11:30 గంటలకు సాయిబాబా, డ్రైవర్ మధుతో పాటు కారులో వికారాబాద్ చేరుకున్నాడు. అన్సారీ నుంచి రూ. 40 లక్షలు తీసుకొని, కారులో హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమయ్యారు. హర్ష తన స్నేహితులైన మహబూబ్‌నగర్‌కు చెందిన అనుదీప్ అలియాస్ లడ్డు స్విఫ్ట్ డిజైర్ కార్‌ను తీసుకొని హఫీజ్‌పేటకు చెందిన దీపక్, హుస్సేనీఆలంకు చెందిన షమీముల్లాలతో కలిసి కారులో మధు కారును వెంబడిస్తున్నారు. వీరి వెనుక ఎస్కార్ట్ వాహనంలో విజయ్, అజార్‌లు అనుసరిస్తున్నారు. డ్రైవర్ మధు నిరంతరం విజయ్‌తో ఫోన్‌లో తన లొకేషన్ వివరాలను అందిస్తూ ఉన్నాడు. దీన్ని విజయ్ హర్ష్‌కు పంపిస్తూ ఉన్నాడు.

పారిపోతుండగా అదుపుతప్పిన కారు...

మధు కారు హుస్సేన్‌పూర్ గేట్ వద్దకు చేరుకోగానే ముందుగా వేసిన పథకం ప్రకారం.. హర్ష పార్కింగ్ లైట్లు వెలిగించాడు. దీంతో మధు కార్‌ను కాస్త స్లో చేశాడు. దీంతో వెంటనే హర్ష కార్‌ను ఓవర్ టేక్ చేసి మధు కార్‌ను ఢీ కొట్టాడు. హర్ష ప్రయాణిస్తున్న మధు కార్‌ను ఓవర్ టేక్ చేసి వారిని అడ్డుకుంది. కారులో నుంచి ముగ్గురు వ్యక్తులు దిగి సాయిబాబాను కొట్టి రూ. 40 లక్షలు ఉన్న బ్యాగ్‌ను దోచుకున్నారు. కారులో సంఘటనా స్థలం నుంచి తప్పించుకుంటుండగా.. కొత్తపల్లి శివార్లలో నిందితులు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పింది. వెనుక ఎస్కార్ట్ వాహనంలో వస్తున్న విజయ్ తన కార్‌లో హర్ష బృందాన్ని ఎక్కించుకొని హైదరాబాద్‌కు చేరుకున్నారు. ఘటన స్థలంలో కారు అదుపు తప్పిన విషయాన్ని గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు ఆధారాలను సేకరించారు. కారు నంబరు ఆధారంగా పోలీసులు కారు యజమాని అనుదీప్ పట్టుకున్నారు. అతను ఇచ్చిన సమాచారంతో సైబరాబాద్ పోలీసులు సంగారెడ్డి, షాద్‌నగర్ పోలీసులను అప్రమత్తం చేశారు. ముంబయి హైవేలో జహీరాబాద్ వద్ద కొందరు.. బెంగళూరు హైవేలోని రాయికల్ టోల్ ప్లాజా వద్ద కొందరు మొత్తం ఏడుగురు వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులకు పట్టుబడ్డారు. నిందితుల నుంచి రూ. 17.50 లక్షలు స్వాధీనం చేసుకున్నారు.

ఐటీ కంపెనీలో అగ్నిప్రమాదం

ఏసీలు, ల్యాప్‌టాప్‌లు దగ్ధం

మాదాపూర్: సాఫ్ట్‌వేర్ కంపెనీలో నెలకొన్న విద్యుదాఘాతం కారణంగా శనివారం అగ్ని ప్రమాదం సంభవించింది. వివరాలివీ... మాదాపూర్‌లోని అయ్యప్ప సొసైటీలో క్యామెల్ క్యూ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ అనే ఐటీ కంపెనీ ఉంది. సంస్థ ఉన్న అపార్ట్‌మెంట్ 2వ అంతస్థులో శనివారం తెల్లవారుజామున 4.30 గంటలకు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న మాదాపూర్ ఫైర్ ఆఫీసర్ ఆంజనేయులు సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అప్పటికే ఏసీలు, ల్యాప్‌టాప్‌లు పూర్తిగా కాలిపోయాయని ఆయన తెలిపారు. ఆస్తి నష్టం తెలియాల్సి ఉంది. అగ్నిప్రమాదం తెల్లవారు జామున జరగడంతో ఉద్యోగులు ఎవరూ లేరు. దీంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని ఫైర్ ఆఫీసర్ స్పష్టం చేశారు.



మంటలను అదుపుచేస్తున్న ఫైర్ సిబ్బంది

బయోడీజిల్ అక్రమ విక్రయదారుల రిమాండ్

15వేల లీటర్ల ఇంధనం, ఐదు ట్యాంకర్లు సీజ్

దుండిగల్: బయో డీజిల్‌ను అక్రమంగా రవాణా చేసి విక్రయాలకు పాల్పడుతున్న ఐదుగురు వ్యక్తులను మేడ్చల్ ఎస్‌ఓటీ పోలీసులు అదుపులోకి తీసుకుని దుండిగల్ పోలీసులకు అప్పగించగా రిమాండ్ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. వనస్థలిపురానికి చెందిన దాచేపల్లి సాయి(26) కొంత కాలంగా బయో డీజిల్‌ను నెల్లూరు జిల్లా రాజుపాలెంలోని శ్రీపాద పెట్రో కెమికల్స్ నుంచి అక్రమ మార్గంలో నగరానికి తీసుకువచ్చి ఎక్కువ ధరకు విక్రయిస్తున్నాడు. ఈ అక్రమ దందాపై విశ్వసనీయ సమాచారం అందుకున్న మేడ్చల్ ఎస్‌ఓటీ పోలీసులు దుండగల్ మున్సిపల్ భౌరంపేట్‌లోని బంగారు మైసమ్మ ఆలయం సమీపంలో దాడులు నిర్వహించారు. ఆలోక్ లైలాండ్ ట్యాంక్ (టీజీ 29టీ 5299), టాటా అల్ట్రా ట్యాంకర్లు (టీఎస్ 08 యుజే 3214, టీఎస్ 15 యుడి 0752, టీఎస్ 07యుఎం 0791, ఏపీ 24 టీసీ 1784)లలో విక్రయించేందుకు తెచ్చిన రూ.13.20 లక్షలు విలువ చేసే 15 వేల లీటర్ల బయో డీజిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. దాచేపల్లి సాయితో పాటు డ్రైవర్ ఆంజనేయులు(30), హెల్పర్ శ్రీరామదాసు సాయినాథ్(22)లను అదుపులోకి తీసుకున్నారు. టాటా అల్ట్రాటెక్ ట్యాంక్ ఓనర్లు అమీన్‌పూర్‌కు చెందిన మహ్మద్ షహనాజ్‌ఖాన్(29), గచ్చిబౌలికి చెందిన సూర్య, కిషన్‌బాగ్‌కు చెందిన సైఫ్ సొహైల్, డ్రైవర్లు కిషన్‌బాగ్‌కు చెందిన మహ్మద్‌ఖాన్, మహ్మద్ మోయిన్‌లతో పాటు శ్రీపాదా పెట్రోకెమికల్స్‌కు చెందిన జగన్నాథంలు పరారీలో ఉన్నారు. కాగా దాచేపల్లి సాయి శ్రీపాదా పెట్రో కెమికల్స్‌లో బయో డీజిల్‌ను లీటర్ రూ. 81కు కొనుగోలు చేసి నగరంలో లీటర్ రూ.88కు విక్రయిస్తున్నట్లు తెలిసింది. 15 వేల బయో డీజిల్‌లో పాటు రూ. 55 లక్షలు విలువ చేసే నాలుగు ట్యాంకర్లు, రూ. 60 వేలు విలువ చేసే ఫోన్లను సీజ్ చేశారు. నిందితులను తదుపరి విచారణ నిమిత్తం దుండిగల్ పోలీసులకు అప్పగించగా శనివారం వారిని రిమాండ్‌కు తరలించారు.

భవనంపై నుంచి దూకి వ్యక్తి ఆత్మహత్య

రాజేంద్రనగర్: తాను నివసిస్తున్న భవనంపై నుంచి దూకి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ క్యాస్ట్రో తెలిపిన వివరాల ప్రకారం... హైదర్‌గూడ జనప్రియ అపార్ట్‌మెంట్ నాలుగో అంతస్తులో మాధవరెడ్డి కుటుంబ సభ్యులు నివసిస్తున్నారు. ఇతని కుమారుడు రోహిత్(35) టీసీఎస్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. ఇతనికి భార్య, ఐదేళ్ల కూతురు ఉంది. శుక్రవారం సాయంత్రం ఆఫీసు నుంచి వచ్చిన రోహిత్ ఇంట్లోనే ఉన్నాడు. అర్ధరాత్రి 12 గంటల సమయంలో నాలుగో అంతస్తు పై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. సంఘటన స్థలానికి చేరుకున్న రాజేంద్రనగర్ పోలీసులు పంచనామా నిర్వహించి మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. రోహిత్ ఎందుకు ఆత్మహత్య చేసుకున్నాడనే విషయంపై విచారణ చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

మహిళతో దురుసు ప్రవర్తన: ముగ్గురిపై కేసు

బంజారాహిల్స్: కారులో ప్రయాణిస్తున్న ఒక మహిళ పట్ల దురుసుగా ప్రవర్తించిన ముగ్గురిపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. జూబ్లీహిల్స్ పోలీసుల సమాచారం మేరకు... కోకాపేటకు చెందిన ఒక ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ యజమాని అంజలీరావు జూబ్లీహిల్స్ రోడ్ నంబర్–45లో తన కారులో ప్రయాణిస్తున్నారు. శుక్రవారం రాత్రి 7 గంటల ప్రాంతంలో రోడ్ నంబర్–45లో ఎలక్ట్రిక్ స్కూటీపై వచ్చిన వాహనదారుడు ఆమె కారును ఢీకొట్టడంతో కారు వెనుక భాగం దెబ్బతింది. పారిపోవడానికి ప్రయత్నించిన వాహనదారుడి వాహన తాళం చెవులను ఆమె తీసుకొంది. దీంతో ఆగ్రహించిన వాహన డ్రైవర్ ఆమెను నెట్టివేయడంతో మరో కారుపై పడింది. ఈ క్రమంలో కారులో ఉన్న మహిళ కిందకు దిగడంతో గొడవ మరింత పెద్దదైంది. అదే సమయంలో మరో వాహనదారుడు సైతం అంజలీరావుతో గొడవకు దిగాడు. తాళం చెవులు ఇవ్వాలంటూ ఒత్తిడి చేశాడు. వాహనదారుడు మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించి ఆమె నుంచి తాళం చెవులను లాక్కున్నాడు. గొడవ అనంతరం గమనించగా అంజలీరావు చేతికి ఉన్న రూ. 7 లక్షల విలువైన బ్రేస్లెట్ కనిపించలేదు. దీంతో ఆమె జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వాహనదారుడు, మహిళతోపాటు, మరో వాహనదారుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తక్కువ ధరకే కొత్త కార్లంటూ మోసం

రూ. 2.80 కోట్లతో పరారైన వ్యక్తి అరెస్టు

అల్వాల్: తక్కువ ధరకు కొత్త కార్లు ఇప్పించి, సాఫ్ట్‌వేర్ కంపెనీలకు కిరాయికి పెట్టి అధిక మొత్తంలో డబ్బులు ఇప్పిస్తానని మోసం చేసిన ఓ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నేరేడ్‌మెట్ పోలీసుల సమాచారం మేరకు... నేరేడ్‌మెట్‌కు చెందిన టేకి క్రాంతికుమార్ బలరాంనగర్‌లో హ్యాపీ గ్రూప్ ఆఫ్ కంపెనీ పేరుతో వ్యాపారం చేస్తున్నాడు. క్రాంతికుమార్ పలువురికి తక్కువ ధరకు కొత్త కార్లు ఇప్పించి, వాటిని తానే ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీలో కిరాయికి పెట్టి నెల రూ. 50 వేల ప్రకారం కిరాయి ఇస్తానని నమ్మబలికాడు. ఈ ప్రకారం 27 మంది వద్ద రూ. 2.80 కోట్ల మొత్తాన్ని తీసుకున్నాడు. అయితే వారికి కార్లు ఇవ్వకుండా... కిరాయిలు ఇవ్వకుండా మోసం చేసి ఆ డబ్బులతో పరారయ్యాడు. విషయం తెలుసుకున్న బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని శనివారం క్రాంతికుమార్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని పోలీసులు తెలిపారు.

కారును ఢీకొన్న టిప్పర్

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి దుర్మరణం

కీసర: వేగంగా దూసుకొచ్చిన ఓ టిప్పర్ లారీ కారును ఢీకొన్న ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి దుర్మరణానికి గుయ్యాడు. ఈ సంఘటన శనివారం కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలోని తిమ్మాయిపల్లిలో చోటు చేసుకుంది. కీసర ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు సమాచారం మేరకు... కాప్రా ఎల్లారెడ్డి గూడలో నివాసం ఉంటున్న గౌరవ్(32) సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. శనివారం ఉదయం తిమ్మాయిపల్లి నుంచి కీసర వైపు గౌరవ్ తన కారులో వెళ్తుండగా ఆ గ్రామ శివారులో ఎదురుగా వేగంగా దూసుకొచ్చిన టిప్పర్ లారీ కారును ఢీకొట్టింది. ఈ సంఘటనలో కారులో ఉన్న గౌరవ్ తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని తీవ్రంగా గాయపడిన గౌరవ్‌ను 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గౌరవ్ మృతిచెందినట్లు పోలీసులు వెల్లడించారు. లారీని డ్రైవర్ నిర్లక్ష్యంగా నడిపినందునే ప్రమాదం చోటు చేసుకున్నట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ వివరించారు.

మహిళా యూనివర్సిటీ విద్యార్థినులను వేధించిన ముగ్గురి అరెస్ట్

'సాక్షి' కథనంతో కేసు నమోదు

చాకచక్యంగా వ్యవహరించిన సుల్తాన్‌బజార్ పోలీసులు

సాక్షి ఎఫెక్ట్..



నిందితులు పిల్లి శ్రీనివాస్, వెంకటేశ్వర్ల వరప్రసాద్, సముద్రాల హరీష్

సుల్తాన్‌బజార్: కోఠిలోని వీరనారి చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీకి చెందిన వంద మందికి పైగా హాస్టల్ విద్యార్థినుల ఫోన్ నంబర్లు హ్యాక్ చేసి వారిని వేధించిన కేసులో ముగ్గురు నిందితులను సుల్తాన్‌బజార్ పోలీసులు అరెస్ట్ చేసి శనివారం రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ నర్సింహా తెలిపిన వివరాల ప్రకారం... కరీంనగర్ నవాబ్‌పేటకు చెందిన పిల్లి శ్రీనివాస్(24), నగరంలోని మియాపూర్‌లో ఉంటూ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మరో నిందితుడు కరీంనగర్ జనగామకు చెందిన సూరంపల్లి వెంకటేశ్వర్ల వరప్రసాద్(19) కొంపల్లిలో ఉంటూ ఓ రెస్టారెంట్‌లో హౌస్‌కీపింగ్ పనిచేస్తున్నాడు. 3వ నిందితుడు వరంగల్ పెద్దమ్మగడ్డకు చెందిన సముద్రాల హరీష్(25) బోరబండలో నివాసం ఉంటూ డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. అల్లరిగా తిరిగే వీరు ఓ ముఠాగా ఏర్పడి కోఠిలోని వీరనారి చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీలో ఉంటున్న హాస్టల్ విద్యార్థినులే లక్ష్యంగా వారి ఫోన్లను హ్యాక్ చేసి వారికి తరచూ వాట్సాప్ కాల్స్, ఇతర మెసేజ్‌ల ద్వారా సందేశాలు పంపుతూ, ఫోన్ కాల్స్ చేస్తూ వారి సున్నిత అంశాలకు సంబంధించిన ప్రశ్నలను అడిగి విద్యార్థిలను ఇబ్బందులకు గురిచేశారు. వారిని మియాపూర్, దిల్‌సుఖ్‌నగర్, కూకట్‌పల్లి ప్రాంతాలకు రమ్మని ఒత్తిడి చేసి హెల్త్ చెకప్‌ల పేరుతో విద్యార్థినులను మభ్యపెట్టే ప్రయత్నం చేశారు. అసభ్య సందేశాలను పంపుతుండేవారు. 20 మంది అమ్మాయిలు కనిపించడం లేదని రూమర్స్ క్రియేట్ చేసి విద్యార్థినుల ఫోన్లకు పంపేవారు. దీంతో భయభ్రాంతులకు గురైన హాస్టల్ విద్యార్థినులు 'సాక్షి' దినపత్రికకు సమాచారం అందించారు. దీంతో 'సాక్షి' దినపత్రిక ద్వారా వారి సమస్య వెలుగులోకి రావడంతో ఈ నెల 5వ తేదీన యూనివర్సిటీ విద్యార్థుల వ్యవహారాల డైరెక్టర్ వినిత పాండేతో కలిసి సుల్తాన్‌బజార్ పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు విద్యార్థినులకు వస్తున్న ఫోన్‌కాల్స్ రికార్డ్‌లను తీసుకుని దర్యాప్తు ముమ్మరం చేయడంతో ముగ్గురు నిందితులు పట్టుబడ్డారు. వారిని అదుపులోకి తీసుకుని వారిపై సెక్షన్ 78(2), 79, 72 ఐటీ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ నర్సింహా పర్యవేక్షణలో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ ధర్మారావు, ఎస్‌ఐలు సాయిరామ్, ఎండీ అలీ, క్రైమ్ సిబ్బంది కలిసి నిందితుల ఫోన్ నెంబర్లు, సీడీఆర్‌లను సేకరించి, వారి లొకేషన్లను ట్రేస్ చేసి వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. పోలీసుల పనితీరును సుల్తాన్‌బజార్ ఏసీపీ మట్టయ్య ప్రశంసించారు.

నకిలీ దస్తావేజులతో స్థలం రిజిస్ట్రేషన్

- ములుగు అగ్రికల్చర్ యూనివర్సిటీ సూపరింటెండెంట్ సహా ఇద్దరి అరెస్టు
- పరారీలో మరో 9 మంది నిందితులు

రాజేంద్రనగర్: మృతి చెందిన మహిళకు చెందిన విలువైన ఖాళీ స్థలాన్ని దొంగ దస్తావేజులు సృష్టించి రిజిస్ట్రేషన్ చేసిన ములుగు అగ్రికల్చర్ యూనివర్సిటీ సూపరింటెండెంట్‌తో పాటు 10 మందిపై రాజేంద్రనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. సూపరింటెండెంట్‌తో పాటు మరో వ్యక్తిని శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ క్యాస్ట్రో తెలిపిన వివరాల ప్రకారం... రాజేంద్రనగర్ బుద్వేల్ సర్వే నంబర్ 95లో ఆయేషా సుల్తానా పేరిట ప్లాట్ ఉంది. వీరి కుటుంబం దుబాయిలో నివశిస్తోంది. 2019లో ఆయేషా సుల్తానా మృతి చెందింది. అప్పటి నుంచి ఈ ప్లాట్ దగ్గరకు ఎవరూ రావడం లేదు. ఈ ప్రాంతంలో రోజురోజుకూ ధరలు భారీగా పెరుగుతున్నాయి. దీనిపై కన్నేసిన ములుగు అగ్రికల్చర్ యూనివర్సిటీ సూపరింటెండెంట్ నవీదుల్ హఫీజ్(53) మహ్మద్ ఉబేద్ బిన్‌తో కలిసి నకిలీ దస్తావేజులు సృష్టించారు. వీరికి మరో 9 మంది సాయం చేశారు. ఈ ప్లాట్‌ను నవీదుల్ హఫీజ్ తన కుమారుడికి రిజిస్ట్రేషన్ చేయించాడు. గత నెలలో నగరానికి వచ్చిన ఆయేషా సుల్తానా కుమారుడు ఇంతియాజ్ ప్లాట్ వద్దకు వచ్చి పరిశీలించగా ఇతరులకు విక్రయించారని తెలిసింది. దీంతో ఆయన రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దస్తావేజులన్నింటినీ పరిశీలించి విచారించారు. హఫీజ్ ప్రోత్సాహంతో ఈ నకిలీ దస్తావేజులు రిజిస్ట్రేషన్ చేశారని పోలీసులు నిర్ధారించారు. ఇద్దరిని శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో మరో 9 మంది నిందితులు పరారీలో ఉన్నట్లు ఇన్‌స్పెక్టర్ క్యాస్ట్రో వివరించారు.

డిసిన్ఫెక్షన్ స్ప్రేతో డస్ట్‌బిన్ల శుభ్రం



కేన్సర్ ఆస్పత్రి వద్ద డిసిన్ఫెక్షన్ స్ప్రే చేస్తున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని బసవతారకం కేన్సర్ ఆస్పత్రి చుట్టూ ఉదయం నుంచి రాత్రి వరకు ఎవరో ఒకరు స్థానికంగా ఉన్న అన్నార్తులకు అన్నదానాలు చేస్తూ ఉంటారు. దీంతో ఈ ప్రాంతమంతా అపరిశుభ్ర వాతావరణంతో ఉంటుంది. స్థానికంగా రోడ్లపై ఉన్న డస్ట్‌బిన్లలో సైతం పెద్ద ఎత్తున పాడైపోయిన ఆహార పదార్థాలు వేస్తుంటారు. దీంతో భరించలేని దుర్గంధం వస్తుంది. విషయాన్ని గమనించిన జీహెచ్‌ఎంసీ అధికారులు ఇక్కడ నిత్యం డిసిన్ఫెక్షన్ లిక్విడ్స్‌ను స్ప్రే చేసి క్లీన్ చేస్తున్నారు.. డస్ట్‌బిన్లతో పాటు బస్టాప్‌లలో కూడా క్లీన్ చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

ఉత్సాహంగా గ్రాండ్ పేరెంట్స్ డే



వేడుకల్లో అమ్మమ్మ, తాతయ్య, చిన్నారులు

వెంగళరావునగర్: యూసుఫ్‌గూడ డివిజన్ పరిధిలోని శ్రీకృష్ణానగర్‌లో ఉన్న శ్రీ సాయిసరస్వతీ విద్యానికేతన్‌లో శనివారం ఘనంగా గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలు జరిగాయి. ఇందులో భాగంగా ప్రీప్రైమరీ చిన్నారులు వారి తాతయ్య, నాయనమ్మ, అమ్మమ్మలతో ఎంతో సరదాగా ఆడుకుని గెంతులేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన పాఠశాల చైర్మన్ శిరీష శంకర్ మాట్లాడుతూ..కుటుంబానికి గ్రాండ్ పేరెంట్స్ వెన్నెముక లాంటి వారని తెలియజేశారు. అమ్మమ్మ, నాయనమ్మ, తాతయ్యల ప్రాధాన్యతను వివరించారు.

నియామకం

రహమత్‌నగర్: రహమత్‌నగర్ బీజేపీ కమిటీని డివిజన్ అధ్యక్షుడు తంగలపల్లి లక్ష్మణ్ శనివారం ప్రకటించారు. ఉపాధ్యక్షులుగా భాస్కర్, శంకర్, పరుశరాం, గిరి, ప్రమీల, వెంకన్న, ప్రధాన కార్యదర్శులుగా కిషోర్ శ్రీనివాస్ రెడ్డి, బాలనాగేష్, కార్యదర్శులుగా రమేశ్‌రెడ్డి, శైలజ, ప్రశాంత్, నాగేష్‌రెడ్డి, ప్రవీణ్, విఘ్నేశ్వర్‌ను నియమించారు. లక్ష్మణ్ మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో డివిజన్ కమిటీ నాయకులు అభ్యర్థి విజయానికి కృషి చేయాలని సూచించారు.

పెండింగ్ బకాయిలను విడుదల చేయాలి

హిమాయత్‌నగర్: రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ.8 వేల కోట్ల వృత్తి విద్యా కోర్సుల విద్యార్థుల బోధన, ఉపకారవేతన ఫీజు బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో శనివారం హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్ నుంచి వై జంక్షన్ కూడలి వరకు చెవిలో పూలు పెట్టుకుని వినూత్న నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈనెల 15 నుంచి తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల మేనేజ్మెంట్ అసోసియేషన్ (టీపీడీపీఎంఏ), ఫెడరేషన్ ఆఫ్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ హయ్యర్ ఇనిస్టిట్యూషన్స్(ఫతీ) వృత్తి విద్యా కళాశాలలు చేపట్టనున్న కళాశాలల బంద్‌కు మద్దతు ప్రకటిస్తున్నట్లు అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర తెలిపారు. ఆర్.బాలకృష్ణ, షేక్ మహమూద్, కె.కళ్యాణ్, రాజ్ కుమార్, మహేష్, విశాల్, నితిన్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

బయట చెత్త వేస్తే.. ఇంటికి రంగు పడుద్ది!

- స్వచ్ఛంద సంస్థతో కలిసి జీహెచ్‌ఎంసీ వినూత్న ప్రయత్నం
- ఇందిరానగర్ బస్తీలో ఎన్జీవోతో కలిసి ఇంటింటి సర్వే
- చెత్త వాహనాలకు చెత్త ఇవ్వని నివాసాలకు ఎర్ర గుర్తులు
- మూడు నెలల పాటు మానిటరింగ్ తీరు మారకపోతే చర్యలు



ఇందిరానగర్ బస్తీలో చెత్త ఇవ్వని నివాసాలకు ఎన్జీవోతో కలిసి రెడ్ మార్క్ జీహెచ్‌ఎంసీ సిబ్బంది

బంజారాహిల్స్: బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా చేసేందుకు ఇప్పటికే జీహెచ్‌ఎంసీ పలు రకాల ప్రయత్నాలు చేసింది..చెత్త వేసిన చోట శుభ్రం చేసి పూల కుండీలు, ఫ్లెక్సీలు పెట్టారు..బ్యానర్లు పట్టుకొని గల్లీ గల్లీ తిరిగారు. చెత్త వేసే వారికి జరిమానాలు సైతం వేశారు. అయినా కొంత మంది తీరు మార్చుకోకుండా చెత్త వేస్తున్నారు. దీంతో అధికారులు ఓ సరికొత్త పద్ధతిలో బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా చేసేందుకు ముందుకు సాగుతున్నారు. తాజాగా ఓ 'ఫేకో మత్'అనే ఎన్జీవోతో జీహెచ్‌ఎంసీ అధికారులు కలిసి బస్తీల్లో పర్యటించి ఈ సమస్యకు పరిష్కారం పెట్టేందుకు రంగంలోకి దిగారు. శనివారం బంజారాహిల్స్ రోడ్ నెం. 2లోని ఇందిరానగర్ బస్తీతో పాటు కమలాపురి కాలనీల్లో ఏ నివాసం నుంచైతే చెత్తను చెత్త సేకరించే వాహనానికి ఇవ్వరో ఆ నివాసాలకు రెడ్ మార్క్‌లు వేశారు. ఈ రెడ్ మార్క్ ఉన్న నివాసాలను మూడు నెలల పాటు మానిటరింగ్ చేసి తగు చర్యలు తీసుకుంటామని అధికారులు చెబుతున్నారు.

రెడ్ మార్క్ నివాసాలపై నిఘా..

- ముందు చెత్త ఇవ్వని భవనాలను చెత్త సేకరించే వ్యక్తి, ఆ ఏరియా శానిటేషన్ సూపర్‌వైజర్‌తో కలిసి గుర్తించి ఆ ఇంటికి రెడ్ మార్క్‌ను వేస్తారు.
- రెడ్ మార్క్ వేసిన తర్వాత యజమానితో మాట్లాడి ఆ భవనంలో ఉండేవారంతా చెత్త సేకరించే వారికి చెత్త ఇవ్వాలని అవగాహన కల్పిస్తారు.
- మూడు నెలల పాటు వారిని మానిటరింగ్ చేస్తారు. ఈ మూడు నెలల్లో వారిలో మార్పు వచ్చి చెత్త సేకరించే వారికి చెత్త ఇస్తే సరే లేదంటూ పలు చర్యలు తీసుకునేందుకు శ్రీకారం చుడతారు.
- తొలుత జలమండలికి, విద్యుత్ శాఖకు ఆ భవనానికి నల్లా కనెక్షన్‌తో పాటు కరెంటు నిలిపివేయాలని లేఖలు రాస్తారు. ఫైన్‌లు వేస్తారు.
- ఒకవేళ ఆ ఇంట్లో ఉండే వాళ్ల తీరు మారితే రెడ్ మార్క్ స్థానంలో బ్లూ మార్క్ గానీ, గ్రీన్ మార్క్ కానీ వేస్తారు.
- ఆ వీధిలో ఎన్ని నివాసాల వారు చెత్త ఇవ్వడం లేదనే వివరాలు బస్తీ ప్రారంభంలోని ఓ గోడపై రాస్తారు.
- వ్యాపార కార్యకలాపాలు నిర్వహించే కార్యాలయాలపై కూడా ఈ సంస్థ దృష్టి పెడుతుంది. వ్యాపారం పూర్తయిన వారు సాయంత్రం కాగానే రోడ్లపై చెత్తను వేసి వెళ్లకుండా వారిని కూడా గుర్తించి చెత్త సేకరించే వారికి చెత్త ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటారు.

అర్థమయ్యేలా వివరిస్తున్నాం..



బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయడం వల్ల ఎన్ని సమస్యలుంటాయో స్థానిక బస్తీవాసులకు, నివాసితులకు వివరిస్తున్నాం. చెత్త సేకరించే వారికి చెత్త ఇవ్వని భవనాలకు రెడ్ కలర్ వేసి గుర్తిస్తున్నాం. వారిలో మార్పు వస్తే మూడు నెలల తర్వాత రెడ్ మార్క్‌ను తొలగిస్తాం. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయడం వల్ల ఎన్నో జబ్బులు వస్తున్నాయని, పరిసరాల పరిశుభ్రం ఉండటం లేదని వారికి అర్థమయ్యేలా వివరిస్తున్నాం.

– మేధా, ఫేకోమత్ ఎన్జీవో చైర్మన్

జీవో 99ను వెంటనే సవరించాలి



మంత్రికి వినతి పత్రం అందజేసిన భాస్కర్, బాలకిషన్

హిమాయత్‌నగర్: జీవో 99తో ఎస్సీలలోని 58 కులాలకు జరుగుతున్న అన్యాయంపై సీఎం రేవంత్ రెడ్డి వెంటనే స్పందించాలని కోరుతూ శనివారం తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ చైర్మన్ మందాల భాస్కర్, గ్రేటర్ హైదరాబాద్ మాల సంఘాల జేఏసీ చైర్మన్ బేర బాలకిషన్ ఆధ్వర్యంలోని బృందం ఎస్సీ వర్గీకరణపై ప్రభుత్వం నియమించిన మంత్రివర్గ ఉప సంఘం సభ్యులు, మంత్రి పొన్నం ప్రభాకర్‌కు శనివారం వినతిపత్రం సమర్పించింది. మంత్రివర్గ ఉప సంఘంతో, మాల ప్రజా ప్రతినిధులతో సీఎం చర్చించి న్యాయం చేయాలని డిమాండ్ చేసింది. సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్‌ను పాటించకుండా చేసిన ఎస్సీ వర్గీకరణ వల్ల ఈడబ్ల్యూఎస్ వర్గాల కంటే కూడా రోస్టర్ విధానంలో ఎస్సీలలోని 58 కులాలకు అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేసింది. వినతి పత్రం అందజేసిన వారిలో జేఏసీ రాష్ట్ర గౌరవాధ్యక్షులు చెరుకు రాంచందర్, నాయకులు రాహుల్‌రావు, ఎన్.నర్సింగ్ రావు, పి.భాను, ఎన్.సైదులు, డాక్టర్ వీరస్వామి ఉన్నారు.

నూతన పరిజ్ఞానం, ఆవిష్కరణలే లక్ష్యం



వర్క్‌షాప్‌కు హాజరైన నిపుణులు

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని కేర్ హాస్పటల్స్ ఫేషియల్ రీకన్‌స్ట్రక్టివ్ అండ్ కాస్మొటిక్ సర్జరీ ఇండియా ట్రస్ట్‌తో కలిసి 9వ అంతర్జాతీయ రైనోప్లాస్టీ అండ్ ఫేషియల్ ప్లాస్టిక్ సర్జరీ వర్క్‌షాప్ నిర్వహించారు. రెండ్రోజుల పాటు జరిగే ఈ వర్క్‌షాప్‌ను క్వాలిటీ కేర్ ఇండియా లిమిటెడ్ గ్రూపు మేనేజింగ్ డైరెక్టర్ వరుణ్‌ఖన్నా ప్రారంభించి మాట్లాడారు. దేశానికి ప్రపంచ స్థాయి పరిజ్ఞానం, కొత్త ఆవిష్కరణలు తీసుకురావాలనే కేర్ హాస్పటల్స్ లక్ష్యానికి ఈ సమావేశం ఒక ఉదాహరణ అన్నారు. ప్రముఖ అంతర్జాతీయ సర్జన్లు, దేశీయ వైద్యులు కలిసి పనిచేయడం ద్వారా వైద్య రంగంలో అనుభవం, పరిజ్ఞానం పెరుగుతుందన్నారు.డాక్టర్ ఎస్.విష్ణుస్వరూప్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ సమావేశం మొదటి రోజే సహకారం, పరిజ్ఞానం పంచుకోవడం ద్వారా ఎంత శక్తివంతమో తెలియజేస్తుందన్నారు. ఈ ప్రత్యక్ష శస్త్ర చికిత్స ప్రదర్శనలతో కూడిన నైపుణ్య మార్పిడి, భారతదేశ సర్జన్లు క్లినికల్ ఎక్సలెన్స్‌కు కొత్త గరిష్టాలను చేరేలా ప్రేరేపించే ప్రత్యేక వేదికగా ఈ శిఖరాగ్ర సమావేశం నిలబెడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో హాస్పటల్స్ జోనల్ చీఫ్ ఒరేటింగ్ ఆఫీసర్ బిజు నాయర్, చీఫ్ ఆఫ్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ నిఖిల్ మాథుర్ తదితరులు పాల్గొన్నారు.

సర్కిల్ కార్యాలయాన్ని సందర్శించిన మేయర్



ఉప కమిషనర్‌తో చర్చిస్తున్న మేయర్

వెంగళరావునగర్: ఒకవైపు నగరాన్ని ఎంతో పరిశుభ్రంగా ఉంచడానికి కోట్లాది రూపాయలు వెచ్చించి నిత్యం పనులు చేపడుతుంటే మరోవైపు చెత్తను ఇక్కడే స్టాక్ ఉంచడం ఏంటని జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని జీహెచ్‌ఎంసీ సర్కిల్–19 కార్యాలయం, పక్కనే ఉన్న డంపింగ్ కేంద్రం పరిసర ప్రాంతాలను శనివారం ఆమె ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో చెత్త నిల్వలు ఉండటానికి చూసి, ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఇదేమిటి చెత్త ఎప్పటికప్పుడు తరలించాలని, ఎక్కడా కూడా నిల్వ ఉంచకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని చెప్పారు. స్థానిక ప్రజలు కూడా తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ సర్కిల్–19 ఉప కమిషనర్ రజినీకాంత్‌రెడ్డి తదితర నేతలు ఉన్నారు.

నిషేధిత ఎండీఎంఏ డ్రగ్స్ స్వాధీనం

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్‌నెం.12లో నిషేధిత ఎండీఎంఏ డ్రగ్స్‌ను సరఫరా చేస్తున్న ముఠాను స్పెషల్ టాస్క్ ఫోర్స్ పోలీసులు పట్టుకొని డ్రగ్స్‌తో పాటు వాహనాలు, సెల్‌ఫోన్లు సీజ్ చేశారు. అమీర్‌పేట్ ఎక్సైజ్ స్టేషన్ లిమిట్స్‌లోని స్పెషల్ టాస్క్‌ఫోర్స్ టీమ్ ఏ పోలీసులకు సమాచారం రావడంతో బంజారాహిల్స్ రోడ్ నెం. 12లో డ్రగ్ పెడ్లర్స్ మధురానగర్‌కు చెందిన భరత్ తుర్కల్, భీమవరంకు చెందిన కొరిపల్లి కృష్ణలను అదుపులోకి తీసుకోగా సప్లయర్ మహ్మద్ షెజెబ్ పరారైనట్లు పోలీసులు తెలిపారు. వీరి వద్ద నుంచి 10.95 గ్రాముల వైట్ కలర్ ఎండీఎంఏ, 2.33 గ్రాముల బ్రౌన్ కలర్ ఎండీఎంఏ, 0.95 గ్రాముల పింక్ కలర్ ఎండీఎంఏ డ్రగ్స్‌తో పాటు 70 గ్రాముల డ్రై గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. భరత్ తుర్కల్ అనే వ్యక్తి గతంలో కూడా పలుసార్లు నిషేధిత డ్రగ్స్ కేసుల్లో అరెస్ట్ అయినట్లు పోలీసులు తెలిపారు. ఇతను డ్రగ్స్ అమ్మడానికి గేలతో పాటు గ్రిండర్ అనే యాప్‌ను కూడా వినియోగించి పలువురు విద్యార్థులను ట్రాప్ చేసి బైసెక్సువల్ యాక్టివిటీస్‌కు పాల్పడేవాడని తెలిపారు. డైరెక్టర్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎక్సైజ్ షానవాజ్ ఖాసిం, జాయింట్ కమిషనర్ ఖురేషి, ఎక్సైజ్ ఏసీపీ ప్రణవి సూపర్‌విజన్‌లో జరిగిన ఈ దాడుల్లో అధికారులు ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎన్. అంజిరెడ్డి, సీఐ ఎంపీఆర్ చంద్రశేఖర్, ఎస్ఐలు భరత్‌కుమార్, సాయికిరణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బస్తీవాసుల అభీష్టం మేరకు అభివృద్ధి పనులు



గౌరీశంకర్ కాలనీలో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే దానం, కార్పొరేటర్ కవితారెడ్డి

వెంకటేశ్వరకాలనీ: బస్తీవాసుల అభివృద్ధి అభీష్టం మేరకు తాను అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయిస్తానని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. శనివారం ఆయన వెంకటేశ్వర కాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డితో కలిసి డివిజన్ పరిధిలోని గౌరీ శంకర్ కాలనీ బస్తీలో రూ.1.30 కోట్లతో నిర్మించనున్న సీసీ రోడ్డు. సీవరేజీ లైన్, తాగునీటి లైన్ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..గౌరీ శంకర్ కాలనీలో ఉన్న జీహెచ్‌ఎంసీ స్థలంలో గతంలో మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్ కోసం రూ.2 కోట్లు మంజూరు చేయించానని స్థానికంగా ఉన్న బస్తీవాసులు దాన్ని పార్కుగానే అభివృద్ధి చేయాలని చెప్పారని అందుకే మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్‌ను రద్దు చేయించామని తెలిపారు. తాజాగా ఆ పార్కు స్థలం చుట్టూ ప్రహరీ నిర్మించేందుకు ప్రతిపాదనలు రూపొందించాలని జీహెచ్‌ఎంసీ అధికారులకు సూచించినట్లు తెలిపారు. బస్తీలో అభివృద్ధి పనుల్లో నాణ్యత తగ్గకుండా చూడాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జలమండలి బంజారాహిల్స్ డీజీఎం షీలారాణి, మేనేజర్ శివకుమార్, జీహెచ్‌ఎంసీ అధికారులు బస్తీ కమిటీ అధ్యక్షుడు ముత్తు, కార్యదర్శి ఆనంద్, వర్కింగ్ ప్రెసిడెంట్ భీమ్ రావు, సలహాదారు లింగారెడ్డి, రమేష్ యాదవ్, సతీష్, కురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

'మాలల రణభేరి'ని విజయవంతం చేయాలి

హిమాయత్‌నగర్: నవంబర్ 2న 'మాలల రణభేరి'పేరుతో చేపట్టనున్న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య పిలుపునిచ్చారు. శనివారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో తెలంగాణ అధ్యక్షుడు బూర్గుల వెంకటేశ్వర్లు, ఏపీ అధ్యక్షుడు కమ్మతోటి పాల్‌తో కలిసి రణభేరి పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కొత్తగా తీసుకొచ్చిన రోస్టర్ విధానంతో విద్య, ఉద్యోగాల్లో మాలలు నష్టపోతున్నారన్నారు. అభివృద్ధి చెందిన మాదిగలకు 9 శాతం రిజర్వేషన్లు ఇచ్చి, మాలలకు కేవలం 5 శాతమే ఇచ్చారన్నారు. ఎంపిరికల్ డేటాను పరిగణలోకి తీసుకోకుండా, జస్టిస్ షమీమ్ అక్తర్ కమిషన్ రిపోర్ట్ ఆధారంగా ఎస్సీ వర్గీకరణ చేశారని ఆరోపించారు. ఈ రణభేరి సభకు మంత్రి వివేక్ వెంకటస్వామి ముఖ్యఅతిథిగా పాల్గొంటారని, లక్షలాదిగా మాలలు తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాయకులు మధుబాబు, ఎ.కేశవులు, సరళ, పి.కోటేశ్వరరావు, ఆనంద్ రావు, శ్రీకాంత్, జైకుమార్, లలిత, సుమలత, అనిల్, బాలకృష్ణ, సుధాకర్, మోహనకృష్ణ పాల్గొన్నారు.

మొక్కలను నాటి కాలుష్యాన్ని నివారించాలి



రాజ్‌భవన్ పాఠశాలలో మొక్కలు నాటుతున్న కృష్ణ జ్యువెలర్స్ ప్రతినిధులు

బంజారాహిల్స్: మొక్కలను నాటి కాలుష్యాన్ని నివారించాలని కృష్ణ జ్యువెలర్స్ ఏరియా ఆపరేషనల్ మేనేజర్ శరత్‌బాబు అన్నారు. సోమాజీగూడ కృష్ణ జ్యువెలర్స్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని శనివారం రాజ్‌భవన్ పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మొక్కలను నాటడం వల్ల పర్యావరణాన్ని కాపాడిన వారమవుతామని తెలిపారు. వాతావరణ సమతుల్యతను సాధించాలంటే, అలాగే వాతావరణ కాలుష్యాన్ని నివారించాలంటే ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో సోమాజీగూడ బ్రాంచ్ మనేజర్ శ్రీకర్‌రెడ్డి, పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం గోపాల్, ఉపాధ్యాయులు సురేందర్, సునీత, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హిందీ భాషా దినోత్సవం



జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో వేడుకలు

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో శనివారం హిందీ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వివిధ తరగతుల విద్యార్థులు హిందీలో తమ నైపుణ్యాన్ని, సృజనాత్మకతను ప్రదర్శించే కవితా పఠనాలు, నాటికలను ప్రదర్శించారు. ప్రసిద్ధ హిందీ పాటలతో ప్రేక్షకులకు వీనులవిందు చేసి పండుగ వాతావరణాన్ని నెలకొల్పారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కాంచనవల్లి మాట్లాడుతూ..భారతదేశం భిన్నత్వంలో ఏకత్వమని, ఇక్కడ అనేక భాషలు విలసిల్లుతున్నాయన్నారు. మన దేశంలో హిందీ రాజభాషగా గౌరవం పొందుతోందని హిందీ ప్రాముఖ్యతను నొక్కిచెప్పారు. హిందీ దివస్ జరుపుకోవడం వల్ల మన భాషా వారసత్వాన్ని అభినందించడానికి, మన భాషపై గౌరవాన్ని పెంపొందించడానికి వీలు కల్పిస్తుందన్నారు.

తెలంగాణ విమోచన దినోత్సవాన్ని వాడవాడలా నిర్వహిద్దాం



సమావేశంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ సాగర్ సొసైటీలోని బీజేపీ కార్యాలయంలో శనివారం జూబ్లీహిల్స్ డివిజన్ బీజేపీ సమావేశం నిర్వహించారు. డివిజన్ అధ్యక్షుడు ముద్దంగుల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బద్దం మహిపాల్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ..తెలంగాణ విమోచన దినోత్సవాన్ని వాడవాడలా నిర్వహిద్దామన్నారు. సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన దినోత్సవంగా ప్రజలంతా జరుపుకోవాలని సూచించారు. ప్రతి పోలింగ్ బూత్‌లో జాతీయ జెండా ఆవిష్కరించాలని, కేంద్ర ప్రభుత్వం పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే తెలంగాణ విమోచన దినోత్సవంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు ప్రతి పోలింగ్ బూత్‌లో సేవాపక్షం–2025 కార్యక్రమాలు ప్రజల వద్దకు తీసుకువెళ్లాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు కాడిగారి భోజిరెడ్డి, కొత్త నీరజముదిరాజ్, శ్రావణ్‌యాదవ్, వల్లెపు శంకర్, దండుగుల శ్రీనివాస్, సీతల అనిల్‌కుమార్, కస్తూరి మహిపాల్‌రెడ్డి, దండుగుల శేఖర్, చెలిమేటి గిరి, దొంగరి రాజకళ తదితరులు పాల్గొన్నారు.

వెయ్యి టన్నుల నిమజ్జన వ్యర్థాల తొలగింపు

- కొనసాగుతున్న తొలగింపు పనులు
- గతేడాదికన్నా తగ్గిన వ్యర్థాలు

బంజారాహిల్స్: వినాయక విగ్రహాల నిమజ్జనం తర్వాత హుస్సేన్‌సాగర్‌తో పాటు చుట్టూ ఉన్న రోడ్లు, ఫుట్‌పాత్‌ల నుంచి జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ సిబ్బంది వెయ్యి టన్నుల నిమజ్జన వ్యర్థాలు, చెత్తాచెదారం తొలగించారు. ఈ నెల 6వ తేదీ విగ్రహాల నిమజ్జనం నుంచే హుస్సేన్‌సాగర్‌లో నుంచి, రోడ్లు, ఫుట్‌పాత్‌ల నుంచి వ్యర్థాల తొలగింపు పనులను జీహెచ్‌ఎంసీ సర్కిల్–17 సిబ్బంది ముమ్మరం చేశారు. హుస్సేన్‌సాగర్ చుట్టూ 500 మంది పారిశుద్ధ్య కార్మికులు ఈ చెత్త తొలగింపులో పాల్పంచుకున్నారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది నిమజ్జన వ్యర్థాలు 150 టన్నుల మేర అదనంగా తొలగించినట్లు అధికారులు తెలిపారు. గతేడాది 850 టన్నుల వ్యర్థాలు తొలగించగా ఈ ఏడాది వెయ్యి టన్నులకు చేరింది. సుమారుగా అయిదున్నర లక్షల మంది భక్తులు ఈ సారి నిమజ్జన వేడుకలను తిలకించడానికి వచ్చారు. 40 వేల పెద్ద వినాయక విగ్రహాలు ఈ సారి నిమజ్జనం చేయగా గతేడాది కంటే 5 వేల విగ్రహాలు అదనంగా పెరిగాయి. నిమజ్జనానికి తిలకించడానికి వచ్చిన భక్తుల ద్వారా టన్నుల కొద్ది పేపర్ ప్లేట్లు ప్లాస్టిక్ గ్లాసులు, ప్లాస్టిక్ సంచులు, విగ్రహాల అలంకరణ, పూజా సామగ్రి పెద్ద సంఖ్యలో పేరుకుపోవడమే కాకుండా వీటి తొలగింపు కూడా సిబ్బందికి సవాల్‌గా మారింది. విగ్రహాల నిమజ్జనం ప్రశాంత వాతావరణంలో జరగడంతో పాటు ఈ సారి చెత్తా చెదారం తొలగింపు కూడా ప్రణాళికాబద్ధంగా నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. పండుగ తర్వాత మూడో రోజు నుంచి మొదలైన చెత్తా చెదారం తొలగింపు నిమజ్జనం అనంతరం వారం రోజుల వరకు కొనసాగింది. దీంతో హుస్సేన్‌సాగర్ చుట్టూ శుక్రవారం నుంచి పూర్తి క్లీన్ అండ్ గ్రీన్ చోటు చేసుకుంది. ఓ వైపు జీహెచ్‌ఎంసీ ప్రణాళికాబద్ధంగా షిఫ్ట్‌ల వారీగా సిబ్బందిని నియమించి వ్యర్థాల తొలగింపు చేపట్టగా హెచ్‌ఎండీఏ కూడా హుస్సేన్‌సాగర్‌లో నుంచి 11 టన్నుల వేస్ట్‌ను తొలగించింది. ఇంకా ఈ పనులు కొనసాగుతూనే ఉన్నాయి. గతేడాది 12 వేల టనుల నిమజ్జన వ్యర్థాలు తొలగించగా ఈ సారి కొంత మేర తగ్గుముఖం పట్టింది. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలతో ఐరన్ మెటీరియల్ కూడా పెద్ద మొత్తంలో ఈ సారి తొలగించి హుస్సేన్‌సాగర్‌ను క్లీన్ చేశారు. హుస్సేన్‌సాగర్‌తో పాటు చుట్టుపక్కల ప్రాంతాలపై జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ ఎవరికి వారే వ్యర్థాలు, ఇనుప చువ్వలు, ఇతరత్రా వేస్ట్ మెటీరియల్‌ను తొలగించి ఇప్పుడిప్పుడే ప్రాంతాన్ని కుదుట పడేలా చేశారు. మొత్తానికి గతేడాదితో పోలిస్తే ఈ సారి నిమజ్జన వ్యర్థాలు పెద్ద ఎత్తున పోగవడమే కాకుండా వాటిని తొలగించడంలో జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య కార్మికులు అదనంగా మూడు రోజుల కష్టపడాల్సి వచ్చింది. తొలగించిన వ్యర్థాలను డంపింగ్ యార్డ్‌కు తరలించినా కూడా జీహెచ్‌ఎంసీకి ఒక సవాల్‌గా మారింది. మొత్తానికి పది రోజులుగా దృష్టి పెట్టిన సిబ్బంది ఇప్పుడిప్పుడే సమస్యను కొలిక్కి తీసుకొచ్చారు.





హుస్సేన్‌సాగర్ నుంచి చెత్తను తొలగిస్తున్న సిబ్బంది

ఎమ్ఎస్ఎంఈలకు ప్రభుత్వ ప్రోత్సాహం

రాష్ట్ర పరిశ్రమల శాఖమంత్రి శ్రీధర్‌బాబు



ఎంఎస్ఎంఈ ఎక్స్‌పోను ప్రారంభిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

శంషాబాద్: సూక్ష్మ, చిన్న, మధ్య తరహా వ్యవస్థాపకులను (ఎంఎస్ఎంఈ)ను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని మంత్రి డి.శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. బీఎన్ఐ(బిజినెస్ నెట్‌వర్క్‌ఇంటర్నెషనల్) ఆధ్వర్యంలో శంషాబాద్ ఎస్ఎస్ కన్వెన్షన్‌హాలులో ఏర్పాటు చేసిన ఎంఎస్ఎంఈల ఎక్స్‌పోను ఆయన ప్రారంభించారు. పారిశ్రామికాభివృద్ధికి బాటలు వేసేందుకు రాష్ట్రంలో రెండు డ్రైపోర్టుల ఏర్పాటుకు ప్రభుత్వం సన్నద్ధంగా ఉందన్నారు. పక్కరాష్ట్రాల్లో ఉన్న పోర్టులను కూడా సద్వినియోగం చేసుకునే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ సందర్భంగా పలు స్టాళ్లలో ఉత్పత్తులను పరిశీలించి వాటి గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీఎన్ఐ ఎక్స్‌క్యూటీవ్ డైరెక్టర్ సంజనాషా తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ పండుగ సంబరాలను విజయవంతం చేద్దాం



బతుకమ్మ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీ డీకే అరుణ

బంజారాహిల్స్: సెప్టెంబర్ 21 నుంచి 30వ తేదీ వరకు తెలంగాణలో జరిగే బతుకమ్మ పండుగ సంబరాలను విజయవంతం చేయాలని ఎంపీ డీకే అరుణ పిలుపునిచ్చారు. శనివారం ఉదయం జూబ్లీహిల్స్‌లోని ఆమె నివాసంలో సంస్కార భారతి తెలంగాణ మాతృశక్తి విభాగం వారితో కలిసి బతుకమ్మ సంబరాలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ సంవత్సరం సంస్కార భారతి తెలంగాణ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా జరిగే బతుకమ్మ ఉత్సవాల్లో మహిళలంతా కలిసి బతుకమ్మను ఆడుతూ మన సంస్కృతిని చాటుదాం అని పిలుపునిచ్చారు. ఈ ఉత్సవాలను ప్రజలు విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంస్కార భారతి మాతృశక్తి రాష్ట్ర కన్వీనర్ నెల్లుట్ల సుష్మా, సంస్కార భారతి రాష్ట్ర కార్యదర్శి భవానీ, రంగోలి విభాగం కన్వీనర్ జయశ్రీ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు విజయలక్ష్మీ, యాక్టింగ్ విభాగం రాష్ట్ర కో-కన్వీనర్ స్వాతి, లావణ్య, సంతోషి, పారిజాత, శ్రీవిద్య, లావణ్య, నర్మద తదితరులు పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్ క్రీడకు అత్యంత ఆదరణ

తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి



గచ్చిబౌలి: మార్షల్ ఆర్ట్ క్రీడ ప్రాచీన క్రీడ అని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి పేర్కొన్నారు. గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో ఏమికల్ స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో జరుగుతున్న మొదటి ఆసియన్ తైక్వాండో ఓపెన్ ఇంటర్నేషనల్ చాంపియన్‌షిప్‌ను ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆసియా దేశాల్లో మార్షల్ ఆర్ట్స్ క్రీడకు అత్యంత ఆదరణ ఉందన్నారు, మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ పొందితే ఆత్మరక్షణకే కాకుండా ఆత్మవిశ్వాసం పెంపొందిస్తుందన్నారు. రెండు రోజులపాటు గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న ఈ క్రీడా పోటీల్లో ఆసియాకు చెందిన 8 దేశాల నుంచి దాదాపు 1000 మంది తైక్వాండో క్రీడాకారులు పాల్గొంటారని ఆయన వివరించారు. ఎమికల్ స్పోర్ట్స్ అకాడమీ చైర్మన్ వీణావాహిని, ఇంటర్నేషనల్ తైక్వాండో మాస్టర్ జయంత్‌రెడ్డి పాల్గొన్నారు.

నగరంలో నేడు

- బంజారాహిల్స్ రోడ్‌నెం.1లోని కళింగ కల్చరల్ హాల్‌లో ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు జాతీయ చేనేత వస్త్ర ప్రదర్శన.
- గచ్చిబౌలిలోని సంధ్య కన్వెన్షన్‌లో ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు డిజైర్ ఎగ్జిబిషన్.
- బంజారాహిల్స్ రోడ్‌నెం.1లోని తాజ్ కృష్ణా హోటల్‌లో ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఆకృతి ఎలైట్ ఆధ్వర్యంలో లైఫ్ స్టైల్ ఎగ్జిబిషన్.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 7.30గంటల వరకు పెన్సిల్ డ్రాయింగ్స్, స్కల్ప్చర్స్, స్టేకిడ్ స్టోరీస్ . దీప్ ఇంటీరియల్స్ చిత్ర ప్రదర్శన.
- మాదాపూర్‌లోని శిల్పారామంలో ఉదయం 10.30గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఏర్పాటు చేసిన హస్తకళా మ్యూజియం.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళా శక్తి బజార్‌లో ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు చేనేత ఉత్పత్తుల ప్రదర్శన.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజు నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.comకు మెయిల్ చేయగలరు.

బిల్డింగ్ బైలాస్‌పై మళ్లీ మెలిక!

అభ్యంతరాలు వ్యక్తం చేసిన రక్షణ శాఖ పీడీ

- మార్పులపై కసరత్తు చేస్తున్న బోర్డు అధికారులు
- 90 ఏళ్ల బైలాస్ ఆధారంగానే నిర్మాణాలు
- 2003 నుంచీ మార్పుల కోసం ప్రయత్నాలు
- రక్షణ శాఖ కొర్రీలతో ఆలస్యమవుతున్న వైనం



కంటోన్మెంట్: సగటు కంటోన్మెంట్ వాసులు చిరకాల కోరిక అయిన 'నూతన బిల్డింగ్ బైలాస్' వ్యవహారం అంతులేని కథలా సాగుతోంది. 90 ఏళ్ల నాటి బైలాస్ ఆధారంగానే నేటికీ భవన నిర్మాణాలు కొనసాగించాల్సి రావడంతో నిర్మాణదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇన్నేళ్లలో రెండు సార్లు కొద్దిపాటి సవరణలు మినహా, బిల్డింగ్ బైలాస్‌లో పెద్దగా మార్పులు లేవు. కంటోన్మెంట్ చుట్టూ ఉన్న జీహెచ్ఎంసీకి భిన్నంగా ఇక్కడ ఆంక్షలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో బైలాస్‌లో మార్పులు చేయాలంటూ ఏళ్ల తరబడి చేస్తున్న ప్రయత్నాలు విఫలమవుతూ వస్తున్నాయి. 2008, 2010, 2013, 2017లో రూపొందించిన బిల్డింగ్ బైలాస్‌ను రక్షణ శాఖ పెండింగ్‌లో పెట్టింది. తాజాగా రక్షణ మంత్రిత్వ శాఖ నుంచే ప్రతిపాదనలు రావడంతో కంటోన్మెంట్ వాసుల్లో ఆశలు చిగురించాయి. గత నెలలో జరిగిన బోర్డు సమావేశంలో డ్రాఫ్ట్ బిల్డింగ్ బైలాస్‌కు ఆమోదం తెలిపి, ఉన్నతాధికారుల ఆమోదం కోసం పంపారు. తాజాగా పుణేలోని రక్షణ శాఖ ప్రిన్సిపల్ డైరెక్టరేట్ పలు అభ్యంతరాలు లేవనెత్తింది. దీంతో బిల్డింగ్ బైలాస్ వ్యవహారం మళ్లీ మొదటికొచ్చింది.

బ్రిటీష్ చట్టమే..

బ్రిటీష్ హయాంలో కంటోన్మెంట్‌లో ఆర్మీ అవసరాలకే అధిక ప్రాధాన్యమిస్తూ, సామాన్యుల నివాసాలపై పెద్ద ఎత్తున ఆంక్షలు విధించారు. 1935లో రూపొందించిన బిల్డింగ్ బైలాస్‌కు లోబడే నేటికీ నిర్మాణాలు కొనసాగుతున్నాయి. కాలక్రమేణా కంటోన్మెంట్‌లలో జనాభా పెరుగుతున్నప్పటికీ, నిబంధనల్లో మాత్రం పెద్దగా మార్పులు చేయలేదు. ప్రైవేటు స్థలాల్లో లే అవుట్‌లకు అనుమతించినప్పటికీ, భవన నిర్మాణాల్లో నిబంధనలు మాత్రం యధావిధిగా కొనసాగుతున్నాయి. 2008లో ఫ్లోర్ స్పేస్ ఇండెక్స్ (ఎఫ్ఎస్ఐ) పరిమితిని 0.5 నుంచి 1.5 పరిమితికి పెంచారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా నిర్ణీత ప్లాటులో ఒకటికంటే ఎక్కువ నివాసాలు నిర్మించుకునే అవకాశం లేదు. అపార్ట్‌మెంట్‌ల నిర్మాణం అసలే కుదరదు. 133 గజాలకు లోబడి ఉండే ప్లాట్‌లలో నిర్మాణ అనుమతులు ఇవ్వరు. ఇలాంటి పలు ఆంక్షల కారణంగా, తప్పనిసరి పరిస్థితుల్లో అక్రమ నిర్మాణాలు చేపడతూ వచ్చారు. ప్రస్తుతం కంటోన్మెంట్‌లో 90 శాతానికి పైగా నిర్మాణాలు నిబంధనలు ఉల్లంఘించి నిర్మించినవే అంటే అతిశయోక్తి లేదు. ప్రస్తుత నిబంధనల మేరకు ఆయా అక్రమ నిర్మాణాలను క్రమబద్ధీకరించే వెసులుబాటు కూడా లేదు. ఈ నేపథ్యంలోనే భవన నిర్మాణ నిబంధనల్లో మార్పులను సూచిస్తూ సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు అధికారులు పలు మార్పులు రక్షణ శాఖకు విన్నపాలు పంపారు. 2008 నుంచి నాలుగు సార్లు వేర్వేరుగా బిల్డింగ్ బైలాస్ రూపొందించి పంపినప్పటికీ, కేంద్రం నుంచి సానుకూలం నిర్ణయమే లేదు. ఎప్పటికప్పుడు బోర్డు ప్రతిపాదనలు బుట్టదాఖలు చేస్తూ రావడంతో స్థానిక అధికారులు సైతం విసుగెత్తిపోయారు.

రక్షణ శాఖే కోరినప్పటికీ...

కంటోన్మెంట్‌లలో బిల్డింగ్ బైలాస్‌లో మార్పులు చేస్తూ ప్రతిపాదనలు పంపాల్సిందిగా కేంద్ర రక్షణ శాఖ గతేడాది లేఖలు పంపింది. దీంతో జీహెచ్ఎంసీ కంటోన్మెంట్, జేఎన్‌టీయూ, హెచ్ఎండీఏ, సీఎస్ఐటీలకు చెందిన 10 మంది ఉన్నతాధికారులతో ఎక్స్‌పర్ట్ కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా రూపొందించిన 'సికింద్రాబాద్ కంటోన్మెంట్ బిల్డింగ్ బైలాస్-2024'ను గత నెలలో నిర్వహించిన బోర్డు సమావేశంలో ఆమోదించారు. ఈ బైలాస్‌పై రక్షణ శాఖ ప్రిన్సిపల్ డైరెక్టర్ (పీడీ) పలు అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో, తాజాగా బోర్డు ఉన్నతాధికారులు పీడీని కలిసి వివరణ ఇచ్చారు. అయినప్పటికీ పీడీ సంతృప్తి చెందక పోవడంతో ఆయన సూచించిన మార్పులు, చేర్పులు ప్రక్రియపై మళ్లీ కసరత్తు చేస్తున్నారు. ఈ నెలాఖరు నాటికి ఈ ప్రక్రియ పూర్తవుతుందని బోర్డు ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. నూతన బిల్డింగ్ బైలాస్ వివిధ దశలు దాటి రక్షణ శాఖ ఆమోదం పొందేందుకు కనీసం ఏడాది పట్టే అవకాశం ఉందని తెలుస్తోంది.

సమాజం నుంచి పాఠాలు నేర్చుకోవాలి

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



మాట్లాడుతున్న గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ

శామీర్‌పేట్: సమాజ నుంచి కార్పొరేట్ నిపుణులు పాఠాలు నేర్చుకోవాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ సూచించారు. శామీర్‌పేటలోని నల్సార్ లా యూనివర్సిటీలో రెండు రోజుల ఇనిస్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా (ఐసీఎస్ఐఐ), నల్సార్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్పొరేట్ గవర్నెన్స్‌సదస్సు శనివారం ముగిసింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర గవర్నర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. స్థానిక, గిరిజన సమాజాలు ప్రకృతి వనరులను వస్తువులుగా మాత్రమే చూడవని, ప్రకృతితో సామరస్యంగా జీవిస్తాయన్నారు. కార్పొరేట్ భవిష్యత్తును రూపొందించడంలో న్యాయ విద్యార్థుల పాత్ర కీలకమని, స్థిరత్వం లేకుండా అభివృద్ధి ఉండదన్న విషయాన్ని గుర్తించాలని గవర్నర్ సూచించారు. వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ శ్రీకృష్ణదేవరావు మాట్లాడుతూ.. సహజ వనరులను సంరక్షించడం, స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలను సాధించడానికి కృషి చేయడం పారిశ్రామిక ఉత్పాదక రంగం బాధ్యత అన్నారు. పర్యావరణ పరిరక్షణకు సమిష్టి బాధ్యత, స్టాంప్ డ్యూటీ నిర్ధారణ, రెవెన్యూ ఆడిట్ తదితర చట్టపరమైన పరిపాలన ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వాసంతి, ప్రొఫెసర్‌లు శ్రీనివాస సుబ్బారావు, నిర్వాహక కమిటీ సభ్యులు, విద్యార్థి వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలనలో సమస్యలన్నీ పరిష్కారం



రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్..

మంత్రి పొన్నం ప్రభాకర్

వెంగళరావునగర్ : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజాపాలనలో భాగంగా రాష్ట్రంలోని సమస్యలన్నీ ఒకొక్కటిగా పరిష్కరిస్తూ వస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలియజేశారు. యూసుఫ్‌గూడ డివిజన్ పరిధిలోని ఎల్ఎన్ నగర్, యూసుఫ్‌గూడ బస్తీ, శ్రీకృష్ణానగర్, హైలాంకాలనీ తదితర ప్రాంతాల్లో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరాన్ని అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దడానికి అన్నిరకాల సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. వ్యవసాయమంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్రం మీద సీఎం ఒత్తిడి తెచ్చి హైదరాబాద్‌కు రావాల్సిన ట్రిపుల్ ఆర్, ఇక్కడ నుంచి అమరావతికి వెళ్లాల్సిన హైస్పీడ్ రైలు ప్రాజెక్టులపై నిబద్ధతతో పని చేస్తున్నారని అన్నారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు రూ.90 కోట్లకు పైగా అభివృద్ధి కార్యక్రమాలను కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిందని చెప్పారు. తొలుత జీహెచ్ఎంసి కార్మికులు, దినసరి కూలీల వద్దకు వెళ్ళిన మంత్రి పొన్నం ప్రభాకర్ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు అనిల్‌కుమార్ యాదవ్, మాజీ ఎంపి అంజన్‌కుమార్ యాదవ్, శేరిలింగంపల్లి జడ్‌సి బోర్కడే హేమంత్, సర్కిల్-19 ఉప కమిషనర్ రజినీకాంత్‌రెడ్డి, శాట్ చైర్మన్ శివసేనారెడ్డి, ఎమ్మెల్సీ అజారుద్దీన్, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, సీనియర్ కాంగ్రెస్ నేతలు మురళీగౌడ్, నవీన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యానికి గత ప్రాభవం తెస్తాం



కేంద్రమంత్రిని సన్మానిస్తున్న ఆయుర్వేద సీనియర్ ప్రొఫెసర్లు...

వెంగళరావునగర్ : గత ప్రాభవాన్ని ఆయుర్వేద వైద్యానికి తిరిగి అందించేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలియజేశారు. యూసుఫ్‌గూడ డివిజన్ పరిధిలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ (నిమ్స్ మే) ఆడిటోరియంలో శనివారం విశ్వ ఆయుర్వేద పరిషత్ ఆధ్వర్యంలో జాతీయ ఆయుర్వేద సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిధిగా హాజరైన కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ఇటీవల కాలంలో ఆయుర్వేద వైద్యానికి ఆదరణ కరువైనప్పటికీ మోడీ అధికారంలోకి రాగానే ప్రాధాన్యత ఎంతో పెరిగిందన్నారు. వేలాది సంవత్సరాల కిందటనే ఆపరేషన్లు, కృత్రిమ అవయవాలు, డయాగ్నస్టిక్ పరీక్షలు, కాటరాక్ట్ ఆపరేషన్లు చేసిన ఘనత చరిత్ర మనకు ఉందన్నారు. మారుతున్న కాలంలో ఆధునిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ ప్రొఫెసర్లు మరింత లోతుగా ఆలోచించి పరిశోధనలు చేపట్టి నేటితరానికి సరిపోయే విధంగా మందులు తయారు చేయాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ప్రకాశ్‌రెడ్డి, డాక్టర్ మనోరంజన్ చావో(బనారస్ హిందు యూనివర్శిటీ మాజీ డీన్), డాక్టర్ హేమంత్ (జైపూర్), డాక్టర్ సారంపాణి (విశ్వ ఆయుర్వేద పరిషత్ అధ్యక్షులు) పాల్గొన్నారు.

జేఎన్‌వీలో ఖాళీ సీట్ల భర్తీ కోసం ప్రవేశ పరీక్షలు

- 9వ,11వ తరగతిలో ఖాళీలలకు ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 7
- ఆన్‌లైన్‌లోనే దరఖాస్తుకు చివరి తేదీ ఈనెల 23

రాయదుర్గం: జవహర్ నవోదయ విద్యాలయలో 9, 11 తరగతులలో ఖాళీగా ఉండే సీట్ల భర్తీ కోసం నిర్వహించే ప్రవేశ పరీక్షల తేదీలను ఖరారు చేశారని శేరిలింగంపల్లి గోపన్‌పల్లిలోని జేఎన్‌వీ రంగారెడ్డిజిల్లా ప్రిన్సిపల్ విజయభాస్కర్ శనివారం తెలిపారు. 2026-27 విద్యాసంవత్సరంలో జవహర్ నవోదయ విద్యాలయాల్లో 9, 11 తరగతుల్లో ఏర్పడిన ఖాళీ సీట్ల భర్తీ కోసం ఉన్నతాధికారుల ఆదేశం మేరకు ఈ ప్రవేశ పరీక్షను నిర్వహిస్తామన్నారు. 9వ తరగతి ఖాళీల కోసం లేటరల్ ఎంట్రీ కింద ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు సెప్టెంబర్ 23 వరకు అవకాశం కల్పించారన్నారు. ప్రవేశ పరీక్షను 2026 ఫిబ్రవరి 7వ తేదీన నిర్వహిస్తామన్నారు. అదేవిధంగా 11వ తరగతిలో ఖాళీల కోసం లేటరల్ ఎంట్రీ కింద ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు సెప్టెంబర్ 23 వరకు అవకాశం కల్పించారన్నారు. ప్రవేశ పరీక్షను 2026 ఫిబ్రవరి 7వ తేదీన నిర్వహిస్తామన్నారు.

సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవాలి

ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ ఎం రాజేశ్వరరావు



పట్టాలను అందజేస్తున్న ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ రాజేశ్వరరావు

రాయదుర్గం: మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా బీమా సంస్థలు తమ విధానాలు, సేవలను రూపొందించుకోవాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) డిప్యూటీ గవర్నర్ ఎం రాజేశ్వరరావు సూచించారు. నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలోని షరటాన్ హోటల్‌లో శనివారం ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్సూరెన్స్ అండ్ రిస్క్ మేనేజ్‌మెంట్(ఐఐఆర్ఎం) స్నాతకోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ భారత ఆర్థికాభివృద్ధిలో బీమా రంగం ప్రముఖ పాత్ర పోషిస్తున్నదని భవిష్యత్ సవాళ్ళ ను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు భారత బీమారంగం, సంస్థలు సన్నద్ధం కావాలని అభిప్రాయ పడ్డారు. ప్రపంచ వ్యాప్తంగా, దేశంలో వస్తున్న వాతావరణ, భౌగోళిక, సామాజిక, ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా బీమా సంస్థలు తమ విధానాలు, పద్ధతులు, సేవలను రూపొందించుకోవాలన్నారు. ఐఆర్‌డీఏఐ సభ్యులు రజయ్‌కుమార్ సిన్హా మాట్లాడుతూ బీమా, ఆర్థిక సేవల రంగంలో అభివృద్ధి చెందుతున్న అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. ఐఐఆర్ఎం డైరెక్టర్ అరవింద్‌కుమార్ పాల్గొన్నారు.

కేబుల్, ఇంటర్నెట్ వైర్ల తొలగింపును నిలిపి వేయాలి



దర్నాలో పాల్గొన్న ఎమ్మెల్సీ శ్రవణ్, మాజీ ఎంపీ డాక్టర్ బూర నరసయ్య గౌడ్ తదితరులు

కవాడిగూడ : రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సుమారు ఐదు లక్షల మంది కేబుల్ ఆపరేటర్ల న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని కేబుల్ ఆపరేటర్లు, ఇంటర్నెట్, టెలికాం ఆపరేటర్లు రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. విద్యుత్ శాఖ అధికారుల చర్యల వల్ల కేబుల్ ఆపరేటర్లు రోడ్డున పడుతున్నారని.. వెంటనే కేబుల్ వైర్ల కటింగ్‌ను నిలిపి వేయాలని డిమాండ్ చేశారు. శనివారం ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద ఫెడరేషన్ ఆఫ్ ఏరియల్ కేబుల్ ఆపరేటర్స్ (పాకో) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో మహాధర్నా చేపట్టారు. ముఖ్య అతిథులుగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, మాజీ ఎంపి తెలంగాణ రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షుడు డాక్టర్ బూర నరసయ్య గౌడ్, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల అశోక్ హాజరై మద్దతు ప్రకటించారు. ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ మాట్లాడుతూ... కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత నిస్తూ కేబుల్ ఆపరేటర్ల ఉపాధి దెబ్బతీస్తోందన్నారు. ప్రభుత్వం వెంటనే ప్రత్యేక పాలసీ ప్రకటించి కేబుల్ ఆపరేటర్ల జీవనోపాధిని పరిరక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాజీ ఎంపీ బూర నరసయ్య గౌడ్ మాట్లాడుతూ... కేబుల్ ఆపరేటర్లు ట్రాయ్ మార్గదర్శకాలకు లోబడి ప్రభుత్వానికి 18 శాతం జీఎస్టీ చెల్లిస్తూ పనిచేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. అలాంటి వారి పట్ల ప్రభుత్వం ఎక్కడో జరిగిన పొరపాటును చూపిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కేబుల్ ఆపరేటర్ల ఉపాధిని దెబ్బతీసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం సరికాదన్నారు. కేబుల్ ఆపరేటర్ల సంఘం అధ్యక్షుడు డి. సతీష్ బాబు, గౌరవ అధ్యక్షుడు వి. కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

డిసెంబర్‌లో అంతర్జాతీయ చలన చిత్రోత్సవం



వెబ్‌సైట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి కోమటిరెడ్డి

పంజగుట్ట: సినెటేరియా ఫౌండేషన్ వెబ్‌సైట్‌ను శనివారం రాష్ట్ర సినిమాటోగ్రఫీ మంత్రి కోమట్రెడ్డి వెంకట్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సినెటేరియా అంతర్జాతీయ చలన చిత్రోత్సవం డైరెక్టర్ వెంకటేశ్వర్లు బులెమోని మాట్లాడుతూ .. డిసెంబర్ 20 నుండి 28వ తేదీ వరకు హైదరాబాద్‌లో సినెటేరియా అంతర్జాతీయ చలన చిత్రోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. నగరంలోని 9 సినిమా మాల్స్‌లో ఈ వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ ఫిల్మ్ ఎగ్జిబిషన్, ఫిల్మ్ ఇన్వెస్ట్ సమ్మిట్ 2025, సినిమా టెక్నాలజీ, వ్యాపారంపై మాస్టర్ క్లాసెస్, కంటెంట్ బి2బి మీట్స్ నిర్వహించనున్నట్లు తెలిపారు. 2024, 2025 సంవత్సరాల్లో నిర్మించిన చిత్రాలను పోటీకి పంపించవచ్చునని నామినేషన్లకు అక్టోబర్ 15 ఆఖరు తేదీ అన్నారు. వివరాలకు 8712217555 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

జీవో 68ను రద్దు చేయాలి

సాక్షి, మేడ్చల్ జిల్లా: గత జీహెచ్ఎంసీ ఎన్నికలకు ముందు మేనిఫెస్టోలో జీవో 68ని రద్దు చేసి, హోర్డింగ్‌లపై గుత్తాధిపత్యాన్ని తొలగించి వాటిపై ఆధారపడిన కుటుంబాలకు చేయూతనిస్తామని పేర్కొన్న కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 21 నెలలు దాటినా, ఎలాంటి చర్యలు తీసుకొనకపోవటం బాధాకరమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాసినట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తక్షణమే 68 జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 2020లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం జీవో 68 ద్వారా హోర్డింగ్ ఏజెన్సీలను రద్దు చేసిందన్నారు. మూడు పెద్ద ఏజెన్సీలకు లాభం కట్టబెట్టేందుకు అప్పటి బీఆర్ఎస్ సర్కారు పూనుకుందని ఆరోపించారు. చిన్న హోర్డింగ్ ఏజెన్సీలు తెలంగాణలోని ఇతర మున్సిపల్ కార్పొరేషన్లల్లో తమ కార్యక్రమాలను కొనసాగిస్తుంటే, వాటిని కూడా అడ్డుకుని, హోర్డింగ్‌లు తొలగించిందన్నారు.ఈ నేపథ్యంలోనే జీవనోపాధికి నిరుద్యోగులు పెట్టుకున్న 209 ఏజెన్సీలకు సంబంధించి సుమారు 50వేల కుటుంబాలు ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డాయన్నారు.

ఘరియాబంద్ ఎన్‌కౌంటర్ బూటకం



మాట్లాడుతున్న పౌరహక్కుల సంఘాల నేతలు

సుల్తాన్‌బజార్: చత్తీస్‌ఘడ్ ఘరియాబంద్ ఎన్‌కౌంటర్ బూటకమని పౌరహక్కుల సంఘం పేర్కొంది. శనివారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శి ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, ఎన్.నారాయణరావులు మాట్లాడారు. మధ్యభారతంలో 21 నెలలుగా కేంద్ర ప్రభుత్వం కొనసాగిస్తున్న ఆపరేషన్ కగార్ హత్యకాండ ఇప్పటికే 72 ఎన్‌కౌంటర్‌లు, 670 మంది వరకు హత్యకు గురయ్యారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ హత్యకాండలో మావోయిస్టులకన్నా ఆదివాసియులే ఎక్కువగా ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సెప్టెంబర్ 11న చత్తీఘడ్ రాష్ట్రం ఘరియాబంద్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 10 మంది మరణించినట్లుగా చెబుతున్నారని ఇందులో కేంద్రకమిటీ సభ్యులు మోడెమ్ బాలకృష్ణతో పాటు ఒరిస్సా రాష్ట్ర కమిటీ సభ్యుడు పాండు ఉన్నట్లుగా పోలీసులు అధికారులు ప్రకటించారన్నారు. ఇప్పటికే మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావుతో పాటు చలపతి, వివేక్, శర్మ, గౌతమ్, మధు తదితరులు హతమయ్యారన్నారు. మావోయిస్టు పార్టీకి చెందిన 366 మంది మరణించినట్లుగా వారు ఇచ్చిన ప్రకటనలో తెలుస్తుందన్నారు. ఇది ఎన్‌కౌంటర్ పేరుతో మోదీ, అమిత్‌షాల నిరంకుశ హత్యాకాండ వైఖరిని ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు, మేధావులు ప్రశ్నించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఘరియాబంద్‌లో జనవరి 21న కులారిఘట్ ఎన్‌కౌంటర్‌లో 16 మంది ఈ హత్య చేశారని అందులో చలపతి అనే కేంద్ర కమిటీ సభ్యుడు ఉన్నాడన్నారు. ఇది బూటకపు ఎన్‌కౌంటర్ అని దీనిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ హత్యకాండను కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆపివేయాలని డిమాండ్ చేశారు. అన్ని ఎన్‌కౌంటర్లపై సుప్రీంకోర్టు జడ్జిచే విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

కల్లుగీత సొసైటీలకు 25 శాతం కేటాయించాలి



అభివాదం చేస్తున్న నాయకులు

పంజగుట్ట: ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా బీసీలకు ఇచ్చిన హామీలు నీటి బుడగల్లా మారుతున్నాయని బీసీ మేధావుల ఫోరం చైర్మన్ టి.చిరంజీవులు అన్నారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే బీసీలకు ప్రతీ సంవత్సరం బడ్జెట్‌లో 20 వేల కోట్లు కేటాయించి ఖర్చుచేస్తామని హామీ ఇచ్చిందని కాని మొదటి సంవత్సరం రూ.9200 కోట్లు కేటాయించి ఖర్చు చేసింది మాత్రం కేవలం రూ. 2200 కోట్లు మాత్రమే అన్నారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో కమిటీ చైర్మన్ బాలగౌని బాల్‌రాజ్ గౌడ్, కన్వీనర్ అయిలి వెంకన్న గౌడ్‌ల అధ్యక్షతన నిర్వహించిన కార్యాక్రమంలో చిరంజీవులు మాట్లాడుతూ ఇప్పటికే 8 రాష్ట్రాల్లో బీసీ రిజర్వేషన్లు పెంచితే హైకోర్టు 50 శాతం స్లాబ్ దాటిందని కొట్టేసిందని, ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ పెంచినా అదే పరిస్థితి వచ్చే అవకాశం ఉందన్నారు. అందుకే అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకువెళ్లి కేంద్రంపై ఒత్తిడి తెచ్చి బీసీ రిజర్వేషన్ల బిల్లును 9వ షెడ్యూల్డ్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. 70 సంవత్సరాలుగా రాష్ట్రంలో వెలమ, రెడ్డి, కమ్మ (వీఆర్‌కె) కులాలే పాలించాయని ఈ వీఆర్‌కె కులాలకు ఇక వీఆర్ఎస్ ఇచ్చి బీసీలు రాజ్యమేలాలని ఆయన పిలుపునిచ్చారు. బీజేపీ రాష్ట్ర ఓ.బీసీ సెల్ అధ్యక్షుడు గందమల్ల ఆనంద్ గౌడ్ మాట్లాడుతూ . కాంగ్రెస్ అధికారంలోకి రాగానే గౌడ్‌ల మెడపై కత్తి పెడుతుందని ఆగ్రహంవ్యక్తం చేశారు. బాలగౌని బాల్‌రాజ్ గౌడ్, అయిలి వెంకన్న గౌడ్ పాల్గొన్నారు.

ప్రభుత్వం రాష్ట్ర ప్రయోజనాల కోసం పనిచేయాలి



మాట్లాడుతున్న బూర నర్సయ్య గౌడ్

పంజగుట్ట: రాష్ట్ర ప్రభుత్వం రాజకీయ లబ్ధికోసం కాకుండా రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని పనిచేయాలని పలువురు సాగునీటి రంగ నిపుణులు, రాజకీయ నాయకులు అన్నారు. తెలంగాణకు కాళేశ్వరం మాత్రమే జీవధార అని, మేడిగడ్డ ప్రాజెక్టులో కొన్ని ఇబ్బందులు వచ్చినా ఇప్పుడు కూడా యథాతథంగా నీటిని వినియోగించుకోవచ్చునని స్పష్టం చేశారు. సీనియర్ జర్నలిస్టు ఎ.రమణ కుమార్ అధ్యక్షతన శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో 'గోదావరి జలాలు - కాళేశ్వరం ప్రాజెక్టు' అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ మాట్లాడుతూ .. ఎల్లంపల్లి నుండి నీటిని వాడుకునే అవకాశం ఉన్నా మేడిగడ్డ నిర్మించారని అన్నారు. నీటికోసం, భూమికోసం ఎన్ని లక్షల కోట్లు ఖర్చుచేసినా తప్పులేదని కాని ప్రజా ధనం వృధా చేయరాదన్నారు. మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్, రిటైర్డ్ ఇంజనీర్లు వెంకటేశం, దామోదర్ రెడ్డి, నీటిపారుదల రంగ నిపుణుడు వి.ప్రకాష్, సీపీఎం నేత సారంపల్లి మల్లారెడ్డి, సాగర్, సీపీఐ నేత పశ్య పద్మ, సంజీవ్ నాయక్‌లు మాట్లాడుతూ .. మేడిగడ్డలో కుంగిపోయిన పిల్లర్లను బూచిగా చూపించి గోదావరి జలాలను బనకచర్లకు తరలించే కుట్రలు రేవంత్ రెడ్డి, చంద్రబాబు నాయకుడు కలిసి చేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ ప్రాంతీయ అస్తిత్వం లేకుండా చేస్తే ఇక్కడి వణరులను దోచుకోవచ్చునని చంద్రబాబు యత్నిస్తుంటే దానికి రేవంత్ రెడ్డి సహకరిస్తున్నాడని అన్నారు. తెలంగాణకు కాళేశ్వరం మాత్రమే లైఫ్‌లైన్ అని మోడిగడ్డ నుండి మిడ్ మానేరు వరకు కాలువల ద్వారాగానీ, టన్నెల్ ద్వారా కానీ నీటిని తరలించే అవకాశం లేనందునే అన్నారం, సుందిళ్ళ రిజర్వాయర్లను నిర్మించాల్సి వచ్చిందన్నారు. పీసీ ఘోష్ కమీషన్ తాము ఇచ్చిన నివేదికను తొక్కి పెట్టిందని ఆరోపించారు. సమావేశంలో నర్రా విజయ్, శివారెడ్డి, రాము, హుస్సేన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



యువ ఆర్టిస్టుల సృజన

సాక్షి, సిటీబ్యూరో: తమదైన స్టైల్‌తో పర్సనల్ వార్డ్‌రోబ్‌ను ఎలా క్రియేట్ చేసుకోవచ్చో జూబ్లీహిల్స్‌లోని 'ది కొలాజియమ్'లో జరిగిన వర్క్‌షాప్‌లో ప్రముఖ స్టైలిస్టులు తెలియజేశారు. దేశీయ హస్తకళాకారులు, డిజైనర్ల చేతుల్లో రూపుదిద్దుకున్న వింటేజ్ ఆభరణాలు, ఫ్యాషనబుల్ డ్రెస్సులు, యాక్సరీస్‌ను ఇక్కడ అందుబాటులో ఉంచారు. వీటితో పాటు హోమ్ డెకార్ వస్తువుల రూపకల్పన, వాటి ప్రత్యేకతలనూ వివరించారు. 150 మందికిపైగా దేశీయ, అంతర్జాతీయ యువ ఆర్టిస్టుల సృజనను కళ్లకు కట్టారు.

వ్యక్తిత్వమే స్టైల్

ముంబై నుంచి వచ్చిన స్టైలిస్ట్, ఫ్యాషన్ క్యురేటర్ దివిషా వర్క్‌షాప్‌లో పాల్గొని ఆహుతులకు స్టైలింగ్‌లో గైడ్‌లైన్స్ ఇచ్చారు. సొంత వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించేలా స్టైల్‌ని క్రియేట్ చేసుకోవడం మన చేతుల్లోనే ఉందని చెప్పారు. ఫ్యాషన్, వార్డ్‌రోబ్ కలబోతగా ఒక అందమైన కథను కళ్లకు కట్టేలా ప్రదర్శించడం ఎంతో ఉపయోగంగా ఉందని తెలిపారు దివిషా. లగ్జరీ స్ట్రీట్‌వేర్ యాక్సరీస్‌ను పరిచయం చేసిన డిజైనర్ రిషి 'టైమ్‌లెస్ ఇంటీరియర్స్‌తో కలిపి అందించడం ఒక పవర్‌ఫుల్ కాంబినేషన్ అని తెలిపారు. డిజైనర్ శీతల్ జవేరీ మాట్లాడుతూ 'మా ఆభరణాలు కేవలం మన దేశీయ వారసత్వం. సంప్రదాయ మోటిఫ్స్, మోడర్న్ ఫినిషింగ్స్‌తో కలిపి డిజైన్ చేసినవి. స్టైలింగ్ వర్క్‌షాప్‌తో పాటు మా సెల్ఫ్ ఎక్స్‌ప్రెషన్‌ని ప్రదర్శించే అవకాశం లభించడం ఆనందంగా ఉంది' అన్నారు.



కీర్తనలు, శ్లోకాలు..

నేర్చుకుంటారా..?

బంజారాహిల్స్: దేవీ నవరాత్రులు వచ్చాయంటే అమ్మవారికి ప్రీతిపాత్రమైన నైవేద్యాలతో పాటు అమ్మవారిని స్తుతిస్తూ పాడే శ్రావ్యమైన కీర్తనలు కూడా అంతే ప్రధానం. ఇందులో భాగంగానే ప్రముఖ కర్ణాటక గాత్ర సంగీత విద్వాంసురాలు రంజనీశికుమార్ బంజారాహిల్స్‌లోని సప్తపర్ణి సాంస్కృతిక కళా కేంద్రంలో డివైన్ మెలోడిస్ పేరుతో కీర్తనలు, శ్లోకాలు నేర్పించే వర్క్‌షాప్‌ను నిర్వహించగా ఔత్సాహిక మహిళలు సంగీతంలో ప్రావీణ్యం ఉన్నవారు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ నెల 13, 14 తేదీలతో పాటు 20, 21 తేదీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 వరకు సప్తపర్ణిలో ఆమె ఈ వర్క్‌షాప్ నిర్వహించనున్నారు.

సంస్కృతి పరంగా ఎన్నో రకాల గొప్పతనాన్ని కలిగి ఉన్న మన నగరం, చక్కని చిక్కని చాయ్ సంస్కృతికి కూడా ప్రసిద్ధి చెందింది. నగర రోజువారీ జీవితంలో అంతర్భాగంగా మారింది. కాసిన్ని కబుర్లు కలబోసుకునే స్నేహితుల కోసం కావొచ్చు.. కాస్టలీ లావాదేవీలు నిర్వహించే కార్పొరేట్స్‌కి కావొచ్చు.. టీ బ్రేక్స్ ఉండాల్సిందే.. ఇంత బలంగా సిటీ లైఫ్‌లోకి చొచ్చుకుపోయిన చాయ్ పునాదులు కూడా అంతే బలమైనవి అంటోంది చరిత్ర.

- సాక్షి, సిటీబ్యూరో



హాయ్ చాయ్..

టీ కల్చర్‌కి మారుపేరుగా నిలిచిన సిటీ

- మార్పు చేర్పులకు అనుగుణంగా నగరంతో మమేకం
- చాయ్‌తో పాటు కాంబినేషన్ స్నాక్స్ కూడా ఫేమస్
- నాడు పాలకులకు ఫ్యాషన్.. నేడు సిటిజనుల ఎమోషన్

మొఘలుల కాలంలో, ఇది పాలకవర్గానికి చెందిన ఒక ఫ్యాషన్ పానీయంగా చరిత్రకారులు పేర్కొంటారు.

ఈ ప్రాంతాన్ని శతాబ్దాల తరబడి పాలించిన నిజాంలు టీ తాగడాన్ని తాము ఆస్వాదించడంతో పాటు ప్రజలనూ ప్రోత్సహించారు. అదే చేత్తో వారు దక్షిణాదికి తీసుకువచ్చిన పర్షియన్ ప్రభావాలు టీ చుట్టూ ఒక అధునాతన మర్యాద వ్యవస్థను రూపొందించడంలో సహాయపడ్డాయి. పర్షియన్ టీ హౌస్‌ల స్ఫూర్తితో నగరంలో తొలిదశ ఇరానీ కేఫ్‌లను జొరాస్ట్రియన్ వలసదారులు ప్రారంభించారని చెబుతారు. ఇవి తొలినాళ్లలో కేవలం పురుషుల రాజకీయ చర్చలకే పరిమితమై ఉండేవట.





→ ఏదేమైనా నేడు అది ఒక అందమైన శక్తివంతమైన చాయ్ కల్చర్‌గా నగరంలో స్థిరపడింది. ప్రస్తుతం నగరంలో చాయ్ ఒక పానీయం మాత్రమే కాదు.. ఉల్లాసమైన సంభాషణలతో స్నేహితులు, కుటుంబ సభ్యుల మధ్య బంధాన్ని బలోపేతం చేసేందుకు ఉద్దేశించిన సామాజిక అనుభవం కూడా. టీ సంస్కృతి నగరంలో వర్ధిల్లడానికి బాటలు వేసిన వాటిలో ఇరానీ కేఫ్స్‌దే ప్రధాన పాత్ర కాగా మిగిలినవి కూడా తమవంతు పాత్ర పోషించాయి.

→ రుచికరమైన వంటకాలతో పాటు చాలా చరిత్ర కలిగిన అత్యంత ప్రజాదరణ పొందాయి ఇరానీ కేఫ్‌లు 'ఇరానీ చాయ్' సహా వివిధ రకాల టీలను ఇవి అందిస్తాయి.

→ స్నేహపూర్వక చాయ్ వాలాలు నిర్వహించే స్ట్రీట్ చాయ్ స్టాల్స్ కూడా సిటీలో టీ కల్చర్‌కు తమవంతు బలాన్ని అందించాయి. తక్కువ, సరసమైన ధరలకు పొగలు వచ్చే ఛాయ్‌లను ఇవి అందిస్తాయి.

→ ఇటీవల వినూత్న మిశ్రమాలు ఫ్యూజన్ పానీయాలను అందించే ఆధునిక కేఫ్ సంస్కృతిని సైతం నగరం స్వీకరిస్తోంది. చాయ్ పాయింట్, చాయ్ షాయ్ మసాలా, చాయ్ లాట్టే, ఐస్డ్ చాయ్ వంటివి విభిన్న రుచులతో ప్రయోగాలు చేసే యువతను ఆహ్వానిస్తున్నాయి.

→ సిటీలో చాయ్ వ్యాపారం ఒక భారీ పరిశ్రమగా మారింది. అనేక మంది వ్యవస్థాపకులు తమ సొంత టీ బ్రాండ్‌లు కేఫ్‌లను ప్రారంభించారు. చాయ్ సబ్‌స్క్రిప్షన్ సేవలను ప్రారంభించి, తాజా మిశ్రమ టీలను వినియోగదారుల ఇంటికే అందించే వారు కూడా ఉన్నారు. సాంకేతిక పరిజ్ఞానం ఉన్న తరాన్ని చేరుకోవడానికి ఆన్‌లైన్‌లో చాయ్‌ని ఆర్డర్ చేసే యాప్‌లు ప్లాట్‌ఫారమ్‌లు కూడా ఉద్భవించాయి.

→ చాయ్ రుచి కోసం ఎక్కువ మంది వినియోగిస్తుండగా, ఆరోగ్యం కోసం కూడా కొందరు ఎంచుకుంటున్నారు. దీని తయారీలో అల్లం ఏలకులు మిరియాలు తదితర సుగంధ ద్రవ్యాలు సైతం మేళవిస్తూ ఆరోగ్యార్థులను ఆకట్టుకుంటున్నారు.



చాయ్‌తో పాటుగా..

నగరంలో చాయ్ మాత్రమే కాదు దానికి తోడుగా తీసుకునే సైడ్ డిష్‌లూ అంతే ఫేమస్. తేలికపాటి తీపి, ఉప్పదనాల కలయికగా ఉండే ఉస్మానియా బిస్కెట్లు ఇరానీ చాయ్‌తో శతాబ్దాలుగా జట్టు కట్టాయి. అలాగే టీతో జత కట్టడంలో ఖారా బిస్కెట్స్ కూడా వీటితో పోటీపడుతున్నాయి. మరోవైపు మసాలా దినుసులతో నిండిన త్రిభుజాకారపు పట్టీ సమోసా కూడా క్లాసిక్ కాంబినేషన్స్‌లో ఒకటిగా కొనసాగుతోంది. ఉల్లి సమోసాలతో పాటు ఇప్పుడు పోహా సమోసా దాకా భిన్న రకాలు వచ్చేశాయి. మలైబన్, బన్‌మస్కా వంటి బన్స్ క్లాసిక్ ఆధునిక కేఫ్‌లు అందించే ఇరానీ చాయ్‌కి ప్రసిద్ధ అనుబంధంగా పేరొందాయి.

కేఫ్ నీలోఫర్: నగరంలోని అత్యంత ప్రసిద్ధ ఐకానిక్ టీ హౌస్‌లలో ఒకటి, ఇది ఒక సాధారణ స్టాల్ నుంచి బహుళ అవుట్‌లెట్ బ్రాండ్‌గా విస్తరించింది. మార్చి 2025లో, ఇది రాయదుర్గంలో 40,000 చదరపు అడుగుల దేశంలోనే అతిపెద్ద కేఫ్‌ను ఏర్పాటు చేసింది.

→ చార్మినార్ సమీపంలో ఉన్న నిమ్రా కేఫ్ బేకరీ, తాజా బిస్కెట్లు స్ట్రాంగ్ చాయ్‌లతో స్థానికులతో పాటు పర్యాటకులనూ స్వాగతిస్తుంది.

చాయ్ కల్చర్‌కి కొన్ని చిరునామాలు..

→ జూబ్లీహిల్స్‌లోని చాయ్ పానీ కేఫ్ భిన్న రకాల చాయ్ వెరైటీలకు పేరొందింది. ఇది చాయ్‌తో పాటు వైవిధ్యభరిత రెట్రో వాతావరణాన్ని అందించే ప్లేస్. దీని అల్లం టీ బాగా ఫేమస్..

→ బ్లూ సీ: సికింద్రాబాద్‌లో పేరొందిన ఇరానీ చాయ్ సెంటర్ ఇది. టీతో పాటు ఎగ్ పఫ్‌లు, దిల్‌ఖుష్ (తీపి బన్)లకు ప్రసిద్ధి.

→ రోస్ట్ సిసికె: బంజారాహిల్స్‌లోని ఈ కేఫ్ వివిధ రకాల బేకరీ ఉత్పత్తులను అందిస్తుంది. ఇక్కడి మసాలా చాయ్‌కి ఫ్యాన్స్ ఉన్నారు.

→ కాఫీ సంగమ్: 90ల నాటి క్లాసిక్ తెలుగు స్నాక్స్‌ను తిరిగి గుర్తు చేసే కేఫ్, కడక్ చాయ్‌తో పాటు పామ్ షుగర్ బన్ శాండ్‌విచ్‌లు వంటి ప్రత్యేకమైన కాంబినేషన్‌కు పేరొందింది.

→ అబిడ్స్‌లో 1935లో ఏర్పాటైన గ్రాండ్ హోటల్ సిసలైన హైదరాబాదీ చాయ్‌ను అందిస్తుంది.

→ సోమాజిగూడలోని రెడ్ రోజ్ రెస్టారెంట్ విద్యార్థులు యువతను ఆకట్టుకుంటుంది. ఇన్‌స్టాగ్రామ్‌లో సైతం ఈ కేఫ్ యాక్టివ్‌గా ఉండటం విశేషం.

→ అఫ్జల్‌గంజ్‌లోని గ్రాండ్ ఓవెన్ బేకరీ/ కేఫ్ గ్రాండ్ ఓవెన్ అనేది ఇరానీ కేఫ్ ఆధునిక కేఫ్ సంస్కృతుల మేళవింపుగా టేస్టీ చాయ్‌లకు పేరొందింది.







బ్యాక్ టు హైదరాబాద్

- విదేశాల్లో మంచి వేతనాలున్నా సొంత గడ్డపై వైద్యానికే మొగ్గు
- నాలెడ్జ్ షేరింగ్ సంతృప్తినిస్తుందంటున్న సీనియర్లు
- స్థానికంగా మెరుగైన సేవల వైపు అడుగులు
- యువ వైద్యులకు ఆదర్శంగా నిలుస్తున్న వైనం

చదువు, ఉద్యోగం కోసం అమెరికా, ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా, కెనడా తదితర దేశాలకు యువత ఎగిరిపోవాలనుకుంటారు. ఇంటర్ నుంచే ప్లాన్ చేసుకుంటున్నారు. ఇదే ట్రెండ్ అనుకుంటున్నారు. ముందుతరం ప్రవాసీ వైద్యులు మాత్రం భిన్నంగా స్పందిస్తున్నారు. దశాబ్దాల కాలం పనిచేసి పొరుగు గడ్డపై ఎప్పటికీ సెకెండ్రీ గ్రేడ్ ప్రజలుగానే బతకాల్సి వస్తోందంటున్నారు. సకల సౌకర్యాలు, రూ.లక్షల్లో ప్యాకేజీలను విడిచిపెట్టి బ్యాక్ టు హైదరాబాద్ స్లోగన్ ఎత్తుకుంటున్నారు. స్థానికంగా హెల్త్ కేర్‌లో పుష్కలంగా అవకాశాలు ఉండటం సానుకూల అంశంగా కనిపిస్తోంది. దీంతో వంద మందికిపైగా వైద్యులు ఇతర దేశాల నుంచి హైదరాబాద్‌కు మకాం మార్చేశారు.


- సాక్షి, సిటీబ్యూరో



నాలెడ్జ్ షేరింగ్ చేస్తున్నాను

హైదరాబాద్‌లో హెల్త్ కేర్ వృద్ధి చెందుతోంది. స్వస్థలంలో సర్వీస్ చేయాలని నిర్ణయించుకున్నాను. పదేళ్లు పనిచేసి యూకే నుంచి తిరిగి వచ్చేశాను. చదువుకున్న చోట మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నాను. నా జూనియర్స్‌కు నాలెడ్జ్ షేర్ చేస్తున్నాను. యువతలో స్కిల్ డెవలప్‌మెంట్‌కు ప్రయత్నిస్తున్నాను. ఫలితంగా మన సమాజానికి మంచి వైద్యం అందుతుందని భావిస్తున్నాను. స్వస్థలానికి తిరిగి వచ్చాక స్థాన బలం కాన్ఫిడెన్స్ ఇస్తుంది. గతంలో మన దగ్గర నుంచి ట్రీట్‌మెంట్ కోసం ఇతర దేశాలకు వెళ్లేవారు. ఇప్పుడు పరిస్థితి మారింది. ఇక్కడ అధునాతన చికిత్స పద్ధతులు అందుబాటులోకి వచ్చాయి. వివిధ దేశాల నుంచి ఇక్కడికి వస్తున్నారు. ఈ అభివృద్ధి సంతృప్తినిస్తోంది.

– సునీల్ దాచేపల్లి, ఆర్థోపెడిక్ సర్జన్, యశోద ఆస్పత్రి సోమాజిగూడ



కుటుంబ సభ్యులతో ఉంటేనే సంతోషం..

అమెరికాలో ఉంటే మంచి అవకాశాలు ఇస్తామన్నారు. అవేవీ అవసరం లేదనుకుని మన ఇల్లు.. మన సొంతం అనే భావనతోనే స్వదేశం వచ్చేశాను. నా సర్వీసు కాలం మొత్తం నిమ్స్‌లోని పేదలకే అంకితం చేశాను. ఇక్కడ వైద్య సేవలు చేయడం ఆత్మసంతృప్తినిస్తున్నాయి. విదేశాల్లో డబ్బు సంపాదించొచ్చు. ఈ తృప్తిని పొందలేము. తల్లిదండ్రులు, అత్త, కుటుంబ సభ్యులతో కలిసి జీవిస్తున్నాను.

– డా.సూర్యప్రభ, న్యూరాలజిస్టు, నిమ్స్ ఆస్పత్రి



మా అమ్మలా మరొకరు బాధపడకూడదని..

నేను రొమ్ము కేన్సర్‌లో సూపర్ స్పెషాలిటీ శిక్షణ తీసుకున్నాను. నా తల్లిదండ్రులు వైద్యులే. మేం యూకేలో ఉండగా అక్కడికి వచ్చారు. అప్పుడు మా అమ్మకు బ్రెస్ట్ కేన్సర్ అని నిర్ధారణ అయ్యింది. 11 ఏళ్ల సర్వీసు అనంతరం దేశంలో రొమ్ము కేన్సర్‌పై విప్లవాత్మకమైన మార్పులు తీసుకురావాలని ఇండియా వచ్చేశాను. రొమ్ము కేన్సర్ గురించి చెప్పుకోవడానికి మొహమాటపడుతున్నారు. స్క్రీనింగ్ లేక, ప్రజల్లో అవగాహన లేకపోవడంతో సుమారు 60 శాతం ముదిరిపోయిన తరువాత కేన్సర్‌ను గుర్తిస్తున్నారు. దీన్ని బ్రేక్ చేయడం కోసం అమ్మ పేరుతో ఉషాలక్ష్మి బ్రెస్ట్ కేన్సర్ ఫౌండేషన్ ఏర్పాటు చేశాను. తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వాల సాయంతో ఆశ, ఏఎన్ఎంలకు బ్రెస్ట్ కేన్సర్ గుర్తించేందుకు శిక్షణ(క్లీనికల్ బ్రెస్ట్ ఎగ్జామినేషన్) ఇచ్చాం. నేషనల్ హెల్త్ మిషన్‌లో స్క్రీనింగ్ చేస్తున్నారు. 2015లో భారత ప్రభుత్వం పద్మశ్రీ అవార్డుతో సత్కరించింది.

– డా.పి.రఘురామ్, ఉషాలక్ష్మి బ్రెస్ట్ కేన్సర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు



సొంత గడ్డపై మమకారంతో వచ్చేశా..

అబుదబీ(యూఏఈ)లో 14 ఏళ్ల పనిచేశాను. పెట్ స్కానింగ్ అడ్వాన్స్ టెక్నాలజీలో ఆస్ట్రేలియాలో శిక్షణ తీసుకున్నాను. యూఏఈలో అన్ని రకాలుగా బాగుంటుంది. అయినా కొన్నాళ్లు పనిచేశాక సొంత గడ్డపై మమకారంతోనే ఇండియా వచ్చేశాను. ప్రొస్టేట్ కేన్సర్, న్యూరో ఎండోక్రైన్ ట్యూమర్స్ కేన్సర్, థైరాయిడ్ కేన్సర్లకు చికిత్స ఇస్తున్నాం. అత్యాధునిక చికిత్సా విధానాలను విద్యార్థులకు అందజేయాలి. ఫలితంగా సామాన్య ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే అవకాశం ఉంటుంది. అందులోనే సంతృప్తి ఉంది. శాలరీ అనేది ప్రామాణికం కాదు.

– డా.ఎస్.సుబ్రహ్మణ్యం, కన్సల్టెంట్ న్యూక్లియర్ మెడిసిన్, కామినేని ఆస్పత్రి



మన కల్చర్ నచ్చుతుంది

లండన్‌లో పదేళ్లకుపైగా పనిచేశాను. నాతో పనిచేసిన చాలా మంది అమెరికా వెళ్లారు. నేను స్వస్థలానికి తిరిగి వచ్చాను. పేషెంట్ గెస్ట్ డాక్టర్ రిలేషన్ విదేశాల్లో ఉండదు. మన దేశంలో వైద్యుడిని దేవుడిలా చూస్తారు. మంచి చేస్తే జీవితాంతం గుర్తుపెట్టుకుంటారు. ఇక్కడ సర్వీస్ అందించడం ఎంతో సంతోషాన్నిస్తుంది. అదృష్టవశాత్తు ఆసుపత్రి పెట్టుకున్నాను. ఎంతో మందికి వైద్యం అందిస్తున్నాను. ఉద్యోగ అవకాశాలు కల్పించాను. ఎన్నో కుటుంబాలకు అండగా నిలుస్తున్నాం. సాయం చేశాననే సంతృప్తి ఉంటుంది. నేను ఇండియా వచ్చినపుడు కొందరు అక్కడే ఉండిపోయారు. ఇతర దేశాల్లో వివక్ష ఉంటుంది. నా దేశంలో ఉన్నందుకు, వైద్యం అందిస్తున్నందుకు సంతోషంగా ఉన్నాను.

– డా.ఏవీ గురవారెడ్డి, ఎండీ, కిమ్స్ షన్‌షైన్, ఆస్పత్రి

ఫ్యాషన్ అంటే

భావోద్వేగం



బంజారాహిల్స్: కృత్రిమ మేథ శక్తివంతమైనదే కానీ, మానవ మేథస్సు అమూల్యమని, డిజైనర్లను ఇది భర్తీ చేయదని యంగ్ ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్(వైఎఫ్ఎల్ఓ) ఫ్యాషన్ ప్రతినిధులు అన్నారు. బంజారాహిల్స్‌లోని పార్క్ హయత్ హోటల్‌లో 'స్టైల్ స్పీక్స్ స్ట్రాటజీ' పేరిట శనివారం సాయంత్రం జరిగిన వైఎఫ్ఎల్ఓ సమావేశంలో ఫ్యాషన్ ప్రతినిధులు కరణ్ తోరానీ, తాన్యా ఘవ్రి, నమ్రత జోషిపురా, అంజలి గైక్వాడ్ తమ అనుభవాలను పంచుకున్నారు. ఫ్యాషన్ అంటే కేవలం వస్త్రం మాత్రమే కాదని, అది భావోద్వేగం, వ్యక్తిత్వం, సంస్కృతి అన్నారు. ఫొటోగ్రఫీ పెయింటింగ్‌ను చంపలేదని, ఏఐ కూడా ఫ్యాషన్ డిజైన్‌ను చంపదన్నారు. ఇది డిజైన్‌ను మరింత అభివృద్ధి చేస్తుందన్నారు. రొటీన్ పనులను ఏఐ చేపడుతుంది కానీ క్రియేటివ్ డైరెక్షన్, కథనం, సస్టెయినబిలిటీ, ఎమోషనల్ బ్రాండింగ్ వంటి విషయాల్లో డిజైనర్లు మరింత లోతుగా పనిచేస్తారన్నారు. ఏ టెక్నాలజీ వచ్చినా ఇండియన్లు తమ వేర్లు మరచిపోరన్నారు. వివాహాల సమయంలో ఇప్పటికీ బ్యాండ్‌వాలా వాయిస్తూనే ఉంటాడన్నారు. ఏఐకి బుద్ధి ఉంటుంది కానీ, మానవులకు ఊహాశక్తి ఉంటుందన్నారు. యంత్రాలు లెక్కలు వేస్తాయి గానీ, మానవ మేథస్సే ఊహించగలదన్నారు. కార్యక్రమంలో వైఎఫ్ఎల్ఓ చైర్ పర్సన్ పల్లవిజైన్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

ఇచ్చిన వాగ్దానం మేరకు రైతు రుణమాఫీ చేయాలి

- ఎంపీ ఈటల డిమాండ్



ఘట్‌కేసర్: ఇచ్చిన వాగ్దానం మేరకు ప్రభుత్వం తక్షణమే రుణమాఫీ చేయాలని, రైతు రుణమాఫీపై అవసరమైతే సీఎంను కలుస్తానని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఘట్‌కేసర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతు రుణమాఫీ సాధన సమితి ఆధ్వర్యంలో చేపట్టిన నిరాహార దీక్షాస్థలిని శనివారం ఈటల సందర్శించి సంఘీభావం తెలిపారు. అనంతరం మాట్లాడుతూ, నిరహార దీక్షకు స్పందించకుండా పోలీసులతో అరెస్ట్ చేయించి దీక్షను భగ్నం చేయాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఘట్‌కేసర్ రైతు సేవా సహకార సంఘంలోని 1,100 మంది రైతుల్లో ఏ ఒక్క రైతుకూ రుణమాఫీ కాలేదని, పది రోజుల్లో చేస్తామని చెప్పి నెలలు గడుస్తున్నా పట్టించుకునే దిక్కులేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రుణమాఫీ చేశారని, ఘట్‌కేసర్ రైతులు ఏం పాపం చేశారని ఆయన ప్రశ్నించారు. ప్రజల సమస్యలపై పోరాటం చేయడానికి తాను సిద్ధంగా ఉన్నానని, అవసరమైతే రైతుల పక్షాన స్వయంగా సీఎంను కలిసి సమస్య పరిష్కరించాలని కోరుతానన్నారు.

గద్వాలకు ఏ మొహం పెట్టుకొచ్చారు?

- కేటీఆర్‌పై మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ ఆగ్రహం



సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి కేటీఆర్.. గద్వాలకు ఏ మొహం పెట్టుకుని వచ్చారని ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ ఒక ప్రకటనలో ప్రశ్నించారు. పదేళ్లపాటు చేనేత శాఖ మంత్రిగా ఉన్న కేటీఆర్.. గద్వాలలో టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటు చేస్తామని చెప్పి చేనేత కార్మికులను మోసం చేశారన్నారు. తుమ్మిల ప్రాజెక్టును పూర్తి చేస్తానని చెప్పి.. సగం సగం పనులు చేసిపోయారని ఆరోపించారు. పదేళ్లలో 4 మున్సిపాలిటీలకు ఒక్క రూపాయి ఇవ్వలేదని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో వంద పడకల ఆస్పత్రిని అన్ని సౌకర్యాలతో ప్రారంభించుకున్నామని పేర్కొన్నారు. తమ ప్రభుత్వ హయాంలో మల్లమ్మ గుంటకు సర్వే పనులు ప్రారంభమయ్యాయని, రూ.120 కోట్లతో జూరాలపై కొత్త వంతెన నిర్మిస్తున్నామని వివరించారు. తాను కాంగ్రెస్ విప్‌గా ఉన్నప్పుడు.. తమ పార్టీ ఎమ్మెల్యేలను ఐదుగురిని, టీడీపీ ఎమ్మెల్యేలను 15 మందిని బీఆర్ఎస్‌లో చేర్చుకున్నారని గుర్తు చేశారు. పదేళ్లలో 39 మంది ఎమ్మెల్యేలను బీఆర్ఎస్‌లో చేర్చుకున్నారని, అప్పుడు కేసీఆర్, కేటీఆర్ వారితో ఎందుకు రాజీనామా చేయించలేదని ప్రశ్నించారు.

కుటుంబ సమస్యలతో సతమతమై జిల్లాలు తిరుగుతున్న కేటీఆర్

- దేవరకద్ర ఎమ్మెల్యే జీఎంఆర్



సాక్షి, హైదరాబాద్: కుటుంబ సమస్యలతో ఇంట్లో ఉండలేక, ఫామ్ హౌస్‌లో కూర్చోలేక బయట గాలికి తిరగడానికి కేటీఆర్ కష్టపడుతున్నారని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. గాంధీభవన్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ చెల్లెలు పోరు ఒక వైపు, బావ నసుగుడు మరో వైపు, అయ్య సతాయింపు మరో వైపు ఉండటంతో కేటీఆర్ తట్టుకోలేకపోతున్నాడని, నాయకులు, కార్యకర్తలు ఎవరి దారి వాళ్లు చూసుకుంటుండటంతో ఏం చేయాలో తెలియక జిల్లాల దారి పడుతున్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ సచ్చిపోయిందని, గద్వాలకు పోయి సమావేశాలు పెట్టినా, ఇంకే జిల్లాకు వెళ్లినా ఇక ఉపయోగం ఉండదని కేటీఆర్ గుర్తుంచుకోవాలన్నారు.

కేటీఆర్‌పై ఓయూ పీఎస్‌లో చనగాని దయాకర్ ఫిర్యాదు



లాలాపేట: 'రూ.3 కోట్లు కొట్టు.. గ్రూప్–1 పోస్టు పట్టు'అంటూ మాజీ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని టీపీసీసీ జనరల్ సెక్రటరీ చనగాని దయాకర్ ఉస్మానియా యూనివర్సిటీ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రూప్–1 పోస్టులను రూ.3 కోట్లకు అమ్ముకున్నారని కేటీఆర్ చేసిన ఆరోపణలు ప్రభుత్వ ప్రతిష్టకు భంగం కలిగించేలా ఉన్నాయన్నారు. మంత్రులపై నిరాధారమైన ఆరోపణలతో ప్రభుత్వ పారదర్శకతను, విశ్వసనీయతను దెబ్బతీసేలా మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండించారు. కేటీఆర్ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని 24 గంటల్లో క్షమాపణ చెప్పాలని దయాకర్ డిమాండ్ చేశారు. లేదంటే కేటీఆర్‌పై రూ.100 కోట్ల పరువునష్టం దావా వేస్తామని హెచ్చరించారు. గత బీఆర్ఎస్ పాలనలో గ్రూప్–1 పరీక్షలను సక్రమంగా నిర్వహించలేకపోయారని గుర్తుచేశారు. ప్రస్తుతం కోర్టు తీర్పును స్వాగతిస్తున్నామన్నారు. కేటీఆర్ చేస్తున్న విష ప్రచారాన్ని తెలంగాణ నిరుద్యోగులు తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాల భర్తీ ప్రక్రియను పారదర్శకంగా చేపడుతుందని దయాకర్ పునరుద్ఘాటించారు.

పచ్చి అబద్ధం.. పచ్చ కుతంత్రం

'ఎమ్మార్' పేరిట ఏమార్చే కుట్ర

- చంద్రబాబు డైరెక్షన్‌లో 'ఈనాడు' దుష్ప్రచారం
- ఎమ్మార్ ప్రాపర్టీస్ కేసు పేరిట వైఎస్ జగన్‌పై విష ప్రచారం
- ఆ కేసులో ఆయన ఏ–1 నిందితుడని అసత్య కథనం
- ఆ కేసు నిందితుల జాబితాలో వైఎస్ జగన్ లేనే లేరు
- అందుకు సీబీఐ చార్జ్‌షీటే ప్రత్యక్ష సాక్ష్యం
- రాజకీయ కుట్రతోనే ఈనాడు అసత్య కథనం
- ప్రజల దృష్టి మళ్లించేందుకు సిట్ లీకులు.. ఎల్లో మీడియా రంకెలు
- అందరూ జగన్‌కు సన్నిహితులే అంటూ వక్రీకరణ
- అక్రమ కేసులో నిందితుల బెయిల్‌ను అడ్డుకోవడమే లక్ష్యం
- చంద్రబాబు, రామోజీ కుటుంబాలదే క్విడ్ ప్రో కో బంధం
- ఫిల్మ్ సిటీ మొదలు మార్గదర్శి వరకు బాబు సహకారం



సాక్షి, అమరావతి: టీడీపీ కరపత్రిక, నిత్యం అసత్యాలు కొంగొత్తగా వల్లించే విష పుత్రిక 'ఈనాడు' మరోసారి బరితెగించింది. దశాబ్దాలుగా తనకు అలవాటైన రీతిలో ఉషోదయాన్నే అవాస్తవ సమాచారంతో ప్రజల్ని తప్పుదారి పట్టించేందుకు బరి తెగించింది. చంద్రబాబుకు రాజకీయ ప్రయోజనం కల్పించేందుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై దుష్ప్రచారానికి తెగబడింది. ఎమ్మార్ ప్రాపర్టీస్ కేసు నిందితుల జాబితాలోనే లేని వైఎస్ జగన్‌ను.. ఆ కేసులో ప్రధాన నిందితుడిగా పేర్కొంటూ ఓ అవాస్తవ కథనాన్ని ప్రచురించి ప్రజల్ని తప్పుదారి పట్టించేందుకు పాత్రికేయ విలువలను మరోసారి దిగజార్చింది. ప్రస్తుతం టీడీపీ కూటమి ప్రభుత్వంపై తీవ్ర ప్రజా వ్యతిరేకత వెల్లువెత్తుతుండటంతో ప్రజల దృష్టి మళ్లించేందుకు చంద్రబాబు డైరెక్షన్‌లో డైవర్షన్ రాజకీయానికి పాల్పడింది.

నిస్సిగ్గుగా 'ఈనాడు' తప్పుడు రాతలు

చంద్రబాబు కుట్రలో భాగంగా ఈనాడు 2010–11 నాటి ఎమ్మార్ ప్రాపర్టీస్ కేసును ఉద్దేశ పూర్వకంగా తెరపైకి తీసుకువచ్చింది. ఆ కేసులో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రధాన నిందితుడు (ఏ1) అంటూ ప్రముఖంగా ప్రచురించింది. ఈ కేసులో ఏ–7గా ఉన్న హైదరాబాద్‌కు చెందిన న్యాయవాది, చిన్నా చితకా వ్యాపారాలు చేసుకునే నర్రెడ్డి సునీల్ రెడ్డి ఆయనకు అత్యంత సన్నిహితుడని కూడా చెప్పుకొచ్చింది. వైఎస్ జగన్ తరఫున సునీల్ రెడ్డి అక్రమ వసూళ్లకు పాల్పడ్డారని.. విదేశాలకు అక్రమంగా నిధులు తరలించారని కూడా అవాస్తవాలు, అభూత కల్పనలను ప్రచురించింది. కనీసం అటువంటి కథనాన్ని ప్రచురించే ముందు ఎమ్మార్ ప్రాపర్టీస్ కేసు పూర్వాపరాలు తెలుసుకోవాలని కూడా యత్నించ లేదు. కనీసం ఆ కేసులో సీబీఐ దాఖలు చేసిన చార్జ్‌షీట్‌ను పరిశీలించినా అసలు వాస్తవాలు వెల్లడవుతాయి. కేవలం చంద్రబాబు చెప్పినట్టు వైఎస్ జగన్‌పై బురద చల్లడమే పనిగా పెట్టుకున్న ఈనాడు పత్రిక అవేమీ పట్టించుకోలేదు. అసత్య సమాచారంతో ప్రజల్ని తప్పుదారి పట్టించడమే ఏకైక లక్ష్యంగా వ్యవహరించింది. అయితే 'ఈనాడు' ప్రచురించిందంతా వాస్తవం అని అమాయకంగా నమ్మేందుకు ఇవి 1995 వైస్రాయ్ హోటల్ కుట్ర నాటి రోజులు కావు. ఈనాడు పత్రిక బండారం ఎప్పుడో బట్టబయలైంది.

ఎమ్మార్ ప్రాపర్టీస్ కేసుతో వైఎస్ జగన్‌కు సంబంధమే లేదు

2010–11లో సీబీఐ నమోదు చేసిన ఎమ్మార్ ప్రాపర్టీస్ కేసుతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఏమాత్రం సంబంధం లేదు. ఆ కేసులో ఆయన ప్రధాన నిందితుడు కాదు కదా.. సాధారణ నిందితుడు కూడా కాదు. అసలు ఆ కేసులో నిందితుల జాబితాలో వైఎస్ జగన్ పేరు లేనే లేదు. ఆయనపై సీబీఐ ఆ కేసు నమోదు చేయనే లేదు. 13 మందిని నిందితులుగా పేర్కొంటూ సీబీఐ న్యాయస్థానంలో చార్జ్‌షీట్ దాఖలు చేసింది.

ఎమ్మార్ ప్రాపర్టీస్ కేసులో నిందితులు వీరే..

బీపీ ఆచార్య (ఏ1), ఎమ్మార్ ప్రాపర్టీస్ (ఏ2), ఎమ్మార్ హిల్స్ టౌన్‌షిప్ (ఏ3), ఎమ్మార్ ఎంజీఎఫ్ ల్యాండ్ లిమిటెడ్ (ఏ4), స్టైలిష్ హోమ్స్ అండ్ రియల్ ఎస్టేట్స్ (ఏ5), కోనేరు రాజేంద్ర ప్రసాద్ (ఏ6), నర్రెడ్డి సునీల్ రెడ్డి (ఏ7), జీవీ విజయ్ రాఘవ్ (ఏ8), శ్రీకాంత్ జోషి (ఏ9), బౌల్డర్ హిల్స్ లీషూర్ ప్రైవేట్ లిమిటెడ్ (ఏ10), ఎల్వీ సుబ్రహ్మణ్యం (ఏ11), విశ్వేశ్వరరావు (ఏ12), మధు కోనేరు (ఏ13) నిందితులుగా ఉన్నారు. వీరిలో ఎల్వీ సుబ్రహ్మణ్యం, మధు కోనేరులపై అభియోగాలను న్యాయస్థానం ఇప్పటికే కొట్టి వేసింది. కేసు విచారణ కొనసాగుతోంది. సెప్టెంబర్ 19న న్యాయస్థానంలో తదుపరి విచారణ ఉంది. దీన్నిబట్టి ఈ కేసులో నిందితుల జాబితాలో ఎక్కడా లేనప్పటికీ వైఎస్ జగన్‌ను ఏ1గా పేర్కొంటూ ఈనాడు కుట్ర పూరితంగానే అవాస్తవ కథనాన్ని ప్రచురించిందని స్పష్టమవుతోంది.

బాబు డైరెక్షన్‌లోనే 'ఈనాడు' యాక్షన్

- చంద్రబాబు కుట్రలో భాగంగానే ఈనాడు అసత్య కథనాన్ని ప్రచురించింది. టీడీపీ కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజల్లో వ్యతిరేకత వెల్లువెత్తగానే మద్యం విధానంపై అక్రమ కేసు పేరిట సిట్ రంగంలోకి దిగుతుంది.. ఎల్లో మీడియాకు లీకులు ఇస్తుంది.. కోతికి కొబ్బరికాయ దొరికినట్టు ఈనాడు, ఇతర ఎల్లో మీడియా తోక పత్రికలు వెంటనే రంకెలు వేస్తాయి. మోకాలికీ బోడి గుండుకు ముడి పెడుతూ అసత్య కథనాలు ప్రచురిస్తాయి.
- ఈ కేసులో సిట్ ఎవర్ని అరెస్టు చేయనుందో ముందే లీకులు ఇస్తుంది. ఆ వెంటనే ఆయనే ఈ కేసులో అత్యంత కీలకం అంటూ ఈనాడు, ఇతర తోక పత్రికలు కథనాలు ప్రచురిస్తాయి. వైఎస్ జగన్‌కు అత్యంత సన్నిహితులు అని పేర్కొంటూ ప్రజల్ని తప్పుదారి పట్టించేందుకు యత్నిస్తాయి. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ధనుంజయ్ రెడ్డి, ఓఎస్డీ కృష్ణ మోహన్‌రెడ్డి, వికాట్ కంపెనీ డైరెక్టర్ బాలాజీ గోవిందప్ప.. మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డి, అనిల్ రెడ్డి.. ఇలా వీరందరిపై ఎల్లో మీడియా బురదజల్లడమే పనిగా పెట్టుకుంటుంది.
- ఆ జాబితాలో తాజాగా చేరిన పేరు సునీల్ రెడ్డి. న్యాయవాది, చిన్న వ్యాపారస్తుడైన ఆయన వైఎస్ జగన్‌కు అత్యంత సన్నిహితుడంటూ ఈనాడు, ఇతర ఎల్లో మీడియా వక్రభాష్యం చెబుతున్నాయి. ఆయన గత పదేళ్లలో వైఎస్ జగన్‌ను కలిసిందే లేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న ఐదేళ్లలో ఒక్కసారి కూడా విజయవాడకు గానీ, అమరావతికి గానీ వచ్చిందే లేదు. కానీ ఆయన వైఎస్ జగన్‌కు అత్యంత సన్నిహితుడంటూ ఉద్దేశ పూర్వకంగా దుష్ప్రచారానికి తెగబడుతున్నారు.
- వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సొంతంగా కంపెనీలు ఉన్నాయి. వాటిలో ఎంతో మంది వృత్తి నిపుణులు పని చేస్తున్నారు. వైఎస్ జగన్ తమ వ్యాపారాలను వారి ద్వారా నిర్వహిస్తారు. అంతే గానీ, సిట్ చెప్పినట్టుగా ఇతరులెవరితోనో వ్యవహారాలు నిర్వహించాల్సిన అవసరం ఆయనకు ఏమాత్రం లేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో లేని కుంభకోణాన్ని ఉన్నట్టుగా చూపేందుకే సిట్, ఎల్లో మీడియా రాద్ధాంతం చేస్తున్నాయన్నది సుస్పష్టం.
- మద్యం అక్రమ కేసులో అక్రమంగా అరెస్టు అయిన నిందితుల బెయిల్ పిటిషన్ విచారణకు వచ్చిన ప్రతిసారీ ఇదే కుట్రను అమలు చేస్తున్నారు. ఎవరు ఆఫ్రికా దేశాల్లోనో మరెక్కడో వ్యాపారాలు చేసుకుంటున్నా.. ఈ అక్రమ కేసుకు ముడి పెడుతున్నారు. అవన్నీ అక్రమ పెట్టుబడులే అంటూ బురద జల్లుతున్నారు.

చంద్రబాబు, రామోజీ కుటుంబ ట్రేడ్ మార్క్ కుట్ర

- పచ్చ కామెర్ల రోగికి లోకం అంతా పచ్చగా కనిపిస్తుందన్న చందంగా చంద్రబాబు– ఈనాడు వ్యవహారం సాగుతోంది. తమ రాజకీయ స్వార్థం, ఆర్థిక దోపిడీ కోసం తెలుగు వారి ఆత్మ గౌరవాన్ని దెబ్బ తీస్తూ.. రాష్ట్ర ప్రతిష్టను మంటగలుపుతూ కుట్రలకు పాల్పడేందుకు చంద్రబాబు, రామోజీ కుటుంబ మార్కు కుతంత్రం ఎన్నో ఏళ్లుగా సాగుతోంది. ఆ క్విడ్ ప్రోకో కుట్రల్లో చంద్రబాబు, రామోజీ కుటుంబాలే లబ్ధిదారులు అన్నది బహిరంగ రహస్యం.
- ఎన్టీ రామారావుకు వెన్నుపోటు పొడిచి అడ్డదారిలో చంద్రబాబు సీఎం అయిన వైస్రాయ్ హోటల్ కుట్రలో ఈనాడు పత్రిక ప్రధాన భాగస్వామి. 1995లో సీఎంగా ఉన్న ఎన్టీరామారావు, ఆయన భార్య లక్ష్మీ పార్వతికి వ్యతిరేకంగా పుంఖాను పుంఖాలుగా కథనాలతో దుష్ప్రచారం చేసి పాత్రికేయ విలువలకు పాతరేసింది.
- చంద్రబాబు సీఎంగా బాధ్యతలు చేపట్టగానే రామోజీ కుటుంబ అక్రమ ఆర్థిక సామ్రాజ్య విస్తరణకు పూర్తిగా సహకరించారు. ఎన్టీ రామారావు అమలు చేసిన సంపూర్ణ మద్యపాన నిషేధాన్ని తొలగించారు. రామోజీ ఫిల్మ్ సిటీ వ్యాపార ప్రయోజనాల కోసమే ఇదంతా చేశారు. టీడీపీ ప్రభుత్వ అండతోనే రామోజీ రావు కుటుంబం రంగారెడ్డి జిల్లాలో వేలాది ఎకరాల అసైన్డ్ భూములను చెరబట్టి ఫిల్మ్ సిటీ నిర్మించింది.
- ఆర్‌బీఐ నిబంధనలకు విరుద్ధంగా మార్గదర్శి డిపాజిటర్స్ వేల కోట్ల రూపాయాల అక్రమ డిపాజిట్లు సేకరించింది. మార్గదర్శి చిట్ ఫండ్స్ యథేచ్ఛగా ఆర్థిక అక్రమాలకు పాల్పడింది. క్విడ్ ప్రో కో కుట్రలో భాగస్వాములు అంటే చంద్రబాబు, రామోజీ కుటుంబాలే అన్నది బహిరంగ రహస్యం. కానీ తమ రాజకీయ ప్రత్యర్థులపై ఈనాడు పత్రిక ద్వారా దుష్ప్రచారం చేయడం చంద్రబాబు, రామోజీ కుటుంబాల మార్కు కుతంత్రం. ఎమ్మార్ ప్రాపర్టీస్ కేసుతో ఏమాత్రం సంబంధం లేని వైఎస్ జగన్‌ను ఆ కేసులో ప్రధాన నిందితుడు అని ఈనాడు పత్రిక ప్రచురించిన అసత్య కథనమే అందుకు తాజా తార్కాణం.

ఇంటర్నేషనల్ టు చిన్న మున్సిపాల్టీ!

రాజధాని అమరావతిపై మాయాబజారును తలపిస్తున్న సీఎం చంద్రబాబు తీరు

సాక్షి, అమరావతి: సంక్షోభాన్ని అవకాశంగా మల్చుకుని రాజధాని లేని రాష్ట్రానికి ప్రపంచంలోనే అత్యుత్తమ నగరాన్ని నిర్మిస్తానంటూ మొన్నటి దాకా చెబుతూ వస్తున్న ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఇప్పుడు సరి కొత్త పల్లవి అందుకున్నారు! రాజధాని కోసం ఇప్పటికే భూమిని సమీకరించిన ప్రాంతానికే పరిమితమైతే అదో చిన్న మున్సిపాల్టీగా మిగిలిపోతుందని.. మహానగరంగా కావాలంటే విస్తరించాలని, అందుకు ఇంకా భూమి తీసుకుంటామని ప్రకటించారు. అంతర్జాతీయ విమానాశ్రయంతోపాటు పరిశ్రమలు వస్తేనే అక్కడ భూముల విలువ పెరుగుతుందని, వాటి కోసం మలి విడత భూమిని తీసుకుంటామని చెప్పుకొచ్చారు. ఇప్పటికే సమీకరించిన 217 చదరపు కిలోమీటర్ల (53,748 ఎకరాలు) పరిధిలో రాజధాని నిర్మాణానికి సింగపూర్ కన్సార్షియం 'సుర్బానా–జురాంగ్'లకు రూ.28.96 కోట్లు చెల్లించి 2015–16లోనే మాస్టర్ ప్లాన్ రూపొందించారు. దాని ప్రకారం 2036 నాటికి రాజధాని నగర నిర్మాణాన్ని పూర్తి చేస్తామని ప్రపంచ బ్యాంకుకు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నివేదిక కూడా ఇచ్చింది. ప్రపంచంలోనే మూడు అత్యుత్తమ రాజధాని నగరాల్లో అమరావతి నిలుస్తుందని ఇన్నాళ్లూ చెప్పుకొచ్చిన సీఎం చంద్రబాబు.. ఇప్పుడు హఠాత్తుగా అదో చిన్న మున్సిపాల్టీగా మిగిలిపోతుందంటూ ప్లేటు ఫిరాయించడంపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. రాజధాని నిర్మాణంపై చంద్రబాబు తీరు మాయబజారును తలపిస్తోందంటున్నారు.

దశల వారీగా 11 గ్రామాల్లో 44,676.64 ఎకరాల సమీకరణ!

కృష్ణా నదీ తీరంలో ఇప్పటికే తుళ్లూరు, తాడికొండ, మంగళగిరి మండలాల్లో 29 గ్రామాల్లో రాజధాని కోసం ల్యాండ్ పూలింగ్ (భూ సమీకరణ) ద్వారా 29,442 మంది రైతుల నుంచి 34,823.12 ఎకరాలు సమీకరించారు. మరో 18,924.88 ఎకరాల ప్రభుత్వ, అటవీ భూములు కలిపి మొత్తం 53,748 ఎకరాల్లో (217 చదరపు కిలోమీటర్లు) రాజధాని నిర్మాణం చేపట్టారు. ఇక స్మార్ట్ ఇండస్ట్రీస్ వస్తేనే రాజధాని కోసం తొలి విడత సమీకరించిన భూముల ధరలు పెరుగుతాయని టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చీ రావడంతోనే మంత్రి నారాయణ చెబుతూ వస్తున్నారు. ఇంటర్నేషనల్ గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు, స్పోర్ట్స్ సిటీలు వస్తేనే స్మార్ట్ ఇండస్ట్రీస్ వస్తాయని తేల్చి చెబుతున్నారు. వాటికి 10 వేల ఎకరాలకుపైగా భూమి అవసరమవుతుందని, అందుకు మలి విడతగా తుళ్లూరు మండలం హరిశ్చంద్రాపురం, వడ్డమాను, పెదపరిమి.. అమరావతి మండలం వైకుంఠపురం, ఎండ్రాయి, కర్లపూడి, మోతడక, నిడుముక్కల, తాడికొండ మండలం తాడికొండ, కంతేరు, మంగళగిరి మండలం కాజ సహా మొత్తం 11 గ్రామాల్లో 44,676.64 ఎకరాలు సమీకరిస్తామని ఇప్పటికే లీకులు ఇచ్చారు. మొదటి విడత భూములిచ్చిన రైతుల్లో తీవ్ర వ్యతిరేకత పెల్లుబుకుతుండటాన్ని పసిగట్టిన ప్రభుత్వం మలి విడత భూసమీకరణను దశల వారీగా చేపట్టే దిశగా అడుగులు వేస్తోంది.

రూ.3 లక్షల కోట్లు అవసరం..

రాజధాని అమరావతికి తొలి విడత సమీకరించిన 53,748 ఎకరాల్లో సింగపూర్ కన్సార్షియం రూపొందించిన మాస్టర్ ప్లాన్ ప్రకారం మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి పనులకు రూ.1,09,023 కోట్లు అవసరమని 2018లో నీతి ఆయోగ్‌కు చంద్రబాబు ప్రభుత్వం డీపీఆర్‌లు (సమగ్ర ప్రాజెక్టు నివేదికలు) సమర్పించింది. అయితే 2014–19 మధ్య రాజధాని నిర్మాణం కోసం కేవలం రూ.5,428.41 కోట్లు మాత్రమే వ్యయం చేశారు. ఆ లెక్కన చూస్తే.. తొలి విడత రాజధాని నిర్మాణం పూర్తయ్యే సరికి ధరలు పెరిగి అంచనా వ్యయం రూ.1.50 లక్షల కోట్లకు చేరుతుందని ఇంజనీరింగ్ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. మలి విడతగా తీసుకునే 44,676.64 ఎకరాల సమీకరించిన భూముల్లో రాజధాని నిర్మాణం పూర్తి కావాలంటే మరో రూ.1.50 లక్షల కోట్లు అవసరం. అంటే.. తొలి, మలి విడతలు కలిపి రాజధాని నిర్మాణం పూర్తయ్యే సరికి వ్యయం ఏకంగా రూ.3 లక్షల కోట్లకు చేరుతుందన్న మాట.. దీన్నంతా ప్రభుత్వం అప్పుగా తీసుకోవాల్సిందే.

భూముల ధరలు పెంచుకోవడం.. కమీషన్లు దండుకోవడం!

'ఓత్ ఆఫ్ సీక్రసీ'కి తిలోదకాలు వదిలి.. రాజధాని ఏర్పాటు చేసే ప్రాంతంపై వందిమాగధులకు ముందే లీకులు ఇచ్చి.. ఇన్‌సైడర్ ట్రేడింగ్‌కు పాల్పడి రైతుల నుంచి తక్కువ ధరలకే చంద్రబాబు బృందం భారీ ఎత్తున భూములు చేజిక్కించుకుంది. ఇప్పుడు ఆ భూములు ధరలు పెంచుకోవడానికి మలి విడత భూసమీకరణకు సిద్ధమయ్యారనే ఆరోపణలు బలంగా వ్యక్తమవుతున్నాయి. ఇక ప్రస్తుతం రాజధాని నిర్మాణ పనుల అంచనా వ్యయాన్ని పెంచేసి.. సిండికేటు కాంట్రాక్టర్లకు అప్పగించి.. మొబిలైజేషన్ అడ్వాన్సులు ముట్టజెప్పి.. కమీషన్లు వసూలు చేసుకుంటున్నారు. మలి విడత సమీరించే భూముల్లోనూ ఇదే రీతిలో నిర్మాణ పనులు సిండికేటు కాంట్రాక్టర్లకు అప్పగించి.. కమీషన్లు వసూలు చేసుకోవాలన్నది ఎత్తుగడ. రాజధాని నిర్మాణం పేరుతో అప్పులు తెచ్చి.. రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టి.. కాంట్రాక్టర్ల నుంచి కమీషన్లు దండుకుని.. కాజేసిన భూముల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసి భారీ ఎత్తున తమ సంపద పెంచుకునే దిశగా చంద్రబాబు బృందం అడుగులు వేస్తోందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.



విజయవాడ-గుంటూరు హైవే సమీపంలో నిర్మించి ఉంటే..

కృష్ణా తీరంలో కాకుండా 2015లో విజయవాడ–గుంటూరు మధ్య హైవే సమీపంలో రాజధాని కోసం 1,000 నుంచి 1,500 ఎకరాల భూమిని సేకరించి ఉంటే సరిపోయేదని అధికారవర్గాలు, ఆర్థిక నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఆ భూమిలో హైకోర్టు, రాజ్‌భవన్, శాసనసభ, సచివాలయం, ప్రభుత్వ కార్యాలయాలు.. అధికారులు, సిబ్బంది క్వార్టర్స్, మంత్రులు, ఎమ్మెల్యేల క్వార్టర్స్‌ను రూ.ఐదారు వేల కోట్ల వ్యయంతో నిర్మించి ఉంటే.. కేవలం మూడేళ్లలో రాజధాని పూర్తయ్యేదని చెబుతున్నారు.

రాజీనామాలు చేయించు.. ఎన్నికలకు రా..

▶ మొదటి పేజీ తరువాయి

ఉప ఎన్నికలకు రావాలి. రెండేళ్ల రేవంత్ పాలన, పదేళ్ల కేసీఆర్ పాలన మీద ప్రజలు తీర్పు ఇస్తారు. సుప్రీంకోర్టు ఈ విషయంపై సీరియస్‌గా ఉంది. ఎవరెన్ని ఎత్తుడలు వేసినా తొమ్మిది నెలల్లో కచ్చితంగా ఉప ఎన్నికలు వస్తాయి. గద్వాల ఎమ్మెల్యేతో పాటు మిగతా తొమ్మిది మందిని చిత్తుచిత్తుగా ఓడించాలి. అంతకు ముందే వచ్చే స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలి.

స్కూటీలు లేవు.. లూటీనే..

కేసీఆర్ ప్రభుత్వం దళిత బంధు ద్వారా రూ.10 లక్షలిస్తే.. కాంగ్రెసోళ్లు రూ.12 లక్షలు ఇస్తామని చెప్పి మోసం చేశారు. అంబేడ్కర్ అభయహస్తం శూన్యహస్తమైంది. ఆడపిల్లలు చదువుకుంటే స్కూటీలు వస్తాయన్నారు. స్కూటీలు లేవు గానీ ముఖ్యమంత్రి బ్రహ్మాండంగా లూటీ చేస్తున్నారు. కేసీఆర్, కేటీఆర్ ఉద్యోగాలు ఊడగొట్టండి.. మొదటి సంవత్సరంలోనే రెండు లక్షల ఉద్యోగాలిస్తామన్న హామీని కాంగ్రెస్ నిలబెట్టుకోలేదు. సీఎం ఒక్కటే నేర్చుకున్నారు.. అబద్ధాలు చెప్పడం.. దాని మీద రెండేళ్లు టైంపాస్ చేయడం. నేను ఇక్కడకు వస్తుంటే అలంపూర్ వద్ద ఒకరు గణపతి బప్పా మోరియా.. కావాలయ్యా యూరియా అంటూ అరుస్తున్నాడు. కాంగ్రెసోళ్లు యూరియా కూడా బుక్కుతున్నారు. గ్రూప్–1లో 500 ఉద్యోగాలు అమ్ముకున్నారు. డిప్యూటీ కలెక్టర్ పోస్టులను రూ.3 కోట్ల నుంచి రూ.5 కోట్ల చొప్పున విక్రయించి రూ.1,700 కోట్లు దండుకున్నారు.



గద్వాలలో జరిగిన బహిరంగ సభకు హాజరైన బీఆర్ఎస్ శ్రేణులు

లంకె బిందెలున్నాయని వచ్చారా..

తెలంగాణను తలసరి ఆదాయంలో దేశంలోనే నంబర్ వన్‌గా నిలిపి బంగారు పళ్లెంలో రాష్ట్రాన్ని అప్పగించాం. కానీ ఇయ్యాల ముఖ్యమంత్రి రాష్ట్రం అప్పులపాలైందని అంటారు. రాష్ట్రానికి పెద్దమనిషి లాంటి సీఎం రాష్ట్రం దివాళా తీసిందని చెబుతాడా.. ఇలా అయితే ఎవరైనా అప్పు ఇస్తారా.. పెట్టుబడులు పెడతారా? లంకెబిందెలు ఉన్నాయనుకుని ఈ ముఖ్యమంత్రి సెక్రటేరియట్‌కు వచ్చినట్టు ఉన్నారు. ఢిల్లీకి పోతే అపాయింట్‌మెంట్లు ఇస్తలేరని చెబుతాడు.. చెప్పులెత్తుకుపోతారేమోనని అపాయింట్‌మెంట్లు ఇస్తలేరు. అలాంటి వ్యక్తి సీఎం కావడం మన ఖర్మ. కాంగ్రెసోళ్లు అరచేతిలో స్వర్గం చూపించి ఓట్లు దండుకున్నారు. గద్వాల ఎమ్మెల్యేతోపాటు మిగతా 9 మంది ఆ దొంగల ముఠాలో చేరారు' అని కేటీఆర్ అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు చల్లా వెంకట్రామిరెడ్డి, నవీన్ కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే విజయుడు, నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'ఫిరాయింపు' ఆధారాలపై

బీఆర్ఎస్ పోస్ట్‌మార్టం

- ఫిరాయింపు ఎమ్మెల్యేల వివరణలపై న్యాయ నిపుణులతో మంతనాలు
- ఆధారాలను స్పీకర్‌కు బలంగా చూపించేందుకు కసరత్తు
- నేటి సాయంత్రంలోగా అభ్యంతరాలు స్పీకర్‌కు సమర్పణ

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలు అసెంబ్లీ స్పీకర్‌కు ఇచ్చిన వివరణలను బీఆర్ఎస్ పోస్ట్‌మార్టం చేస్తోంది. ఆ ఎమ్మెల్యేలు ఇచ్చిన సమాధానాలను స్పీకర్.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు మూడు రోజుల క్రితం పంపారు. ఆ సమాధానాలపై అభ్యంతరాలు ఉంటే మూడు రోజుల్లోగా తెలపాలని గడువు విధించారు. దీంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు స్పీకర్ కార్యాలయం నుంచి తమకు అందిన వివరణ లేఖలను పార్టీ శాసనసభాపక్ష నేతకు అందజేశారు. ఈ వివరణలపై బీఆర్ఎస్ లీగల్ సెల్‌తో పాటు న్యాయ నిపుణులతో సంప్రదించి స్పీకర్‌కు తిరుగు సమాధానం పంపడంపై కసరత్తు జరుగుతోంది. ఫిరాయింపు ఎమ్మెల్యేలు స్పీకర్‌కు ఇచ్చిన వివరణలపై బీఆర్ఎస్ అభ్యంతరాలు వ్యక్తం చేస్తోంది. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలంతా ఒకే రకమైన వివరణ ఇచ్చారని ఫిర్యాదుదారుగా ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే ఒకరు 'సాక్షి'కి తెలిపారు. ఎమ్మెల్యేలు పార్టీ మారినట్లు ఆధారాలను బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు స్పీకర్‌కు గతంలో ఇచ్చిన ఫిర్యాదు లేఖతో జత చేశారు. వాటిని మరింత లోతుగా పరిశీలించాలని స్పీకర్‌ను మరోమారు కోరనున్నారు.

నేటి సాయంత్రంలోగా సమాధానాలు

స్పీకర్ కార్యాలయం నుంచి అందిన వివరణ పత్రాలపై న్యాయ నిపుణుల సూచనల మేరకు రూపొందిస్తున్న సమాధానాలను ఆదివారం సాయంత్రంలోగా అందజేసేందుకు బీఆర్ఎస్ సన్నాహాలు చేస్తోంది. అయితే, బెంగళూరు పర్యటనలో ఉన్న స్పీకర్ ప్రసాద్‌కుమార్ ఈ నెల 16న హైదరాబాద్‌కు తిరిగి రానున్నారు. ఆ తర్వాతే స్పీకర్ హియరింగ్ ఏర్పాటు చేసి ఇరుపక్షాల వాదనలు వినే అవకాశాలు కనిపిస్తున్నాయి.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
ఆదివారం ॥ 14-9-2025



రెండు సంవత్సరాల లోపు పిల్లలు ఎక్కువగా స్క్రీన్ ముందు గడపడం వల్ల మెదడుపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. పిల్లల అధిక స్క్రీన్ టైమ్ అనేది వారి ఆలోచన, గ్రహణశక్తి, మెదడు ఆరోగ్యకరమైన అభివృద్ధిపై ప్రతికూల ప్రభావం చూపుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి.



● సంధ్యారాణి చిన్నప్పటి ఫొటో

2016లో 'లయన్' అనే సినిమా వచ్చింది. కథా నాయకుడు దేవ్ పటేల్. స్లమ్ డాగ్ మిలియనీర్ ఫేమ్. లయన్ కథకు వస్తే సరూ అనే అయిదేళ్ల పిల్లాడు ఇంటి నుంచి పారిపోయి రైలెక్కుతాడు. అది వేల కిలోమీటర్లు ప్రయాణించి కోల్‌కతా చేరుకుంటుంది. అప్పటినుంచి ఆ పిల్లాడి ఒంటరి పోరాటం మొదలవుతుంది. అక్కడ ఆ బాలుడి జీవితం రకరకాల మలుపులతో ఆఖరుకు ఒక ఆస్ట్రేలియన్ జంటకు దత్తతతో ఆస్ట్రేలియా చేరుకుంటుంది. పాతికేళ్ల తర్వాత సొంతకుటుంబాన్ని కలవాలనే తాపత్రయంతో గుప్పెడు బాల్య జ్ఞాపకాలను తోడు చేసుకుని, గూగుల్ ఎర్త్ సాయంతో తన ఇంటిని కనుక్కుంటాడు, కుటుంబాన్ని కలుసుకుంటాడు. వాస్తవ సంఘటన ఆధారంగా తీసిన సినిమా అది.

నాన్నా... నువ్వెక్కడ?

జనారణ్యంలో ఓ అమ్మాయి అన్వేషణ!



● సంధ్యారాణి

సంధ్యారాణి కథా అలాంటిదే! అయితే ఆమె ఇంకా సొంత కుటుంబాన్ని కలుసుకోలేదు. అన్నం, పప్పు తిన్న లీలామాత్రపు జ్ఞాపకాలతో తల్లిదండ్రుల అన్వేషణలో ఉంది. తన కథ సుఖాంతం కావడం కోసం ఎదురు చూస్తోంది. సంధ్యారాణి చెప్పిన వివరాల ప్రకారం ఆ కథ ఎక్కడ మొదలైందంటే..

1987...

హైదరాబాద్, ఖైరతాబాద్‌లోని ప్రేమ్‌నగర్ వాసి కె.రామయ్య నిజాం కాలేజ్‌లో తోటమాలి. అతనికి అబిడ్స్‌లోని పరాస్ బార్ అండ్ రెస్టారెంట్‌లో వెయిటర్ బి. రాజ్‌కుమార్‌తో స్నేహం కుదిరింది. మాటల్లో తనదీ, రాజ్‌కుమార్‌దీ ఇద్దరిదీ ఒకే కులమని తేలింది. దాంతో తన మరదలు అనసూయకు రాజ్‌కుమార్‌తో పెళ్లి చేయాలనుకుని రాజ్‌కుమార్‌ని అడిగాడు. అయితే తనకు అంతకుముందే పెళ్లై, మూడేళ్ల కూతురూ ఉందని, కాకపోతే భార్య చనిపోయిందని చెప్పాడు రాజ్‌కుమార్. అయినా సరే తమ ఆర్థికపరిస్థితి దృష్ట్యా మరదలికి రాజ్‌కుమార్‌తో వివాహం జరిపించాడు రామయ్య. ముచ్చటగా మూడు నెలలు గడిచాయి. రాజ్‌కుమార్ పత్తాలేకుండా పోయాడు బిడ్డను అనసూయ దగ్గరే వదిలి. పరాస్ బార్ అండ్ రెస్టరెంట్‌కి వెళ్లి వాకబు చేశాడు రామయ్య. నెల రోజులుగా పనిలోకి రావట్లేదని చెప్పారు హోటల్ సిబ్బంది. రాజ్‌కుమార్ కోసం వెదికి వేసారిన రామయ్య.. సంధ్యను విజయ నగర్ కాలనీలోని సేవా సమాజం.. బాలికా నిలయమనే అనాథాశ్రమంలో వదిలేశాడు.

1988...

సంతానం లేని స్వీడన్ జంట మిస్టర్ అండ్ మిసెస్ లిండ్‌గ్రెన్ సంధ్యారాణిని దత్తత తీసుకున్నారు. అలా స్వీడన్ వెళ్లిన సంధ్యారాణి.. ఊహ తెలిసేప్పటికి అది తన మాతృదేశం కాదని.. వాళ్లు తనకు జన్మనిచ్చిన తల్లిదండ్రులు కారనే సత్యాన్ని గ్రహించింది! పై చదువు కోసం యూకే వెళ్లాక ఓ ఫ్రెండ్ ప్రేరణతో తన అసలు పేరెంట్స్ గురించి ఆరా తీయడం మొదలుపెట్టింది. తనది హైదరాబాద్ అని, సేవా సమాజం బాలికా నిలయం నుంచి తనను తెచ్చుకున్నామనే స్వీడన్ పేరెంట్స్ చెప్పిన విషయం తప్ప ఇంకే సమాచారమూ లేదు. కాబట్టి యూకేలో ఉంటూ హైదరాబాద్‌లో తన మూలాల కోసం చేసిన వాకబు అంగుళం కూడా ముందుకు కదల్లేదు. దాంతో 2009లో తొలిసారిగా హైదరాబాద్‌కు వచ్చింది సంధ్య. తనను దత్తత ఇచ్చిన అనాథాశ్రమానికి వెళ్లింది. పెద్దగా వివరాలేవీ దొరకలేదు. చదువైపోయి లండన్‌లో ఉద్యోగం చేస్తూ, వీలు దొరికినప్పుడల్లా హైదరాబాద్ వస్తున్నా.. ఏళ్లు గడుస్తున్నా ఒంటరి వెదుకులాట దారీ తెన్నూ చూపలేదు.

2025...

జన్మనిచ్చిన తల్లిదండ్రులను కలవాలనుకునే దత్తత పిల్లలెందరికో సహాయపడుతున్న సంస్థ.. పుణేలోని అడాప్టీ రైట్స్ కౌన్సిల్ గురించి సంధ్యకు తెలిసింది. ఆ సంస్థ డైరెక్టర్ అంజలి తారా బబన్‌రావ్ పవార్‌ని కాంటాక్ట్ చేసింది. ఆమె.. సంధ్యకు సాయం చేయడానికి సిద్ధపడింది. మొత్తానికి అంజలి సహకారంతో రామయ్యను కలుసుకోగలిగింది సంధ్య. అనారోగ్యంతో ఆయన ఆసుపత్రిలో ఉన్నాడు. సంధ్య సవతి తల్లి అనసూయ చనిపోయిందని చెప్పాడు. అంతే కాదు రాజ్‌కుమార్ సొంతూరు వరంగల్ అని, అతని తోబుట్టువులు అక్కడే ఉన్నారనీ తెలిపాడు. ఆ మాత్రం ఆధారంతోనే ఆత్రంగా సంధ్య వరంగల్ ప్రయాణమైంది. అమ్మానాన్నలు కనిపిస్తే.. అంతకన్నా అదృష్టం ఉంటుందా అంటుంది నీళ్లు నిండిన కళ్లతో.

'వరంగల్‌లో నాన్నే కాదు అమ్మా కనిపిస్తుందని ఆశ. అమ్మ చనిపోయిందని రామయ్యగారితో నాన్న చెప్పినా నాకు మాత్రం అమ్మ బతికే ఉందనిపిస్తోంది. నాలా విదేశాలకు దత్తత వెళ్లి.. సొంత తల్లిదండ్రులను కలవాలనుకుంటున్న వాళ్లెందరో! పెద్దలందరికీ నాదొకటే విన్నపం.. దయచేసి పిల్లలను విదేశీయులకు దత్తత ఇవ్వకండి. ఎంత కష్టమైనా సొంత దేశంలోనే పెరగనివ్వండి. దత్తత వెళ్లిన పిల్లలకు అక్కడ జీవితం వడ్డించిన విస్తరేం కాదు. అమ్మానాన్నలనే కాదు సొంత ఊరు, భాష, సంస్కృతి.. ఒక్కమాటలో చెప్పాలంటే మా గుర్తింపును, ఉనికినే కోల్పోతున్నాం. దానంత నరకం ఇంకోటి లేదు. నా సంబంధీకులెవరైనా ఉండి.. నన్ను పోల్చుకోగలిగితే దయచేసి నన్ను కాంటాక్ట్ అవండి. మా అమ్మానాన్నల జాడ చెప్పండి!'

సంప్రదించాల్సిన నంబర్.. 9822206485.'' అంటూ తన కథ చెప్పింది సంధ్య. ఆమె త్వరలో తన తల్లిదండ్రులను కలుసుకుంటుందని ఆశిద్దాం.

– సరస్వతి రమ

– ఫొటోలు: గడిగె బాలస్వామి

● జీవన దృశ్యం

ప్రయాణికులకు ముఖ్య గమనిక





ఒక్కసారి రైల్వేప్లాట్‌ఫామ్‌పై అడుగు పెడితే ఎన్నో దృశ్యాలు కంటబడతాయి.

అనుబంధాలకు అద్దం పట్టే తీయటి దృశ్యం, అత్తారింటికి వెళుతున్న కూతురికి వీడ్కోలు చెబుతూ కళ్లనీళ్ల పర్యంతమయ్యే తల్లిదండ్రుల విచార దృశ్యం, కొత్త ప్రాంతానికి వెళ్లే ఆనందంలో స్నేహితుల వినోద దృశ్యం. యాచకుల హడావిడి దృశ్యం, ఒంటరి జీవుల ఏకాంత దృశ్యం...ఎన్నో ఎన్నెన్నో దృశ్యాలు కనిపిస్తాయి. ఇలాంటి ఎన్నో దృశ్యాలకు సంగీత వల్లట్ పుస్తకాలు అద్దం పడతాయి. రైల్వేడిపార్ట్‌మెంట్‌లో కమర్షియల్ క్లర్క్‌గా పద్నాలుగు సంవత్సరాలు ఉద్యోగం చేసిన సంగీత 'ప్లాట్‌ఫామ్ టికెట్' పేరుతో తాజాగా పుస్తకం రాసింది. తన ఉద్యోగ జీవితంలో ఎన్నో జ్ఞాపకాలు, అనుభవాలకు ఈ పుస్తకంలో అక్షరరూపం ఇచ్చింది. చెన్నై రైల్వే స్టేషన్‌లో డెబ్బైమంది ఉద్యోగులు పనిచేసే రోజుల్లో తాను ఒక్కరే మహిళా ఉద్యోగి.

హృదయాలను కదిలించే సంఘటనలు మాత్రమే కాదు హాయిగా నవ్వించే సంఘటనలు ఎన్నో 'ప్లాట్‌ఫామ్ టికెట్'లో ఉన్నాయి. 'భారతీయ రైల్వే దృశ్యాలు' అనే మాట వినబడగానే ఆర్‌కే నారాయణ్, రస్కిన్ బాండ్ పుస్తకాలు గుర్తుకు వస్తాయి. ఇప్పుడు ఆ కోవలో సంగీత పేరు కూడా చేరుతుంది. ఉద్యోగిగా రైల్వే డిపార్ట్‌మెంట్‌తో ఉన్న అనుబంధమే ఆమె కలానికి ఉన్న అసలు బలం.

రైల్వేస్టేషన్‌లలో కనిపించే విభిన్న వర్గాల జీవన దృశ్యాలను మాత్రమే కాదు భారతీయ రైల్వే వ్యవస్థ విశ్వరూపాన్ని సూక్ష్మంగానైనా అర్థం చేసుకునే ప్రయత్నం తన రచనల ద్వారా చేస్తోంది సంగీత.

● యాభై లక్షల ప్రశ్న

పచ్చల రాజధాని ఏది?



స్త్రీలకు నవరత్నాలు ఇష్టం. అయితే వాటిలో కొన్నే కొందరికి 'మేచ్' అవుతాయి అని కూడా నమ్ముతారు. వజ్రం, ముత్యం, కనకపుష్యరాగం, కెంపు, పగడం, వైఢూర్యం, నీలం, గోమేధికం... వీటన్నింటితో పాటు పచ్చ... అన్నీ అద్భుతమైన ఆకర్షణ కలిగినవే. స్త్రీలు వీటిని తమ ఆభరణాల్లో పొదిగి మిలమిలా మెరుస్తారు. అయితే ఇప్పుడు ఈ నవరత్నాలకు సంబంధించిన ఒక ప్రశ్నకు జవాబు తెలియపోవడం వల్ల 25 లక్షలు కోల్పోయింది మాన్సీ శర్మ. ఇటీవల ప్రసారమైన కౌన్ బనేగా కరోడ్‌పతి ఎపిసోడ్‌లో మాన్సీ శర్మకు హాట్‌సీట్ దక్కింది. ఆమె ఢిల్లీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తోంది. అమితాబ్ అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పడం వల్ల 25 లక్షలు గెలుచుకుంది. తర్వాతి ప్రశ్నకు సమాధానం చెప్తే 50 లక్షలు వస్తాయి. అప్పుడు అమితాబ్ అడిగిన ప్రశ్న– పచ్చల రాజధానిగా పేరుబడ్డ ముజో నగరం ఏ దేశంలో ఉంది అని. ఆప్షన్స్‌లో ఎ) నికరాగ్వే బి)నైజీరియా సి)జింబాబ్వే డి)కొలంబియా అని ఇచ్చారు.

అయితే ఈ ప్రశ్నకు మాన్సీ శర్మ జవాబు చెప్పలేకపోయింది. 25 లక్షలతో ఆట ముగించి అంతటితో సంతృప్తి పడింది. ఈ ప్రశ్నకు సరైన జవాబు కొలంబియా. పచ్చల రాజధానిగా పేరుబడ్డ ముజో నగరం ఈ దేశంలోనే ఉంది. ఇక్కడ పచ్చల మైనింగ్ కోసం పూర్వం జాతుల మధ్య రక్తపాతాలు జరిగాయి. స్పానిష్ జాతీయులు ఇక్కడి ఆదివాసులైన ముజో ఇండియన్స్‌ను ఊచకోత కోశారు కూడా. అయితే కాలక్రమంలో ఈ ప్రాంతం అన్ని దాడులను తట్టుకుని నిలబడింది. ఇక్కడి పచ్చల గనుల్లో నేటికీ విలువైన పచ్చలు వెలికి తీస్తున్నారు. అవి ప్రపంచ మార్కెట్‌లో అత్యంత ఖరీదైన పచ్చలుగా డిమాండ్ కలిగి ఉన్నాయి. ఇందుకు కారణం ఇక్కడి పచ్చలు దాదాపు 30 లక్షల సంవత్సరాల క్రితం ఏర్పడినవి అని శాస్త్రవేత్తల అంచనా. అందుకే వీటి క్వాలిటీకి తిరుగు ఉండదు. అన్నట్టు ఇక్కడి ముజో ఇండియన్స్ ఈ పచ్చల గనులకు ఒక దేవత ఉందని నమ్ముతారు. ఆమె పేరు 'ఆరె'. ఆ దేవత చల్లగా చూడటం వల్లే ఇక్కడ పచ్చలు పండుతుంటాయని అంటారు.

హెల్త్

ఫిట్ ఫర్ ఫుట్



దయాబెటిస్ పేషెంట్లలో కాలికి దెబ్బతగిలి, అది సెప్టిక్ కావడంతో కాలు తొలగించాల్సి వచ్చిందని వింటుండటం మామూలే. ఇలా కాలు సెప్టిక్ కావడాన్ని వైద్య పరిభాషలో గ్యాంగ్రీన్ అంటారు. డయాబెటిస్ ఉన్న వారికి కాళ్లకూ, వేళ్లకూ చివర్లలో ఉన్న నరాలు మొద్దుబారుతుండటం సాధారణం. దాంతో వాళ్లకు చిన్న చిన్న దెబ్బలు తగిలినా నొప్పి తెలియదు. కొందరిలోనైతే చిన్న చిన్న గులకరాళ్లు గుచ్చుకున్నా కాలికి గ్యాంగ్రీన్ వచ్చే వరకు విషయం తెలియదు. తీరా పరిస్థితి విషమించాక వారు తమ ఫిజిషియన్ దగ్గరకు రావడం, వాళ్లు వ్యాస్క్యులార్ సర్జన్ దగ్గరికి పంపితే కాలు తొలగించాల్సిన పరిస్థితి అని చెప్పడం చాలామందికి ఎదురయ్యే పరిస్థితే! ఈ పరిస్థితి నివారించడానికి ఏం చేయాలో తెలిపే కథనమిది.

డయాబెటిస్‌తో బాధపడే వ్యక్తుల్లో కాలికి ఏదైనా దెబ్బతగిలి అది గ్యాంగ్రీన్‌గా మారిన దాదాపు 80% మందిలో కాలు తొలగించాల్సిన పరిస్థితి తలెత్తవచ్చు. ఇలా కాలు తొలగించడాన్ని వైద్య పరిభాషలో 'నాన్‌ట్రామాటిక్ లోయర్ లింబ్ యాంపుటేషన్'గా చెబుతారు.

పల్లె వాసుల్లో కాలు తొలగింపు ముప్పు...

నిజానికి పట్టణవాసులతో పోలిస్తే డయాబెటిస్ కారణంగా కాలు తొలగింపు ముప్పు పల్లెప్రజల్లోనే ఎక్కువగా ఉంటుంది. దీనికి చాలా కారణాలు ఉన్నాయి. అవి...

● పల్లెల్లోని రక్కిసపొదలతో నిండి ఉండే డొంకదారుల్లో నడుస్తున్నప్పుడు కాలికి ముళ్లు గుచ్చుకోవడం లేదా ముళ్ల కంచెకు కాలు తగిలి చీరుకుపోవడంతో గాయాలు కావడం ● పట్టణ ప్రజలతో పోలిస్తే చెప్పుల్లేకుండా ఖాళీ పాదాలతో నడిచేవారు పల్లెల్లోనే ఎక్కువగా ఉండటం. దాంతో పాదం కింద చిన్న చిన్న గులకరాళ్లు గుచ్చుకోవడం లేదా కాలివేళ్లకు తాకుడు రాయి తలగడం ఎక్కువ ● పశువులను మేతకు విడుస్తున్నప్పుడు అవి పొరబాటున కాలు తొక్కడంతో గాయం కావడం ● వ్యవసాయ పనుల్లో కొడవలి వంటి పదునైన పనిముట్లు తగిలి గాయం కావడం ● డొంకదారులను పశువులు నడవడానికి వీలుగా కంప కొడుతున్నప్పుడు... అది గీరుకుపోవడం... ● పత్తి పంట కోశాక... ఎండిన మొదళ్లపైన పొరబాటున కాలు పడ్డప్పుడు... అవి పాదాల్లో గుచ్చుకుపోవడం.

ఇప్పుడు పట్టణ / నగరా ప్రాంతాల్లోనూ...

ఇలాంటి ప్రమాదాలకు పల్లెల్లో అవకాశాలు ఎక్కువ. అయితే ఇటీవల పట్టణ ప్రాంతాల్లోనూ ఈ తరహా కేసులు పెరుగుతున్నాయి. డిజైనర్ వేర్ పాదరక్షలు ధరించేవారిలో, ఎప్పుడూ కదలకుండా పనిచేస్తూ ఉండే ఐటీ రంగాలకు చెందిన ఉద్యోగుల్లో, ఏదైనా ప్రత్యేక సందర్భాల్లో ఆరుబయట నిర్వహించే ప్రత్యేక పూజలూ / ప్రార్థనల్లో భాగంగా చెప్పులు లేకుండా నడవటం వంటి సందర్భాల్లో పాదాలకు గాయాలు కావడంతో ఇప్పుడు పట్టణ, నగర వాసుల్లో కూడా ఈ తరహా గాయాలు అవుతున్నాయి. అవి పల్లెవాసులకైనా లేదా పట్టణ ప్రాంతాలవారికైనా వాళ్ల కాళ్లకు అయ్యే గాయాలు 'ఫుట్ అల్సర్' అని పిలిచే పుండ్లుగా మారి కాలు దాదాపుగా గ్యాంగ్రీన్‌గా మారినప్పుడు కొందరిలో కాలిని తొలగించాల్సి వచ్చే 'యాంపుటేషన్' తప్పకపోవచ్చు.

కాలు తొలగించాల్సిన పరిస్థితి ఎందుకు వస్తుందంటే..?

సాధారణంగా కాలికి గానీ ఇతరత్రా ఏ అవయవానికైనా గాయమైతే వెంటనే నొప్పి వస్తుంది. గాయమైనప్పుడు ఆ భాగం పూర్తిగా కోలుకోవడానికి వీలుగా మనలోని రక్షణ వ్యవస్థ ఆ భాగంలో 'నొప్పి'ని కలిగిస్తుంది. దాంతో మనం కాలిని కదిలించకుండా దానికి తగినంత విశ్రాంతినిస్తాం. అయితే డయాబెటిస్‌తో బాధపడే వ్యక్తుల్లో నొప్పిని తెలిపే 'నరాలు' మొద్దుబారి ఉండటంతో నొప్పి పెద్దగా తెలియదు. దాంతో అదే కాలిని ఉపయోగిస్తున్నప్పుడు తగిలిన చోటే మళ్లీ మళ్లీ దెబ్బ తగులుతూ గాయం మాటిమాటికీ రేగుతుంది. అప్పుడా ఇన్ఫెక్షన్ దెబ్బతగిలిన చోటి నుంచి పైపైకి పాకవచ్చు. ఇలా జరగడాన్ని వాడుక భాషలో మనం సెప్టిక్ కావడం అంటుంటాం.

గాయం ఒక ముప్పు అయితే గ్యాంగ్రీన్ మరో ముప్పు...

మన దేహంలోని ప్రతి అవయవానికీ, అందులోని ప్రతి కణానికీ నిత్యం రక్తసరఫరా జరుగుతూ ఉంటుంది. అలాగే దేహంలోని ప్రతి భాగానికీ స్పర్శ తెలిపే నరాలూ ఆవరించుకుని ఉంటాయి. వాటి వల్ల మనకు స్పర్శజ్ఞానంతో పాటు దెబ్బతగిలినప్పుడు నొప్పి, బాధ తెలుస్తుంటాయి. కాలక్రమంలో డయాబెటిస్ వ్యాధి నరాల చివరలను మొద్దుబారేలా చేయడం వల్ల దేహంలోని కొన్ని భాగాలు... మరీ ముఖ్యంగా కాలివేలి చివర్లలో స్పర్శజ్ఞానం అంతగా తెలియదు. పైగా దేహంలోని చివరి భాగాలకు రక్తం సరఫరా చేసే అతి సన్నటి రక్తనాళాల్లో (క్యాపిల్లరీస్) అడ్డంకులు ఏర్పడటం వల్ల అక్కడికి అందాల్సిన పోషకాలు, ఆక్సిజన్ అందకపోవడంతో ఆ భాగం కుళ్లిపోవడం మొదలవుతుంది. ఇలా జరగడాన్ని 'గ్యాంగ్రీన్'గా చెబుతారు. స్పర్శజ్ఞానం, నొప్పి తెలియకపోవడంతో గ్యాంగ్రీన్ మొదలైనప్పటికీ ఆ విషయమే డయాబెటిస్ బాధితులకు వెంటనే తెలియదు. అలా ఇన్ఫెక్షన్ పైపైకి పాకుతూ పోతుంటే మొత్తం ప్రాణానికే ప్రాణాపాయం జరిగే అవకాశముంటుంది కాబట్టి గ్యాంగ్రీన్ ఎంతవరకు పాకిందో అక్కడి వరకు ఆ కుళ్లిన భాగాన్ని తొలగించాలంటూ (యాంపూట్ చేయాలంటూ) డాక్టర్లు చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

ప్రమాదం కేవలం కాళ్లకేనా..?

ఇలా యాంపూటేషన్ చేయాల్సిన పరిస్థితి కేవలం కాళ్లకు మాత్రమే కాకుండా చేతులకూ వచ్చే ప్రమాదముంది అయితే కాళ్లతో పోలిస్తే చేతులూ, చేతి వేళ్లతో మనం ప్రతినిత్యం పనిచేస్తుంటాం కాబట్టి... చేతులకు అలాంటి కండిషన్ వస్తే కాళ్లతో పోలిస్తే త్వరగా తెలిసిపోతుంది. అందుకే చేతులతో పోలిస్తే కాళ్లు, కాలివేళ్లకే గ్యాంగ్రీన్ ముప్పు మరింత ఎక్కువ.

మరో జాగ్రత్త 'యాంకిల్ బ్రేకిల్ ఇండెక్స్' పరీక్ష...

● ఏడాదికోసారి లేదా డాక్టర్లు చెప్పిన విధంగా పాదాల విషయంలో వైద్యులను కలిసి పాదాలకు పల్స్ చెక్ చేయించుకుంటూ ఉండాలి. చేతుల మణికట్టు దగ్గర చూసినట్టే... డాక్టర్లు కాలి దగ్గర కూడా పల్స్ చెక్ చేసి చూస్తారు. అక్కడ నాడీస్పందనలు ఎలా ఉన్నాయో పరిశీలిస్తారు. అలాగే యాంకిల్ బ్రేకిల్ ఇండెక్స్ అని మరో పరీక్ష ఉంటుంది. ఇందులో బీపీ పరిశీలించేటప్పుడు చేతికి చుట్టినట్టే కాలి దగ్గర కూడా బీపీ పరిశీలించేప్పుడు చుట్టే పట్టా చుట్టి ఈ పరీక్ష చేసి, కాలిలో బీపీ కొలత చూస్తారు. కొలత విలువ 'ఒకటి (1)' ఉంటే అంతగా ఆందోళన పడాల్సిందేమీ ఉండదు. కానీ ఈ కొలత 0.5 కంటే తగ్గుతూ పోతూ ఉంటే (అంటే ఆ విలువలో సగానికంటే తక్కువగా ఉంటే... చేతితో పోలిస్తే అందులో సగం కంటే తక్కువగా ఉంటే) కాలిలో రక్త ప్రసరణ తగ్గుతూ ఉందని అర్థం. ఇలాంటప్పుడు 'సూపర్‌వైజ్‌డ్ ఎక్సర్‌సైజ్ థెరపీ'లాంటి వ్యాయామాల చికిత్స తప్పక అవసరమని గుర్తించాలి.

చివరగా... డయాబెటిక్ ఫుట్ సమస్యలో పాదానికి పుండ్లు పడ్డప్పుడు అది కేవలం వాస్క్యులార్ సర్జన్ మాత్రమే కాకుండా ఒక సమగ్రమైన కార్యాచరణతో పలువురు నిపుణులు ఓ బృందంగా ఏర్పడి చికిత్స అందించాల్సి అవసరం ఉంటుంది. ఇందులో వాస్క్యులార్ సర్జన్‌లు, ప్లాస్టిక్ సర్జన్‌లు, డయాబెటాలజిస్టులు, ఫుట్ యాంకిల్ సర్జన్లు, పోడియాట్రిక్ నిపుణులు, ఇంటర్నల్ మెడిసిన్ చికిత్సకులు, ఫిజియోథెరపిస్టులు ఇలా టీమ్‌వర్క్‌తో డయాబెటిక్ లింబ్ సాల్వేజ్ టీమ్‌గా ఏర్పడి పాదాన్ని రక్షించడానికి ప్రయత్నిస్తారు. ఆ తర్వాత ఆహారంలో చక్కెర మోతాదులను తగ్గించేవిధంగా న్యూట్రిషనిస్టులు, రక్తంలో చక్కెరను అదుపు చేయడానికీ, రక్తంలో కొవ్వులు తగ్గించే మందులిచ్చే జనరల్ ఫిజీషియన్లు... ఇలా డాక్టర్ల బృందమంతా సమగ్రంగా పనిచేయాల్సి ఉంటుంది.

కాళ్లను కాపాడుకోవడం ఇలా...

చాలాకాలంగా (ఐదు, పదేళ్లకు పైగా) చక్కెర వ్యాధితో బాధపడుతున్నవారు తమ కాళ్లు, పాదాలను చాలా జాగ్రత్తగా పరిశీలించుకుంటూ ఉండాలి. పాదాల పరిరక్షణ కోసం కొన్ని సూచనలివి...

● కాలిగోళ్లను ప్రతివారమూ కట్ చేసుకోవాలి. ఈ సమయంలో గోళ్లను మరీ లోపలికి కట్ చేసుకోకూడదు. అలాంటప్పుడు ఒక్కోసారి గోరు మూలల్లో రక్తం వచ్చేంతగా గోరు కట్ కావచ్చు. ఇది జరిగినప్పుడు కొందరిలో గోరు లోపలి వైపునకు పెరగవచ్చు. డయాబెటిస్ బాధితుల్లో ఇది చాలా ప్రమాదకరం.

● వేడి వస్తువుల నుంచి కాళ్లను దూరంగా ఉంచుకోవాలి.

● పాదాలను మృదువుగా ఉంచుకోవాలి. ఇందుకోసం కాళ్లు కడుక్కున్న తర్వాత పొడిగా తుడుచుకొని, ఆ తర్వాత వాజిలైన్ రుద్దుకొని, మళ్లీ ఆ తర్వాత పొడిగా మారేంతవరకు తుడుచుకోవాలి.

● పాదాలను ప్రతి నిత్యం పొడిగా ఉంచుకోవాలి. కాళ్లు కడుక్కున్న వెంటనే అవి పొడిబారే వరకు తుడుచుకోవాలి. కాలి వేళ్ల మధ్య పొడిగా ఉండటం కోసం పౌడర్ రాసుకోవాలి.

● ఎవరికి వారు కాళ్లను స్వయంగా పరీక్షించుకుంటూ ఉండాలి. ఇందుకోసం పాదాల కింద అద్దం పెట్టుకుని, పాదాల అడుగుభాగం ఎలా ఉందో చూసుకుంటూ ఉండాలి. అలాగే కాలి పైభాగాన్ని కూడా శ్రద్ధగా పరిశీలించుకోవాలి. కాలి వేళ్ల మధ్య భాగాలనూ జాగ్రత్తగా చూస్తూ... అక్కడ చిన్న పొక్కుల్లాంటివి ఏవైనా ఉన్నాయేమో చూడాలి. అలాంటివి ఉంటే వెంటనే డాక్టర్‌కు తెలపాలి. లేదంటే అవి పుండ్లుగా మారే ప్రమాదం ఉండవచ్చు.

● కాలికి చెప్పులు, బూట్లు లేకుండా నడవకూడదు. అయితే ఈ చెప్పులు, బూట్లు కాలికి సౌకర్యంగా ఉండాలి. ఏమాత్రం అసౌకర్యం ఉన్నా అలాంటివి తొడగడం సరికాదు.

● కాళ్ల మీద పులిపిరి కాయల్లాంటివి ఏవైనా ఏర్పడితే డాక్టర్‌ను సంప్రదించి, వారి పర్యవేక్షణలోనే వాటిని తొలగించుకోవాలి. లేదంటే అవే భవిష్యత్తులో పుండ్లుగా మారే అవకాశం లేకపోలేదు.

● ఇంట్లో కూడా పాదరక్షలు లేకుండా నడవకూడదు. ప్రత్యేకంగా తడి, తేమలో పనిచేసే మహిళలు (పురుషులు కూడా) స్లిప్పర్స్ వంటివి తొడుక్కునే పనిచేసుకోవాలి.

మానని పుండ్లకు చికిత్స ఇలా...

కాలిపైన పుండుగానీ లేదా చాలాకాలం వరకు మానని గాయం గానీ ఉంటే వెంటనే డాక్టర్‌కు చూపించుకోవాలి. ఇలా ఎంత త్వరగా డాక్టర్‌కు చూపిస్తే కాలిని కాపాడుకునే అవకాశాలు అంత ఎక్కువని గుర్తుంచుకోవాలి.

● యాంకిల్ బ్రేకిల్ ఇండెక్స్ పరీక్షలో కాలి నాడీ స్పందనల కొలత 0.5 కు లేదా అంతకంటే తగ్గుతున్నప్పుడు 'సూపర్‌వైజ్‌డ్ ఎక్సర్‌సైజ్ థెరపీ' కింది రోజుకు అరగంటకు తగ్గకుండా, అది కూడా వారంలో ఐదు రోజులకు తగ్గకుండా బ్రిస్క్‌వాకింగ్ ఎక్సర్‌సైజ్ చేయాలి. దీనివల్ల యాంజియోగ్రామ్‌కు మించిన ఫలితం ఉంటుందని చాలా పరిశోధనల్లో నిర్ధారణ అయ్యింది ● ఇలా యాంకిల్ బ్రేకిల్ ఇండెక్స్ పరీక్షలో కొలత 0.5 కంటే తగ్గుతున్నవారిలో ప్రొటీన్‌తో కూడిన ఆహారాలూ, ద్రవాహారాలు ఎక్కువగా తీసుకుంటూ ఉండాలి. దీని వల్ల రక్తప్రసరణ వేగం పెరగడం వల్ల కాలికి జరగాల్సిన నష్టం నివారితమవుతుంది ● కాలిలో రక్తప్రసరణ వేగాలు తగ్గుతున్నాయని గుర్తించిన తొలి దశల్లో రక్తాన్ని పలచబార్చేవీ, కాలిలో రక్తప్రసరణవేగాన్ని మెరుగుపరిచేవి కొన్ని రకాల మందులతో మున్ముందు రాబోయే కాలి తొలగింపు ముప్పును నివారించవచ్చు ● అత్యాధునిక టీసీపీఓటూ (క్యూటేనియస్ ఆక్సిజన్ మెజర్‌మెంట్) పరీక్షతో అతి సన్నటి రక్తనాళాల (క్యాపిల్లరీస్) ద్వారా కాలి కొనగోరు చివరల వరకూ ఆక్సిజన్ అందుతున్న తీరును పరిశీలించి ఒకవేళ అందకపోతే ఇవ్వాల్సిన చికిత్సను డాక్టర్లు నిర్ణయిస్తారు. ఇలాంటి కొన్ని సందర్భాల్లో రక్తం అందడం లేదు / పుండు పడి మానడం లేదని తెలిస్తే మొదట 'యాంజియోగ్రామ్' ప్రక్రియ ద్వారా రక్తప్రసరణను మెరుగుపరచవచ్చు. అప్పటికీ రక్తప్రసరణ మెరుగుపడటకపోతే 'బైపాస్' వంటి కొన్ని ప్రత్యామ్నాయాలు అందుబాటులో ఉన్నాయి. అదీ కుదరకపోతే 'వీనస్ ఆర్టీరియలైజేషన్' ప్రక్రియ అనే మరో ప్రత్యామ్నాయం అందుబాటులో ఉంది. అంటే ఇందులో సిరలూ, ధమనులను కలిపి... కొనగోరు చివరి వరకూ రక్త ప్రసరణ సరిగా జరిగేలా చూస్తారు ● గాయానికి చికిత్సను ఎంత త్వరగా అందిస్తే అది అంత త్వరగా మానుతుంది. పుండు మానకుండా మరింత ఆలస్యమయ్యేకొద్దీ అది గ్యాంగ్రీన్‌గా మారే అవకాశాలెక్కువ. ఇలా డాక్టరుకు గాయాన్ని చూపించడం ఆలస్యమైనవాళ్లలో డాక్టర్లు 'స్టెమ్ సెల్ థెరపీ' వంటి అత్యాధునిక ప్రక్రియలతో కాలిని కాపాడే అవకాశం ఉంది.



డా॥ కార్తీక్ మిక్కినేని
సీనియర్
వాస్క్యులార్ సర్జన్

డయాబెటిక్ ఫుట్ విస్తృతి

డయాబెటిస్ కారణంగా ప్రపంచవ్యాప్తంగా ప్రతి 20 సెకండ్లకు ఒకరికి కాలు లేదా పాదం తొలగించాల్సిన దుస్థితి కలుగుతోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాల ప్రకారం మధుమేహంతో బాధపడేవారిలో సుమారు 25 శాతం మందిలో తమ జీవితకాలంలో కనీసం ఒకసారైనా కాలికి డయాబెటిస్ కారణంగా పుండు (డయాబెటిక్ అల్సర్) వచ్చే అవకాశముంటుంది. ఇలా పుండ్లు పడ్డవారిలో కనీసం నాలుగోవంతు మందికి పాదాలు తొలగించాల్సిన ముప్పు కలుగుతుందని డబ్ల్యూహెచ్ఓ పేర్కొంటోంది.





ఆసియాకప్ మహిళల హాకీ ఫైనల్లో భారత్

హాంగ్జౌ (చైనా): భారత మహిళల హాకీ జట్టు ఆసియా కప్ టోర్నమెంట్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. 'సూపర్–4' దశ చివరి మ్యాచ్‌లో శనివారం డిఫెండింగ్ చాంపియన్ జపాన్‌తో పోరును భారత జట్టు 1–1 గోల్స్‌తో 'డ్రా' చేసుకుంది. భారత్ తరఫున బ్యూటీ డుంగ్ డుంగ్ 7వ నిమిషంలో గోల్ సాధించింది. చివరి క్వార్టర్ వరకు ఆధిక్యాన్ని కొనసాగించిన టీమిండియా... విజయం సాధించడం ఖాయమే అనుకుంటుండగా... 58వ నిమిషంలో కోబయకావా షిహో గోల్‌తో జపాన్ స్కోరు సమం చేసింది. ఇరు జట్ల మధ్య గ్రూప్ దశలో జరిగిన మ్యాచ్ సైతం 'డ్రా'గానే ముగిసింది. మరో మ్యాచ్‌లో చైనా 1–0 గోల్స్ తేడాతో దక్షిణ కొరియాపై గెలవడంతో టీమిండియా ఫైనల్‌కు అర్హత సాధించింది. దీంతో 'సూపర్–4' దశలో మూడు మ్యాచ్‌లాడిన భారత్ ఒక విజయం, ఒక పరాజయం, ఒక 'డ్రా'తో 4 పాయింట్లు ఖాతాలో వేసుకొని పట్టిక రెండో స్థానంతో ఫైనల్లో అడుగుపెట్టింది. నేడు జరగనున్న ఫైనల్లో చైనాతో భారత్ తలపడనుంది. ఇందులో గెలిచిన జట్టు వచ్చే ఏడాది బెల్జియం, నెదర్లాండ్స్ వేదికగా జరగనున్న ప్రపంచకప్‌నకు నేరుగా అర్హత సాధిస్తుంది.

క్వాలిఫయర్స్‌కు భారత్

- రివర్స్ సింగిల్స్‌లో గెలిపించిన నగాల్
- 3–1తో స్విట్జర్లాండ్‌పై విజయం
- డేవిస్ కప్ టెన్నిస్ టోర్నీ



బీల్ (స్విట్జర్లాండ్): మూడు దశాబ్దాల తర్వాత డేవిస్ కప్‌లో భారత జట్టు ఓ ఘనమైన విజయంతో ముందంజ వేసింది. డేవిస్ కప్ టెన్నిస్ వరల్డ్ గ్రూప్–1 టైలో భాగంగా స్విట్జర్లాండ్‌తో జరిగిన ఈ మ్యాచ్‌లో భారత్ 3–1తో విజయం సాధించింది. తొలి రోజు కొత్త కుర్రాడు దక్షిణేశ్వర్‌తో పాటు భారత స్టార్ సుమిత్ నగాల్ వరుస విజయాలతో సింగిల్స్‌లో 2–0తో క్లీన్‌స్వీప్ చేసిన భారత్‌కు రెండో రోజు శనివారం డబుల్స్‌లో పరాజయం ఎదురైంది. దీంతో భారత్ ఆధిక్యం 2–1కి తగ్గింది. ఈ దశలో రివర్స్ సింగిల్స్ బరిలోకి దిగిన భారత నంబర్‌వన్ టెన్నిస్ స్టార్ సుమిత్ 6–1, 6–3తో హెన్రీ బెర్నెట్‌పై విజయం సాధించాడు. దీంతో ఈ 'టై'లో భారత్ గెలుపొందింది. ఫలితం రావడంతో నామమాత్రమైన రెండో రివర్స్ సింగిల్స్ మ్యాచ్‌ను నిర్వహించలేదు. మూడేళ్ల క్రితం 2022లో డెన్మార్క్‌పై గెలిచినప్పటికీ ఇది న్యూఢిల్లీ వేదికపై జరిగింది. తాజా విజయంతో డేవిస్ కప్ క్వాలిఫయర్స్‌కు భారత్ అర్హత సాధించింది. తొలిరౌండ్ డేవిస్ కప్ క్వాలిఫయర్స్ పోటీలు వచ్చే జనవరిలో జరుగుతాయి. అంతకుముందు జరిగిన డబుల్స్‌లో భారత బృందానికి నిరాశ ఎదురైంది. శ్రీరామ్ బాలాజీతో జోడీగా బరిలోకి దిగిన తెలంగాణ ఆటగాడు రిత్విక్ బొల్లిపల్లి జంటకు ఆతిథ్య స్విట్జర్లాండ్ జోడీ చేతిలో చుక్కెదురైంది. రిత్విక్–బాలాజీ ద్వయంకు 7–6 (8/3), 4–6, 5–7తో జాకుబ్ పాల్–డామినిక్ స్ట్రికెర్ జంట చేతిలో పరాజయం ఎదురైంది. మొత్తమ్మీద విదేశీ గడ్డపై భారత్ చివరిసారిగా 1993లో గెలిచింది.

ఫైనల్లో సాత్విక్–చిరాగ్ జోడీ

- సింగిల్స్ టైటిల్ పోరుకు లక్ష్యసేన్
- హాంకాంగ్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ




లక్ష్యసేన్

హాంకాంగ్: భారత బ్యాడ్మింటన్ అగ్ర శ్రేణి డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి హాంకాంగ్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–500 టోర్నీలో టైటిల్ పోరుకు సిద్ధమైంది. సింగిల్స్‌లో లక్ష్యసేన్ కూడా ఫైనల్లోకి దూసుకెళ్లాడు. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 20వ స్థానంలో ఉన్న భారత ఆటగాడు 23–21, 22–20తో ప్రపంచ తొమ్మిదో ర్యాంకర్, మూడో సీడ్ చౌ తియెన్ చెన్ (చైనీస్ తైపీ)ని కంగు తినిపించాడు. సుమారు గంటపాటు హోరాహోరీగా జరిగిన సమరంలో లక్ష్యసేన్ ఏ దశలోనూ పట్టు సడలించలేదు. నేడు జరిగే టైటిల్ పోరులో చైనాకు చెందిన రెండో సీడ్ లి షి ఫెంగ్‌తో అమీతుమీ తేల్చుకోనున్నాడు. ఈ ఏడాది సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి అద్భుతమైన ఫామ్‌లో ఉన్నప్పటికీ సెమీస్‌తోనే ఆగిపోతున్నారు. ఆరు టోర్నీల్లో సెమీస్‌తోనే ముగిసిన భారత జోడీ పోరాటం ఇక్కడ ఫైనల్‌కు చేరింది. ఈ సీజన్‌లో తొలిసారి సాత్విక్–చిరాగ్‌లు ఎట్టకేలకు టైటిల్ వేటలో అడుగు దూరంలో ఉన్నారు. తాజా ప్రపంచ చాంపియన్‌షిప్‌లో కాంస్య విజేత అయిన భారత డబుల్స్ జోడీ వరుస సెట్లలో చైనీస్ తైపీకి చెందిన బింగ్ వే లిన్–చెన్ చెంగ్ కున్ జంటను కంగుతినిపించింది. ప్రపంచ తొమ్మిదో ర్యాంకులో ఉన్న సాత్విక్–చిరాగ్ ద్వయం 21–17, 21–15తో తైపీ జోడీని కంగుతినిపించింది. ఆదివారం జరిగే టైటిల్ పోరులో ఎనిమిదో సీడ్ భారత జోడీ... పారిస్ ఒలింపిక్స్‌లో రజత పతక విజేతలైన లియాంగ్ వే కెంగ్–వాంగ్ చాంగ్ (చైనా) జంటతో తలపడుతుంది.

అసలు సమరానికి సమయం

నేడు భారత్, పాకిస్తాన్ మధ్య మ్యాచ్

ఆసియా కప్‌లో దాయాదుల పోరు ● రా.గం.8 నుంచి సోనీ స్పోర్ట్స్‌లో...


సూర్యకుమార్ గిల్

సరిహద్దు ఉద్రిక్తతలు, విభేదాలు, వివాదాలు, విమర్శలు ఎన్ని ఉన్నా క్రికెట్ మైదానానికి వచ్చేసరికి ఈ మ్యాచ్ ఫలితంపై అందరి దృష్టి పడుతుంది... బలాబలాల మధ్య ఆకాశమంత అంతరం ఉన్నా ఆసక్తి విషయంలో ఎక్కడా లోటుండదు. ఆటగాళ్లు మారినా, వేదికలు మారినా అభిమానుల్లో ఈ పోరు కొత్త ఉత్సాహాన్ని రేపుతుంది. దాయాది జట్లు భారత్, పాకిస్తాన్ మధ్య ఆసియా కప్‌లో జరిగే మ్యాచ్‌లో నేడు తలపడనున్నాయి. పహల్గావ్ ఘటనను దృష్టిలో ఉంచుకొని మ్యాచ్‌ను బాయ్‌కాట్ చేయాలంటూ ఎన్నో వైపులనుంచి పిలుపులు వచ్చినా క్రికెటర్లు, నిర్వాహకులు, ప్రసారకర్తలు తమ పని తాము చేసుకుంటూ మ్యాచ్‌కు బహుళ ప్రచారాన్ని కల్పిస్తున్నారు.


సల్మాన్ ఆగా

దుబాయ్: ఆసియా కప్ లీగ్ దశలో మొత్తం 12 మ్యాచ్‌లు జరుగుతాయి. మిగతా 11 మ్యాచ్‌లపై ఆసక్తి, ప్రేక్షకుల స్పందన చూస్తే అతి పేలవం. టోర్నీని నిలబెట్టగలిగే, భాగస్వాములకు కాస్త ఆర్థిక పుష్టి అందించే మ్యాచ్ ఏదైనా ఉందంటే అది భారత్, పాకిస్తాన్ మధ్య జరిగే పోరు మాత్రమే. గత ఏడాది జరిగిన టి20 వరల్డ్ కప్ తర్వాత ఈ రెండు టీమ్‌లు ఈ ఫార్మాట్‌లో తలపడటం ఇదే మొదటిసారి. భారత తరఫున సీనియర్లు రోహిత్, కోహ్లి నిష్క్రమించగా...పాక్ జట్టుకు బాబర్, రిజ్వాన్ దూరమయ్యారు. దాంతో ఎక్కువ మంది యువ ఆటగాళ్లు తమ సత్తా చాటాలని పట్టుదలగా ఉన్నారు. ఆసియా కప్‌లో తాము ఆడిన తొలి మ్యాచ్‌లో యూఏఈని భారత్ చిత్తు చేయగా...ఇదే తరహాలో ఒమన్‌పై పాక్ విజయం సాధించింది.

అదే జట్టుతో...

టోర్నీ తొలి పోరులో తమ స్థాయికి తగ్గ ప్రదర్శనతో చెలరేగిన భారత్ అదే జోరును కొనసాగించాలని భావిస్తోంది. ఆ మ్యాచ్‌లో బౌలర్లంతా ఆకట్టుకోగా, ఓపెనర్లకు మినహా మిగతావారికి బ్యాటింగ్ అవకాశమే రాలేదు. అభిషేక్ శర్మ మరోసారి విధ్వంసకర బ్యాటింగ్‌కు సై అంటుండగా, మరో ఓపెనర్ గిల్ కూడా పాక్‌పై చెలరేగాలని పట్టుదలగా ఉన్నాడు. గిల్ ఇప్పటి వరకు పాకిస్తాన్‌పై ఒక్క టి20 మ్యాచ్ కూడా ఆడలేదు. పాక్‌పై ఇప్పటి వరకు 20 పరుగులు దాటలేకపోయిన సూర్యకుమార్ యాదవ్ కూడా లెక్క సరిచేసేందుకు సిద్ధమయ్యాడు. సంజు, తిలక్, దూబే, హార్దిక్‌లతో విధ్వంసకర లైనప్ టీమిండియాకు భారీ స్కోరును అందించగలదు. ఆల్‌రౌండర్‌గా అక్షర్ తన విలువ చూపిస్తే పాక్‌కు ఇబ్బంది తప్పదు. బుమ్రా ప్రమాదకర బౌలింగ్‌ను పాక్ బ్యాటర్లు ఏమాత్రం ఎదుర్కోగలరనేది సందేహమే. పాండ్యా, దూబేల రూపంలో ఆల్‌రౌండర్లు అందుబాటులో ఉండటంతో రెండో పేసర్ అవసరం జట్టుకు లేదు. కుల్దీప్, వరుణ్‌లను ప్రత్యర్థిని పూర్తిగా కట్టిపడేయగల సమర్థులు.

పిచ్, వాతావరణం

దుబాయ్‌లో సాధారణంగా భారీ స్కోర్లు నమోదు కావు. అటు పేసర్లు, ఇటు స్పిన్నర్లు కూడా మంచి ప్రభావం చూపే అవకాశం ఉంది. మ్యాచ్‌కు వర్ష సూచన లేదు కానీ క్రికెటర్లు తీవ్రమైన ఎండలను తట్టుకోవాల్సి ఉంది.

తుది జట్లు (అంచనా)

భారత్: సూర్యకుమార్ (కెప్టెన్), అభిషేక్, గిల్, సామ్సన్, తిలక్, శివమ్ దూబే, పాండ్యా, అక్షర్, కుల్దీప్, బుమ్రా, వరుణ్. **పాకిస్తాన్:** సల్మాన్ ఆగా (కెప్టెన్), ఫర్హాన్, అయూబ్, ఫఖర్, హసన్, హారిస్, నవాజ్, ఫహీమ్, అఫ్రిది, ముఖీమ్, అబ్రార్

ఇషా పసిడి గురి



నింగ్బో (చైనా): అంతర్జాతీయ షూటింగ్ క్రీడా సమాఖ్య (ఐఎస్‌ఎస్‌ఎఫ్) ప్రపంచకప్‌లో చాలా ఆలస్యంగా భారత్ ఐదో రోజు పతకాల పట్టికలో నిలిచింది. తెలంగాణ షూటర్ ఇషా సింగ్ పసిడి సాధించడంతో ఎట్టకేలకు భారత్ బోణీ కొట్టింది. ప్రపంచ కప్‌లో ఆమెకిది తొలి వ్యక్తిగత స్వర్ణం కావడం విశేషం. శనివారం జరిగిన మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో 20 ఏళ్ల తెలంగాణ షూటర్ విజేతగా నిలిచింది. ఎనిమిది మంది షూటర్లు బరిలోకి దిగిన ఫైనల్లో ఇషా సింగ్ 242.6తో చైనా ఫేవరెట్ యావో క్వియన్‌జున్ (242.5)పై గెలిచింది. వీరిద్దరి గురి దాదాపు లక్ష్య బిందువుకు సమీపంగా ఉండటంతో పాయింట్ల సాధనలో దీటుగా కదిలారు. చివరకు కేవలం 0.1 తేడాతో భారత అమ్మాయి బంగారం గెలుపొందగా, స్థానిక షూటర్ రజతానికి పరిమితమైంది.

ఫైనల్లో మీనాక్షి

ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్



లివర్‌పూల్: బాక్సింగ్ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో భారత బాక్సర్ల పంచ్ ఫైనల్‌కు చేరుతోంది. తాజాగా మీనాక్షి హుడా తుది పోరుకు అర్హత సంపాదించింది. దీంతో మొత్తం ముగ్గురు ఫైనల్ చేరడం ద్వారా కనీసం మూడు రజతాలైనా దక్కుతాయి. శనివారం జరిగిన మహిళల 48 కేజీల సెమీఫైనల్లో ఆసియా చాంపియన్‌షిప్, ప్రపంచకప్ రజత పతకాల విజేత మీనాక్షి 5–0తో మంగోలియాకు చెందిన లుట్‌సైఖాన్‌పై ఏకపక్ష విజయం సాధించింది. ఇదివరకే జైస్మిన్ లాంబోరియా (57 కేజీలు), నుపుర్ షెరాన్ (ప్లస్ 80 కేజీలు) ఫైనల్లోకి ప్రవేశించారు. స్వర్ణ పతక బౌట్‌లో మీనాక్షి... కజకిస్తాన్‌కు చెందిన నజీమ్ కిజైబయ్‌తో పోటీపడనుంది.

- ప్రపంచ అథ్లెటిక్స్ ఫలితాలు
- దులీప్ ట్రోఫీ వివరాలు

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ–పేపర్‌లో

నవంబరులో సంగీత విభావరి


● ఇళయరాజా

ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా సంగీత విభావరి (మ్యూజికల్ లైవ్ కన్సర్ట్) నిర్వహిస్తుంటారనే విషయం తెలిసిందే. అందులో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లో నవంబరు 8న మ్యూజికల్ లైవ్ కన్సర్ట్ చేయనున్నారు. విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం ఇందుకు వేదిక కానుంది. 'ట్రెండ్‌సెట్టర్స్.లైవ్' సుధాకర్ ఈ వేడుకని నిర్వహిస్తున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఇళయరాజా, మంత్రి టీజీ భరత్ విడుదల చేశారు. ఈ సందర్భంగా 'ట్రెండ్ సెట్టర్స్.లైవ్' సుధాకర్ మాట్లాడుతూ– ''సినీ సంగీతానికి జీవనాడిగా ఉన్న ఇళయరాజాగారితో ఈ సంగీత విభావరి నిర్వహించనుండటం సంతోషంగా ఉంది. 40 మంది సభ్యులతో ఆయన ఈ లైవ్ కన్సర్ట్‌కు హాజరవుతున్నారు'' అని చెప్పారు.

నిన్ను వదిలేయడం అంటే..


● అంకిత్, నీలఖి

అంకిత్ కొయ్య, నీలఖి పాత్ర హీరో హీరోయిన్లుగా, వీకే నరేశ్, వాసుకి, నందగోపాల్, సోనియా చౌదరి ఇతర ప్రధాన పాత్రల్లో నటించిన ఎమోషనల్ లవ్‌స్టోరీ 'బ్యూటీ'. జేఎస్‌ఎస్ వర్ధన్ దర్శకత్వంలో అడిదల విజయ్పాల్ రెడ్డి, ఉమేష్ కుమార్ బన్సల్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 19న విడుదల కానుంది. ఈ సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ను హీరో నాగచైతన్య విడుదల చేసి, చిత్రబృందానికి ఆల్ ది బెస్ట్ చెప్పారు. 'నిన్ను వదిలేయడం అంటే ఊపిరి వదిలేయడమే కన్నా..', 'ఏంటి... ఫాలో చేస్తున్నావా', 'బండి ఎక్కాను కదా అని అడ్వాంటేజ్ తీసుకోకు..' 'కూతురు అడిగిందంతా ఇవ్వాలంటే ప్రేమ ఒక్కటే సరిపోదండి' అనే డైలాగ్స్ ఈ సినిమా ట్రైలర్‌లో ఉన్నాయి. ''తండ్రీ–కూతుర్ల అనుబంధం, హీరో హీరోయిన్ల లవ్ ట్రాక్, మధ్యతరగతి కుటుంబ కష్టాలు... ఇలా అన్ని అంశాలతో ఈ సినిమా ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉంటుంది'' అని యూనిట్ పేర్కొంది.

మీరెప్పుడూ చూసుండరు


● చందన, రాజా

సూపర్ రాజా, వంశీ గోనె, చందన పాలంకి, రమ్య ప్రియ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ఇలాంటి సినిమా మీరెప్పుడు చూసుండరు'. సూపర్ రాజా స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 19న విడుదల కానుంది. ఈ సినిమా మొత్తాన్ని ఒకే షాట్‌లో చిత్రీకరించామని యూనిట్ పేర్కొంది. ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో సూపర్ రాజా మాట్లాడుతూ– ''క్రియేటివిటీయే బ్యాక్‌గ్రౌండ్, కసియే బలం... ఈ రెండు ఆయుధాలతో పరిశ్రమలో అద్భుతాలు చేయొచ్చు. వదలకుండా ప్రయత్నిస్తే ఓ మనిషి ఏం చేయగలడో ఈ నెల 19న థియేటర్స్‌లో చూస్తారు. మా సినిమాను డిస్ట్రిబ్యూట్ చేస్తున్న మైత్రీవాళ్లకు ధన్యవాదాలు'' అని తెలిపారు. ''సోషల్ మీడియాలో సూపర్ రాజా గురించి తెలుసుకుని, ఆయనతో మాట్లాడాను. ఈ సినిమా చూశాక షాక్ అయ్యాను. సింగిల్ టేక్‌లో ఈ సినిమా ఎలా చేశారు? అనే ఆశ్చర్యం వేసింది. మంచి కంటెంట్ ఉన్న సినిమాను నిర్మాతలు రవి, నవీన్, విశ్వప్రసాద్ ప్రోత్సహిస్తారు'' అని మైత్రి డిస్ట్రిబ్యూటర్ శశిధర్ పేర్కొన్నారు. ''1400 డైలాగ్స్‌ని 100 నిమిషాల్లో చెప్పడం అంటే మామూలు విషయం కాదు. దాని కోసం చాలా కష్టపడ్డాం'' అని వంశీ గోనె తెలిపారు. ఈ కార్యక్రమంలో నటి చందన మాట్లాడారు.

క్లాసికల్ డ్యాన్సర్‌గా...


● శ్రద్ధా కపూర్

'స్త్రీ 2' వంటి బ్లాక్‌బస్టర్ సినిమా తర్వాత బాలీవుడ్ హీరోయిన్ శ్రద్ధా కపూర్ నటించనున్న సినిమాపై అతి త్వరలో అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది. విక్కీ కౌశల్‌తో 'ఛావా' వంటి బ్లాక్ బస్టర్ సినిమా తీసిన లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వం వహించనున్న తాజా చిత్రంలో శ్రద్ధా కపూర్ నటించనున్నారని బాలీవుడ్ సమాచారం. ఈ ఫీమేల్ ఓరియంటెడ్ సినిమా పనులు ఆల్రెడీ ప్రారంభమయ్యాయని, ఈ చిత్రంలో క్లాసికల్ డ్యాన్సర్ పాత్రలో శ్రద్ధా కపూర్ నటించనున్నారని టాక్. నవంబరులో ఈ సినిమా చిత్రీకరణను ప్రారంభించేలా సన్నాహాలు చేస్తున్నారట దర్శకుడు లక్ష్మణ్. మరోవైపు ఈ సినిమా కోసం ప్రస్తుతం శ్రద్ధగా క్లాసికల్ డ్యాన్స్‌లో ప్రత్యేక శిక్షణ తీసుకునే పనిలో ఉన్నారట శ్రద్ధా కపూర్. మహారాష్ట్ర చరిత్ర, సంస్కృతిని చాటి చెప్పేలా ఈ సినిమా కథనం ఉంటుందని సమాచారం. ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది చివర్లో విడుదల చేయాలని ఈ చిత్రనిర్మాత దినేష్ విజన్ ప్లాన్ చేస్తున్నారని భోగట్టా. ప్రీ ప్రొడక్షన్ పనులు పూర్తయిన తర్వాత ఈ సినిమాను అధికారికంగా ప్రకటించాలని యూనిట్ ప్లాన్ చేస్తోందనే టాక్ బాలీవుడ్‌లో వినిపిస్తోంది.

ప్రభాస్‌గారి వాయిస్ మిరాయ్‌కి మంచి వెయిట్

– తేజ సజ్జా



● విశ్వ ప్రసాద్, తేజ సజ్జా, కార్తీక్, రితికా నాయక్, మంచు మనోజ్

''మిరాయ్' సినిమాకు ప్రేక్షకుల నుంచి వస్తున్న స్పందన సంతోషాన్నిస్తోంది. ఈ చిత్రాన్ని గుండెల్లో పెట్టుకుని ఆదరిస్తున్న ప్రేక్షకులకు ధన్యవాదాలు. వాళ్ల ఆదరణ వల్లే నేను సినిమాలు చేయగలుగుతున్నాను. ఇండస్ట్రీలో ఉండగలుగుతున్నాను'' అని తేజ సజ్జా అన్నారు. తేజ సజ్జా హీరోగా కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో రూపొందిన మైథలాజికల్ అండ్ అడ్వెంచరస్ యాక్షన్ డ్రామా 'మిరాయ్'. రితికా నాయక్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో శ్రియ, జగపతిబాబు ప్రధాన పాత్రల్లో నటించారు. టీజీ విశ్వప్రసాద్, కృతీ ప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 12న విడుదలైంది. ఈ సందర్భంగా 'బ్రహ్మాండ్ బ్లాక్ బస్టర్ సక్సెస్' పేరిట శనివారం చిత్రయూనిట్ నిర్వహించిన థ్యాంక్స్ మీట్‌లో తేజ సజ్జా మాట్లాడుతూ–''దర్శకుడు కార్తీక్, నిర్మాత విశ్వప్రసాద్‌గార్లు లేకపోతే ఈ సినిమా ఉండేది కాదు. మా మీద విశ్వప్రసాద్‌గారు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకున్నందుకు సంతోషంగా ఉంది. మంచు మనోజ్‌గారి రాకతో మా సినిమా నెక్ట్స్ లెవల్‌కి వెళ్లింది. 'మిరాయ్' కథ ప్రభాస్‌గారి వాయిస్ ఓవర్‌తో ప్రారంభమవ్వడం వల్లే మా సినిమాకు వెయిట్ వచ్చింది. మా సినిమాను సపోర్ట్ చేసిన ప్రభాస్, రానాగార్లకు ప్రత్యేక ధన్యవాదాలు'' అని అన్నారు. ''ఈ రోజు నాకు చాలా సంతోషంగా ఉంది. దాదాపు 12 ఏళ్ల తర్వాత సక్సెస్‌తో నా ఫోన్ మోగుతూనే ఉంది. నాకు ఇదంతా కలలా ఉంది. ఈ కథలో నన్ను భాగం చేసిన కార్తీక్‌కు రుణపడి ఉంటాను. విశ్వప్రసాద్ ప్యాషనేట్ ప్రొడ్యూసర్. తమ్ముడు తేజ మంచి స్థాయికి వెళ్తాడు. మా అన్నతమ్ముళ్లు ఇద్దరి కోసం ప్రభాస్‌గారు నిలబడ్డారు (మంచు విష్ణు 'కన్నప్ప'లో ప్రభాస్ కీలక పాత్రలో నటించారు). ఆయనకు థ్యాంక్స్'' అని తెలిపారు మనోజ్ మంచు. ''మిరాయ్' నాలుగేళ్ల జర్నీ. తేజ అప్పట్నుంచి ట్రావెల్ అవుతున్నాడు. నన్ను నమ్మిన విశ్వప్రసాద్ గారికి, ఈ సినిమాలో భాగమైన అందరికీ ధన్యవాదాలు'' అని పేర్కొన్నారు దర్శకుడు కార్తీక్. ''2024 మాకు అంతగా కలిసి రాలేదు. ఇలాంటి సమయంలో 'మిరాయ్' సక్సెస్ మాకు మరెన్నో సినిమాలు చేసే గొప్ప ఎనర్జీ ఇచ్చింది. గౌర హరి అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చారు. మా తర్వాతి నాలుగు సినిమాలకు కూడా ఆయనే మ్యూజిక్ చేస్తున్నారు. మా అమ్మాయి కృతి క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా తన జర్నీ మొదలుపెట్టి, ఈ సినిమాతో నిర్మాతగా మారారు. తను మా లక్కీ చార్మ్ అని భావిస్తున్నాం'' అని తెలిపారు.

థియేటర్స్ కళకళలాడుతున్నాయి

– మంచు మనోజ్


● మంచు లక్ష్మి, మనోజ్, వంశీకృష్ణ

''ప్రస్తుతం థియేటర్స్ అన్నీ ప్రేక్షకులతో కళకళలాడుతున్నాయి. 'లిటిల్ హార్ట్స్' సినిమా హిట్ అయింది. బెల్లంకొండ సాయి 'కిష్కింధపురి' మంచి విజయాన్ని అందుకుంది. అలాగే మా 'మిరాయ్'ని ప్రేక్షకులు బాగా ఆదరిస్తున్నారు. నెక్ట్స్ 'దక్ష' చిత్రం రాబోతోంది. ఆ తర్వాత 'ఓజీ' మూవీ వస్తోంది. ఈ నెల మూవీ లవర్స్‌కు ఫీస్ట్‌లా ఉంటుంది. అన్ని సినిమాలు బాగుంటేనే ఇండస్ట్రీ బాగుంటుంది'' అని హీరో మంచు మనోజ్ తెలిపారు. మంచు లక్ష్మీ ప్రసన్న ప్రధాన పాత్రలో, మంచు మోహన్‌బాబు కీలక పాత్రలో నటించిన చిత్రం 'దక్ష–ది డెడ్లీ కాన్స్పిరసీ'. వంశీకృష్ణ మల్లా దర్శకత్వంలో శ్రీలక్ష్మీ ప్రసన్న పిక్చర్స్, మంచు ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్లపై రూపొందిన ఈ సినిమా ఈ నెల 19న విడుదల కానుంది. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ చిత్రం ప్రెస్‌మీట్‌కి ముఖ్య అతిథిగా హాజరైన మంచు మనోజ్ మాట్లాడుతూ– ''దక్ష' కోసం మా అక్క లక్ష్మి చాలా కష్టపడింది. మా నాన్న, అక్క కలిసి నటించిన 'దక్ష'ని పెద్ద సక్సెస్ చేయాలని కోరుకుంటున్నాను'' అన్నారు. మంచు లక్ష్మి మాట్లాడుతూ–''నాన్నగారి తర్వాత నన్ను అంత బాగా చూసుకునేది మనోజ్. మనోజ్ హీరోగానే కాదు... విలన్‌గానూ మెప్పించగలడు, కామెడీ చేయగలడు. వర్సటైల్ యాక్టర్‌గా ప్రూవ్ చేసుకున్నాడు. మా 'దక్ష' చిత్రాన్ని నైజాంలో మైత్రీ మూవీ వాళ్లు పంపిణీ చేస్తున్నారు'' అని చెప్పారు. ''దక్ష' ఒక డిఫరెంట్ థ్రిల్లర్ మూవీ. విష్ణు అన్న 'కన్నప్ప', మనోజ్ అన్న 'మిరాయ్' సక్సెస్ అయినట్లే లక్ష్మి అక్క 'దక్ష' కూడా విజయం సాధించాలి'' అన్నారు వంశీకృష్ణ మల్లా.

స్నేహితుల కథ


● జాన్వీ కపూర్

కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్, టొరంటో ఫిల్మ్ ఫెస్టివల్ వంటి అంతర్జాతీయ చలన చిత్రోత్సవాల్లో ప్రదర్శితమైన 'హోమ్‌బౌండ్' సినిమా థియేటర్స్‌లో విడుదలకు సిద్ధమైంది. ఇషాన్ కట్టర్, విశాల్ జైత్వ, జాన్వీ కపూర్ ప్రధాన పాత్రల్లో నటించిన హిందీ చిత్రం 'హోమ్ బౌండ్'. హైదరాబాదీ ఫిల్మ్ మేకర్ నీరజ్ ఘైవాన్ తెరకెక్కించారు. కరణ్ జోహార్, అదార్ పూనావాలా, అపూర్వ మెహతా, సోమెన్ మిశ్రా నిర్మించారు. ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా ఈ నెల 26న విడుదల చేయనున్నట్లుగా మేకర్స్ శనివారం వెల్లడించారు. హాలీవుడ్ చిత్ర నిర్మాత మార్టిన్ స్కోర్సెస్ ఈ 'హోమ్ బౌండ్' చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా చేశారు. అంతర్జాతీయ రిలీజ్‌ను మార్టిన్ పర్యవేక్షిస్తున్నారట. ఇక నార్త్ ఇండియాకు చెందిన ఇద్దరు చిన్ననాటి స్నేహితులు జీవితంలో పోలీస్ ఆఫీసర్లుగా స్థిరపడాలనుకుంటారు. ఇందుకోసం ఎంతో కష్టపడుతుంటారు. మరి... వారు అనుకున్నది ఎలా సాధించారు? వీరి జీవితాల్లో ఓ అమ్మాయి వచ్చిన తర్వాత ఏం జరిగింది? అనే అంశాల ఆధారంగా 'హోమ్ బౌండ్' సినిమా కథనం సాగుతుందనే ప్రచారం సాగుతోంది.

ప్రేమతో దెయ్యం


● నవ్యశ్రీ

బి. గణేశ్, బద్దెల శ్రీనివాస్, నవ్యశ్రీ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ప్రేమతో దెయ్యం'. బి.కె.ఎస్ దర్శకత్వంలో హరి ఓం తపశ్రిత సమర్పణలో శ్రీ లక్ష్మీ హనుమ శివపార్వతి బ్యానర్‌పై బి. కుమారస్వామి నిర్మించారు. ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ని హైదరాబాద్‌లో నిర్వహించారు. ప్రసన్నకుమార్, అనుపమా రెడ్డి టీజర్‌ని విడుదల చేయగా సముద్ర, శివనాగు పాటలను, తుమ్మలపల్లి సత్యనారాయణ ట్రైలర్‌ని రిలీజ్ చేశారు. బి. కుమారస్వామి మాట్లాడుతూ– ''ప్రస్తుతం వస్తున్న చిత్రాలకు భిన్నంగా 'ప్రేమతో దెయ్యం' నిర్మించాం. మా చిత్రంలో ప్రేక్షకులను కదిలించే సన్నివేశాలు ఉంటాయి'' అని తెలిపారు. ''అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునే కథ, కథనాలతో మా చిత్రం రూపొందింది'' అని బి.కె.ఎస్ తెలిపారు.

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహవేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. **బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు.** కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

పగలు తరగతులు... రాత్రి ఆల్ప్రాజోలం తయారీ

- పాఠశాలలో మత్తుమందు తయారీ యూనిట్ గుట్టురట్టు
- మత్తు మందును తీసుకెళ్తుండగా మాటువేసి పట్టుకున్న ఈగల్ టీం
- రూ.50 లక్షల విలువైన ఆల్ప్రాజోలం స్వాధీనం
- సికింద్రాబాద్‌లో మేధా హైస్కూల్ కరస్పాండెంట్ అరెస్ట్



జయప్రకాశ్‌గౌడ్



ఉదయ్ సాయి



మురళీ సాయి

సాక్షి, హైదరాబాద్: విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే పాఠశాలనే మత్తుమందు తయారీ ఫ్యాక్టరీగా మార్చేశారు. ఉదయం పాఠశాల తరగతులు నిర్వహిస్తూనే గుట్టుచప్పుడు కాకుండా రాత్రివేళల్లో ఆల్ప్రాజోలం అనే మత్తుపదార్థాన్ని తయారు చేస్తున్నారు. స్వయంగా పాఠశాల కరస్పాండెంటే ఈ దందాకు తెరతీయడం గమనార్హం. సికింద్రాబాద్‌లోని ఓల్డ్ బోయినపల్లిలో మేధా హైస్కూల్ కరస్పాండెంట్ మల్లేల జయప్రకాశ్‌గౌడ్ పాఠశాలలోనే ఆల్ప్రాజోలం తయారు చేస్తున్నట్టు అందిన సమాచారం మేరకు ఈగల్ (ఎలైట్ యాక్షన్ గ్రూప్ ఫర్ డ్రగ్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్) బృందం నిఘా పెట్టింది. శనివారం మధ్యాహ్నం జయప్రకాశ్‌గౌడ్ ఆల్ప్రాజోలంను కస్టమర్లకు విక్రయించేందుకు తీసుకెళ్తుండగా అప్పటికే మాటువేసి ఉన్న ఈగల్ బృందం అతడిని అదుపులోకి తీసుకుంది. అతడి వద్ద నుంచి 3.5 కిలోల ఆల్ప్రాజోలంను స్వాధీనం చేసుకున్నట్టు తెలిసింది. పాఠశాలలో తనిఖీ చేయగా.. రెండు గదుల్లో ఆల్ప్రాజోలం తయారీ పరికరాలు గుర్తించారు. ఈ సోదాల్లో తయారీలో ఉన్న 4.3 కిలోల ఆల్ప్రాజోలం, రూ.20 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. జయప్రకాశ్‌గౌడ్‌కు సహకరిస్తున్న ఓల్డ్ బోయినపల్లి గంగపుత్ర కాలనీకి చెందిన గౌటి మురళీసాయి, బోయినపల్లి హస్మత్‌పేటకు చెందిన పెంటమోల్ ఉదయ్ సాయిని అరెస్టు చేశారు. పట్టుబడిన ఆల్ప్రాజోలం విలువ బహిరంగ మార్కెట్‌లో రూ. 50 లక్షల వరకు ఉంటుందని తెలిసింది.

ఓల్డ్ బోయినపల్లిలో..

బీటెక్ డిస్‌కంటిన్యూ చేసిన జయప్రకాశ్‌గౌడ్ హైదరాబాద్ ఓల్డ్ బోయినపల్లిలో ఒక భవనాన్ని అద్దెకు తీసుకుని తొమ్మిదేళ్లుగా మేధ హైస్కూల్ నడుపుతున్నాడు. పాఠశాల కరస్పాండెంట్‌గా పనిచేస్తూనే మత్తుపదార్థాల తయారీ దందాకు తెరతీశాడు. వనపర్తి ప్రాంతానికి చెందిన జయప్రకాశ్... మహబూబ్‌నగర్, వనపర్తి జిల్లాల్లో కల్లు దుకాణాలకు ఆల్ప్రాజోలం సరఫరా చేయడం ప్రారంభించాడు. ఆల్ప్రాజోలం తయారీ ఫార్ములాను ఒకరి నుంచి నేర్చుకున్న తర్వాత తానే స్వయంగా తయారీ ప్రారంభించాడు. ఇందుకు తాను నడుపుతున్న పాఠశాల అయితే ఎవరికీ అనుమానం రాదన్న ఉద్దేశంతో ఇక్కడే రెండు పెద్ద గదుల్లో ఆల్ప్రాజోలం తయారీ మొదలుపెట్టాడు. అవసరమైన కెమికల్స్, ఇతర పదార్థాలను రాత్రి సమయాల్లో తెచ్చేవాడు. ఉదయం పాఠశాల నడిచే సమయంలో ఆ రెండు గదులకు తాళం వేసి ఉంచేవాడు. విద్యార్థులు, ఉపాధ్యాయులు అంతా వెళ్లిన తర్వాత ఆల్ప్రాజోలం తయారీ మొదలుపెట్టేవాడు. ఈ విషయం పాఠశాల సిబ్బందికి, ఇతరులకు తెలియకుండా పాఠశాలతో సంబంధం లేని మురళీసాయి, ఉదయ్ సాయిలను తనతోపాటు చేర్చుకున్నాడు. గత ఆరు నెలలుగా ఇక్కడ ఆల్ప్రాజోలం తయారు చేస్తున్నట్టు అధికారులు అనుమానిస్తున్నారు. ఈ వ్యవహారం వెనుక ఇంకా ఎవరైనా ఉన్నారా..? ఈ ఆల్ప్రాజోలంను ఇతర రాష్ట్రాల్లోనూ విక్రయిస్తున్నారా? అన్న కోణంలో అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

మళ్లీ కృష్ణా, గోదావరికి వరద

- కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద పెరిగిన ఉధృతి
- శ్రీశైలం 7, నాగార్జునసాగర్ 26 గేట్లు ఎత్తివేత



సాగర్‌లో 26 గేట్ల ద్వారా విడుదలవుతున్న వరద

కాళేశ్వరం/నాగార్జునసాగర్/దోమలపెంట: ఎగువన వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గోదావరి, కృష్ణా నదులకు వరద పోటెత్తుతోంది. కాళేశ్వరం వద్ద గోదావరిలో వరద ఉధృతమైంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని త్రివేణి సంగమం వద్ద శనివారం గోదావరి పుష్కర ఘాట్‌ను తాకుతూ 10 మీటర్ల ఎత్తులో నీటిమట్టం ప్రవహించింది. దిగువన కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బరాజ్ వద్ద 5.25 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో తరలివెళ్తోంది. దీంతో బ్యారేజీలోని మొత్తం 85 గేట్లు ఎత్తి.. నీటిని దిగువకు ఇంజనీర్లు విడుదల చేస్తున్నారు. ఇప్పటికే ఈ సీజన్‌లో పలుమార్లు గోదావరి, ప్రాణహితలు ఉగ్రరూపం దాల్చి శాంతించాయి. మళ్లీ వరద పెరుగుతుండటంతో గోదావరి పరీవాహక ప్రాంత రైతులు ఆందోళన చెందుతున్నారు.

26 గేట్ల ద్వారా కృష్ణమ్మ పరుగు

సాగర్ వద్ద 26 గేట్ల ద్వారా కృష్ణమ్మ పరుగులిడుతోంది. సాగర్ జలాశయం క్రస్ట్‌గేట్ల నుంచి 2,09,794 క్యూసెక్కులు, విద్యుదుత్పాదనతో 32,764 క్యూసెక్కుల నీటిని దిగువ కృష్ణా నదిలోకి వదులుతున్నారు. కాగా, ఈ సీజన్‌లో జూలై 29 నుంచి ఇప్పటివరకు సాగర్ గేట్లు తెరుచుకోవడం ఇది నాలుగోసారి కావడం విశేషం.

శ్రీశైలంలో 7 గేట్ల ఎత్తివేత: ఎగువ నుంచి భారీ వరద వస్తుండటంతో శనివారం శ్రీశైలం ఆనకట్ట వద్ద ఏడు గేట్లను ఎత్తి స్పిల్‌వే ద్వారా దిగువన నాగార్జునసాగర్‌కు నీటిని విడుదల చేస్తున్నారు. జూరాలలో ఆనకట్ట స్పిల్‌వే ద్వారా 1,27,260, విద్యుదుత్పత్తి చేస్తూ 35,350, సుంకేసుల నుంచి 61,306, హంద్రీ నుంచి 250 మొత్తం 2,24,166 క్యూసెక్కుల వరద శ్రీశైలం జలాశయానికి వస్తుంది. దీంతో శ్రీశైలంలో ఆనకట్ట వద్ద 7 గేట్లను.. ఒక్కొక్కటి 10 అడుగుల మేర పైకెత్తి 1,93,634 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి చేస్తూ 66,280 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు వదులుతున్నారు.

21 నుంచి సంస్కార భారతి 'బతుకమ్మ సంబరాలు'

సాక్షి, హైదరాబాద్: ఈనెల 21 నుంచి 30 వరకు సంస్కార భారతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'బతుకమ్మ సంబరాలు' నిర్వహించనున్నారు. ఈ మేరకు బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, ఎంపీ డీకే అరుణను శనివారం జూబ్లీహిల్స్‌లోని ఆమె నివాసంలో సంస్కార భారతి సభ్యులు కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యులతో కలిసి అరుణ వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను గౌరవిస్తూ.. సంస్కార భారతి ఆధ్వర్యంలో నిర్వహించే ఈ వేడుకలను విజయవంతం చేయాలని ఆమె కోరారు.

24న ట్యాంక్‌బండ్‌పై బీసీ బతుకమ్మ

సాక్షి, హైదరాబాద్: బీసీలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు పెంచే బీసీ బిల్లును కేంద్ర ప్రభుత్వం ఆమోదించాలని, మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 24వ తేదీన ట్యాంక్‌బండ్ వద్ద వేలాదిమంది బీసీ మహిళలతో 'బీసీ బతుకమ్మ' నిర్వహించనున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. విద్య, ఉద్యోగ రాజకీయ రంగాల్లో బీసీ రిజర్వేషన్లు పెరిగితే.. మహిళలకు విద్య, ఉద్యోగ ఉపాధి రాజకీయ అవకాశాలు దక్కుతాయని స్పష్టం చేశారు.

సంచలన కేసుల్లో సాగదీతే!

శిక్షలు పడేది 10 శాతం మేరకే

- ఈ 10 శాతంలోనే హత్య, పోక్సో, దాడుల వంటి తీవ్ర కేసులు
- మిగిలినవి ట్రాఫిక్, పెట్టీ, చిన్న కేసులు
- స్పెషల్ డ్రైవ్‌లో మిగిలినవి కొట్టుకుపోతాయంటున్న పోలీసులు

సాక్షిప్రతినిధి, కరీంనగర్: రాష్ట్రంలో రెండేళ్లుగా నమోదవుతున్న కేసుల్లో పురోగతి నెమ్మదించింది. దర్యాప్తు విషయంలో ఆధారాలు లభించక కొన్ని, ఆలస్యంగా వెలుగుచూసిన కేసుల్లో ఆధారాలు చెదిరిపోవడం వల్ల మరికొన్ని, దర్యాప్తులో శాస్త్రీయత లోపించడం వల్ల ఇంకొన్ని కేసులు పరిష్కారానికి నోచుకోవడం లేదు. నమోదైన కేసులు వేలల్లో ఉంటుండగా.. పరిష్కారమైనవి వందల్లోనే ఉంటుండటం ఇందుకు నిదర్శనం. కేవలం 10% కేసుల్లోనే కోర్టుల్లో కన్విక్షన్ వస్తుంది. మిగిలిన కేసుల్లో దర్యాప్తు సాగుతూనే ఉంది. అన్నింటికంటే రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపిన కేసుల్లో మాత్రం సాగదీతే కనిపిస్తోంది. ఈ క్రమంలో గ్రేటర్ హైదరాబాద్‌లోని హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్లను మినహాయించి ఆయా ఉమ్మడి జిల్లాల్లో కేసులు నమోదవుతున్న తీరు, పరిష్కారమవుతున్న తీరును పరిశీలించినప్పుడు ఇదే విషయం స్పష్టమైంది.

కేసుల్లో సగం ట్రాఫిక్‌వే..

పోలీసులు నమోదు చేసే కేసుల్లో తీవ్ర నేరారోపణలు కలిగిన కేసులు, పెట్టీ కేసులు అని రెండు రకాలుగా ఉంటాయి. అయితే, హత్య, దొంగతనాలు, దోపిడీలు, హత్యాయత్నాలు, దాడులు, కిడ్నాప్‌లు, రేప్, రేప్ అటెంప్ట్, పోక్సో, అట్రాసిటీ తదితరాలు తీవ్ర నేరారోపణలు. ఈ కేసుల దర్యాప్తు విషయంలో జిల్లా ఎస్పీలు, సీపీలు సీరియస్‌గానే ఉంటారు. నెలా నెలా నిర్వహించే క్రైం మీటింగుల్లో కేసుల పురోగతి గురించి ఎప్పటికప్పుడు తెలుసుకుంటూనే ఉంటారు. వాస్తవానికి సీరియస్ కేసుల్లో దర్యాప్తుపై పోలీసులు నిందితుల గుర్తింపు 24 గంటల నుంచి 48 గంటల్లోనే పూర్తి చేస్తున్నారు. 90% కేసుల్లోనే సకాలంలోనే చార్జ్‌షీట్ దాఖలు చేస్తున్నారు. కొన్ని హత్య కేసుల్లో దర్యాప్తు అధికారులు సరిగ్గా వ్యవహరించక, ఆధారాలు సేకరించలేక కేసుల్లో నిందితులు నేటికీ పట్టుబడటం లేదన్నది మాత్రం వాస్తవం. ప్రతీ జిల్లా, కమిషనరేట్లలో నమోదవుతున్న కేసుల్లో సగానికి కంటే అధికంగా ట్రాఫిక్ కేసులే ఉన్నాయి. ఇవన్నీ సుదీర్ఘకాలం పెండింగ్‌లో ఉంటాయి. స్పెషల్ డ్రైవ్ పెట్టినప్పుడు కేసులు డిస్పోజ్ అవుతాయని పోలీసు అధికారులు చెబుతున్నారు.

2016 సెప్టెంబర్ 23న జగిత్యాల జిల్లా రాయికల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చెర్లకొండాపూర్ గ్రామానికి చెందిన దువ్వాక రాజు (45) అనే మహిళను వ్యవసాయ పొలం వద్ద గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేశారు. ఇప్పటివరకు నిందితులు దొరకలేదు. పోలీసులు దర్యాప్తులో పురోగతి కనిపించలేదు. ఆ తర్వాత ఎస్పీ నుంచి ఎస్‌హెచ్‌వోల దాకా అధికారులు బదిలీలు కావడంతో ఈ కేసు దర్యాప్తు గురించి అంతగా ఎవరూ పట్టించుకోలేదు.

వనపర్తి జిల్లా చిన్నంబావి మండలం లక్ష్మీపల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ మండల నాయకుడు, మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి ముఖ్య అనుచరుడు బొడ్డు శ్రీధర్‌రెడ్డిని 2024 మే 23 అర్ధరాత్రి దారుణంగా హత్య చేశారు. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి వీలైనంత త్వరగా కేసును ఛేదించాలని ఆదేశాలిచ్చారు. ఐజీ సత్యనారాయణ గ్రామాన్ని స్వయంగా సందర్శించారు. అయినా నేటికీ కేసు మిస్టరీగానే మారింది. మృతుని కుటుంబ సభ్యులు డీజీపీ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ని కలిసి విన్నవించినా, 15 నెలలుగా ఆ మిస్టరీ వీడలేదు.



రెండేళ్లలో ఆయా ఉమ్మడి జిల్లాల్లో కేసుల పురోగతి తీరు ఇలా...


జిల్లాపేరు	ఏడాది	కొట్టివేసినవి	శిక్ష పడినవి
ఖమ్మం	2023	28,060	1,838
	2024	17,569	2,289
మెదక్	2023	905	2,937
	2024	650	2,764
వరంగల్	2023	18,770	1,877
	2024	18,579	1,543
మహబూబ్‌నగర్	2023	2,991	4,606
	2024	4,194	4,886
నల్లగొండ	2023	5,564	17,008
	2024	6,525	17,986

మరికొన్ని సంచలనాలు..

- 2020 డిసెంబర్‌లో నిజామాబాద్ జిల్లా సిరికొండ మండల కేంద్రంలో పొలానికి వెళ్లిన మహిళను దారుణంగా హతమార్చిన కేసులో నేటికీ ఎలాంటి ఆధారాలు లభించలేదు. కేసు జాప్యాన్ని నిరసిస్తూ.. బంధువులంతా కలిసి పోలీస్‌స్టేషన్‌పై దాడికి దిగారు. కేసులో ఎలాంటి సాంకేతిక ఆధారాలు లభించకపోవడంతో దర్యాప్తు అటకెక్కింది.
- 2024 డిసెంబర్‌లో కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలంలోని అడ్లూరి ఎల్లారెడ్డి పెద్దచెరువులో బిక్కనూరు ఎస్సై, బీబీపేట మహిళా కానిస్టేబుల్, మరో కంప్యూటర్ ఆపరేటర్ అనుమానాస్పద స్థితిలో మరణించిన కేసును పోలీసులు ఛేదించలేకపోయారు. వీరిది హత్యా, ఆత్మహత్యా అన్న విషయంలో నేటికీ స్పష్టత లేదు.

భూమి ఇస్తారా.. కోర్టుకు వస్తారా ?

మాజీ నక్సల్ భార్యకు భూమి ఇవ్వని కలెక్టర్‌పై హైకోర్టు ఆగ్రహం



సాక్షి, హైదరాబాద్: పీపుల్స్‌వార్ గ్రూప్ మాజీ దళసభ్యుడు నాగవెల్లి మోహన్ భార్య అరుణకు భూమి ఇస్తారా.. లేదా వ్యక్తిగతంగా మా ముందు హాజరై వివరణ ఇస్తారా అని మెదక్ జిల్లా కలెక్టర్‌పై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. కౌంటర్ దాఖలు చేయడంలో నిర్లక్ష్యం వహించడంపై తీవ్రంగా పరిగణించింది. తదుపరి విచారణ ఈ నెల 24కు వాయిదా వేస్తూ.. ఆలోగా కౌంటర్ దాఖలు చేయకపోతే తమ ముందు హాజరు కావాలని కలెక్టర్‌ను ఆదేశించింది. 16ఏళ్లుఅండర్‌గ్రౌండ్‌లో ఉండి, పీపుల్స్‌వార్ దళ కమాండర్ హోదాకు ఎదిగిన మోహన్‌కు.. 5 ఎకరాల కేటాయింపుతో సహా పునరావాసం కల్పిస్తామని ప్రభుత్వం హామీ ఇవ్వడంతో 1989లో లొంగిపోయాడు. ఇదే క్రమంలో లొంగిపోయిన తీవ్రవాదుల ఉపశమనం కోసం 1993లో ప్రభుత్వం ప్రత్యేక పాలసీని రూపొందించింది. నిఘా విభాగం మెదక్ జిల్లాలో అతనికి భూమి కేటాయించాలని 1999లో సిఫారసు చేయగా, జిల్లా స్థాయి కమిటీ కూడా ఆమోదించింది. సదాశివపేటలో కొంత భూమిని కేటాయింపు కోసం గుర్తించారు. ఈలోపే పోలీసులకు సహకరిస్తున్నారని మోహన్‌ను నక్సలైట్లు చంపేశారు. తర్వాత ఆ భూమిని అతని భార్య నాగవెల్లి అరుణకు కేటాయించాలని 2004లో కలెక్టర్ సిఫారసు చేశారు. ప్రజ్ఞాపూర్‌లో ఎకరం స్థలం కేటాయించారు. ఇది పట్టా భూమి అని కొందరు కోర్టుకు వెళ్లడంతో రద్దు చేశారు. దీంతో అరుణ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కాజా శరత్ విచారణ చేపట్టారు.

పోలీసులకు సహకరించినందుకే హత్య..

పిటిషనర్ తరఫున న్యాయవాది గొరారం రాజశేఖర్‌రెడ్డి వాదనలు వినిపించారు. 1989లో మోహన్ లొంగిపోగా, ఇప్పటివరకు భూమి కేటాయించకపోవడం సరికాదన్నారు. అరుణ దినసరి కూలీ అని, మానసిక వికలాంగుడైన కొడుకు కారణంగా తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారని చెప్పారు. పోలీసులకు సహకరించినందుకే ఆమె భర్తను హత్య చేశారని గుర్తు చేశారు. వెంటనే అరుణకు భూమి ఇచ్చేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ప్రభుత్వ న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. రెండు వారాలు సమయం ఇవ్వాలని, కౌంటర్ దాఖలు చేస్తామని కోరారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. ఇదే చివరి అవకాశమని చెబుతూ, విచారణ వాయిదా వేశారు.

విద్యార్థినిపై లైంగిక వేధింపులు

కటకటాల పాలైన కీచక ఉపాధ్యాయుడు

ములుగు (గజ్వేల్): విద్యార్థినిపై ఓ ఉపాధ్యాయుడు లైంగిక వేధింపులకు పాల్పడ్డారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన సిద్దిపేట జిల్లా ములుగు మండలం లక్ష్మక్కపల్లి వెరిటాస్ సైనిక్ ఇంటర్ నేషనల్ స్కూల్‌లో చోటు చేసుకుంది. గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి చెప్పిన వివరాల ప్రకారం..హైదరాబాద్‌కు చెందిన ఓ విద్యార్థిని లక్ష్మక్కపల్లి సైనిక్ స్కూల్లో 9వ తరగతి చదువుతుంది. అదే పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు ప్రణయ్ ఉపాధ్యాయ దినోత్సవం కోసం తరగతి గది డెకరేషన్ పేరిట ఈ నెల 4వ తేదీ సాయంత్రం ఆ బాలికను తరగతి గదిలోకి తీసుకెళ్లాడు. ఆ విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. ఈ విషయాన్ని బాధిత విద్యార్థిని ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకెళ్లింది. బాలికకు భరోసాగా నిలవాల్సిన ప్రిన్సిపాల్ ఈ విషయం ఎవరికి చెప్పినా, ఇతర పాఠశాలలో చదువుకోకుండా రెడ్ టీసీ ఇస్తానని బెదిరించారు. దీంతో ఆ విద్యార్థిని ఎవరికీ చెప్పలేదు. తల్లిదండ్రులు పాఠశాలకు రాగా, జరిగిన విషయాన్ని బాధిత విద్యార్థిని పేపర్‌పై రాసి ఇచ్చింది. దీంతో వారు ములుగు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఎస్ఐ విజయ్‌కుమార్ కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం కీచక ఉపాధ్యాయుడు ప్రణయ్‌ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పాఠశాల యాజమాన్యంపై కూడా కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

విత్తన రంగంలో తెలంగాణ ఆదర్శం

సీడ్ సర్టిఫికేషన్ అథారిటీ డైరెక్టర్ కేశవులు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ విత్తన ధ్రువీకరణ సంస్థ దేశంలోనే మొదటిసారిగా ఆన్‌లైన్ విత్తన ధ్రువీకరణ, సీడ్ ట్రేసబిలిటీ విధానాలను ప్రవేశపెట్టి ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందని తెలంగాణ సీడ్ సర్టిఫికేషన్ అథారిటీ డైరెక్టర్ డాక్టర్ కేశవులు అన్నారు. హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న ఇండియా - ఆఫ్రికా సీడ్ సమ్మిట్‌లో భాగంగా శనివారం ఆఫ్రికా ప్రతినిధుల బృందం తెలంగాణ అంతర్జాతీయ విత్తన పరీక్ష కేంద్రం (టిస్టా)ను సందర్శించింది. తెలంగాణ రాష్ట్రం ఇంటర్నేషనల్ సీడ్ టెస్టింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేసి నాణ్యమైన విత్తన ఎగుమతులకు మార్గం సుగమం చేసిందని డాక్టర్ కేశవులు ఆఫ్రికా ప్రతినిధులకు వివరించారు. ఈ కేంద్రం రైతులు, ఉత్పత్తిదారులకు శిక్షణ ఇస్తూ రాష్ట్ర విత్తన రంగానికి గణనీయమైన సహకారం అందిస్తోందని తెలిపారు. సంవత్సరానికి సుమారు 22 లక్షల క్వింటాళ్ల విత్తనాలను ఉత్పత్తి చేస్తూ తెలంగాణతో పాటు మరో పది రాష్ట్రాలకు ధ్రువీకరించిన విత్తనాలను సరఫరా చేస్తోందని స్పష్టం చేశారు. తెలంగాణలో విత్తనోత్పత్తికి అనుకూల వాతావరణం ఉండటంతో 500 పైగా విత్తన కంపెనీలు, 3.5 లక్షల మంది రైతులు విత్తనాలను ఉత్పత్తి చేస్తున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా ఆఫ్రికా సీడ్ ట్రేడ్ అసోసియేషన్ సెక్రటరీ జనరల్ యాకబో డయాలో మాట్లాడుతూ ఆఫ్రికా దేశాలలో కూడా ఇలాంటి విత్తన పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ఇదిలా ఉండగా ఇండో-ఆఫ్రికా సమ్మిట్‌లో తెలంగాణ సీడ్ సర్టిఫికేషన్ అథారిటీ (టీఎస్‌సీఏ) విత్తన పరీక్ష-ధ్రువీకరణ ఎక్సలెన్సీ అవార్డును గెలుచుకుంది. డాక్టర్ కేశవులు ఈ అవార్డు అందుకున్నారు.

బీజాపూర్ జిల్లాలో ఎదురుకాల్పులు

- ఒక మావోయిస్టు మృతి
- ఇంకో ఘటనలో ఇద్దరు మృతి

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో శనివారం జరిగిన ఎదురుకాల్పుల్లో ఒక మావోయిస్టు మృతి చెందాడు. జిల్లా ఎస్పీ జితేంద్రకుమార్ యాదవ్ తెలిపిన వివరాలివి. బీజాపూర్ జిల్లా మంకేలి అటవీ ప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారనే సమాచారంతో డీఆర్‌జీ, సీఆర్‌పీఎఫ్, ఎస్‌టీఎఫ్ బలగాలు కూంబింగ్ చేపట్టాయి. ఈ క్రమంలో శనివారం తారసపడిన మావోయిస్టులు కాల్పులు జరపడంతో.. పోలీసు బలగాలు సైతం ఎదురుకాల్పులకు దిగాయి. ఈ కాల్పుల్లో ఒక మావోయిస్టు మృతి చెందగా, పలువురు తప్పించుకుపోయారు. ఘటనాస్థలం నుంచి మావోయిస్టు మృతదేహంతో పాటు ఒక 12 బోర్ తుపాకీ, ఒక గ్రనేడ్ లాంచర్, ఇతర మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఇక శుక్రవారం.. ఇదే జిల్లా గంగులూరు అటవీ ప్రాంతంలో జరిగిన ఎదురుకాల్పుల్లోనూ మరో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారని ఎస్పీ తెలిపారు.

14 అడుగుల స్తూపం కూల్చివేత


ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని కాంకేర్ జిల్లా కర్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధి పట్టేపూర్ అడవుల్లో భద్రతా బలగాలు కూంబింగ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నాయి. ఇందులో భాగంగా 14 అడుగుల మావోయిస్టుల స్మారక స్తూపం కనిపించడంతో ఉన్నతాధికారుల సూచనల మేరకు కూల్చివేశారు.

గుర్తుంచుకోండి

వయసు పెరిగేకొద్దీ తరిగిపోయే జ్ఞాపకశక్తి

కాస్త కష్టపడితే మెమొరీ పవర్ మీ సొంతం

ప్రపంచ వ్యాప్త అధ్యయనాల సారాంశం ఇదే



సుప్రసిద్ధ శాస్త్రవేత్త అల్బర్ట్ ఐన్‌స్టీన్ తరచూ ఫోన్ నంబర్లు మర్చిపోతూ ఉండేవారు. ఈ విషయంపై ఆయన ఒకసారి.. 'టెలిఫోన్ డైరెక్టరీ చూస్తే తెలుస్తుందిగా' అని కూల్‌గా అన్నారట! అలాంటి జ్ఞానులు సాధారణ సమాచారాన్ని గుర్తుపెట్టుకోవాలని ఏమీలేదని దీని సారాంశం. అయితే, మామూలు వ్యక్తులు మతిమరుపును అలా తీసేయడానికి వీల్లేదు. దానికి కారణాలేంటో గమనించి.. ఏ వయసులో ఎలాంటి సమస్యలు రావచ్చు.. వాటిని ఎలా పరిష్కరించుకోవచ్చో తెలుసుకోవాలి.

20 లలో.. 25 ఏళ్లు వచ్చేసరికి మెదడు పూర్తిగా వికసిస్తుంది. నేర్చుకోవడం, గుర్తుపెట్టుకోవటం, గుర్తుతెచ్చుకోవడంలో అత్యుత్తమంగా పనిచేస్తుంది. వయసు పెరిగేకొద్దీ మెదడు సామర్థ్యం కొద్దిగా తగ్గుతుంది. ఈ తగ్గుదల దశాబ్దానికి స్వల్పంగా 5% వరకు ఉంటుందని మిచిగాన్ విశ్వవిద్యాలయ పరిశోధన వెల్లడించింది.

మల్టీ టాస్కింగ్.. మద్యం వద్దు

డిజిటల్ పరికరాల్లో మల్టీ టాస్కింగ్ చేస్తే యువతలోనూ జ్ఞాపకశక్తి తగ్గుతుందని పరిశోధనలు చెబుతున్నాయి. ఒకేసారి అనేక పనులు చేసేటప్పుడు మెమరీ సిస్టమ్‌లు ప్రతిసారీ రీసెట్ అవుతాయి. గ్రహించిన వివరాలు మనసు పొరల్లోకి పూర్తిగా ఇంకక ముందే జారిపోతాయి. అందుకే, ఒక సమయంలో ఒక విషయంపైనే దృష్టిపెట్టాలి. అతిగా మద్యం తాగినా జ్ఞాపకశక్తి తగ్గుతుందట.

- సాక్షి, స్పెషల్ డెస్క్

30 లలో.. మెదడు కణాల మధ్య సంకేతాలను ప్రసారం చేసే న్యూరో ట్రాన్స్‌మీటర్లు ముప్పైలలో తగ్గటం ప్రారంభిస్తాయి. జ్ఞాపకాల నిక్షిప్తానికి సాయపడే రసాయనమైన డోపమైన్.. వయసు పెరిగే కొద్దీ దశాబ్దానికి 10% మేర తగ్గుతుంది.

చేతి రాతే జ్ఞాపక మంత్రం!

ఎక్కువ కాలం గుర్తుండాలంటే టైప్ చేయడానికి బదులుగా చేతితో రాయండి. దీనివల్ల మెదడులో జ్ఞాపకశక్తికి, అవగాహనకు అనుసంధానమై ఉండే భాగాలు బాగా పనిచేస్తాయని 'సైకలాజికల్ సైన్స్ జర్నల్'లో ప్రచురితమైన పరిశోధన వెల్లడించింది.

40 లలో.. మధ్య వయసు నుంచి జ్ఞాపకశక్తి క్షీణించడం ప్రారంభమవుతుందని బ్రిటిష్ మెడికల్ జర్నల్ (2012)లో ప్రచురితమైన అధ్యయనంలో తేలింది. అధిక ఒత్తిడి సమయాల్లో అధికంగా విడుదలయ్యే కార్టిసాల్ హార్మోన్ మెదడులో కొత్త జ్ఞాపకాలను నిక్షిప్తం చేసే భాగాలను, ప్రక్రియను దెబ్బతీస్తుంది.

ప్రాసెస్డ్ మీట్ వద్దు

40 ఏళ్ల వయసులో రెడ్ మీట్, ప్రాసెస్ చేసిన మాంసం ఉత్పత్తులను అతిగా తీసుకుంటే భవిష్యత్తులో జ్ఞాపకశక్తి తగ్గుతోందని 'న్యూరాలజీ జర్నల్'లో ప్రచురితమైన ఓ పరిశోధన సూచిస్తోంది. శాకాహారం ఎక్కువగా, మాంసాహారం తక్కువగా తీసుకునే వారి జ్ఞాపకశక్తి, ఏకాగ్రతల స్కోర్ ఎక్కువగా ఉందట. మాంసానికి బదులు నట్స్, బీన్స్ తీసుకుంటే ఈ ప్రమాదాన్ని 19% వరకు తగ్గించుకోవచ్చట.

50 లలో.. మీరు ఎప్పుడైనా ఒక గదిలోకి వెళ్లి, మీరు దేని కోసం వెతుకుతున్నదీ మర్చిపోయారా? 50 ఏళ్లు దాటిన వారిలో ఇది సర్వసాధారణమే. ఇందుకు కారణం మెదడులోని 'రిఫ్రంటల్ కార్టెక్స్' కుంచించుకుపోవడమే. సాధారణ జ్ఞాపకాలను గుర్తుచేసుకునే సామర్థ్యం 45–55 ఏళ్ల మధ్య గరిష్ఠ స్థాయికి చేరుతుంది. మెనోపాజ్ కారణంగా ఈస్ట్రోజెన్ వంటి హార్మోన్లలో వచ్చే హెచ్చుతగ్గుల వల్ల జ్ఞాపకశక్తి, ఏకాగ్రతలు ప్రభావితమవుతాయి. ఈ దశకు 'బ్రెయిన్ ఫాగ్' అని ప్రపంచ ప్రసిద్ధిగాంచిన 'క్రాకింగ్ ది మెనోపాజ్' పుస్తక రచయిత్రి ఆలిస్ స్మెల్లీ పేరుపెట్టారు.

సానుకూల భావన

తాళాలను ఎప్పుడూ ఒకే చోట పెట్టడం, ఫోన్‌లో రిమైండర్లు పెట్టుకోవటం వంటి జాగ్రత్తలు తీసుకోండి. సానుకూల భావనతో ఉండే వారిలో జ్ఞాపకశక్తి మెరుగుపడుతుందని అధ్యయనాల సారాంశం. మెనోపాజ్ దశలో ఉన్న మహిళలు.. పౌష్టికాహారం తీసుకుంటూ, ఒత్తిడికి దూరంగా ఉంటే జ్ఞాపకశక్తి బాగుంటుంది.

60 లలో.. ఈ వయసులో తరచుగా.. వ్యక్తుల పేర్లు, పదాలు గుర్తుకురాక సతమతమవుతుంటారు. అంతమాత్రాన వీరు బాధపడాల్సిన పనిలేదు. ఎందుకంటే, కిక్కిరిసిన గ్రంథాలయంలో ఒక పుస్తకాన్ని దొరకపుచ్చుకోవటానికి సమయం పడుతుంది కదా.. అలాగే ఇదీనూ!

శారీరక శ్రమ

క్రమం తప్పకుండా బ్రిస్క్ వాకింగ్ వంటి ఏరోబిక్ ఎక్సర్‌సైజులు చేయాలి. వారంలో మూడు రోజులు ఇలా చేసే వృద్ధుల మెదడులోని జ్ఞాపకశక్తికి కేంద్రమైన హిప్పోక్యాంపస్ సైజు ఏడాదికి 2% పెరిగినట్లు యూనివర్సిటీ ఆఫ్ బ్రిటిష్ కొలంబియా (2011) అధ్యయనంలో వెల్లడైంది.

70 లలో.. కొన్ని పేర్ల జాబితా చదివిన కొద్ది నిమిషాల తర్వాత ఆ పేర్లు గుర్తుచేసుకునే సామర్థ్యం 20 ఏళ్ల వారితో పోల్చితే 70 ఏళ్ల వారిలో సగానికి తగ్గుతుంది. చిన్ననాటి సంఘటనలను జ్ఞాపకం చేసుకోగలిగే వీరు.. నిన్న రాత్రి ఏం తిన్నారో మర్చిపోవచ్చు. దీనికి కారణం మెదడులో భావోద్వేగాల కేంద్రమైన 'అమిగ్డలా'. యుక్తవయసు నాటి అనుభవాలు ఉద్వేగంతో కూడి ఉంటాయి కాబట్టి అమిగ్డలా సాయంతో వాటిని గుర్తు తెచ్చుకోగలుగుతారు.

కొత్త పనులు చేయండి

'ద జర్నల్స్ ఆఫ్ జెరంటాలజీ'లో ప్రచురితమైన అధ్యయనం ప్రకారం.. రోజూ ఒకే రకం కాకుండా, కొత్త పనులు ప్రయత్నించే, ఉత్సాహంగా ఉండే వృద్ధుల్లో ఏకాగ్రత, జ్ఞాపకశక్తి ఇనుమడించాయి.

80 లలో.. జ్ఞాపకశక్తి వేగంగా తగ్గుతుంది. మెదడుకు రక్తాన్ని అందించే ధమనుల సామర్థ్యం తగ్గిపోవటం వల్ల మెదడుకు రక్తప్రవాహం, ప్రాణవాయువు సరఫరా మందగించటమే ఇందుకు కారణం. వినికిడి సమస్య వల్ల కూడా జ్ఞాపకశక్తి తగ్గుతుంది. ఇతరులు చెప్పేది వినటానికి అధిక శక్తిని మెదడు వినియోగించాల్సి రావటంతో, ఆ విషయాలను గుర్తుపెట్టుకోలేరు. ఒంటరితనం, కుంగుబాటు కూడా జ్ఞాపకశక్తిని క్షీణింపజేస్తాయి.

నలుగురితో కలవండి

ఇతరులతో ఎక్కువగా కలుస్తూ, కలివిడిగా ఉంటే యాక్టివ్‌గా ఉంటారు. బలమైన సాంఘిక సంబంధాలుండే వృద్ధుల జ్ఞాపకశక్తి అమోఘంగా ఉందని హార్వర్డ్ యూనివర్సిటీ అధ్యయనం (2015). వినికిడి పరికరాలు వాడని వృద్ధులతో పోలిస్తే, వాడే వారిలో జ్ఞాపకశక్తి 50%కి పైగా మెరుగ్గా ఉందని 'లాన్సెట్' అధ్యయనం (2023).

క్లుప్తంగా...



శ్రీవారిని దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి

తిరుమల: తిరుమల శ్రీవారిని శనివారం తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేశ్ భీమపాక దర్శించుకున్నారు. అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో వేద పండితులు ఆశీర్వదించగా, టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలు అందజేశారు.

బూర్గుల చిరస్మరణీయుడు: సీఎం

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ రాష్ట్ర తొలి సీఎం గా డాక్టర్ బూర్గుల రామకృష్ణారావు చిరస్మరణీయుడని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. బహు భాషావేత్తగా, స్వాతంత్ర్య సమరయోధునిగా, రాజనీతిజ్ఞునిగా రాష్ట్రానికి అందించిన సేవలను.. ఆదివారం ఆయన వర్ధంతి సందర్భంగా సీఎం స్మరించుకున్నారు. రెవెన్యూ మంత్రిగా.. వినోబాభావే ప్రారంభించిన భూదానోద్యమానికి చట్టబద్ధత కల్పించి భూ సంస్కరణలకు నాంది పలికారని కొనియాడారు.

అధిక వర్షాలతో పెసర, మినుము పంటలకు నష్టం

సాక్షి, న్యూఢిల్లీ: దేశ వ్యాప్తంగా విస్తారంగా కురిసిన వర్షాలు, ముంచెత్తిన వరదల కారణంగా పప్పుధాన్యాల పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. పెసర, మినుము పంటలకు ఎక్కువగా నష్టం జరిగిందని కేంద్ర వ్యవసాయ శాఖ తెలిపింది. దేశ వ్యాప్తంగా మొత్తం పప్పుధాన్యాల సగటు విస్తీర్ణం 1.29 కోట్ల హెక్టార్లు కాగా, ఈ ఏడాది 1.18 కోట్ల హెక్టార్లలో సాగైంది. ఇందులో పెసర సగటు సాగు 35.69 లక్షల హెక్టార్లుండగా, ఈ ఏడాది 34.54 హెక్టార్లలో సాగైంది. మినుము సగటు సాగు విస్తీర్ణం 32.64లక్షల హెక్టార్లయితే, ఈసారి 23.66 లక్షల హెక్టార్లకే పరిమితమైంది. అసలే సాగు విస్తీర్ణం తగ్గిన నేపథ్యంలో అధిక వర్షాలు పంటల సాగును దెబ్బతీశాయి. ఆంధ్రప్రదేశ్, రాజస్తాన్, మధ్యప్రదేశ్, కర్నాటక రాష్ట్రాల్లో ఈ పంటలకు అధికంగా నష్టం వాటిల్లిందని కేంద్ర నివేదికలు చెబుతున్నాయి. గత ఏడాది పెసర ఉత్పత్తి 14.47లక్షల మెట్రిక్ టన్నులుండగా, అది ఈ ఏడాది 12 లక్షల మెట్రిక్ టన్నుల కంటే తక్కువగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. మినుములు గత ఏడాది 13.02 లక్షల టన్నులు ఉత్పత్తి ఈ దఫా 10 లక్షల మెట్రిక్ టన్నులకు తగ్గుతుందని చెబుతున్నారు.

అత్యాచారం, ఆపై దేశం విడిచి వెళ్లాలని బెదిరింపు

యూకేలో దారుణం

లండన్: బ్రిటన్‌లో సిక్కు మహిళపై పట్టపగలే అత్యాచారం జరిగింది. ఓల్డ్ బరీ ప్రాంతంలోని ఓ పార్కులో మంగళవారం ఉదయం 8.30 గంటల ప్రాంతంలో ఈ దారుణం చోటుచేసుకుంది. ఇద్దరు శ్వేత జాతీయులు 20 ఏళ్ల మహిళపై అత్యాచారానికి ఒడిగట్టారు. మీ దేశానికి తిరిగి వెళ్లిపొమ్మంటూ ఆమెను బెదిరించారు. ఘటనపై బాధితురాలు వెస్ట్‌మిడ్‌ల్యాండ్ ప్రాంత పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు విద్వేష దాడిగా కేసు నమోదు చేసి, దుండగుల కోసం గాలింపు చేపట్టారు. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. మొబైల్ ఫుటేజీ ఉంటే ఇవ్వాలని కోరారు. దుండగులకు సంబంధించిన సమాచారం తెలిసిన వారు తమకు తెలపాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఘటనపై సిక్కు వర్గం ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవలి కాలంలో విద్వేష ఘటనలు పెరిగిపోయాయంటూ ఆగ్రహంతో ఉన్నారు. అధికార లేబర్ పార్టీ ఎంపీ ప్రీత్ కౌర్ గిల్ ఘటనపై స్పందించారు. జాతి విద్వేషానికి ఓల్డ్‌బరీలోనే కాదు, బ్రిటన్‌లో ఎక్కడా చోటులేదన్నారు.

ఈవీఎంలను మ్యానిపులేట్ చేయలేరని చెప్పలేం

చేసినట్టు ఇప్పటివరకు ఆధారాలు లేవు

ఎస్‌ఐఆర్ పేరుతో ఈసీ తన పరిధి దాటింది

పౌరసత్వాన్ని రుజువు చేసుకునే బాధ్యతను పౌరులపై వేసింది.. గతంలో ఎన్నడూ ఈసీ అలా చేసిన సందర్భం లేదు

ప్రమాదంలో భూమి, చదువులేని పౌరుల ఓటు

అజయ్‌గాంధీ స్మారక ఉపన్యాసంలో .. కేంద్ర ఎన్నికల సంఘం మాజీ కమిషనర్ అశోక్ లావాసా



మాట్లాడుతున్న అశోక్ లావాసా

సాక్షి, హైదరాబాద్: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎం)లను మ్యానిపులేట్ చేసే అవకాశాలను తోసిపుచ్చలేమని కేంద్ర ఎన్నికల సంఘం మాజీ కమిషనర్ అశోక్ లావాసా అన్నారు. అయితే, దేశంలో ఈవీఎంలను మ్యానిపులేట్ చేస్తున్నట్లు తాను భావించటంలేదని తెలిపారు. ఏ దేశంలోనూ ఈవీఎంలను దుర్వినియోగం చేసినట్టు ఆధారాలు లేవని పేర్కొన్నారు. ఈవీఎంలపై కోర్టుల్లో 40కిపైగా కేసులు వీగిపోయాయని గుర్తుచేశారు. మంతన్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం హైదరాబాద్‌లోని విద్యారణ్య పాఠశాలలో 'కేంద్ర ఎన్నికల సంఘం: ముప్పేట దాడిలో ఓ కాపలాదారుడు'అనే అంశంపై నిర్వహించిన కార్యక్రమంలో అశోక్ లావాసా.. మంథన్ సహ వ్యవస్థాపకుడు 'అజయ్ గాంధీ'స్మారక ఉపన్యాసం ఇచ్చారు. సాంకేతిక రంగంలో శరవేగంగా మార్పులు వస్తున్న ప్రస్తుత తరుణంలో ఎన్నికల ప్రక్రియపై నిరంతర నిఘా ఉంచాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

ఎస్ఐఆర్ పేరుతో ఈసీ పరిధి అతిక్రమణ..

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) పేరుతో బిహార్‌లో చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ విషయంలో కేంద్ర ఎన్నికల సంఘం తన పరిధిని దాటి వ్యవహరించిందని అశోక్ లావాసా అభిప్రాయపడ్డారు. ఎన్నికల సంఘం చరిత్రలోనే ఇది అత్యంత వివాదాస్పద అంశమని తెలిపారు. ఓటర్ల జాబితాలో స్థానం కోసం పౌరసత్వాన్ని రుజువు చేసుకోవాలని పౌరులపై బాధ్యతలను వేయడం ఇదే తొలిసారి అన్నారు. గతంలో గుర్తింపు, పుట్టిన తేదీ, నివాస ధ్రువీకరణ పత్రాలు ఇస్తే ఓటరుగా నమోదు చేసేవారని గుర్తుచేశారు. దేశంలో పౌరసత్వం రుజువుకు ప్రభుత్వం ఎలాంటి ధ్రువీకరణ పత్రం ఇవ్వదని.. పాస్‌పోర్టు కూడా ఆధార్, ఓటర్ గుర్తింపు కార్డుల తరహాలో పౌరసత్వ రుజువు కాదని తెలిపారు. కొత్తగా దేశ పౌరసత్వాన్ని స్వీకరించే వారికే అలాంటి పత్రాలు ఇస్తుందని చెప్పారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత రోడ్లపై నివసించే నిరాశ్రయులకు సైతం ఓటు హక్కు కల్పించడానికి నాటి కేంద్ర ఎన్నికల సంఘం తొలి కమిషనర్ చర్యలు తీసుకున్నారని తెలిపారు.

వారు ఓటు హక్కు కోల్పోతారు..

ఎస్ఐఆర్ నిర్వహణ వెనుక ఉద్దేశం, పాటించిన సూత్రాలు, అమలుపరిచిన విధానంపై ఎన్నో సందేహాలు లేవనెత్తాయని అశోక్ లావాసా అన్నారు. అర్హులందరికీ ఓటర్ల జాబితాలో స్థానం కల్పిస్తామని, అనర్హులని తొలగిస్తామంటే ఎవరికీ అభ్యంతరం ఉండదని తెలిపారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఈ ప్రక్రియను చేపట్టడం, ముందస్తు ప్రకటన లేకుండా అకస్మాత్తుగా ఎస్ఐఆర్‌ను అమలు చేయటం వివాదాస్పదమైందని చెప్పారు. చివరిసారిగా 2003లో ఎస్ఐఆర్‌ను 8 నెలల్లో నిర్వహించగా, ఈసారి 90 రోజులు మాత్రమే గడువు ఇవ్వడంతో ఎన్నో ఇబ్బందులొచ్చాయని అన్నారు. దేశంలో పుట్టి ఎలాంటి భూమి లేని, బడికి వెళ్లని, ఎలాంటి ప్రభుత్వ పథకం కింద లబ్ధి పొందని వారు ఓటు హక్కును కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈసీ నిర్దేశించిన 11 డాక్యుమెంట్లలో ఏదీ పౌరసత్వాన్ని ధ్రువీకరించదని తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవడానికి అందరూ కలిసి పనిచేయాలని అశోక్ లావాసా పిలుపునిచ్చారు. రాజకీయ పార్టీలను సమాచార చట్టం పరిధిలోకి తీసుకురావాలని కేంద్ర సమాచార కమిషన్ ఇచ్చిన తీర్పు అమలు కావడం లేదని, రాజకీయ పార్టీలన్నీ దీనికి వ్యతిరేకంగా ఉన్నాయని అశోక్ లావాసా విమర్శించారు.

విద్యా 'సేద్యం'.. ఆరోగ్యం సుస్థిరం





→ మార్కెట్‌లో ఎక్కడ చూసినా కల్తీ రక్కసి వెక్కిరిస్తోంది. కూరగాయల సాగులోనూ రసాయనిక ఎరువుల వినియోగం ఎక్కువగా ఉంటోంది. ఈ నేపథ్యంలో తామే సొంతంగా కూరగాయలు పండించాలని నిర్ణయించుకున్నారు కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు. పాఠశాలలో విద్యతో పాటు సంపూర్ణ ఆరోగ్యమూ పొందుతున్నారు. ఉపాధ్యాయుల సహకారంతో పాఠశాల ప్రాంగణాన్ని వివిధ రకాల కూరగాయలను పండించేందుకు వినియోగిస్తున్నారు. పూర్తిగా సేంద్రియ పద్ధతిలో పండిస్తుండగా విద్యార్థులే యాజమాన్య చర్యలు చేపడుతున్నారు. సదరు కూరగాయలతోనే మధ్యాహ్న భోజనంగా వండుతున్నారు. 8, 9, 10వ తరగతి విద్యార్థుల కృషికి ప్రతిరూపమే ఈ చిత్రాలు. మిర్చి, టమాట, వంకాయ, బెండ, చిక్కుడు, కొత్తిమీర ఇలా రకరకాల కూరగాయలను పండిస్తున్నారు.

- సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కరీంనగర్

'పేలుడు' ఇక పేలదు..!

పేలుడు పదార్థాల అధ్యయనానికి సురక్షిత పద్ధతి అభివృద్ధి చేసిన సెంట్రల్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు



కొల్లి రాజేష్



అనిల్ కుమార్

సాక్షి, హైదరాబాద్: ఆర్డీఎక్స్ లాంటి పేలుడు పదార్థాలపై అధ్యయనం చేసేందుకు సెంట్రల్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు సురక్షిత, మెరుగైన పద్ధతిని అభివృద్ధి చేశారు. డాక్టర్ కొల్లి రాజేష్, ప్రొఫెసర్ అనిల్ కుమార్ చౌదరిలతో కూడిన శాస్త్రవేత్తల బృందం.. టెరాహెర్ట్జ్ – టైమ్ డొమైన్ స్పెక్ట్రోస్కోపీ ద్వారా ఈ ఘనత సాధించింది. సాధారణంగా పేలుడు పదార్థాలను అధ్యయనం చేయాలంటే ముందుగా చిన్నచిన్న గుళికలు చేసుకోవాలి. అయితే ఇలా గుళికలు చేసే క్రమంలో అది పేలిపోయే ప్రమాదం ఉంటుంది. ఈ సమస్యను పరిష్కరించడానికి డా.రాజేష్, ప్రొఫెసర్ అనిల్.. పేలుడు పదార్థాన్ని ఒక నిరపాయకరమైన పదార్థంతో కలిపారు. దీంతో గుళికల తయారీలో ప్రమాదం జరిగే అవకాశం లేకుండా పోయింది. ఆ తర్వాత ఈ మిశ్రమ పదార్థం ధర్మాలను ఎఫెక్టివ్ మీడియం సిద్ధాంతం సాయంతో లెక్కించ గలిగారు. ఫలితాలను విశ్లేషించగా అవి పేలుడు పదార్థం తాలూకు ప్రత్యేక లక్షణాలను వెల్లడిస్తున్నాయని స్పష్టమైంది. అంటే.. చాలా సున్నితంగా ఉండే పేలుడు పదార్థాలను సురక్షితంగా గుర్తించవచ్చు అని తెలిసింది. ఈ పరిశోధన అంశాలు ఇన్‌ఫ్రారెడ్ ఫిజిక్స్ అండ్ టెక్నాలజీ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

సింగరేణి ఉపరితల గనుల్లో మహిళా ఆపరేటర్లు

జనరల్ అసిస్టెంట్లు, బదిలీ వర్కర్లకు అవకాశం



మహిళా ఉద్యోగులతో సీఎండీ బలరామ్ (ఫైల్)

కొత్తగూడెం అర్బన్: సింగరేణి సంస్థలో జనరల్ అసిస్టెంట్లుగా, బదిలీ వర్కర్లుగా పనిచేస్తున్న మహిళలకు ఓపెన్ కాస్ట్ గనుల్లో భారీ యంత్రాలపై ఆపరేటర్లుగా పనిచేయడానికి యాజమాన్యం అవకాశం కల్పిస్తోంది. మైనింగ్ రంగంలో మహిళా సాధికారత, సమాన అవకాశాలు, మానవ వనరుల సమర్థ వినియోగంలో భాగంగా సీఎండీ ఎస్.బలరామ్ ఆలోచనల నుంచి ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈమేరకు శనివారం యాజమాన్యం నుంచి అన్ని గనులు, విభాగాలకు సర్క్యులర్ అందింది. మహిళలకు ఓపెన్ కాస్ట్ గనుల్లో భారీ యంత్రాల ఆపరేటర్లుగా పనిచేసే అవకాశం కల్పించడం సింగరేణి చరిత్రలో ఇదే తొలిసారి. ప్రస్తుతం జనరల్ అసిస్టెంట్‌గా లేదా బదిలీ వర్కర్‌గా పనిచేస్తూ 35 ఏళ్ల లోపు వయసు ఉండి, కనీసం ఏడో తరగతి పాసైన మహిళా అభ్యర్థులు ఆపరేటర్ పోస్టుకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆగస్టు 2024 కన్నా ముందు డ్రైవింగ్ లైసెన్స్ తీసుకున్న వారికి ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. ఆసక్తి, అర్హతలు కలిగిన వారు దరఖాస్తు చేసుకుంటే ప్రత్యేక కమిటీ ద్వారా పరిశీలన అనంతరం ఎంపిక చేస్తారన్నారు. ఆపై అభ్యర్థులు సిరిసిల్లలోని తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డ్రైవింగ్ ఎడ్యుకేషన్ అండ్ స్కిల్స్ సంస్థలో హెవీ గూడ్స్ వెహికల్, హెవీ మోటార్ వెహికల్ విభాగంలో శిక్షణ పొందాలి. ఆ తర్వాత పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి ఖాళీల ఆధారంగా ఈపీ ఆపరేటర్ ట్రెయినీ కేటగిరీ–5 హోదాతో పోస్టింగ్ ఇస్తారు.



డిజిటల్ దోపీలు

యువతలో పెరిగిపోతున్న డిజిటల్ డోపమిన్ సమస్య

సోషల్ మీడియాలో లైక్‌లు, కామెంట్ల కోసం ఎదురుచూపులు.. లైకులొస్తే సంతోషం.. రాకపోతే చిరాకు, కోపం, నిరాశ

సంతోషాన్నిచ్చే హార్మోన్‌తో సమస్యలు సృష్టిస్తున్న సోషల్ మీడియా

నేటి యువత 'డిజిటల్ సంతోషాల్లో' తేలియాడుతోంది. ఎంతగా అంటే.. తాము సోషల్ మీడియాలో పెట్టే పోస్టుకు లైకులు, కామెంట్లు రావటానికి ఒక్క సెకను ఆలస్యమైనా పిచ్చిగా ప్రవర్తించేంతగా. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, వాట్సాప్ వంటి సామాజిక మాధ్యమాలను అధికంగా వినియోగించే యువత సమయాన్ని వృథా చేసుకోవటంతోపాటు అనేక ఆరోగ్య సమస్యలు కూడా కొని తెచ్చుకుంటోంది. అందులో తాజాగా 'డిజిటల్ డోపమిన్'వచ్చి చేరింది.

- సాక్షి, హైదరాబాద్

ఏమిటీ డోపమిన్?

→ డోపమిన్ అనేది మన శరీరంలో ఉత్పత్తి అయ్యే ఒక హార్మోన్. దీనిని 'సంతోష హార్మోన్'అని పిలుస్తారు. ఇది మన మెదడు బహుమతి వ్యవస్థలో కీలకపాత్ర పోషిస్తుంది. రుచికరమైన ఆహారం తినడం, ప్రశంసలు స్వీకరించడం, లక్ష్యాన్ని సాధించడం వంటి ఆహ్లాదకరమైన అనుభూతిని పొందినప్పుడు ఈ హార్మోన్ విడుదలవుతుంది. ఈ న్యూరోట్రాన్స్‌మీటర్ మెదడుకు కార్యాచరణ ఫలవంతమైందని సంకేతమిస్తుంది. మరింత ఉత్సాహంతో పనిచేసేలా ప్రోత్సహిస్తుంది.

ఇప్పుడు సమస్య ఏంటి?

→ మనసుకు సంతోషాన్ని కలిగించే పనులు చేసినప్పుడు విడుదలై మనల్ని మరింత ప్రోత్సహించే ఈ డోపమిన్ హార్మోనే ఇప్పుడు సోషల్ మీడియాను నడిపిస్తోందని మానసిక శాస్త్రవేత్తలు అంటున్నారు. మనం సోషల్ మీడియాలో పెట్టే పోస్టు లు, వీడియోలకు లైకులు, షేర్‌లు వచ్చినప్పుడు సంతోషం కలుగుతుంది. అప్పుడు మన మెదడులో ఈ డోపమిన్ హార్మోన్ విడుదలవుతుంది. అయితే, అది ఇప్పుడు శ్రుతిమించింది. మనం పెట్టే ప్రతి పోస్టుకు లైకులు, షేర్‌ల కోసం ఎంతో ఆత్రుతతో ఎదురుచూసేలా ఈ హార్మోన్ ప్రేరేపిస్తోందని నిపుణులు చెబుతున్నారు. దీనివల్ల యువత నిత్యం సోషల్‌మీడియా యాప్‌లను అంటిపెట్టుకొని ఉంటున్నారని అంటున్నారు. అలా మన మెదడు ఈ తక్షణ బహుమతులను కోరుకునేలా కండిషన్‌కు గురవుతుంది. ఇది స్వల్పకాలిక ఆనందం ఇచ్చినా.. తరువాత దీర్ఘకాలిక అసంతృప్తికి దారితీస్తుందని పేర్కొంటున్నారు.

డిజిటల్ డోపమిన్ సంకేతాలు

→ సామాజిక మాధ్యమాల్లో నిరంతరం నోటిఫికేషన్లను తనిఖీ చేయడం
→ సోషల్ ప్లాట్‌ఫామ్‌లలో యాక్టివ్‌గా లేనప్పుడు ఆందోళన చెందడం
→ సమయం తెలియకుండా సోషల్ మీడియాలో స్క్రోలింగ్ చేస్తూ ఉండిపోవటం
→ ఒకరి జీవితాన్ని ఇతరుల హైలైట్ రీల్స్‌తో పోల్చడం
→ ప్రతికూల కంటెంట్‌తో మానసిక స్థితిలో మార్పులు రావడం

డోపమిన్ విరమణ (క్రాష్) తర్వాత భావోద్వేగ ప్రతిస్పందనలు..

→ డోపమిన్ హార్మోన్ ప్రభావం తొలగిపోయి మెదడు సాధారణ స్థితికి రావటాన్ని డోపమిన్ క్రాష్ అంటారు.
→ ఈ స్థితిలో విసుగు, అశాంతి కలుగుతాయి.
→ చిరాకు, నిరాశ, అపరాధ భావన, సిగ్గు, నిస్పృహ ఆవరించడం, ఆందోళనకు గురవుతారు.
→ ఉదాహరణకు ఓటీటీలో ఒక వెబ్‌సిరీస్‌ను గంటల తరబడి చూసిన తర్వాత సమయం అంతా వృథా అయ్యిందని బాధపడటం.
→ డోపమిన్ వ్యసనానికి అతిపెద్ద కారణాలలో సోషల్ మీడియా ఒకటి. ఇన్‌స్టాగామ్, టిక్‌టాక్, ఫేస్‌బుక్ వంటి వాటిని వినియోగదారులను ఆకర్షించేలా రూపొందించారు. ప్రతి లైక్, కామెంట్, షేర్ చిన్నస్థాయిలో డోపమిన్ విడుదలను ప్రేరేపిస్తాయి. ఏదో సాధించామనే భావనను కలిగిస్తాయి. ఈ వర్చువల్ బహుమతులను ఎంత ఎక్కువగా వెంబడిస్తే, నిజ జీవిత అనుభవాలతో మనం అంతగా అసంతృప్తి చెందాల్సి వస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.
→ ఇది మన జీవితంలోని ఇతర అంశాలైన అతిగా తినడం, ఇంపల్స్ షాపింగ్, మితిమీరిన గేమింగ్ వంటి వాటికి కూడా విస్తరించింది.
→ డిజిటల్ డోపమిన్ సమస్య ఇప్పటికే అమెరికన్లలో తీవ్రంగా ఉంది. భారత్‌లోని సోషల్, డిజిటల్ మీడియా వినియోగదారులు సైతం దీనికి ఎక్కువగానే ప్రభావితమవుతున్నారని అధ్యయనాలు చెబుతున్నాయి.

'డిజిటల్' వాడకం తగ్గించుకోవటమే మార్గం

● డ్రగ్స్, ఆల్కహాల్ వంటివి తీసుకున్నపుడు వచ్చే ప్రభావం మాదిరిగా 'డిజిటల్ డోపమిన్'ప్రభావితం చేస్తోంది. మెదడు రివార్డ్ సిస్టమ్‌లో భాగంగా క్విక్ గ్రాటిఫికేషన్‌ను కోరుకుంటోంది. మెదడులోని సహజ రివార్డ్ సర్క్యూట్‌ను సోషల్‌మీడియా అధిక వినియోగం హైజాక్ చేసి చురుకుదనాన్ని తగ్గిస్తుంది. పుస్తకాలు చదివే అభిరుచి, రోజువారీ వ్యాయామం వంటివాటికి దూరం చేస్తోంది. స్వీయ నియంత్రణ తగ్గిపోవడం, ఏ అంశంపైనా దృష్టి నిలపలేకపోవటం, చేయాల్సిన పనులను వాయిదా వేయడం నిత్యకృత్యమవుతున్నాయి. దీనిని అధిగమించాలంటే మొబైల్స్, ఇతర డిజిటల్ సాధనాల వినియోగ సమయాన్ని కచ్చితంగా తగ్గించుకోవాలి.

- డా. నిషాంత్ వేమన, కన్సల్టింగ్ సైకియాట్రిస్ట్.

● సామాజిక మాధ్యమాలు నిత్యావసరాలు కాకపోయినా.. అవే సర్వస్వం, అవి లేకపోతే అంతా శూన్యం అన్నట్టుగా యువత ప్రవర్తిస్తుండడం ఆందోళనకరం. వ్యాయామ విద్య, క్రీడలు, కళలు వంటి వాటిని పట్టించుకోకపోవడం వల్లనే ఇలాంటి సమస్యలు వస్తున్నాయి. ఇప్పటికైనా సామాజిక మాధ్యమాల అతి వినియోగాన్ని అదుపుచేసే చర్యలు తీసుకోకపోతే దేశం అనేక దుర్గుణాలకు, మానసిక అనారోగ్యాలకు కేంద్రంగా మారుతుంది. వ్యాయామం, శారీరక శ్రమ తగ్గిపోయి ఇప్పటికే డయాబెటిస్, ఒబేసిటీ వంటివి తీవ్రస్థాయికి చేరుకున్నాయి. డిజిటల్ డోపమిన్ మనిషి ఉత్పాదకతపై తీవ్ర ప్రభావం చూపుతుంది.

- సి.వీరేందర్, సీనియర్ సైకాలజిస్ట్

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

సాక్షి ప్లస్
ఆదివారం । 14-9-2025

తంగళ్లపల్లి మండలం గోపాల్‌రావుపల్లెలో బహుజన బతుకమ్మ పాట చిత్రీకరణ (ఫైల్)



పైలమే తల్లీ..
పైలమే బతుకమ్మా!



బతుకమ్మతో అరుణోదయ విమలక్క, ప్రొఫెసర్ లక్ష్మి

- నేడు 'బహుజన బతుకమ్మ' పాట ఆవిష్కరణ
- విమలక్క పాడిన పాట.. రచించిన అమర్
- సిరిసిల్ల ప్రాంతంలో పాట చిత్రీకరణ
- ఈ నెల 20 నుంచి అక్టోబర్ 3 వరకు రాష్ట్రమంతటా ఆటాపాట
- ప్రకృతి రక్షణే ప్రజల రక్షణ నినాదంతో వేడుకలు

సిరిసిల్ల:

'అడవి పూల సింగారం.. చేను చెల్కల బంగారం
పైలమే తల్లీ.. పైలమే బతుకమ్మా..
గునుగు పూలెయ్యాలో.. తంగెడు పూలెయ్యాలో..
ఊరూ.. అడవి.. ఆడీపాడంగా..
అడవులన్నీ పైలంగా.. ఆపదలన్నీ దూరంగా..
చప్పట్లే మిరిమిట్లవ్వంగా.. రావే చెల్లి.. రావే అక్క..
బతుకమ్మ ఆడగరావే.. ఉయ్యాలో.. ఉయ్యాలో..
బతుకు సుడిగుండం దాటి బరిగీసి నిలువగ రావే..
ఉయ్యాలో.. ఉయ్యాలా..'

ఇలా సాగే బతుకమ్మ పాటతో బహుజన బతుకమ్మ సింగారించుకుంది. ఈ పాటను వేములవాడకు చెందిన కూర దేవేందర్ అలియాస్ అమర్ అలియాస్ మిత్ర రాయగా.. ఆయన సతీమణి విమలక్క గానం చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా పరిసరాల్లోనే చిత్రీకరణ జరిగింది. పన్నెండు రోజులపాటు రాష్ట్ర వ్యాప్తంగా బహుజన బతుకమ్మ ఆటా పాటలతో అలరించనుంది.

ప్రకృతి రక్షణే ప్రజల రక్షణ అని చాటుదాం

'బహుజన బతుకమ్మ కేవలం ఉత్సవం మాత్రమే కాదు ఉద్యమం అంటూ..' ప్రారంభమైన ఈ కార్యక్రమానికి 15 ఏళ్లు నిండుతున్నాయి. తెలంగాణ ప్రాంత మెట్టపంటలు అందివచ్చే కాలానికి పంటల పండుగలా (హార్వెస్ట్ ఫెస్టివల్) వస్తున్న బతుకమ్మను తెలంగాణ ప్రజలు వందల ఏళ్లుగా జరుపుకుంటున్నారు. ఈ సాంస్కృతిక ఉత్సవం మహత్తర తెలంగాణ సాయుధ పోరాటకాలంలోనూ, రైతాంగ పోరాటాలలోనూ, ప్రత్యేకించి తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటాల్లో సాధనంగా మారిన అనుభవం ఉంది. పార్లమెంటులో తెలంగాణ బిల్లు ప్రవేశపెట్టాలనే డిమాండ్‌తో మొదలైన బహుజన బతుకమ్మ, కులం, మతం అని తేడాలు లేకుండా, వనరుల విధ్వంసం జరగకుండా, ప్రత్యేకించి స్త్రీల సమానహక్కుల ప్రస్తావనతో సెక్యులర్ పండుగగా జరగాలని బహుజన బతుకమ్మ కృషి చేస్తుంది. 'ప్రకృతి రక్షణే ప్రజల రక్షణ' అనే నినాదంతో ఈ ఏడాది బహుజన బతుకమ్మ వేడుకలు జరగనున్నాయి.

ప్రసాద్ ల్యాబ్స్‌లో పాట ఆవిష్కరణ

హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ ప్రసాద్ ల్యాబ్స్ వద్ద ఆదివారం (సెప్టెంబర్ 14న) ఉదయం 9 గంటలకు బహుజన బతుకమ్మ పాటను ఆవిష్కరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో పోతుల రమేశ్, విమలక్క, ప్రొఫెసర్ కె.లక్ష్మి, సీడీ ఆవిష్కరణను సామ అనసూయ, పాట స్విచ్ ఆన్ వెంకట లక్ష్మి చేస్తారు. డాక్టర్ అనితకుమారి వందన సమర్పణతో సీడీ ఆవిష్కరణ ముగుస్తుంది.

సిరిసిల్ల ప్రాంతంలో చిత్రీకరణ

బహుజన బతుకమ్మ పాటను రాజన్న సిరిసిల్ల జిల్లాలోని తంగళ్లపల్లి, గోపాల్‌రావుపల్లి, తాడూరు శివారుల్లో చిత్రీకరించారు. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ఉమ్మడి తెలుగు రాష్ట్రాల గౌరవ అధ్యక్షురాలు విమలక్క బృందం, జానపద కళాకారుడు వంతడ్పుల నాగరాజు పర్యవేక్షణలో ఈ పాట షూటింగ్ జరిగింది. 'ప్రకృతి విధ్వంసమంటే.. ప్రజలపై యుద్ధమే.. శాంతి స్వావలంబన చాటుదామని ఈ ఏడాది ప్రజాబాహుళ్యంలోకి వెళ్లారు. గత 15 ఏళ్లుగా బహుజన బతుకమ్మను అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య నిర్వహిస్తోంది. కళాకారుల నృత్యాలు, ఆటపాటలతో గోపాల్‌రావుపల్లి, తాడూరు, తంగళ్లపల్లి పరిసరాల్లో సందడి చేశారు.

పన్నెండు రోజులు పాటల పండుగే


బహుజన బతుకమ్మ పాటల పండుగను రాష్ట్రమంతంటా నిర్వహించనున్నారు. తొలిరోజు సెప్టెంబర్ 20న గన్ పార్క్‌లో 11 గంటలకు నివాళితో మొదలై.. 3 గంటలకు ఉస్మానియా ఆర్ట్స్ కాలేజీ ప్రాంగణంలో ఆటపాటలతో ప్రారంభమవుతుంది. సెప్టెంబర్ 21న సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం మల్లుపల్లి, 22న ఉమ్మడి రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం చిలుకూరు, 23న వనపర్తి జిల్లా కొత్తకోట, 24న ఉమ్మడి నల్లగొండ జిల్లా నాంపల్లి మండల కేంద్రం, 25న ఉమ్మడి ఖమ్మం జిల్లా పాల్వంచ మండలం ఉల్వనూరు, 26న ఉమ్మడి వరంగల్ జిల్లా భూపాలపల్లి మండలం పెద్దాపురంలో, 27న రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో వేడుకలు నిర్వహించనున్నారు. సెప్టెంబర్ 28న ఉమ్మడి మెదక్ జిల్లా పెద్ద నిజాంపేట మండలం కల్వకుంట, 29న హైదరాబాద్‌లోని మల్లాపురం గోకుల్‌నగర్‌లో, 30న మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలం వెన్నాచెడ్, అక్టోబర్ 3న నిజామాబాద్ జిల్లా ముప్కాల్ మండల కేంద్రంలో బహుజన బతుకమ్మ వేడుకలు ముగియనున్నాయి.





తాడూరు చెరువు కట్టపై బతుకమ్మ పాట చిత్రీకరణ

ప్రకృతి మాయాజాలం..



పొలం గట్టుపై ఉన్న చిన్నచెట్టుకు తీగ రకం గడ్డి అల్లుకుని పక్షిని తలపిస్తున్న దృశ్యం కనువిందు చేస్తోంది. పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం పొత్కపల్లి గ్రామ శివారు పంట పొలాల్లో కనిపించిందీ చిత్రం. - సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి



శనివారం సాయంత్రం హైదరాబాద్‌లో వర్షం కురవడంతో రేతిబౌలి వద్ద ట్రాఫిక్ జామ్



శనివారం సాయంత్రం హైదరాబాద్‌లో వర్షం కురవడంతో రేతిబౌలి వద్ద ట్రాఫిక్ జామ్



పట్టుగుచ్చుపూల తోట



తంగేడు పువ్వు



పట్టుగుచ్చు పూలు

పూల పండుగ కోసం..

పూలను పూజించే పండుగ.. బతుకిచ్చే పండుగ బతుకమ్మ సంబురాలు సమీపిస్తున్నాయి. ఊరూరా పది రోజులపాటు వేడుకలు జరుపుకొనేందుకు సిద్ధమవుతున్నారు. పంట పొలాల్లో ఎక్కడ చూసినా పట్టుగుచ్చుపూలు (సీతమ్మ జడలు), బంతిపూలు, తంగేడు పూలు దర్శనమిస్తున్నాయి. పండుగపూట పట్టణాలకు వెళ్లి విక్రయించేందుకు రైతులు పూలు పండిస్తున్నారు. పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండలం రొంపికుంట, పేరపల్లి గ్రామ శివారుల్లో పట్టుగుచ్చు పూల తోటలు అందంగా కనిపించాయి. - సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి





బంతిపూల తోట

'అంగుతట్ట మోసినం.. తట్టచెమ్మస్ పట్టినం.. మోకాళ్లు, నడుం పనికి రాకుండా పోయింది.. కొడుకక్కన్నా ఉద్యోగం పెట్టిద్దామని మెడికల్ బోర్డుకు పోతే పూర్తిగా అన్యాయం జరిగింది'.. ఓ కార్మికుని ఆగ్రహమిది.

'సత్తువ ఉన్నంత వరకు సింగరేణిలో పనిచేశా. రోగాలబారిన పడి మెడికల్ బోర్డుకు దరఖాస్తు చేసుకుని ఇన్వాలిడేషన్ బోర్డులో ఇన్వాలిడేషన్ అయ్యా. కొడుక్కి ఉద్యోగం ఇవ్వమంటే మారుపేర్ల సాకుచూపి గోస పెడుతుండ్రు'.. మరో మాజీ కార్మికుని ఆవేదన ఇది.

చీకటి సూర్యుల పోరుబాట

- జీవన్మరణ సమస్యగా చీకటి సూర్యులు
- రోడ్డెక్కిన కార్మిక కుటుంబాలు
- ఉధృత ఆందోళనలకు సన్నద్ధం
- పట్టించుకోని ప్రభుత్వం
- తమ చేతుల్లో లేదంటున్న గెలిచిన సంఘాలు



మెడికల్ బోర్డు సింగరేణి కార్మికులు

గోదావరిఖని: చీకటి సూర్యులు రోడ్డెక్కుతున్నారు. ఇన్నేళ్లు లేని కొత్త నిబంధనలతో గోస పెడుతున్నారని కుటుంబ సభ్యులతో సహా సీఎండీ కార్యాలయ ముట్టడికి సన్నద్ధమవుతున్నారు. హయ్యర్ సెంటర్ మెడికల్ బోర్డు కార్మికులు.. విజిలెన్స్ పెండింగ్ ఉద్యోగాల కార్మికుల పిల్లలు పోరుబాటకు సిద్ధమయ్యారు. వన్‌టైం సెటిల్‌మెంట్ కింద సమస్యను పరిష్కరించాల్సిన యాజమాన్యం పట్టించుకోవడం లేదు. ఉదాసీనంగా వ్యవహరించి సమస్య పరిష్కరించాల్సిన ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవడం లేదు. దీంతో సింగరేణి కార్మికులు, వారి కుటుంబాలకు జీవన్మరణ సమస్యగా మారింది. సుమారు 50 మంది మెడికల్ ఇన్వాలిడేషన్ కార్మికులు, దాదాపు 700 మంది కారుణ్య నియామకాల విజిలెన్స్ పెండింగ్ బాధితుల సమస్య పరిష్కారం కోసం రోడ్డున పడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు. కనిపించిన ఎమ్మెల్యే, యూనియన్ నాయకులను కలిసి విన్నవిస్తున్నా.. సమస్య మాత్రం అలాగే ఉంటోంది.




సీతారామయ్య కాళ్లపై పడి వేడుకుంటున్న విజిలెన్స్ మారుపేర్ల బాధితులు

ఆందోళనలకు సన్నద్ధం

సింగరేణి విజిలెన్స్ మారుపేర్ల బాధితులు తమకు వన్‌టైం సెటిల్‌మెంట్ కింద ఉద్యోగాలివ్వాలని ఆందోళన ఉధృతం చేయాలని నిర్ణయించారు. యాజమాన్యం నిర్ణయం తీసుకునేప్పటికి తమ వయసైపోతే ఉద్యోగానికి దూరం అవుతామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే గోదావరిఖనిలోని భాస్కర్‌రావు భవన్‌ను ముట్టడించి ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య కాళ్లు మొక్కారు. వారితో వాగ్వాదానికి దిగారు. డైరెక్టర్లు, సీఎండీ ఎక్కడికి వచ్చినా తమ నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. వన్‌టైం సెటిల్‌మెంట్ కింద మారుపేర్ల కుటుంబాల్లో ఒక్కరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

పక్షవాతం వచ్చింది



ఎనిమిదేళ్ల క్రితం పక్షవాతం వచ్చింది. సింగరేణి ద్వారా ఆస్పత్రిలో చికిత్స చేసుకుని ఆరునెలల పాటు మెడికల్ లీవులో ఉన్నా. నరాలు సరిగా పనిచేస్తలేవు. డిస్క్ సమస్యతో సరిగా నడవలేక ఇబ్బంది పడుతున్నా. మోకాళ్ల నొప్పులు వేధిస్తున్నాయి. డ్యూటీ చేయలేని పరిస్థితి నెలకొంది. అనారోగ్య సమస్యలను దృష్టిలో ఉంచుకుని మెడికల్ అన్‌ఫిట్ చేయాలని యాజమాన్యానికి చేతులెత్తి మొక్కుతున్నా. - బండారి రాజనర్సు, ఈపీ ఫిట్టర్, ఓసీపీ-3

నడుం భాగంలో ఆపరేషన్



మూడేళ్ల క్రితం నడుం భాగంలో ఆపరేషన్ అయ్యింది. నడుముకు బెల్టు ఉంటే తప్ప నడవలేని పరిస్థితి ఉంది. ఎల్‌త్రీ, ఎల్‌ఫోర్, ఎల్‌ఫైవ్ ప్రాంతంలో సర్జరీ చేశారు. హైపటైటిస్ సీ పాజిటివ్‌తో బాధపడుతున్నా. హయ్యర్ మెడికల్ బోర్డులో కూడా డాక్టర్లు సమస్య ఉందని రాశారు. అయినా యాజమాన్యం మెడికల్ ఇన్వాలిడేషన్ చేయలేదు. ఆర్థిక, అనారోగ్య సమస్యలు వెంటాడుతున్నాయి. దయచేసి అన్‌ఫిట్ చేయాలి. - బి.సత్యారావు, ఫిట్టర్, ఓసీపీ-1

వన్‌టైం సెటిల్‌మెంట్..



వన్‌టైం సెటిల్‌మెంట్ కింద యాజమాన్యం అందరికీ ఉద్యోగాలివ్వాలి. 40 ఏళ్లు సంస్థలో పనిచేసి రిటైరైన కార్మికుల విషయంలో లేని ఇబ్బంది.. వారి వారసులుగా తమకు ఉద్యోగాలు ఇవ్వకుండా ఎందుకు ఇబ్బంది పెడుతున్నారు. ఆలస్యం జరిగిన కొద్దీ వయస్సు పెరిగి ఉద్యోగాలకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడుతోంది. ప్రభుత్వం, యాజమాన్యం జోక్యం చేసుకుని వెంటనే ఉద్యోగాలివ్వాలి. - దిష్‌బాబు, విజిలెన్స్ మారుపేర్ల బాధితుడు

అడ్వొకేట్ జనరల్ పరిధిలో..



మారుపేర్ల విజిలెన్స్ పెండింగ్ సమస్య అడ్వొకేట్ జనరల్ పరిధిలో ఉంది. ప్రభుత్వం జోక్యం చేసుకుని త్వరగా పరిష్కరించాలి. జూలై చివర్లో జరిగిన హయ్యర్ మెడికల్ బోర్డు కార్మికులందరినీ ఇన్వాలిడేషన్ చేసి వారి పిల్లలకు ఉద్యోగాలివ్వాలి. ఈ విషయంలో యాజమాన్యంతో ఇప్పటికే మాట్లాడాం. - రెడ్డి సీతారామయ్య, అధ్యక్షుడు, ఏఐటీయూసీ

ఉక్కుకు ఉచ్చు?

రూ.3లక్షల కోట్ల ఆస్తి భద్రత ప్రశ్నార్థకం



- ఆగస్టు 25.. స్టీల్‌ప్లాంట్‌లోని బ్లాస్ట్ ఫర్నేస్-3 పునరుద్ధరణ కోసం భద్రపరిచిన భారీ కాపర్ స్టేవ్స్ చోరీకి గురయ్యాయి. ఒక్కొక్కటి 1,200 నుంచి 1,400 కిలోల బరువుండే ఆరు స్టేవ్స్ మాయమయ్యాయి. వీటి విలువ సుమారు రూ.50 లక్షలకు పైగా ఉంటుందని అంచనా.
- సెప్టెంబర్ 10.. స్టీల్‌ప్లాంట్ రా మెటీరియల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ (ఆర్‌ఎంహెచ్‌పీ) విభాగంలో గుర్తుతెలియని వ్యక్తులు కన్వేయర్ బెల్ట్‌ను కోసేశారు. సిబ్బంది విధి నిర్వహణలో భాగంగా కన్వేయర్‌ను ప్రారంభించగా, బెల్ట్ కొంత భాగం తెగి ఉండటాన్ని గమనించి, అది పూర్తిగా ధ్వంసం కాకముందే నిలిపివేశారు.
- విశాఖ ఉక్కు కర్మాగారంలో ఇటీవలి కాలంలో చోటుచేసుకుంటున్న ఈ ఘటనలు కార్మికులు, ఉద్యోగ సంఘాల్లో తీవ్ర ఆందోళన రేకెత్తిస్తున్నాయి. ప్రైవేటీకరణ కుట్రలో భాగంగానే యాజమాన్యం భద్రతను ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం చేస్తోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

- రాగి స్టేవ్‌లు ఎలా మాయమయ్యాయి
- కన్వేయర్ బెల్ట్‌లను కోసిందెవరు?
- వరుస ఘటనలతో ఆందోళనలో స్టీల్‌ప్లాంట్ కార్మికులు
- ఉక్కు ఆస్తులకు ఎసరు పెడుతున్నదెవరు?
- యాజమాన్య నిర్లక్ష్యమా? పాలకుల కుట్రా?

సాక్షి, విశాఖపట్నం: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి చేస్తున్న కుయుక్తులు ఉక్కు పరిశ్రమకు కొత్త చిక్కులు తెచ్చిపెడుతున్నాయి. సంవత్సరాలుగా ఉద్యోగ, కార్మిక సంఘాలు తమ కుటుంబాలతో కలిసి రోడ్లపై పోరాటాలు చేస్తున్నా.. కేంద్రం తన పని తాను చేసుకుపోతోంది. ఒక్కో విభాగాన్ని ప్రైవేటీకరణ చేయడానికి చకచకా పావులు కదుపుతోంది. ఖర్చుల తగ్గింపులో భాగంగా స్వచ్ఛంద పదవీ విరమణ పేరుతో ఉద్యోగులను, వేలాది మంది కార్మికులను విడతలవారీగా విధుల నుంచి తొలగించేసింది. ఇదే విధంగా ఈ ఏడాది ఫిబ్రవరిలో భద్రతా సిబ్బందిపైనా వేటు పడింది. ఈ నేపథ్యంలో ప్లాంట్‌లో భద్రత ప్రశ్నార్థకంగా మారింది.

భారీగా తగ్గిన సీఐఎస్‌ఎఫ్ సిబ్బంది

దేశంలోని పార్లమెంట్, విమానాశ్రయాలు వంటి అత్యంత కీలకమైన సంస్థలకు రక్షణ కల్పించే సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్(సీఐఎస్‌ఎఫ్) విశాఖ ఉక్కు కర్మాగారానికి 1983 ఆగస్టు నుంచి భద్రత కల్పిస్తోంది. రూ.3 లక్షల కోట్ల విలువైన ప్లాంట్ ఆస్తులు, యంత్రాలు, ముడి పదార్థాలను సుమారు 40 ఏళ్లుగా సుమారు 1,013 మంది సిబ్బంది కంటికి రెప్పలా కాపాడారు. అయితే ఈ ఏడాది ఫిబ్రవరిలో 'డిప్లాయ్‌మెంట్ కాస్ట్ కటింగ్' పేరుతో యాజమాన్యం సీఐఎస్‌ఎఫ్ సిబ్బందిని భారీగా తగ్గించింది. మొత్తం 1013 మందిలో ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు, కానిస్టేబుళ్ల వంటి హోదాలో ఉన్న 438 మందిని ఇతర ప్రాంతాలకు బదిలీ చేశారు. ప్రస్తుతం కేవలం 575 మంది సిబ్బంది మాత్రమే విధుల్లో ఉన్నారు. సిబ్బందిని తగ్గించిన తర్వాత ప్రత్యామ్నాయ భద్రతా ఏర్పాట్లు చేయడంలో యాజమాన్యం మీనమేషాలు లెక్కిస్తోందని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి.

యాజమాన్య నిర్లక్ష్యం.. ప్రైవేటీకరణ కుట్ర

కేంద్ర ప్రభుత్వం ప్లాంట్ ప్రైవేటీకరణకు మొగ్గు చూపడం, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అందుకు వత్తాసు పలకడంతోనే యాజమాన్యం ప్లాంట్ భద్రతపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో ఒక ఉద్యోగి ప్లాంట్‌లోకి వెళ్లి బయటకు రావాలంటే సీఐఎస్‌ఎఫ్ సిబ్బంది డేగ కళ్లతో పహారా కాసేవారు. లోపలకు వెళ్లి.. బయటకు వచ్చేటప్పుడు ఉద్యోగి చేతిలో అదనపు వస్తువు ఏదైనా కనిపించినా ఆరా తీసేవారు. ఇప్పుడు సిబ్బంది కొరత కారణంగా భద్రతా ప్రమాణాలు పడిపోయాయి. ఒక్కొక్కటి 1,400 కిలోల బరువున్న కాపర్ స్టేవ్స్ చోరీకి గురైనా గుర్తించలేకపోవడం, అత్యంత కీలకమైన ఆర్‌ఎంహెచ్‌సీ విభాగంలో కనీసం సీసీ కెమెరాలు కూడా లేకపోవడం యాజమాన్య నిర్లక్ష్యానికి నిదర్శనమని ఉద్యోగ, కార్మిక సంఘాలు మండిపడుతున్నాయి. ఈ వరస ఘటనల వెనుక ప్రైవేటీకరణకు మార్గం సుగమం చేసే కుట్ర దాగి ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్లాంట్ భద్రతా వ్యవస్థను బలహీనం చేశారు



స్టీల్‌ప్లాంట్ ఆస్తులను దొడ్డిదారిన దోచుకోవడానికి పెద్దస్థాయిలో కుట్ర జరుగుతోంది. భద్రతా వలయంలో ఉంటూ నిరంతరం రూ.వేల కోట్ల ఉత్పత్తులున్న చోట.. బయట వాహనాల్లో వచ్చి చోరీ చేస్తే.. ప్లాంట్‌లో ఏదో జరుగుతోందని అర్థమవుతోంది. కాపర్ స్టేవ్స్ ఒక్కో ప్లేట్ 1.4 టన్నుల బరువు ఉంటుంది. వాటిని ఎత్తాలంటే హైడ్రాలిక్ క్రేన్, లారీ అవసరం. అలాంటివి ఆరు కాపర్ స్టేవ్‌లు మాయమయ్యాయి. ఈ నేరానికి పాల్పడినవారు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలి. సీఐఎస్‌ఎఫ్ సిబ్బందిని బదిలీ చేసి, సెక్యూరిటీని బలహీనపరిచారు. ప్రజల ఆస్తులకు కట్టుదిట్టమైన భద్రత కల్పించాల్సిన చోట, యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. సీఐఎస్‌ఎఫ్ సిబ్బందిని బదిలీ చేసిన తర్వాత ఇంతవరకూ ప్రత్యామ్నాయ భద్రతా ఏర్పాట్లు చేయకపోవడం గర్హనీయం.


– అయోధ్యరామ్, కన్వీనర్, విశాఖ ఉక్కు పోరాట కమిటీ

వలిసె విలాసం

మన్యం పేరు చెబితే ప్రకృతి అందాలకు నిలయమే కాకుండా పచ్చని కొండలు గుట్టల మధ్య పసుపు తివాచీ పరిచినట్లుండే వలిసె పూలు గుర్తుకు వస్తాయి. అందానికే కాకుండా మరో వైపు ఆదాయం ఇచ్చే వాణిజ్య పంటగా వలిసెలకు గుర్తింపు ఉంది. వేరుశనగ తరువాత అత్యధిక విస్తీర్ణంలో సాగయ్యే ఈ పంట విస్తీర్ణం ఏటా తగ్గిపోతుండటం పర్యాటకులకు నిరాశ కలిగిస్తోంది. పర్యాటక సీజన్‌లో మంచు తెరల మధ్య వన్నెలద్దే వలిసె పూలు పూర్వవైభవం కోల్పోయే పరిస్థితులు నెలకొంటున్నాయి.



వలిసెలపై పరిశోధనలు జరుగుతున్న చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం



వలిసె పూల మకరందాన్ని సేకరిస్తున్న తేనెటీగ

- ఏటా తగ్గిపోతున్న సాగు విస్తీర్ణం
- ఫలించని శాస్త్రవేత్తల ప్రయత్నాలు
- పర్యాటక ప్రాంతాల్లో తగ్గనున్న శోభ
- సంప్రదాయ విత్తనాల వల్ల దిగుబడి తగ్గుదల
- అధిక వర్షాల వల్ల ఈ ఏడాది ఆలస్యంగా సాగు
- ప్రభుత్వ ప్రోత్సాహం కరువు

చింతపల్లి: వలిసెలను అల్లూరి జిల్లాలో పాడేరు డివిజన్‌లో నూనె గింజల పంటగా గిరిజనులు సాగు చేస్తున్నారు. సంప్రదాయ విత్తనాల వినియోగం, ఆకాశపందిరి కలుపు మొక్క ప్రభావం కారణంగా దిగుబడి తగ్గింది. దీంతో నిరాశకు గురవుతున్న రైతులు ఈ సాగుపై ఆసక్తి చూపడం లేదు.

- రెండు దశాబ్దాల క్రితం 6 వేల ఎకరాలకు పైగా ఉన్న సాగు విస్తీర్ణం ఏటా గణనీయంగా తగ్గిపోతోంది. గత రెండేళ్లలో 1500 నుంచి 1600 ఎకరాలు ఉన్న సాగు విస్తీర్ణం ఇప్పుడు 1200 ఎకరాలకు తగ్గిపోయింది.

కారణాలివీ..

గిరిజన రైతులు సంప్రదాయ విత్తనాలను వినియోగించడం వల్ల దిగుబడి రావడం లేదు. మరోపక్క మార్కెటింగ్ సమస్యను ఎదుర్కొంటున్నారు. తేనెటీగలు తగ్గడం కూడా దిగుబడిపై ప్రభావం చూపిస్తోంది. రాజ్‌మా, వరి విత్తనాలను ప్రభుత్వం రాయితీపై అందజేయడం వల్ల ఆ పంటల సాగుపై రైతులు మొగ్గు చూపుతున్నారు. ప్రభుత్వం నుంచి ఎటువంటి ప్రోత్సాహం లేకపోవడం కూడా గిరి రైతులను నిరాశ పరుస్తోంది.

అనువైన రకాలు

ఎత్తయిన గిరిజన ప్రాంతాల్లో సాగు చేసేందుకు అనువైన రకాలను స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు గుర్తించారు. జేఎన్‌ఎస్-28,30, జేఎన్‌ఎస్-2016, 1115, కేజీఎన్ -2 రకాలు వంద నుంచి 110 రోజుల్లో దిగుబడి వస్తుంది. జేఎన్‌ఎస్-6 రకం 110 రోజులు, జేఎన్‌ఎస్-9, ఉత్కల్ నైజర్-150 రకాలు 95 నుంచి వంద రోజుల్లో దిగుబడి వస్తుందని శాస్త్రవేత్తలు తెలిపారు.



చింతపల్లి ఆర్‌ఏఆర్‌ఎస్‌లో వలిసె సాగు పరిశోధన క్షేత్రం

త్వరలో చింతపల్లి నైజర్ 1,2 విత్తనాలు

ఇక్కడి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో వలిసెలపై ప్రత్యేకంగా జాతీయ ప్రాజెక్ట్ అమలు అవుతోంది.ఇక్కడ వేల రకాల విత్తనాలపై 2018 నుంచి పరిశోధనలు జరుగుతున్నాయి. ఈ ప్రాంత వాతావరణ పరిస్థితులు అనుకూలంగా చింతపల్లి నైజర్ 1,2 రకాలు ఉన్నట్టు చింతపల్లి గుర్తించారు. వీటిపై పరిశోధనలు మరో రెండేళ్లు జరిపిన అనంతరం రైతులకు పంపిణీ చేస్తామని శాస్త్రవేత్తలు తెలిపారు.

ఈ ఏడాది ఆలస్యంగా..

ఈ ఏడాది ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తునందున సాగు ఆలస్యమయ్యే పరిస్థితి కనిపిస్తోంది. ఏటా ఆగస్టు నెలాఖరు, సెప్టెంబర్‌లో సాగు మొదలు పెడతారు. నవంబర్ నుంచి పూత వస్తుంది. జనవరి నాటికి దిగుబడి వస్తుంది. అయితే ఈ ఏడాది ఇప్పటివరకు సాగు చేపట్టిన పరిస్థితులు కనిపించలేదు.

అగ్రి టూరిజంలో సంకల్పించినా..

సాగు విస్తీర్ణం పెంచే చర్యల్లో భాగంగా రెండేళ్ల క్రితం చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు అగ్రిటూరిజంలో ఈ పంటను చేర్చారు. రైతులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించినా ప్రయోజనం లేకపోయింది. ఇదే పరిస్థితి కొనసాగితే మన్యానికి శోభనిచ్చే వలిసె పూలు భవిష్యత్తులో పూర్తిగా కనుమరుగయ్యే పరిస్థితులు లేకపోలేదు.

- వలిసె పూల మకరందాన్ని సేకరించే తేనెటీగలు పరాగ సంపర్కంలో కీలక పాత్ర పోషిస్తాయి, ఇది పంటల దిగుబడికి మరియు కొత్త మొక్కల పెరుగుదలకు సహాయపడుతుంది. వలిసె తోటల వద్ద తేనెటీగలు చేరడం సహజమే అయినా, ఇటీవలి కాలంలో తేనెటీగల సంఖ్య తగ్గడం వల్ల దిగుబడి తగ్గి గిరిజన రైతులకు నష్టం కలిగిస్తుందని శాస్త్రవేత్తలు తెలిపారు.

రాయితీపై విత్తనాలివ్వాలి



వరి, రాజ్‌మా విత్తనాలు మాదిరిగానే వలిసె విత్తనాలను రాయితీపై పంపిణీ చేయాలి. విత్తనాలు అందుబాటులో లేకపోవడం వల్ల సాగు చేపట్టలేకపోతున్నాం. దీనిపై ప్రభుత్వం, అధికారులు స్పందించి రాయితీపై విత్తనాల పంపిణీకి చర్యలు తీసుకోవాలి.

– బౌడు కుశలవుడు, రైతు, గొందిపాకలు, చింతపల్లి మండలం

అవగాహన కల్పిస్తున్నాం



గిరి రైతులు వలిసె సాగులో దిగుబడులు తగ్గడంపై ఆసక్తి చూపడం లేదు. ఈ పరిస్థితుల్లో రైతులను ప్రోత్సహించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. దత్తత తీసుకున్న దుచ్చరపాలెంలో ట్రైబల్ సబ్ ప్లాన్ ద్వారా మేలు రకాల విత్తనాలు 100 కిలోలు పంపిణీ చేశాం. వీటితోపాటు ఆకాశపందిరి కలుపు మొక్క నివారణకు సూచనలిచ్చాం. ఇదే కాకుండా జల్లెడలు, టార్పాలిన్లు అందజేశాం. తేనెటీగలు మనుగడ తగ్గడంతో కూడా ఈ పంట దిగుబడి తగ్గుతుంది. వీటి పెంపకానికి రైతులను అవగాహన కల్పిస్తున్నాం.

– బయ్యపురెడ్డి, ప్రధాన శాస్త్రవేత్త, ఆర్‌ఏఆర్‌ఎస్, చింతపల్లి

నల్లమలలో వజ్రాన్వేషణ



వంక వద్ద వజ్రాల కోసం వెతుకుతున్న ప్రజలు



ఒక వ్యక్తికి దొరికిన రాయి



దొరికిన వివిధ రంగురాళ్లు

నీటి గలగలలు.. తళుక్కుమనే ఆశలు.. ఒకరు కాదు ఇద్దరు కాదు వేల మంది వజ్రాల కోసం నల్లమల అడవిలోని ఒక వంకలో అన్వేషణ సాగిస్తున్నారు. నంద్యాల జిల్లా మహానంది మండలం గాజులపల్లె సమీపంలోని సర్వనరసింహ స్వామి ఆలయం సమీపం వద్ద ఈ దృశ్యం కనిపిస్తోంది. అన్వేషకులకు ఎక్కువగా చెకుముకి రాయి తరహాలో తెల్లగా ఉండే చిన్న చిన్న రాళ్లు దొరుకుతున్నాయి. వజ్రాలు దొరుకుతాయనే నమ్మకంతో ఆంజనేయపురంలోని ఆంజనేయస్వామి ఆలయ పరిసరాల్లో కొంతమంది, మరికొంత మంది ఇదే గ్రామంలో ఇళ్లను అద్దెకు తీసుకుని ఉంటున్నారు. అదృష్టం వరించిన వారికి సుమారు రూ. లక్షకు పైగా విలువ చేసే వజ్రాలు దొరికినట్లు గ్రామస్తులు తెలిపారు. ఇటీవల చీరాల నుంచి వచ్చిన ఓ మహిళకు రూ.1.50లక్షల విలువైన వజ్రం దొరికింది. ఇక్కడికి ప్రకాశం, గుంటూరు, విజయవాడ, బాపట్ల తదితర జిల్లాల నుంచి వేలాది సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు.

– మహానంది

శ్రీవారి దర్శనానికి 15 గంటలు

తిరుమల: తిరుమలలో శనివారం భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు అన్నీ నిండిపోయాయి. క్యూలైన్ కృష్ణతేజ అతిథి గృహం వద్దకు చేరుకుంది. శుక్రవారం అర్ధరాత్రి వరకు 69,842 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 28,234 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.18 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 15 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన వారికి 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయాన్ని కంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలో అనుమతించరని స్పష్టంచేసింది.

వైభవంగా పుష్పపల్లకీ సేవ

కాణిపాకం: చిత్తూరు జిల్లా కాణిపాకం ప్రత్యేక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో శనివారం పుష్పపల్లకీ వాహన సేవ అంగరంగవైభవంగా సాగింది. వేకువ జామున స్వామిని మేల్కొలిపి నిత్య పూజలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. రాత్రి పుష్పమాలికలతో పుష్పపల్లకీని ముస్తాబు చేశారు. ఉభయదారులు స్వామికి పూజా సామగ్రి, పట్టు వస్త్రాలను సమర్పించారు. తర్వాత ఉత్సవమూర్తిని పుష్పపల్లకీలో అధిష్ఠింపజేశారు. గణనాథుడు పుష్ప పల్లకిలో విహరిస్తూ భక్తులకు అభయమిచ్చారు.

టీటీడీ ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.44 లక్షల విరాళం



తిరుమల: తమిళనాడు మంత్రి కెఎన్ నెహ్రూ టీటీడీ ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.44 లక్షలు విరాళంగా అందించారు. నవంబర్ 9న తన పుట్టినరోజు సందర్భంగా ఒక్కరోజు అన్నప్రసాదం వితరణకు అయ్యే ఖర్చు రూ 44 లక్షలు విరాళం ఇచ్చారు. ఆయన ప్రతినిధి శనివారం టీటీడీ చైర్మన్‌కు డీడీ అందజేశారు.

అమరావతి శిల్పాల రాక ఎన్నడో?

- లండన్ మ్యూజియంలో భద్రపర్చిన శిల్పాలు
- 'అమరావతి ఆర్ట్'తో తెరపైకి
- లండన్ స్థాయిలో మ్యూజియం నిర్మించాలి
- 'కొండ'ను సందర్శనీయం చేయాలి

తెనాలి: గుంటూరులో కొద్దిరోజుల కిందట సీనియర్ పాత్రికేయుడు పున్నా కృష్ణమూర్తి రచన 'అమరావతి ఆర్ట్ ధరణికోట-నాగార్జునకొండ శిల్ప సంపదల సచిత్ర వ్యాస సంకలనం ఆవిష్కరణలో పాల్గొన్న ప్రముఖులు కీలకమైన తీర్మానం చేశారు. రాజధాని ప్రాంతంలో లలిత కళల విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటుచేయాలని, అందులో అమరావతి శిల్పకళను పదిలం చేయాలనేది ఆ తీర్మానం. చెన్నైలో, లండన్‌మ్యూజియంల్లో ఉన్న అమరావతి శిల్పసంపదను రప్పించాలని, ఒరిజినల్ శిల్పాలు కాకున్నా నమూనా శిల్పాలనైనా తెప్పించేందుకు కృషి జరగాలని అభిప్రాయపడ్డారు. మన అమరావతి శిల్ప సంపదను రప్పించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారు.



లండన్ మ్యూజియం... అందులోని మన శిల్పాలు

కదిలినా ప్రయోజనం శూన్యం

వాస్తవానికి ఈ దిశగా గతంలోనే కొంత కదలిక కనిపించినా, జరిగింది మాత్రం శూన్యం. విభజిత ఆంధ్రప్రదేశ్‌కు అమరావతి పేరిట నామకరణం చేసిన తెలుగుదేశం ప్రభుత్వం, అప్పట్లో రాష్ట్రంలోని బౌద్ధపర్యాటక కేంద్రాలను అభివృద్ధి చేస్తామని ప్రకటించింది. లండన్‌లోని బ్రిటిష్ మ్యూజియంలో ఉన్న 'అమరావతి నగర అపురూప శిల్పాలు' వెనక్కి రప్పించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని నాడు వార్తలొచ్చాయి. దీనిపై బౌద్ధ అభిమానులు, రాష్ట్ర ప్రజలు సంతోషించారు. కేంద్రంలో నాటి ఎన్డీఏ ప్రభుత్వమే కొలువు దీరింది. ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉన్న టీడీపీ భాగస్వామిగా గల కూటమి ప్రభుత్వం, ఎన్డీఏలో భాగస్వామిగా తెలిసిందే. ఇప్పటికైనా లండన్ మ్యూజియంలోని శిల్పసంపదను, కనీసం నమూనాలైనా తెప్పించాలనేది అందరి ఆకాంక్ష.


విరాజిల్లిన బౌద్ధం

శాతవాహనుల కాలంలో కృష్ణా తీరాన బౌద్ధం విరాజిల్లింది. ధాన్యకటకం అంటే అమరావతి రాజధానిగా శాతవాహనులు దాదాపు 300 ఏళ్ల సువిశాల సామ్రాజ్యాన్ని పరిపాలించారు. అంతకుపూర్వం అశోకుని కాలంలోనే అక్కడ మహాస్తూపం నిర్మాణం ప్రారంభమై చాలా కాలం కొనసాగింది. అమరావతి స్తూపంలోని పూర్ణఘటం సంపూర్ణ జ్ఞానానికి సంకేతం. దీనినే తర్వాత పూర్ణకుంభంగా మార్చి ఆంధ్రప్రదేశ్ అధికార చిహ్నంగా ప్రకటించారు.

భద్రపర్చిన బ్రిటీష్ పాలకులు

ఈ శిల్పాలను ఫొటోలు తీయించడమే కాకుండా విరిగిపోయిన భాగాలను యథావిధిగా చిత్రాలు గీయించి, భద్రపర్చారు. అక్కడకు తరలించిన శిల్పాల జాబితాను రూపొందించి, అన్నింటికీ ఫొటోలు తీయించారు. లండన్‌లోని మన శిల్పాలపై బీబీసీ డాక్యుమెంటరీ చేసింది. అలాంటి మన వారసత్వ సంపదను అమరావతికి తీసుకొచ్చేందుకు గతంలో అమరావతి డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ జాస్తి వీరాంజనేయులు ప్రధాని నరేంద్రమోదీకి లేఖ రాశారు. ఆ ప్రకారం చర్యలు తీసుకోవాలని భారత ప్రభుత్వ సాంస్కృతికశాఖ కార్యాలయం నుంచి పురావస్తు శాఖ డైరెక్టర్ జనరల్‌కు ఆదేశాలు పంపారు. అక్కడితో కథ ఆగిపోయింది. ముందుకు సాగలేదు. మళ్లీ ఇప్పుడు ప్రముఖులు చేసిన తీర్మానం ప్రకారం అమరావతి శిల్పాలను వెనక్కి రప్పించే ప్రక్రియ ఆరంభం కావాలనేది బౌద్ధ అభిమానులు, కళాభిమానుల ఆకాంక్ష.

అమరావతిలోని ఆనాటి శిల్పసంపదను అపురూపమైనవిగా బ్రిటిష్ వలస పాలకులు గుర్తించారు. 1798లో కల్నల్ కొలిన్ మెకంజీ, అతడి సహాయకుడు బెంజిమిన్ సడస్‌హేంలు అమరావతిలోని బౌద్ధస్తూపాన్ని సందర్శించాక, అక్కడి శిల్పాలకు కాళ్లొచ్చాయి. ఆ తర్వాత 1845లో మరోసారి ఇక్కడ తవ్వకాలు చేశారు. సుమారు వందేళ్ల కాలంలో దశలవారీగా ఈ శిల్పాలను మచిలీపట్నం, కోల్‌కతా, చెన్నై, ఢిల్లీకి తరలించి, అక్కడ్నుంచి లండన్‌కు పంపారు. అక్కడి బ్రిటిష్ మ్యూజియంలో 120పైగా శిల్పాలను అమరావతి ఆర్ట్ గ్యాలరీ పేరిట భద్రపరిచారు. మరి కొన్ని చెన్నై, కోల్‌కతా, ఢిల్లీ మ్యూజియంలలో ఉన్నాయి.



శిల్ప సంపద

సాక్షి సినిమా

హీరోయిన్ల కెరీర్ అంటే పెళ్లికి ముందు పెళ్లి తర్వాత అనే నానుడి ఇండస్ట్రీలో ఉంది. పెళ్లికి ముందు ఫుల్ క్రేజ్‌తో దూసుకెళ్లే నాయికల కెరీర్ మిసెస్ అయ్యాక జోరు తగ్గుతుందని, అవకాశాలు అరకొరగా వస్తాయని అంటుంటారు. అయితే ఇప్పుడు ఈ పరిస్థితి లేదు. 'మిసెస్ అయితే ఏంటి?' అని ఇండస్ట్రీ అనుకుంటోంది... పెళ్లయ్యాకా కెరీర్‌లో దూసుకెళ్లాలని హీరోయిన్లు అనుకుంటున్నారు. అయితే పెళ్లి తర్వాత చాన్స్‌లు వచ్చినా అక్క, చెల్లి, వదిన... వంటి పాత్రలకే వారిని పరిమితం చేస్తుంటారనే వారూ ఇండస్ట్రీలో లేకపోలేదు. కానీ ఈ పరిస్థితి కూడా మారింది. ప్రస్తుతం మాత్రం పెళ్లి అయినా కెరీర్‌లో ఏ మాత్రం జోరు తగ్గకుండా దూసుకెళుతున్నారు పలువురు హీరోయిన్లు. మిసెస్ అయినా క్రేజ్, చాన్స్‌ల విషయంలో తగ్గేదే లే అంటూ అవకాశాలు అందిపుచ్చుకుంటున్నారు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ... ఇలా ఆయా భాషల హీరోయిన్లు వివాహ బంధంలోకి అడుగు పెట్టినా, తల్లిగా ప్రమోషన్ పొందినా అవకాశాల్లో మాత్రం జోరు చూపిస్తున్నారు. పెళ్లి తర్వాత కూడా కెరీర్‌లో విజయవంతంగా దూసుకుపోతున్న హీరోయిన్లు ఎవరో ఓ లుక్ వేద్దాం.



● శ్రియ ● కాజల్ ● కీర్తి సురేశ్ ● నయనతార



● ఆలియా భట్ ● కియారా ● రకుల్ ప్రీత్‌సింగ్ ● లావణ్యా త్రిపాఠి

క్రేజ్ తగ్గేదే లే

● మిసెస్ అయితే ఏంటి?

ఇష్టంతో...

తెలుగు చిత్ర పరిశ్రమకు 'ఇష్టం'తో (2001) వచ్చారు శ్రియ శరణ్. ఆ తర్వాత 'సంతోషం, నువ్వే నువ్వే, ఠాగూర్, ఎలా చెప్పను, నేనున్నాను, ఛత్రపతి, గౌతమిపుత్ర శాతకర్ణి, పైసా వసూల్' వంటి పలు విజయవంతమైన సినిమాల్లో నటించి, ప్రేక్షకులను అలరించారు శ్రియ. అదే విధంగా మలయాళ, తమిళ, కన్నడ, హిందీ భాషల్లోనూ నటించారామె. కెరీర్ జోరుగా ఉన్న సమయంలోనే 2018 మార్చి 19న ఆండ్రీ కోస్చీవ్‌తో పెళ్లి పీట లెక్కారు శ్రియ. అయితే వివాహం తర్వాత కూడా ఆమె వరుస చాన్స్‌లు అందిపుచ్చుకున్నారు. 2021 జనవరి 10న ఓ పాపకు జన్మనిచ్చారు శ్రియ. ఆ సమయంలో కొంచెం విరామం తీసుకున్న ఆమె 2022 నుంచి వరుస సినిమాలు చేస్తున్నారు. ఈ ఏడాది ఆమె నటించిన సూర్య 'రెట్రో' (ప్రత్యేక పాట) సినిమా మే 1న విడుదలైంది. తేజ సజ్జా హీరోగా నటించిన 'మిరాయ్' చిత్రం శుక్రవారం పాన్ ఇండియా స్థాయిలో విడుదలైన సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో తేజ సజ్జా తల్లిగా అంబిక పాత్రలో నటించారు శ్రియ. ఆమె పాత్రకి మంచి ఆదరణ వస్తోంది. ఇంకా శ్రియ చేతిలో మరికొన్ని సినిమాలు ఉన్నాయి. తన తొలి సినిమా (ఇష్టం) లానే కెరీర్ అంటే ఉన్న ఇష్టంతో సినిమాల్లో కంటిన్యూ కావాలనుకుంటున్నారు శ్రియ.

జోరుగా చందమామ

రెండు దశాబ్దాలుగా అందం, అభినయంతో ప్రేక్షకులను అలరిస్తున్నారు కాజల్ అగర్వాల్. 'క్యూ! హో గయా నా' (2004) అనే బాలీవుడ్ మూవీలో అతిథి పాత్రలో కనిపించిన ఈ బ్యూటీ తేజ దర్శకత్వం వహించిన 'లక్ష్మీ కళ్యాణం' (2007) సినిమా ద్వారా తెలుగుకి పరిచయమయ్యారు. అయితే కృష్ణవంశీ దర్శకత్వం వహించిన 'చందమామ' (2007) చిత్రంతో ఓవర్ నైట్ పాపులర్ అయ్యారు కాజల్. ఆ సినిమా తర్వాత ఆమెని టాలీవుడ్ చందమామ అంటూ ముద్దుగా పిలుచుకుంటున్నారు అభిమానులు. ఆ తర్వాత తెలుగులో 'మగధీర, ఆర్య 2, డార్లింగ్, బృందావనం, మిస్టర్ పర్‌ఫెక్ట్, బిజినెస్ మేన్, సారొచ్చారు, నాయక్, బాద్‌షా, టెంపర్, ఖైదీ నంబర్ 150, నేనే రాజు నేనే మంత్రి, భగవంత్ కేసరి' వంటి పలు విజయవంతమైన సినిమాల్లో నటించారామె. తెలుగు, తమిళ, హిందీ సినిమాలతో ప్రేక్షకులను తనదైన నటనతో అలరించిన ఈ బ్యూటీ 2020 అక్టోబరు 30న గౌతమ్ కిచ్లుతో వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. పెళ్లి తర్వాత కూడా వరుస సినిమాలు చేశారు ఈ బ్యూటీ. 2022 ఏప్రిల్ 19న ఓ బాబుకి జన్మనిచ్చారు కాజల్. ఆ సమయంలో కొంచెం విరామం తీసుకున్న ఈ చందమామ సెకండ్ ఇన్నింగ్స్‌లోనూ మళ్లీ అదే జోరు చూపిస్తున్నారు. ప్రస్తుతం ఆమె 'ది ఇండియా స్టోరీ, రామాయణ: పార్ట్ 1, రామాయణ: పార్ట్ 2' వంటి హిందీ మూవీస్‌తో పాటు 'ఇండియన్ 3' అనే తమిళ సినిమా చేస్తున్నారు.

అదే జోరు

చిత్ర పరిశ్రమలో రెండు దశాబ్దాలకు పైగా కెరీర్‌ని సొంతం చేసుకున్నారు నయనతార. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ చిత్రాల్లో నటిస్తూ తనకంటూ స్పెషల్ ఇమేజ్, క్రేజ్‌ని సంపాదించుకున్నారామె. 'మనస్సినక్కరే' (2003) అనే మలయాళ సినిమాతో చిత్ర పరిశ్రమలో ఎంట్రీ ఇచ్చిన ఈ బ్యూటీ ప్రస్తుతం లేడీ సూపర్ స్టార్‌గా కంటిన్యూ అవుతున్నారు. ఓ వైపు హీరోలకి జోడీగా వాణిజ్య సినిమాల్లో నటిస్తూనే మరోవైపు లేడీ ఓరియంటెడ్ సినిమాలతోనూ తానేంటో నిరూపించుకుంటున్నారు. హీరోయిన్‌గా జెట్ స్పీడ్‌లో దూసుకెళుతున్న సమయంలోనే దర్శకుడు విఘ్నేశ్ శివన్‌తో పెళ్లి పీటలెక్కారు నయన్. 2022 జూన్ 9న వీరి వివాహం జరిగింది. వారికి ఉయిర్, ఉలగమ్ అనే ట్విన్స్ ఉన్న సంగతి తెలిసిందే. ఆమెతో పాటు కెరీర్ స్టార్ట్ చేసిన మిగతా హీరోయిన్లు కెరీర్‌లో స్లో అయినప్పటికీ నయన్ మాత్రం ఇప్పటికీ అదే జోరు కొనసాగిస్తున్నారు. ఇప్పటికీ చేతినిండా సినిమాలతో బిజీ బిజీగా దూసుకెళుతున్నారామె. నయనతార ప్రస్తుతం తెలుగులో చిరంజీవి సరసన 'మన శంకరవరప్రసాద్‌గారు' చిత్రంలో నటిస్తున్నారు. అలాగే తమిళ, మలయాళ, కన్నడ భాషల్లోనూ అరడజనుకు పైగా సినిమాలతో బిజీ బిజీగా ఉన్నారు.

బిజీ బిజీగా...

'గిల్లి' (2009) సినిమాతో కన్నడ ఇండస్ట్రీలో హీరోయిన్‌గా అడుగుపెట్టారు రకుల్‌ప్రీత్ సింగ్. 'కెరటం' (2011) చిత్రంతో తెలుగు పరిశ్రమకు పరిచయమయ్యారామె. 'వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్' (2013) సినిమాతో తెలుగులో తొలి హిట్‌ని తన ఖాతాలో వేసుకున్నారు రకుల్. ఆ తర్వాత 'లౌక్యం, నాన్నకు ప్రేమతో, సరైనోడు, రారండోయ్ వేడుక చూద్దాం' వంటి పలు హిట్ మూవీస్ చేశారు. తెలుగులో స్టార్ హీరోయిన్లలో ఒకరిగా వెలుగొందిన ఈ బ్యూటీ హిందీ, తమిళ చిత్రాల్లోనూ నటించి, ప్రేక్షకులను అలరించారు. హీరోయిన్‌గా బిజీగా ఉన్న సమయంలోనే వ్యాపారవేత్త, నటుడు-నిర్మాత జాకీ భగ్నానీతో 2024 ఫిబ్రవరి 21న ఏడడుగులు వేశారు. పెళ్లి తర్వాత కూడా వరుస చాన్స్‌లతో కెరీర్‌ని కంటిన్యూ చేస్తున్నారామె. ఈ ఏడాది ఫిబ్రవరిలో 'మేరే హస్బెండ్ కి బీవీ' చిత్రంతో సందడి చేశారు రకుల్. ప్రస్తుతం హిందీలో 'దే దే ప్యార్ దే 2, పతీ పత్నీ ఔర్ ఓ 2' వంటి మూవీస్‌తో బిజీ బిజీగా ఉన్నారు రకుల్ ప్రీత్ సింగ్. అలాగే కమల్‌హాసన్ హీరోగా శంకర్ దర్శకత్వంలో రూపొందిన 'ఇండియన్ 3'లో రకుల్ నటించారు. ఈ చిత్రం విడుదల కావాల్సి ఉంది.

షార్ట్ బ్రేక్ తర్వాత...

'అందాల రాక్షసి' (2010) సినిమాతో టాలీవుడ్‌కి హీరోయిన్‌గా పరిచయమయ్యారు లావణ్యా త్రిపాఠి. ఆ తర్వాత 'మనం, భలే భలే మగాడివోయ్, సోగ్గాడే చిన్నినాయనా' వంటి పలు హిట్ మూవీస్‌లో యాక్ట్ చేశారామె. తెలుగులోనే కాదు... పలు తమిళ చిత్రాల్లోనూ నటించారు లావణ్య. 2023 నవంబరు 1న హీరో వరుణ్ తేజ్‌ని ప్రేమ వివాహం చేసుకున్నారు లావణ్య. వివాహం తర్వాత కూడా ఆమె సినిమాలు చేశారు. లావణ్య నటించిన తమిళ చిత్రం 'టన్నెల్', తెలుగు సినిమా 'సతీ లీలావతి' విడుదలకు సిద్ధంగా ఉన్నాయి. అథర్వా మురళి, లావణ్యా త్రిపాఠి జంటగా నటించిన చిత్రం 'టన్నెల్'. రవీంద్ర మాధవ దర్శకత్వం వహించారు. ఈ చిత్రాన్ని తెలుగులో లచ్చురామ్ ప్రొడక్షన్స్‌పై ఎ.రాజు నాయక్ విడుదల చేస్తున్నారు. అదేవిధంగా లావణ్యా త్రిపాఠి, దేవ్ మోహన్ జంటగా నటించిన చిత్రం 'సతీ లీలావతి'. 'భీమిలీ కబడ్డీ జట్టు, ఎస్.ఎం.ఎస్('శివ మనసులో శృతి') సినిమాల ఫేమ్ తాతినేని సత్య దర్శకత్వం వహించారు. నాగమోహన్ నిర్మించిన ఈ సినిమా విడుదలకు ముస్తాబవుతోంది. ఇదిలా ఉంటే ఈ నెల 10న లావణ్యా త్రిపాఠి ఓ బాబుకి జన్మనిచ్చిన సంగతి తెలిసిందే. ఇప్పుడు షార్ట్ బ్రేక్ తీసుకుని, మళ్లీ సినిమాలతో బిజీ అవుతారని ఊహించవచ్చు.

పెళ్లయిన వెంటనే ప్రమోషన్‌తో...

'పైలెట్స్' (2000) సినిమాతో బాలనటిగా మలయాళంలో అడుగుపెట్టారు కీర్తీ సురేశ్. 2013లో విడుదలైన 'గీతాంజలి' చిత్రంతో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చారు. అప్పటి నుంచి మలయాళ, తెలుగు, తమిళ, హిందీ చిత్రాల్లో నటిస్తూ ప్రేక్షకులను అలరిస్తున్నారు. 2016లో విడుదలైన 'నేను శైలజ' సినిమా ద్వారా తెలుగులో హీరోయిన్‌గా పరిచయం అయ్యారామె. ఆ తర్వాత 'నేను లోకల్, అజ్ఞాతవాసి, మహానటి, రంగ్ దే, సర్కారువారి పాట, దసరా, భోళా శంకర్, ఉప్పు కప్పురంబు' వంటి పలు సినిమాల్లో నటించారు. దివంగత నటి సావిత్రి బయోపిక్‌గా రూపొందిన 'మహానటి' చిత్రానికిగానూ జాతీయ ఉత్తమ నటి అవార్డు గెలుచుకున్నారు కీర్తి. వరుస అవకాశాలతో బిజీ బిజీగా ఉన్న ఆమె... తన చిన్ననాటి స్నేహితుడు ఆంటోని తట్టిల్‌ని 2024 డిసెంబరు 12న వివాహం చేసుకున్నారు. గోవాలో హిందు, క్రిస్టియన్ సంప్రదాయ పద్ధతుల్లో వీరి పెళ్లి జరిగింది. వివాహం అనంతరం హనీమూన్‌కి కూడా వెళ్లకుండా తాను కథానాయికగా నటించిన తొలి హిందీ చిత్రం 'మేరీ జాన్' ప్రమోషనల్ కార్యక్రమాల్లో మెడలో పసుపుతాడుతో పాల్గొని, టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీ అయ్యారు. పెళ్లి తర్వాత కూడా కీర్తి సురేశ్ జోరు ఏ మాత్రం తగ్గలేదు. ఆమె నటించిన 'ఉప్పు కప్పురంబు' చిత్రం ఈ ఏడాది జూలై 4న రిలీజ్ అయింది. ప్రస్తుతం 'రివాల్వర్ రీటా, కన్నివెడి' వంటి తమిళ సినిమాలతో బిజీగా ఉన్నారు కీర్తి.

టాప్ ప్లేస్‌లో...

బాలీవుడ్ స్టార్ హీరోయిన్‌లలో ఒకరిగా దూసుకెళుతున్నారు దీపికా పదుకోన్. 'ఐశ్వర్య' (2006) అనే కన్నడ సినిమాతో హీరోయిన్‌గా పరిచయమైన ఈ బ్యూటీ రెండు దశాబ్దాల కెరీర్‌కి చేరువ అవుతున్నారు. కన్నడ, హిందీ, తమిళ, తెలుగు, ఇంగ్లిష్ చిత్రాలతో ప్రేక్షకులను అలరించారామె. కెరీర్ పీక్స్‌లో ఉన్నప్పుడే బాలీవుడ్ హీరో రణవీర్ సింగ్‌తో ఏడడుగులు వేశారు. 2018 నవంబరు 14న వీరి వివాహం జరిగింది. పెళ్లి తర్వాత కూడా దీపిక క్రేజ్ ఏమాత్రం తగ్గలేదు. వరుస క్రేజీ ప్రాజెక్టులను సొంతం చేసుకుని, ఔరా అని ఆశ్చర్యపరిచారామె. ఇప్పటికీ బాలీవుడ్ స్టార్ హీరోయిన్స్ జాబితాలో దీపికా పదుకోన్ పేరు టాప్ ప్లేస్‌లో ఉండటం విశేషం. పైగా పెళ్లయినప్పటికీ హిందీలో అత్యధిక పారితోషికం తీసుకుంటున్న హీరోయిన్‌గా కంటిన్యూ అవుతున్నారీ బ్యూటీ. రణ్‌వీర్-దీపిక దంపతులకు దువా పదుకోన్ సింగ్ అనే పాప ఉంది. 2024లో అమ్మగా ప్రమోషన్ పొందారు దీపిక. ప్రస్తుతం మాతృత్వపు మాధుర్యాన్ని ఆస్వాదిస్తున్న ఆమె సినిమాలకు కొంచెం విరామం ఇచ్చారు. ఆ తర్వాత ఎలాగూ బిజీ అవుతారని ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. ప్రస్తుతం ఆమె చేతిలో 'కింగ్'(వర్కింగ్ టైటిల్) అనే సినిమా ఉంది.

భలే జోరు...


అందం, అభినయంతో ప్రేక్షకుల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సొంతం చేసుకున్నారు ఆలియా భట్. 'సంఘర్ష్' (1999) సినిమాతో బాలనటిగా వెండితెరపై మెరిసిన ఆమె ఇప్పటికీ కెరీర్‌ని దిగ్విజయంగా కొనసాగిస్తున్నారు. హీరోయిన్‌గా బిజీ బిజీగా ఉన్న సమయంలోనే హీరో రణబీర్ కపూర్‌ని పెళ్లి చేసుకున్నారు. 2022 ఏప్రిల్ 14న వీరు వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. పెళ్లి తర్వాత కూడా పెద్దగా బ్రేక్ తీసుకోకుండానే కెరీర్ కంటిన్యూ చేశారు ఆలియా. వరుస అవకాశాలు అందిపుచ్చుకుని తన క్రేజ్ ఏమాత్రం తగ్గలేదంటూ నిరూపించారామె. రణబీర్ కపూర్-ఆలియా భట్‌లకు రాహా అనే పాప ఉంది. 2022 నవంబరు 6న వీరు తల్లితండ్రులుగా ప్రమోషన్ పొందారు. పాప పుట్టిన తర్వాత సినిమాలకు కొంచెం విరామం ఇచ్చిన ఈ బ్యూటీ ఆ తర్వాత మళ్లీ బిజీ బిజీ అయ్యారు. వరుస ఆఫర్స్ అందుకుంటూ దూసుకెళుతున్నారు. ప్రస్తుతం ఆమె చేతిలో 'ఆల్ఫా, లవ్ అండ్ వార్' సినిమాలున్నాయి. ఇదిలా ఉంటే... 2022లో రిలీజైన తెలుగు చిత్రం 'ఆర్ఆర్ఆర్'లో రామ్‌చరణ్‌కి జోడీగా సీత పాత్రలో ఆలియా భట్ నటించిన సంగతి తెలిసిందే.

ఇక బ్రేక్ లేకుండా...

హీరోయిన్ కియారా అద్వానీ క్రేజ్ గురించి ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. కేవలం బాలీవుడ్‌లోనే కాదు... టాలీవుడ్‌లోనూ ఈ బ్యూటీకి యూత్‌లో మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. 'ఫగ్లీ' (2014) అనే సినిమాతో హీరోయిన్‌గా బాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చిన కియారా దశాబ్దానికి పైగా దూసుకెళుతున్నారు. మహేశ్‌బాబు హీరోగా నటించిన 'భరత్ అనే నేను' (2018) చిత్రంతో తెలుగు చిత్ర పరిశ్రమకి పరిచయమైన ఈ బ్యూటీ 'వినయ విధేయ రామ, గేమ్ ఛేంజర్' వంటి సినిమాల్లో నటించారు. బాలీవుడ్‌లో వరుస అవకాశాలతో దూసుకెళుతున్న సమయంలోనే హీరో సిద్ధార్థ్ మల్హోత్రాని వివాహం చేసుకున్నారామె. 2023 ఫిబ్రవరి 7న రాజస్థాన్‌లో వీరి పెళ్లి జరిగింది. వివాహం తర్వాత కూడా సినిమాల్లో నటిస్తున్నారు కియారా. ఆమె నటించిన 'గేమ్ ఛేంజర్' ఈ ఏడాది జనవరి 10న, 'వార్ 2' మూవీ ఆగస్టులో విడుదలైంది. ఈ ఏడాది జూలై 15న ఒక పాపకు జన్మనిచ్చారామె. ప్రస్తుతం ఆమె చేతిలో 'టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్' అనే కన్నడ-ఇంగ్లిష్ చిత్రం ఉంది. పెళ్లి, తల్లయిన కారణంగా కొంత గ్యాప్ తీసుకున్నారు కియారా. అయితే ఇక బ్రేక్ లేకుండా వరుసగా సినిమాలు చేయాలనుకుంటున్నారు.

వీళ్లే కాదు... ప్రియాంకా చోప్రా, కరీనా కపూర్, కాజోల్, రాణీ ముఖర్జీ, జ్యోతిక, కత్రినా కైఫ్, విద్యాబాలన్, యామి గౌతమ్, మౌని రాయ్.. ఇలా పలువురు హీరోయిన్లు పెళ్లి తర్వాత కూడా అవకాశాలు అందుకుంటూ తమ జోరు చూపిస్తున్నారు.


– దేరంగుల జగన్ మోహన్



● తేజు అశ్విని, శివ కందుకూరి

సున్నితమైన ప్రేమకథ

శివ కందుకూరి, తేజు అశ్విని జోడీగా నటిస్తున్న చిత్రం 'చాయ్ వాలా'. ప్రమోద్ హర్ష రచన, దర్శకత్వంలో హర్షిక ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రాధా విజయలక్ష్మి, వెంకట్ ఆర్. పాపుడిప్పు నిర్మిస్తున్నారు. ప్రశాంత్ ఆర్.విహారి సంగీతం అందించిన ఈ సినిమా నుంచి నుంచి 'సఖిరే..' అంటూ సాగే తొలి పాటని విడుదల చేశారు మేకర్స్. సురేష్ బనిశెట్టి సాహిత్యం అందించిన ఈ పాటని కపిల్ కపిలన్ పాడారు. ''సున్నితమైన ప్రేమకథతో రూపొందుతోన్న చిత్రం 'చాయ్ వాలా'. ఈ సినిమా నుంచి ఇటీవల విడుదల చేసిన ఫస్ట్ లుక్, టీజర్‌లకు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన వచ్చింది. ప్రేయసిపై గుండెలనిండా స్వచ్ఛమైన ప్రేమను నింపుకున్న హీరో తన భావాలను అందంగా 'సఖిరే..' పాట రూపంలో వ్యక్తం చేస్తారు. ఈ మెలోడి సాంగ్ హృదయాలను హత్తుకుంటుంది. శివ కందుకూరి స్టన్నింగ్ లుక్స్ ఆకట్టుకుంటాయి. తేజు అశ్విని అందం చూపులు తిప్పుకోనివ్వదు. ఈ పాట అందరూ పాడుకునేలా ఉంటుంది. ప్రేమించే వాళ్లకు, మ్యూజిక్ లవర్స్‌కు ఈ పాట బాగా కనెక్ట్ అవుతుంది'' అని చిత్రయూనిట్ తెలిపింది. ఈ చిత్రానికి కెమెరా: క్రాంతి వర్ల.



● శివ కార్తికేయన్

సంక్రాంతి బరిలో...

శివ కార్తికేయన్ హీరోగా నటిస్తున్న తాజా తమిళ చిత్రం 'పరాశక్తి'. ఈ పీరియాడికల్ యాక్షన్ డ్రామాకు సుధా కొంగర దర్శకత్వం వహిస్తున్నారు. కాలేజీ క్యాంపస్ నేపథ్యంతో సాగే ఈ చిత్రంలో శ్రీలీల, అథర్వ ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తుండగా, 'జయం' రవి విలన్ రోల్ చేస్తున్నారు. ఆనంద భాస్కరన్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో శివ కార్తికేయన్ స్టూడెంట్ లీడర్‌గా నటిస్తున్నారు. కాగా తాజాగా ఈ సినిమాను వచ్చే సంక్రాంతి సందర్భంగా జనవరి 14న రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. తమిళంతో పాటుగా, తెలుగులోనూ ఈ సినిమాను సంక్రాంతికే రిలీజ్ చేయాలనుకుంటున్నారు మేకర్స్. ఇక 1965 నేపథ్యంలో జరిగిన కొన్ని వాస్తవ సంఘటనల ఆధారంగా ఈ సినిమా కథనం సాగుతుందని సమాచారం.



మౌళి తనూజ్, శివానీ నాగారం జంటగా సాయి మార్తాండ్ దర్శకత్వం వహించిన చిత్రం 'లిటిల్ హార్ట్స్'. ఆదిత్య హాసన్ నిర్మించిన ఈ సినిమాని బన్నీ వాస్, వంశీ నందిపాటి ఈ నెల 5న విడుదల చేశారు. ఈ సినిమా విజయం సాధించిన సందర్భంగా చిత్ర బృందాన్ని హీరో విజయ్ దేవరకొండ అభినందించారు. ఆయన్ని కలిసిన వారిలో మౌళి తనూజ్, సాయి మార్తాండ్, కెమెరామెన్ సూర్య బాలాజీ, మ్యూజిక్ డైరెక్టర్ సింజిత్ యెర్రమల్లి ఉన్నారు.

బిజినెస్ రీల్

ప్రాజెక్టుల నిర్వహణపై పీఎంఐ దక్షిణాసియా సదస్సు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఉన్నత లక్ష్యాల సాధన నినాదంతో ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ ఇనిస్టిట్యూట్ (పీఎంఐ) నిర్వహించిన 17వ దక్షిణాసియా వార్షిక సదస్సు (పీఎంఎస్ఏసీ) ముగిసింది. ఇందులో 1200 మంది పైగా ప్రతినిధులు, 20 మంది పైగా వక్తలు పాల్గొన్నారు. వీరిలో దక్షిణాసియావ్యాప్తంగా పలువురు ప్రాజెక్ట్ ప్రొఫెషనల్స్, పరిశ్రమ దిగ్గజాలు, విధానకర్తలు ఉన్నారు. ఐటీ ఇంజినీరింగ్ సేవల సంస్థ సైయెంట్ వ్యవస్థాపకుడు బీవీఆర్ మోహన్ రెడ్డి, రిలయన్స్ జియో ఇన్ఫోకామ్‌కి చెందిన సునీల్ దత్, జోహోకి చెందిన రాజేంద్రన్ దండపాణి తదితరులు పాల్గొన్నారు. ప్రధానంగా ప్రాజెక్టుల నిర్వహణలో వస్తున్న మార్పులు, ఏఐ ఆధారిత నైపుణ్యాల ప్రాధాన్యత, డిజిటల్ పరివర్తన తదితర అంశాల గురించి ఇందులో చర్చించారు. ఈ సందర్భంగా పీఎంఐ సౌత్ ఏషియా అవార్డులను ప్రదానం చేశారు.

యాక్సిస్ బ్యాంక్ 'మూవ్స్ 2025' విజేతలుగా ఐఎస్‌బీ విద్యార్థులు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రైవేట్ రంగ యాక్సిస్ బ్యాంక్ నిర్వహించిన 'మూవ్స్ 2025' పోటీల్లో ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) విద్యార్థులు శ్రేయాంశ్ కలహంశ్, దివ్యాని విజేతలుగా నిల్చారు. ఐఐటీ ఖరగ్‌పూర్‌కి చెందిన విద్యార్థులు అమర్‌ప్రీత్ సింగ్, ఇషితా ముట్నెజా తొలి రన్నరప్‌లుగా నిల్చారు. గ్రామీణ బ్యాంకింగ్, టెక్నాలజీ తదితర రంగాలకు సంబంధించి వినూత్న సొల్యూషన్స్‌ను రూపొందించేలా ప్రతిభావంతులైన యువతను ప్రోత్సహించేందుకు దీన్ని నిర్వహించారు. ఈ పోటీల్లో దేశవ్యాప్తంగా 50 పైగా ఎంబీఏ కాలేజీలు, ఐఐఎంలు, ఐఐటీల నుంచి 21,000 మంది పైచిలుకు విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు నగదు పురస్కారాలు, యాక్సిస్ బ్యాంకులో ప్లేస్‌మెంట్ అవకాశాలు లభించాయి. రాబోయే రోజుల్లో దేశవ్యాప్తంగా మరిన్ని క్యాంపస్‌లలో ఈ పోటీలను నిర్వహించనున్నట్లు బ్యాంక్ గ్రూప్ ఎగ్జిక్యూటివ్ రాజీకమల్ వెంపటి తెలిపారు.

ఇండియా హోమ్ లోన్‌లో స్కైబ్రిడ్జ్ వాటా కొనుగోలు

ముంబై: ఇండియా హోమ్‌లోన్ లిమిటెడ్‌లో 24.5% వాటా(34.99 లక్షలకుపైగా షేర్లు) దక్కించుకున్నట్లు స్కైబ్రిడ్జ్ వెంచర్స్ ఎల్‌ఎల్‌పీ తెలిపింది. అయితే, ఎంతకు కొనుగోలు చేసేందనే వివరాలు వెల్లడించలేదు. శుక్రవారం బీఎస్ఈలో ఇండియన్ హోమ్ లోన్ షేరు ముగింపు (రూ.42.46)తో లెక్కిస్తే డీల్ విలువ రూ.14.85 కోట్లుగా ఉంటుందని అంచనా. ''ఈ వాటా కొనుగోలుతో భారత్‌లో అందుబాటు ధరల గృహాలు, రిటైల్ ఫైనాన్స్ రంగాల్లో దీర్ఘకాల వృద్ధి అవకాశాలు ఆశిస్తున్నాము. సేవలు విస్తరణకు ఒక బలమైన ప్లాట్‌ఫామ్‌ను ఏర్పాటు చేసుకున్నాము. సంస్థ అభివృద్ధిలో భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉంది'' అని స్కైబ్రిడ్జ్ వెంచర్స్ తెలిపింది. కాగా 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఇండియా హోమ్ ఫైనాన్స్ రూ.13.60 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. అంతకు ముందు ఆర్థిక సంవత్సరంలో నమోదైన రూ.12 కోట్లతో పోలిస్తే 13.14% అధికంగా ఉంది.

కెన్‌స్టార్ కొత్త వాటర్ హీటర్ల శ్రేణి



న్యూఢిల్లీ: గృహోపకరణాల బ్రాండు కెన్‌స్టార్ తాజాగా కొత్త తరం 5 స్టార్ వాటర్ హీటర్ల శ్రేణిని ప్రవేశపెట్టింది. జర్మన్ బ్లూ సఫైర్ టెక్నాలజీతో 40 శాతం అధిక జీవితకాలం, అధునాతన 7 లెవెల్ సేఫ్టీ షీల్డ్, విద్యుత్‌ను ఆదా చేసే సాంకేతికత మొదలైన ప్రత్యేకతలు వీటిలో ఉంటాయి. ట్యాంకులపై 7 ఏళ్ల వారంటీతో 3 లీటర్ల నుంచి 100 లీటర్ల వరకు సామర్థ్యాలతో ఇవి లభిస్తాయని సంస్థ సీఈవో సునీల్ జైన్ తెలిపారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

14-9-2025

విశాఖ	555-00
చిత్తూరు	563-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	535-00
విజయవాడ	550-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	535-00
వరంగల్	537-00
రిటైల్ ధర	5.95

కంపెనీల్లో జెన్‌ఏఐ నిపుణుల కొరత..

- ప్రతి పదిమందిలో ఒక్కరికే అర్హతలు
- ప్రాంప్ట్ ఇంజినీరింగ్, ఏజెంట్ డిజైన్ నైపుణ్యాలకు డిమాండ్
- సీనియర్లకు రూ. 60 లక్షల వరకు ప్యాకేజీలు
- టీమ్‌లీజ్ డిజిటల్ సర్వే



న్యూఢిల్లీ: దేశీయంగా కృత్రిమ మేథ (ఏఐ) మార్కెట్ చాలా వేగంగా వృద్ధి చెందుతోంది. 2025లో 28.8 బిలియన్ డాలర్లకు చేరుతుందనే అంచనాలు నెలకొన్నాయి. కానీ నిపుణల కొరతే పరిశ్రమకు ప్రధాన సమస్యగా మారింది. పది జెన్ ఏఐ ఉద్యోగాలుంటే నైపుణ్యాలున్న అభ్యర్థులు ఒక్కరే ఉంటున్నారు. టీమ్‌లీజ్ డిజిటల్ రూపొందించిన నివేదికలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. దీని ప్రకారం నిర్దిష్ట ప్రాంప్ట్ ఇంజినీరింగ్, ఎల్ఎల్ఎం సేఫ్టీ..ట్యూనింగ్, ఏఐ ఆర్కెస్ట్రేషన్, ఏజెంట్ డిజైన్, సిమ్యులేషన్ గవర్నెన్స్, ఏఐ కాంప్లయెన్స్, రిస్క్ ఆపరేషన్స్‌లాంటి ఏఐ నైపుణ్యాలకు అత్యధిక డిమాండ్ ఉంటోంది. గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు.. జనరేటివ్ ఏఐ ఇంజినీరింగ్, మెషిన్‌లెర్నింగ్ ఆపరేషన్స్‌లాంటి విభాగాల్లో కొత్త ప్రమాణాలు నెలకొల్పుతున్నాయి. సీనియర్లకు ఏటా రూ. 58-60 లక్షల వరకు ప్యాకేజీలు ఉంటున్నాయి.

నివేదికలోని మరిన్ని విశేషాలు..

- డిజిటల్ ఎకానమీలో ఏఐ, క్లౌడ్ ఉద్యోగాలకు డిమాండ్ భారీగా ఉంది. దానికి తగ్గట్లుగా నైపుణ్యాలున్న అభ్యర్థులు లభించక, తీవ్ర కొరత నెలకొంది. దీంతో తగిన అర్హతలున్న వారికి కంపెనీలు భారీ వేతనాలిస్తున్నాయి.
- జీసీసీల్లో సైబర్‌సెక్యూరిటీ, డేటా ఇంజినీరింగ్ ఉద్యోగుల వేతనాలు 2025-2027 ఆర్థిక సంవత్సరాల మధ్య కాలంలో వార్షికంగా వరుసగా రూ. 28 లక్షల నుంచి రూ. 33.5 లక్షలకు, రూ. 23 లక్షల నుంచి రూ. 27 లక్షలకు పెరగనున్నాయి.
- నాన్-టెక్ రంగాల్లోని టెక్ ఉద్యోగాలకు సంబంధించి ఐటీ సపోర్ట్, సంప్రదాయ తరహా సిస్టమ్స్ మెయింటెనెన్స్ విభాగాల్లో వేతనాలు వార్షికంగా రూ. 12 లక్షల స్థాయిలోనే స్థిరపడిపోయి ఉన్నాయి. పరిశ్రమ క్లౌడ్ నేటివ్, ఔట్‌సోర్స్‌డ్ సర్వీస్ మోడల్స్ వైపు మళ్లుతుండటాన్ని ఇది సూచిస్తోంది.
- ఏఐ మార్కెట్ ప్రస్తుతం హైపర్-గ్రోత్ దశలోకి అడుగుపెడుతోంది. ఏటా 45 శాతం వృద్ధితో 2025లో 28.8 బిలియన్ డాలర్లకు చేరుతుందనే అంచనాలు ఉన్నాయి. అయితే, ప్రతిభావంతుల కొరత తీవ్రంగా ఉంటోంది. ప్రతి పది జెన్‌ఏఐ ఉద్యోగాలకు అన్ని అర్హతలు కలిగిన ఇంజినీరు ఒకే ఒక్కరు ఉంటున్నారు.
- 2026 నాటికి ఏఐ టాలెంట్ అంతరాలు 53 శాతానికి పెరగనుంది. అలాగే క్లౌడ్ కంప్యూటింగ్‌లో డిమాండ్-సరఫరా మధ్య అంతరం 55-60 శాతానికి పెరగనుంది.
- ఉద్యోగులకు కొత్త నైపుణ్యాల్లో పెద్ద స్థాయిలో శిక్షణను కల్పించకుంటే, కంపెనీల వృద్ధి ఆకాంక్షలు నెరవేరని పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉంది.
- ఏఐ వినియోగమనేది జాబ్ మార్కెట్ల రూపురేఖలను గణనీయంగా మార్చేయనుంది. గ్లోబల్ విధులు నిర్వహించే 40 శాతం వరకు ఉద్యోగులపై తీవ్ర ప్రభావం పడనుంది. ఐటీ సర్వీసులు, కస్టమర్ ఎక్స్‌పీరియన్స్, బీఎఫ్ఎస్ఐ, హెల్త్‌కేర్‌లాంటి రంగాల్లో ఇది మరింత ఎక్కువగా ఉంటుంది. అందుకే కంపెనీలు ఏఐ-ఫస్ట్ లెర్నింగ్ మోడల్స్, డిజిటల్ అక్షరాస్యతను పెంపొందించడంపై ప్రధానంగా దృష్టి పెడుతున్నాయి.
- భారత డిజిటల్ ఎకానమీలో ఉద్యోగాలు, నైపుణ్యాల్లో మార్పులకు ఇంజిన్లుగా వ్యవహరిస్తున్న జీసీసీలు, ఉద్యోగాల కల్పనకు సారథ్యం వహిస్తున్నాయి. 2025లో 22-25 శాతం మేర ఉద్యోగాలు కల్పించనున్నాయి. ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్ విభాగాల్లో అత్యధికంగా కొలువులు ఉండనున్నాయి.
- 2027లో అందుబాటులోకి రాబోయే 47 లక్షల కొత్త టెక్ ఉద్యోగాల్లో గణనీయ సంఖ్యలో కొలువులను (12 లక్షలు) జీసీసీలే కల్పించనున్నాయి. ప్రధానంగా జెన్‌ఏఐ, ఇంజినీరింగ్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగాల్లో ఈ ఉద్యోగాలు ఉంటాయి.
- జీసీసీలు మెట్రో పరిధిని దాటి విస్తరిస్తున్నాయి. 2025 ఆర్థిక సంవత్సరంలో 1,30,000-1,40,000 మంది తాజా గ్రాడ్యుయేట్లను రిక్రూట్ చేసుకోనున్నాయి. వీరిలో ఎక్కువ శాతం హైరింగ్ ద్వితీయ, తృతీయ శ్రేణి ఇంజినీరింగ్ క్యాంపస్‌లలో ఉండొచ్చు. వైవిధ్యానికి కూడా ప్రాధాన్యం పెరుగుతోంది. ఇప్పుడు టాప్ 20 జీసీసీల్లో 40 శాతం మంది సిబ్బంది మహిళలే ఉంటున్నారు. పరిశ్రమ సగటు కన్నా ఇది 1.5 రెట్లు అధికం.
- 2027 నాటికి భారత్‌లో 2,100 పైగా జీసీసీలు ఉంటాయి. వీటిలో 30 లక్షల మంది పైగా ఉంటారు.

ఆరు కోట్లు దాటిన ఐటీ రిటర్నులు

సెప్టెంబర్ 15 తుది గడువు
- ఆదాయపు పన్ను విభాగం వెల్లడి



న్యూఢిల్లీ: 2025-26 అసెస్‌మెంట్ ఇయర్‌కి సంబంధించి సెప్టెంబర్ 13 (శనివారం) నాటికి ఆరు కోట్ల పైగా రిటర్నులు దాఖలైనట్లు ఆదాయపు పన్ను విభాగం తెలిపింది. తుది గడువు (సెప్టెంబర్ 15 గడువు) దగ్గర పడుతుండడంతో ఈ సంఖ్య మరింత పెరుగుతుందని పేర్కొంది. ''ఆరు కోట్ల మైలురాయిని చేరుకునేందుకు సహకరించిన పన్ను చెల్లింపుదారులు, పన్ను నిపుణులకు ధన్యవాదాలు. రిటర్నుల ఫైలింగ్‌లో పన్ను చెల్లింపుదారులకు సాయంగా హెల్ప్ డెస్కులు, వారమంతా ఇరవై నాలుగ్గంటలూ పనిచేస్తాయి. కాల్స్, లైవ్ చాట్స్, వెబ్‌ఎక్స్ సెషన్లు, ఎక్స్ ద్వారా హెల్ప్ డెస్క్ అందుబాటులో ఉంటుంది'' అని తన ఎక్స్ అకౌంట్ పోస్ట్ ద్వారా తెలిపింది. రిటర్నులు ఇంకా సమర్పించని పన్ను చెల్లింపుదారులు వెంటనే దాఖలు చేయాలని సూచించింది. చివరి నిమిషం వరకు వేచిచూడొద్దని కోరింది. ఆదాయపన్ను శాఖ ఇప్పటికే జూలై 31వ తేదీ నుంచి సెప్టెంబర్ 15వ తేదీ వరకు గడువు పొడిగించిన సంగతి తెలిసిందే. గత అసెస్‌మెంట్ సంవత్సరంలో 2024 జులై 31 నాటికి 7.28 కోట్ల రిటర్నులు దాఖలయ్యాయి. అంతకుముందు ఏడాది 6.77 కోట్ల రిటర్నుల ఫైలింగ్‌తో పోలిస్తే వార్షిక ప్రాతిపదికన 7.5% పెరిగాయి.

వెండి ఆభరణాలకు హాల్ మార్కింగ్ తప్పనిసరి!

- ఆరు నెలల తర్వాత నిర్ణయిస్తాం
- బీఐఎస్ డీజీ ప్రమోద్ కుమార్



న్యూఢిల్లీ: వెండి ఆభరణాలు, వస్తువులకు హాల్‌మార్కింగ్‌ను తప్పనిసరి అమలు చేయడాన్ని ప్రభుత్వం ఆరు నెలల తర్వాత పరిశీలిస్తుందని భారతీయ ప్రమాణాల సంస్థ (బీఐఎస్) డైరెక్టర్ జనరల్ ప్రమోద్ కుమార్ తివారీ తెలిపారు. సెప్టెంబర్ 1 నుంచి వెండి ఆభరణాలు, వస్తువులకు స్వచ్ఛంద హాల్‌మార్కింగ్‌ను ప్రభుత్వం అమల్లోకి తీసుకురావడం తెలిసిందే. ''దీని ఫలితాలను పరిశీలించేందుకు కనీసం ఆరు నెలల సమయం అవసరం. ప్రస్తుత ప్రక్రియను ఆరు నెల పాటు పరిశీలిస్తాం. ఆ తర్వాతే తప్పనిసరి చేయాలా? లేదా? అన్నది నిర్ణయిస్తాం'' అని ప్రమోద్ కుమార్ తివారీ చెప్పారు. చిన్న వర్తకులు వెండిని కరిగించి ఆభరణాలు తయారు చేస్తుంటారని, వారిని తప్పనిసరి హాల్‌మార్కింగ్ సర్టిఫికేషన్ కిందకు తీసుకురావడం సవాలుగా పేర్కొన్నారు. ఎలక్ట్రిక్ వాహనాలు ప్రజాదరణ పొందాలంటే పెట్రోల్ పంపుల మాదిరి మౌలిక వసతులు ఉండాలని తివారీ అభిప్రాయపడ్డారు. ఈవీ చార్జింగ్ స్టేషన్లు, బ్యాటరీ స్వాపింగ్‌కు సంబంధించి ప్రమాణాలను అభివృద్ధి చేశామని, అవి ముసాయిదా దశలో ఉన్నట్లు చెప్పారు.

రిస్కులో ఎస్ఎంఈ రుణాలు

- రేటింగ్ ఏజెన్సీ ఇక్రా అంచనాలు
- ఈ ఏడాది 10.5 శాతం రుణ వృద్ధి

ముంబై: చిన్న, మధ్యతరహా సంస్థల(ఎస్ఎంఈలు) రుణాలలో రిస్కుకు వీలున్నట్లు రేటింగ్ ఏజెన్సీ ఇక్రా తాజాగా అంచనా వేసింది. బ్యాంకులు ఆఫర్ చేస్తున్న ఫిక్స్‌డ్ డిపాజిట్ల రేట్లు కనిష్టస్థాయికి చేరాయని పేర్కొంది. రిజర్వ్ బ్యాంక్(ఆర్‌బీఐ) కీలక రేట్లను నిలువరిస్తే ఇవి మరింత తగ్గకపోవచ్చునని తెలియజేసింది. రుణ వృద్ధి మందగిస్తే మాత్రమే రేట్ల తగ్గింపునకు వీలుంటుందని అభిప్రాయపడింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025-26)లో బ్యాంకింగ్ వ్యవస్థ రుణ వృద్ధి 10.5 శాతంగా నమోదుకానున్నట్లు తెలియజేసింది. ఎన్‌బీఎఫ్‌సీల నిర్వహణలోని ఆస్తులు(ఏయూఎం) 15-17 శాతం వృద్ధి చూపనున్నట్లు అంచనా వేసింది. ప్రస్తుతం బ్యాంకింగ్ దిగ్గజాలు ఏడాది కాలావధి డిపాజిట్లపై 6 శాతం వడ్డీ రేటును ఆఫర్ చేస్తున్నట్లు ప్రస్తావించింది. దేశీ బ్యాంకింగ్ వ్యవస్థకు స్థిరత్వం(నిలకడ)తో కూడిన ఔట్‌లుక్‌ను కొనసాగిస్తున్నట్లు తెలియజేసింది. పెరగనున్న వినియోగం, యూఎస్ తుది టారిఫ్‌లు, వాటి ప్రభావం, మందగమన వృద్ధితో ఉపాధి మార్కెట్‌పై ప్రభావం, ఆస్తుల(రుణాల) నాణ్యతా ఆందోళనలు తదితరాలను గమనించదగ్గ కీలక అంశాలుగా పేర్కొంది.

ఒత్తిళ్ల సంకేతాలు

రూ. 25 లక్షలలోపు రుణాలు పొందిన ఎస్ఎంఈ పోర్ట్‌ఫోలియో నుంచి చెల్లింపుల్లో ఒత్తిడి ఎదురవుతున్నట్లు ఇక్రా సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ అనిల్ గుప్తా పేర్కొన్నారు. ప్రొప్రయిటరీషిప్ కంపెనీల నుంచి రుణ చెల్లింపుల్లో ఒత్తిడి సంకేతాలు రుణదాతలకు కనిపిస్తున్నట్లు తెలియజేశారు. ఎన్‌బీఎఫ్‌సీ రుణదాతలకు హామీతోకూడిన, హామీలేని ఎస్ఎంఈ రుణాలలో (రుణ)నష్టాలు నమోదవుతున్నట్లు వివరించారు. 2025 మార్చిలో అంతక్రితం ఏడాదితో పోలిస్తే ఇవి 3.4 శాతం పెరిగినట్లు వెల్లడించారు. దీనికితోడు యూఎస్ టారిఫ్‌లు ఫైనాన్షియల్ వ్యవస్థపై ప్రభావం చూపితే అధిక ఈల్డ్‌తోకూడిన, తక్కువస్థాయి రుణాలపై మరింత ఒత్తిడి పెరగనున్నట్లు అభిప్రాయపడ్డారు. 20 శాతానికంటే అధిక రుణ రేట్లుగల రుణాలపై ఈ ప్రభావం అధికంగా కనిపించనున్నట్లు వివరించారు. యూఎస్ టారిఫ్‌లతో ఎన్‌బీఎఫ్‌సీలకంటే బ్యాంకులపైనే ప్రతికూల ప్రభావం పడనున్నట్లు సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ ఏఎం కార్తీక్ పేర్కొన్నారు. ఎగుమతిదారులకు రుణాలందించడం ఇందుకు కారణంకానున్నట్లు తెలియజేశారు. అయితే వీటి వాటా తక్కువకావడంతో బ్యాంకులపై ఒత్తిడి నెలకొనే అవకాశంలేదని అభిప్రాయపడ్డారు.



రియల్టీలో పెట్టుబడులు జోరు

- 15 ఏళ్లలో 80 బిలియన్ డాలర్లు
- విదేశీ ఇన్వెస్టర్ల వాటా 57 శాతం



సింగపూర్: గత పదిహేనేళ్లలో భారత రియల్టీ రంగంలో 80 బిలియన్ డాలర్ల(రూ. 7 లక్షల కోట్లకుపైగా) పెట్టుబడులు ప్రవహించినట్లు క్రెడాయ్, కొలియర్స్ ఇక్కడ విడుదల చేసిన సంయుక్త నివేదిక వెల్లడించింది. 2010 నుంచి దేశీ రియల్టీ రంగం సంస్థాగత ఇన్వెస్టర్ల నుంచి భారీ స్థాయిలో పెట్టుబడులను ఆకట్టుకుంటున్నట్లు తెలియజేసింది. గత దశాబ్దన్నర కాలం పెట్టుబడుల్లో విదేశీ ఇన్వెస్టర్లు 57 శాతం సమకూర్చినట్లు నివేదిక పేర్కొంది. దేశీ రియల్టీ సమాఖ్య క్రెడాయ్, రియల్టీ కన్సల్టెంట్ కొలియర్స్ ఇండియా సంయుక్తంగా నివేదికను విడుదల చేశాయి. క్రెడాయ్ నిర్వహించిన వార్షిక జాతీయ సదస్సు(నాట్కన్)లో 'భారత రియల్టీ: ఈక్విటీ పురోభివృద్ధి, ఆర్థిక వృద్ధికి ఊతం' పేరిట నివేదికను వెలువరించాయి. కోవిడ్ మహమ్మారి తదుపరి దేశీ పెట్టుబడులు సైతం పుంజుకున్నట్లు నివేదిక పేర్కొంది. సంస్థాగత ఇన్వెస్టర్ల జాబితాలో కుటుంబ కార్యాలయాలు, విదేశీ కార్పొరేట్ గ్రూప్‌లు, విదేశీ బ్యాంకులు, పెన్షన్ ఫండ్స్, ప్రయివేట్ ఈక్విటీ, విదేశీ పెట్టుబడులున్న ఎన్‌బీఎఫ్‌సీలు, రీట్‌లు, సావరిన్ వెల్త్ ఫండ్స్ ఉన్నట్లు నివేదిక వివరించింది. దేశీ రియల్టీ మార్కెట్ పరిమాణం 2047కల్లా 5-10 ట్రిలియన్ డాలర్లకు చేరనున్నట్లు అంచనా వేసింది. 2047కల్లా దేశీ రియల్టీ రంగాన్ని కేవలం చదరపు అడుగులు లేదా ఆస్తుల విలువ ద్వారా కాకుండా కోట్లమంది ప్రజల కోసం సృష్టించిన నాణ్యమైన జీవనం ద్వారా మదింపు చేయవలసి ఉంటుందని క్రెడాయ్ ప్రెసిడెంట్ శేఖర్ పటేల్ వ్యాఖ్యానించారు.

ఏఐకి మహిళా టెకీల జై..

- మెరుగైన అవకాశాలు కల్పిస్తుందని భరోసా
- నైపుణ్యాల్లో శిక్షణపై మరింతగా దృష్టి
- అప్నాడాట్‌కో నివేదిక

ముంబై: మెరుగైన అవకాశాలను దక్కించుకునేందుకు కృత్రిమ మేథ (ఏఐ) ఉపయోగపడుతుందని టెక్నాలజీ రంగంలో అత్యధిక శాతం మహిళలు విశ్వసిస్తున్నారు. జాబ్స్, కెరియర్ ప్లాట్‌ఫాం అప్నాడాట్‌కో నిర్వహించిన సర్వేలో 78 శాతం మంది ఈ అభిప్రాయం వ్యక్తం చేశారు. దీని ప్రకారం మహిళా టెకీలు ఏఐ ఆధారిత కెరియర్ల కోసం సన్నద్ధమవుతున్నారు. 58 శాతం మంది ఇప్పటికే ఉద్యోగాల్లో భాగంగానో లేదా ఏదైనా ప్రోగ్రాంలలో చేరడం ద్వారానో లేక స్వయంగానో ఏఐ/ఎంఎల్ నైపుణ్యాల్లో శిక్షణ పొందుతున్నారు. 24 శాతం మంది త్వరలోనే శిక్షణ పొందే యోచనలో ఉన్నారు. టెక్నాలజీ రంగంలో పని చేస్తున్న 11,300 మంది మహిళలు ఈ సర్వేలో పాల్గొన్నారు. ఇందులో అత్యధిక భాగం మహిళలు జెన్ జెడ్ విభాగానికి (పాతికేళ్ల లోపు వారు) చెందినవారే. వీరిలో 60 శాతం మంది ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలకు చెందిన వారు కాగా, మూడింట రెండొంతుల మంది సాధారణ కాలేజీల్లో చదివినవారే.

ఏఐ సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్‌కి డిమాండ్.

సర్వేలో పాల్గొన్న వారిలో దాదాపు సగం మంది ఏఐ సాఫ్ట్‌వేర్ డెవలపర్లు కావాలనుకుంటున్నారు. అలాగే 19 శాతం మంది డేటా సైన్స్.. మెషిన్ లెర్నింగ్ (ఎంఎల్), 14 శాతం మంది ప్రోడక్ట్ మేనేజ్‌మెంట్, 10 శాతం మంది రీసెర్చ్ ఉద్యోగాలపై దృష్టి పెడుతున్నారు. దీన్ని బట్టి చూస్తే ఏఐని ఏదో ఆషామాషీ ట్రెండ్‌గా కాకుండా సమాన అవకాశాలను కల్పించే దోహదకారిగా మహిళా టెకీలు భావిస్తున్నట్లు తెలుస్తోందని అప్నాడాట్కో వ్యవస్థాపకుడు నిర్మిత్ పారిఖ్ తెలిపారు. మరోవైపు, ఇప్పుడు పేరొందిన కాలేజీ నుంచి పట్టా పొందడం కన్నా ఏఐలో నైపుణ్యాలే చాలా ముఖ్యమని మూడింట రెండొంతుల టెకీలు భావిస్తున్నారు. జెన్ జెడ్ అమ్మాయిల్లో (22-25 ఏళ్ల వయస్సున్న వారిలో 62 శాతం మంది), ద్వితీయ-తృతీయ శ్రేణి పట్టణాల్లోని మహిళల్లో (74 శాతం మంది) ఈ భావన అత్యధికంగా ఉంది.

మెట్రోల్లో ఇది 66 శాతం మందిలో ఉంది. ఏఐని అందిపుచ్చుకోవడంలో ఎదురవుతున్న సవాళ్ల విషయానికొస్తే.. నాణ్యమైన అవకాశాలు అందుబాటులో ఉండటం లేదని 42 శాతం మంది, బలమైన మెంటార్‌షిప్ లేదని 27 శాతం, అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ ఆప్షన్లు అవసరమని 19 శాతం మంది తెలిపారు.



ఉద్యోగాల ఎంపికపై ఆచి..తూచి..

దేశీ టెకీల ధోరణిపై మైఖేల్ పేజ్ నివేదిక

న్యూఢిల్లీ: చాలా మటుకు టెక్నాలజీ నిపుణులు కొత్త అవకాశాలపై ఆసక్తిగా ఉన్నప్పటికీ .. ఉద్యోగాల ఎంపిక విషయంలో మాత్రం ఆచితూచి వ్యవహరిస్తున్నారు. తమ లక్ష్యాలు, కెరియర్ పురోగతి, శారీరక .. మానసిక ఆరోగ్యం లాంటి అంశాలకు సదరు ఉద్యోగం ఎంత వరకు దోహదపడుతుందనేది బేరీజు వేసుకుంటున్నారు. దేశీ టెకీలపై గ్లోబల్ రిక్రూట్‌మెంట్ ఏజెన్సీ మైఖేల్ పేజ్ రూపొందించిన నివేదికలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. దీని ప్రకారం అంతర్జాతీయంగా అత్యంత ఆత్మవిశ్వాసంతో, ఉద్యోగాల ఎంపికలో లోతుగా ఆలోచించి నిర్ణయం తీసుకుంటున్న టెక్ నిపుణుల్లో భారతీయ ప్రొఫెషనల్స్ కూడా ఉన్నారు. దీనికి సంబంధించిన సర్వేలో భారత్ సహా ప్రపంచ వ్యాప్తంగా సుమారు 5,000 మంది ప్రొఫెషనల్స్ పాల్గొన్నారు. భారతీయ ప్రొఫెషనల్స్‌లో 94 శాతం మంది కొత్త అవకాశాలపై ఆసక్తిగా ఉన్నట్లు తెలిపారు.

మరిన్ని విశేషాలు..

- అంతర్జాతీయంగా అవకాశాలను పరిశీలించాలనే ఆలోచనే తాము ఉద్యోగాలు మారడానికి ప్రేరణగా ఉంటుందని 39 శాతం మంది టెకీలు తెలిపారు. మెరుగైన జీతం, వృద్ధి అవకాశాలు కారణమని 31 శాతం మంది చెప్పారు.
- వెసులుబాటు విషయంలో టెక్ నిపుణులు ఏమాత్రం రాజీపడటం లేదు. 26 శాతం మంది సరళతరమైన పని విధానాలకు ప్రాధాన్యమిస్తున్నారు. ఒకవేళ మాటిమాటికీ ఆఫీసుకు రమ్మంటే ఉద్యోగాన్ని కూడా విడిచిపెట్టేసే అంశాన్ని కూడా పరిశీలిస్తామని 45 శాతం మంది తెలిపారు.
- 23 శాతం మంది తమ ప్రస్తుత వేతనాలపై అసంతృప్తిగా ఉన్నారు. 20 శాతం మంది చురుగ్గా శిక్షణ పొందుతున్నారు. అర్థవంతమైన పని, కెరియర్లో వృద్ధి అవకాశాలకు ప్రాధాన్యతనివ్వడానికి మొగ్గు చూపుతున్నారు.
- టెక్ నిపుణులు, ఉద్యోగాలను ఎంచుకోవడంలో ఆలోచించి నిర్ణయం తీసుకుంటున్న నేపథ్యంలో కంపెనీలు కూడా కేవలం మెరుగైన వేతనాన్ని ఇవ్వజూపడానికే పరిమితం కాకుండా వెసులుబాటు, వృద్ధి అవకాశాల్లాంటివి కూడా ఆఫర్ చేయాల్సి వస్తోంది.
- హైబ్రిడ్ పని, ఏఐ సన్నద్ధతపై పెట్టుబడులు, నమ్మకం..పారదర్శకతకు పెద్దపీట వేసే సంస్కృతిని పెంపొందించే కంపెనీలు టాప్ ప్రతిభావంతులను ఆకర్షించడంతో పాటు పోటీ మార్కెట్లోను గట్టిగా నిలబడటానికి వీలుంటుంది.

పెరిగిన ఫ్లిప్‌కార్ట్ ఇండియా నష్టం



న్యూఢిల్లీ: గత ఆర్థిక సంవత్సరంలో ఈ-కామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్ ఇండియా నష్టం మరింత పెరిగి రూ. 5,189 కోట్లకు చేరింది. అంతక్రితం ఆర్థిక సంవత్సరంలో కంపెనీ నష్టాలు రూ. 4,248 కోట్లుగా నమోదయ్యాయి. బిజినెస్ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫాం టోఫ్లర్ ప్రకారం.. తాజాగా ఆదాయం రూ. 70,542 కోట్ల నుంచి 17 శాతం పెరిగి రూ. 82,787 కోట్లకు చేరింది. మొత్తం వ్యయాలు 17 శాతం పెరిగి రూ. 88,121 కోట్లకు చేరాయి.

మింత్రా లాభం జూమ్..



న్యూఢిల్లీ: ఫ్యాషన్, లైఫ్‌స్టయిల్ ఈ-కామర్స్ సంస్థ మింత్రా డిజైన్స్ గత ఆర్థిక సంవత్సరంలో రూ. 548 కోట్ల లాభం ప్రకటించింది. అంతక్రితం ఆర్థిక సంవత్సరంలో నమోదైన రూ. 31 కోట్లతో పోలిస్తే ఇది అనేక రెట్లు అధికం కావడం గమనార్హం. మరోవైపు, సమీక్షాకాలంలో సంస్థ ఆదాయం రూ. 5,122 కోట్ల నుంచి 18 శాతం వృద్ధి చెంది రూ. 6,043 కోట్లకు చేరింది.



హర్మన్‌ప్రీత్

ప్రపంచకప్ సన్నాహకంగా...

నేడు ఆస్ట్రేలియాతో భారత మహిళల జట్టు తొలి వన్డే

ముల్లాన్‌పూర్: సొంతగడ్డపై వన్డే ప్రపంచకప్‌నకు ముందు భారత మహిళల క్రికెట్ జట్టు కీలక సిరీస్‌కు సిద్ధమైంది. ఈ నెల 30 నుంచి ఐసీసీ వరల్డ్‌కప్ ప్రారంభం కానుండగా... దానికి ముందు డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియాతో టీమిండియా మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ ఆడనుంది. ఇందులో భాగంగా ఆదివారం హర్మన్‌ప్రీత్‌కౌర్ సారథ్యంలోని భారత జట్టు తొలి మ్యాచ్ ఆడనుంది. ఈ ఏడాది ఆడిన 11 వన్డేల్లో తొమ్మిదింట గెలిచిన భారత్... ఇంగ్లండ్‌పై సిరీస్ విజయంతో ఆత్మవిశ్వాసంతో ఉంది. అయితే ఆస్ట్రేలియాపై మాత్రం భారత్‌కు మంచి రికార్డు లేదు. ఇరు జట్ల మధ్య జరిగిన గత 13 మ్యాచ్‌ల్లో 12 ఆసీస్ నెగ్గింది. టీమిండియా చివరిసారిగా 2007లో సొంతగడ్డపై ఆస్ట్రేలియాను ఓడించింది. హర్మన్‌ప్రీత్‌కు ఇది 150వ వన్డే. ఈ ఘనత సాధించిన మూడో భారత ప్లేయర్‌గా నిలవనుంది.

స్నేహ్ రాణా, రేణుక కీలకం...

ఇంగ్లండ్ పర్యటనలో సత్తా చాటిన భారత అమ్మాయిలకు... ఆస్ట్రేలియా రూపంలో అసలు సిసలు పోటీ ఎదురు కానుంది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్, వైస్ కెప్టెన్ స్మృతి మంధాన, జెమీమా రోడ్రిగ్స్, రిచా ఘోష్, హర్లీన్ డియోల్, ప్రతీక రావల్ బ్యాటింగ్‌లో కీలకం కానున్నారు. గాయం నుంచి కోలుకొని పునరాగమనం చేస్తున్న పేసర్ రేణుక సింగ్‌పై అందరి దృష్టి నిలవనుంది. దీంతో హైదరాబాద్ అమ్మాయి అరుంధతి రెడ్డికి తుది జట్టులో చోటు దక్కడం కష్టమే. ఇటీవల ఇంగ్లండ్‌తో సిరీస్‌లో ఆకట్టుకున్న క్రాంతి గౌడ్‌తో కలిసి రేణుక పేస్ భారం మోయనుంది. ఆల్‌రౌండర్ దీప్తి శర్మ, ఆంధ్రప్రదేశ్ అమ్మాయి శ్రీ చరణి, స్నేహ్ రాణా స్పిన్ బాధ్యతలు చూసుకోనున్నారు. మరోవైపు ఇటీవల భారత 'ఎ'తో సిరీస్‌లో విజృంభించిన ఆస్ట్రేలియా కెప్టెన్ అలీసా హీలీ అంతర్జాతీయ స్థాయిలో అదే జోరు కొనసాగించేందుకు రెడీ అయింది. పెర్రీ, మూనీ, గర్డ్‌నర్, తహిలా, సథర్లాండ్, అలానా కింగ్, కిమ్ గార్త్, మేగన్ షుట్‌తో కూడిన ఆసీస్ జట్టు పటిష్టంగా ఉంది.

- బట్లర్ వీర విహారం
- 20 ఓవర్లలో ఇంగ్లండ్ 304/2
- టి20ల్లో మూడో అత్యధిక స్కోరు
- 146 పరుగులతో దక్షిణాఫ్రికా పరాజయం



సాల్ట్

సాల్ట్ సునామీ

60 బంతుల్లో 15 ఫోర్లు, 8 సిక్స్‌లతో 141 నాటౌట్

మాంచెస్టర్: బ్యాటర్లు విజృంభించడంతో ఇంగ్లండ్ జట్టు రికార్డుల దుమ్ము దులిపింది. సొంతగడ్డపై దక్షిణాఫ్రికా చేతిలో వన్డే సిరీస్ కోల్పోయిన ఇంగ్లండ్ జట్టు... రెండో టి20లో ఆకాశమే హద్దుగా చెలరేగిపోయింది. వర్షం అంతరాయం మధ్య ముగిసిన తొలి టి20లో భారీ షాట్‌లు ఆడలేక పరాజయం పాలైన ఇంగ్లండ్.. రెండో మ్యాచ్‌లో అంతకంత బదులు తీర్చుకుంది. ఫలితంగా శుక్రవారం అర్ధరాత్రి దాటాక జరిగిన రెండో టి20లో ఇంగ్లండ్ 146 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాను చిత్తు చేసి సిరీస్‌ను 1–1తో సమం చేసింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ నిర్ణీత 20 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 304 పరుగులు చేసింది. ఈ ఫార్మాట్‌లో ఇది మూడో అత్యధిక స్కోరు. జింబాబ్వే (344/4 గాంబియాపై; 2024లో), నేపాల్ (314/3 మంగోలియాపై; 2023లో) తొలి రెండు స్థానాల్లో ఉన్నాయి. ఓపెనర్ ఫిల్ సాల్ట్ (60 బంతుల్లో 141 నాటౌట్; 15 ఫోర్లు, 8 సిక్స్‌లు) భారీ సెంచరీతో కదం తొక్కగా... జోస్ బట్లర్ (30 బంతుల్లో 83; 8 ఫోర్లు, 7 సిక్స్‌లు) వీరవిహారం చేశాడు. టి20ల్లో ఇంగ్లండ్‌కు ఇదే అత్యధిక స్కోరు కాగా... ఈ ఫార్మాట్‌లో ఇంగ్లండ్ తరఫున వేగవంతమైన సెంచరీ చేసిన ప్లేయర్‌గా సాల్ట్ రికార్డుల్లోకెక్కాడు. సఫారీ బౌలింగ్‌ను తుత్తునియలు చేసిన సాల్ట్ 39 బంతుల్లో మూడంకెల స్కోరు చేశాడు. లియామ్ లివింగ్‌స్టోన్ (పాకిస్తాన్‌పై;42 బంతుల్లో) రెండో స్థానానికి చేరాడు. జాకబ్ బెథెల్ (14 బంతుల్లో 26; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), కెప్టెన్ హ్యారీ బ్రూక్ (21 బంతుల్లో 41 నాటౌట్; 5 ఫోర్లు, 1 సిక్స్) కూడా వేగంగా ఆడటంతో ఇంగ్లండ్ కొండంత స్కోరు చేసింది. ఇంగ్లండ్ ఇన్నింగ్స్‌లో 30 ఫోర్లు, 18 సిక్స్‌లు నమోదు కాగా... కేవలం బౌండరీల ద్వారానే 228 పరుగులు పిండుకుంది. చూస్తున్నది లైవ్ మ్యాచా లేక హైలైట్సా అనే రీతిలో ఇంగ్లండ్ బ్యాటర్లు దంచికొట్టారు. దక్షిణాఫ్రికా బౌలర్లలో ప్రతి ఒక్కరూ పదికి పైగా ఎకానమీ నమోదు చేసుకున్నారు. జోర్న్ ఫార్చూన్‌కు 2 వికెట్లు దక్కాయి. అనంతరం భారీ లక్ష్యఛేదనలో దక్షిణాఫ్రికా 16.1 ఓవర్లలో 158 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ ఎయిడెన్ మార్క్‌రమ్ (20 బంతుల్లో 41; 2 ఫోర్లు, 4 సిక్స్‌లు) టాప్ స్కోరర్ కాగా... మిగిలిన వాళ్లెవరూ చెప్పుకోదగ్గ ఇన్నింగ్స్ ఆడలేదు. ఇంగ్లండ్ బౌలర్లలో ఆర్చర్ 3 వికెట్లు పడగొట్టగా... సామ్ కరన్, లియామ్ డాసన్, విల్ జాక్స్ తలా రెండు వికెట్లు తీశారు. ఇరు జట్ల మధ్య నేడు నిర్ణయాత్మక మూడో టి20 జరుగుతుంది.


బట్లర్

304/2 అంతర్జాతీయ టి20ల్లో ఇది మూడో అత్యధిక స్కోరు. గాంబియాపై జింబాబ్వే 344/4, మంగోలియాపై నేపాల్ 314/3 చేసిన స్కోర్లు తొలి రెండు స్థానాల్లో ఉన్నాయి.

39 సాల్ట్ సెంచరీకి తీసుకున్న బంతులు. టి20ల్లో ఇంగ్లండ్ తరఫున ఇదే వేగవంతమైన శతకం. లివింగ్‌స్టోన్ (42 బంతుల్లో పాకిస్తాన్‌పై) రెండో స్థానంలో ఉన్నాడు.

228 ఈ మ్యాచ్‌లో ఫోర్లు, సిక్స్‌ల ద్వారా ఇంగ్లండ్ బ్యాటర్లు సాధించిన పరుగులు. అంతర్జాతీయ టి20ల్లో ఇది మూడో అత్యధికం.

శ్రీలంక శుభారంభం

బంగ్లాపై 6 వికెట్ల తేడాతో గెలుపు


కమిల్ మిషార

అబుదాబి: ఆసియా కప్ టి20 టోర్నమెంట్‌లో శ్రీలంక శుభారంభం చేసింది. గ్రూప్ 'బి'లో శనివారం జరిగిన మ్యాచ్‌లో అసలంక సారథ్యంలోని లంక 6 వికెట్ల తేడాతో బంగ్లాదేశ్‌పై విజయం సాధించింది. టాస్ నెగ్గిన శ్రీలంక ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 139 పరుగులే చేసింది. ఓపెనర్లు తన్‌జీద్ హసన్ (0), పర్వేజ్ హుసేన్ (0) డకౌట్ కావడంతో జట్టు పరుగుల ఖాతా తెరువకముందే 2 టాపార్డర్ వికెట్లను కోల్పోయింది. జట్టు రెండంకెల స్కోరు 11కు చేరగానే తౌహీద్ హృదయ్ (8) రనౌటయ్యాడు. ఈ దశలో కెప్టెన్ లిటన్ దాస్ (26 బంతుల్లో 28; 4 ఫోర్లు) కాసేపు పోరాడాడు. అయితే స్వల్ప వ్యవధిలోనే మెహదీ హసన్ (9)తో పాటు లిటన్ దాస్ కూడా పెవిలియన్ చేరడంతో బంగ్లా 53 పరుగులకే 5 వికెట్లను కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో షమీమ్ (34 బంతుల్లో 42 నాటౌట్; 3 ఫోర్లు, 1 సిక్స్), జాకీర్ అలీ (34 బంతుల్లో 41 నాటౌట్; 2 ఫోర్లు) రాణించారు. మరో వికెట్ పడకుండా జట్టు స్కోరును వంద పరుగులు దాటించారు. అనంతరం సులువైన లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన శ్రీలంక 14.4 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 140 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్లలో కుశాల్ మెండిస్ (3) నిరాశ పరచగా, నిసాంక (34 బంతుల్లో 50; 6 ఫోర్లు, 1 సిక్స్) అర్ధసెంచరీ సాధించాడు. వన్‌డౌన్ బ్యాటర్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' కమిల్ మిషార (32 బంతుల్లో 46 నాటౌట్; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు)తో కలిసి నిసాంక రెండో వికెట్‌కు 95 పరుగులు జోడించాడు.


సారాంశ్
యశ్ రాథోడ్

పోరాడుతున్న సౌత్ జోన్

- రెండో ఇన్నింగ్స్‌లో 129/2
- మరో 233 పరుగుల వెనుకంజ
- సెంట్రల్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 511 ఆలౌట్
- యశ్ రాథోడ్ 194
- దులీప్ ట్రోఫీ ఫైనల్

బెంగళూరు: దేశవాళీ క్రికెట్ టోర్నమెంట్ దులీప్ ట్రోఫీ ఫైనల్లో సౌత్ జోన్ జట్టు పోరాడుతోంది. తొలి ఇన్నింగ్స్‌లో సెంట్రల్ జోన్ జట్టు కొండంత స్కోరు చేయగా... శనివారం మూడో రోజు ఆట ముగిసే సమయానికి సౌత్ జోన్ రెండో ఇన్నింగ్స్‌లో 33 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 129 పరుగులు చేసింది. తన్మయ్ అగర్వాల్ (42 బంతుల్లో 26; 2 ఫోర్లు), మోహిత్ కాలే (61 బంతుల్లో 38; 7 ఫోర్లు) అవుట్ కాగా... రవిచంద్రన్ స్మరణ్ (50 బంతుల్లో 37 బ్యాటింగ్; 5 ఫోర్లు, 1 సిక్స్), రికీ భుయ్ (46 బంతుల్లో 26 బ్యాటింగ్; 3 ఫోర్లు, 1 సిక్స్) క్రీజులో ఉన్నారు. చేతిలో 8 వికెట్లు ఉన్న సౌత్ జోన్ జట్టు... ప్రత్యర్థి తొలి ఇన్నింగ్స్ స్కోరుకు ఇంకా 233 పరుగులు వెనుకబడి ఉంది. మరో రెండు రోజుల ఆట మిగిలిఉన్న ఈ మ్యాచ్‌లో ఫలితం తేలడం పక్కా కాగా... మొహమ్మద్ అజహరుద్దీన్ సారథ్యంలోని సౌత్ జోన్ జట్టు ఏమాత్రం స్కోరు చేస్తుందో చూడాలి. సెంట్రల్ జోన్ బౌలర్లలో సారాంశ్ జైన్, కుల్దీప్ సేన్ చెరో వికెట్ పడగొట్టారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 384/5తో రెండో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన సెంట్రల్ జోన్ చివరకు 145.1 ఓవర్లలో 511 పరుగులకు ఆలౌటైంది. యశ్ రాథోడ్ (286 బంతుల్లో 194; 17 ఫోర్లు, 2 సిక్స్‌లు) త్రుటిలో డబుల్ సెంచరీ చేసే అవకాశం కోల్పోయాడు. సారాంశ్ జైన్ (193 బంతుల్లో 69; 7 ఫోర్లు), దీపక్ చాహర్ (49 బంతుల్లో 37; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) విలువైన పరుగులు చేశారు. సౌత్ జోన్ బౌలర్లలో గుర్‌జపనీత్ సింగ్, అంకిత్ శర్మ చెరో 4 వికెట్లు ఖాతాలో వేసుకున్నారు.

యశ్ డబుల్ సెంచరీ మిస్...

స్పిన్నర్లు సత్తా చాటడంతో తొలి ఇన్నింగ్స్‌లో సౌత్ జోన్‌ను తక్కువ స్కోరుకే పరిమితం చేసిన సెంట్రల్‌జోన్... చక్కటి బ్యాటింగ్‌తో విజయానికి బాటలు వేసుకుంది. సౌత్ జోన్ బౌలర్లు పెద్దగా ప్రభావం చూపలేకపోవడంతో సెంట్రల్ జోన్ ప్లేయర్లు స్వేచ్ఛగా ఆడారు. క్రితం రోజు సెంచరీ పూర్తి చేసుకున్న యశ్ రాథోడ్... ఇన్నింగ్స్‌ను ముందుండి నడిపించాడు. గతేడాది రంజీ ట్రోఫీలో అత్యధిక పరుగుల వీరుడిగా నిలిచిన యశ్... ఈ టోర్నీలోనూ అదే కొనసాగించాడు. మరో ఎండ్ నుంచి సారాంశ్ అతడికి చక్కటి సహకారం అందించాడు. బౌలింగ్‌లో ఐదు వికెట్లతో సత్తాచాటిన సారాంశ్... స్పెషలిస్ట్ బ్యాటర్ మాదిరిగా యశ్‌కు అండగా నిలిచాడు. దీంతో సెంట్రల్ జోన్‌కు పెద్దగా ఇబ్బందులు ఎదురుకాలేదు. ఈ జంట ఆరో వికెట్‌కు 176 పరుగులు జోడించడంతో సెంట్రల్ జోన్ భారీ స్కోరు సాధించింది. ద్విశతకం చేయడం ఖాయం అనుకుంటున్న దశలో యశ్ రాథోడ్‌ను గుర్‌జపనీత్ సింగ్ అవుట్ చేశాడు. అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోగా... దీపక్ చహర్ చివర్లో ధాటిగా ఆడి కీలక పరుగులు రాబట్టాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన సౌత్ జోన్‌కు శుభారంభం దక్కలేదు. ఓపెనర్లు తన్మయ్, మోహిత్ ఎక్కువసేపు నిలవలేకపోవడంతో ఆ జట్టు 76 పరుగులకే 2 వికెట్లు కోల్పోయింది. ఈ రెండు వికెట్లు మరోసారి సెంట్రల్ జోన్ స్పిన్నర్లే ఖాతాలో వేసుకున్నారు. సారాంశ్, కుల్దీప్ స్పిన్‌ను ఎదుర్కొంటూ... సౌత్ జోన్ జట్టు రెండో ఇన్నింగ్స్‌లో ఎన్ని పరుగులు చేస్తుందో చూడాలి!

స్కోరు వివరాలు

సౌత్ జోన్ తొలి ఇన్నింగ్స్: 149; **సెంట్రల్ జోన్ తొలి ఇన్నింగ్స్:** దానిశ్ మాలేవర్ (సి) రికీ భుయ్ (బి) గుర్‌జపనీత్ సిగ్ 53; అక్షయ్ వాడ్కర్ (బి) కౌశిక్ 22; శుభమ్ శర్మ (బి) గుర్‌జపనీత్ సింగ్ 6; రజత్ పాటీదార్ (సి) అజహరుద్దీన్ (బి) గుర్‌జపనీత్ సింగ్ 101; యశ్ రాథోడ్ (బి) గుర్‌జపనీత్ సింగ్ 194; ఉపేంద్ర యాదవ్ (సి) అజహరుద్దీన్ (బి) నిధీశ్ 5; సారాంశ్ జైన్ (బి) అంకిత్ శర్మ 69; దీపక్ చాహర్ (సి) అజహరుద్దీన్ (బి) అంకిత్ శర్మ 37; కుమార్ కార్తికేయ (సి అండ్ బి) అంకిత్ శర్మ 8; ఆదిత్య ఠాకరే (సి) (సబ్) తనయ్ త్యాగరాజన్ (బి) అంకిత్ శర్మ 1; కుల్దీప్ సేన్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు: 14; మొత్తం (145.1 ఓవర్లలో ఆలౌట్)511. వికెట్ల పతనం: 1-55, 2-74, 3-93, 4-260, 5-266, 6-442, 7-500, 8-500, 9-509, 10-511. బౌలింగ్: గుర్‌జపనీత్ సింగ్ 28-2-124-4; అంకిత్ శర్మ 44.1-5-180-4; నిధీశ్ 19-4-43-1; వాసుకి కౌశిక్ 28-6-64-1; రికీ భుయ్ 26-2-93-0.

సౌత్ జోన్ రెండో ఇన్నింగ్స్: తన్మయ్ అగర్వాల్ (బి) కుల్దీప్ సేన్ 26; మోహిత్ కాలె (ఎల్బీ) (బి) సారాంశ్ జైన్ 38; స్మరణ్ (బ్యాటింగ్) 37; రికీ భుయ్ (బ్యాటింగ్) 26; ఎక్స్‌ట్రాలు 2; మొత్తం (33 ఓవర్లలో 2 వికెట్లకు)129. వికెట్ల పతనం: 1-62, 2-76. బౌలింగ్: దీపక్ చాహర్ 6-1-37-0; ఆదిత్య ఠాకరే 6-2-15-0; కుమార్ కార్తికేయ 6-0-23-0; సారాంశ్ జైన్ 10-1-32-1; కుల్దీప్ సేన్ 5-1-22-1.

భారత అథ్లెట్లు విఫలం

- అమెరికాకు రెండు పసిడి పతకాలు
- ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్



ప్రియాంక

టోక్యో: ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ తొలి రోజు భారత అథ్లెట్లు ఆకట్టుకోలేకపోయారు. పోటీలో ఆరంభ రోజు బరిలో ఉన్న నలుగురు భారత అథ్లెట్లు కనీస ప్రభావం చూపలేకపోయారు. పురుషుల 35 కిలోమీటర్ల రేస్ వాక్‌లో సందీప్ కుమార్ 23వ స్థానంతో సరిపెట్టుకోగా... మహిళల విభాగంలో ప్రియాంక గోస్వామి 24వ 'ప్లేస్'లో నిలిచింది. పురుషుల విభాగంలో పోటీపడిన మరో భారత అథ్లెట్, జాతీయ రికార్డు హోల్డర్ రామ్‌బాబు నాలుగు రెడ్ కార్డ్‌లు పొంది అనర్హతకు గురయ్యాడు. 39 ఏళ్ల సందీప్ కుమార్ 2 గంటల 39 నిమిషాల 15 సెకన్లలో లక్ష్యాన్ని చేరాడు. ఈ విభాగంలో కెనడాకు చెందిన ఇవాన్ డున్‌ఫీ (2 గంటల 28 నిమిషాల 22 సెకన్లలో) పసిడి గెలుచుకున్నాడు. మహిళల విభాగంలో జాతీయ రికార్డు కలిగిన ప్రియాంక 3 గంటల 5 నిమిషాల 58 సెకన్లలో రేసును పూర్తి చేసింది. స్పెయిన్‌కు చెందిన మారియా పెరెజ్ (2 గంటల 39 నిమిషాల 1 సెకన్) స్వర్ణం నెగ్గింది. మహిళల 1500 మీటర్ల హీట్స్‌లో భారత అథ్లెట్ పూజ 4 నిమిషాల 13.75 సెకన్లలో రేసును పూర్తి చేసి 11వ స్థానంలో నిలిచింది. ఈ నెల 18న జరగనున్న మహిళల 800 మీటర్ల పరుగులోనూ ప్రియాంక పోటీపడనుంది. ఇక తొలి రోజు ఐదు విభాగాల్లో మెడల్ ఈవెంట్లు జరగగా... వాటిలో అమెరికా 2 స్వర్ణాలు... స్పెయిన్, కెనడా, కెన్యా తలా ఒక పసిడి పతకం సాధించాయి. మిక్స్‌డ్ 4-400 మీటర్ల రిలే ఫైనల్లో బ్రైస్ డెడ్‌మన్, లీనా జాక్సన్, జెనా మెకివర్, అలెక్సిస్ హోమ్స్‌తో కూడిన అమెరికా బృందం 3 నిమిషాల 8.80 సెకన్లలో లక్ష్యాన్ని చేరి బంగారు పతకం కైవసం చేసుకుంది. పురుషుల షాట్‌పుట్‌లో ర్యాన్ క్రౌసర్ ఇనుప గుండును 22.34 మీటర్ల దూరం విసిరి పసిడి గెలుచుకున్నాడు. మహిళల 10,000 మీటర్ల పరుగులో కెన్యాకు చెందిన బిట్రైస్ చెబెట్ 30 నిమిషాల 37.61 సెకన్లలో గమ్యాన్ని చేరి అగ్రస్థానంలో నిలిచింది.

తెలుగు టైటాన్స్ పరాజయం



జైపూర్: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) 12వ సీజన్‌లో వరుస విజయాలతో జోరు మీదున్న తెలుగు టైటాన్స్‌కు పరాజయం ఎదురైంది. వైజాగ్ వేదికగా ఆడిన గత మూడు మ్యాచ్‌ల్లోనూ నెగ్గిన తెలుగు టైటాన్స్ శనివారం 33–39 పాయింట్ల తేడాతో పుణేరి పల్టన్ చేతిలో ఓడింది. ఈ సీజన్‌లో టైటాన్స్‌కు ఇది మూడో పరాజయం. తెలుగు టైటాన్స్ తరఫున భరత్ 12 పాయింట్లతో విజృంభించగా... కెప్టెన్ విజయ్ మాలిక్ 7 పాయింట్లు సాధించాడు. పల్టన్ తరఫున అస్లమ్ ఇనామ్‌దార్, గౌరవ్ చెరో 7 పాయింట్లు సాధించారు. విశాల్ భరద్వాజ్ (6 పాయింట్లు), ఆదిత్య (5 పాయింట్లు), పంకజ్ (5 పాయింట్లు) కూడా మెరవడంతో పల్టన్ ముందంజ వేసింది. ఈ మ్యాచ్‌లో టైటాన్స్ 21 రెయిడ్ పాయింట్లు సాధించగా... పల్టన్ 15కే పరిమితమైంది. ట్యాక్లింగ్‌లో పల్టన్ 17 పాయింట్లు సాధిస్తే తెలుగు టైటాన్స్ పది పాయింట్లకే పరిమితమైన పరాజయం పాలైంది. లీగ్‌లో భాగంగా ఆరు మ్యాచ్‌లు ఆడిన టైటాన్స్ మూడింట గెలిచి మరో మూడు మ్యాచ్‌ల్లో ఓడి 6 పాయింట్లతో పట్టిక నాలుగో స్థానంలో కొనసాగుతోంది. మరో మ్యాచ్‌లో జైపూర్ పింక్ పాంథర్స్ 41–29 పాయింట్ల తేడాతో యూపీ యోధాస్‌పై గెలుపొందింది. పింక్ పాంథర్స్ తరఫున నితిన్ కుమార్ 11 పాయింట్లు, అలీ సమది 10 పాయింట్లతో సత్తాచాటారు. యూపీ యోధాస్ తరఫున గగన్ గౌడ 15 పాయింట్లతో ఒంటరి పోరాటం చేసినా లాభం లేకపోయింది. ఓవరాల్‌గా ఈ మ్యాచ్‌లో యూపీ యోధాస్ 22 రెయిడ్ పాయింట్లు సాధించగా... జైపూర్ పింక్ పాంథర్స్ 21 సాధించింది. అయితే ట్యాక్లింగ్‌లో మెరుగైన ప్రదర్శన కనబర్చిన పింక్ పాంథర్స్ 12 పాయింట్లు సాధిస్తే... యూపీ యోధాస్ 4 పాయింట్లకే పరిమితమైంది.



ఆంధ్ర జట్టు కోచ్‌గా గ్యారీ స్టీడ్

- దేశవాళీ జట్టుకు తొలి విదేశీ కోచ్
- న్యూజిలాండ్‌కు ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ అందించిన గుర్తింపు

సాక్షి, విజయవాడ: అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యుత్తమ కోచ్‌లలో ఒకడిగా గుర్తింపు తెచ్చుకున్న గ్యారీ స్టీడ్ తొలిసారి భారత్‌లో ఒక దేశవాళీ జట్టుకు శిక్షణ ఇవ్వనున్నాడు. 2025–26 సీజన్ కోసం ఆంధ్ర జట్టుకు స్టీడ్ హెడ్ కోచ్‌గా వ్యవహరిస్తాడు. న్యూజిలాండ్‌కు చెందిన స్టీడ్ (53) నియామకాన్ని శనివారం ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) ప్రకటించింది. శిక్షణలో అపార అనుభవం ఉన్న స్టీడ్ 2018 నుంచి 2025 వరకు కివీస్ జాతీయ జట్టుకు హెడ్ కోచ్‌గా పని చేశాడు. ఆయన నేతృత్వంలోని కివీస్ టీమ్ 2021 డబ్ల్యూటీసీలో చాంపియన్‌గా నిలవడంతో పాటు 2019 వన్డే వరల్డ్ కప్, 2021 టి20 వరల్డ్ కప్, 2025 చాంపియన్స్ ట్రోఫీల్లో ఫైనల్‌కు చేరింది. భారత్ గడ్డపై 3–0తో చారిత్రాత్మక టెస్టు సిరీస్ విజయం సాధించిన సమయంలో కూడా స్టీడ్ కోచ్‌గా ఉన్నారు. న్యూజిలాండ్ తరఫున ప్లేయర్‌గా 5 టెస్టులు ఆడిన స్టీడ్‌కు 101 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు ఆడిన అనుభవం ఉంది. గత ఏడాది రంజీ ట్రోఫీలో తమ గ్రూప్‌లో ఆరో స్థానంలో నిలిచిన ఆంధ్ర... విజయ్‌హజారే ట్రోఫీలో నాకౌట్ దశకు అర్హత సాధించడంలో విఫలమైంది. ముస్తాక్ అలీ టి20 టోర్నీలో కూడా ప్రిలిమినరీ క్వార్టర్ ఫైనల్లో ఓడింది.

గిన్నిస్‌లో పొద్దుతిరిగింది

ఏకంగా 35.9 అడుగుల ఎత్తు పెరిగిన పొద్దుతిరుగుడు మొక్క
- అమెరికాలో పండించిన ఉక్రెయిన్ శరణార్థి
- వలసదేశంలో తనను తలెత్తుకు తిరిగేలా చేసిందని ఆనందం వ్యక్తం చేసిన అలెక్స్

పొద్దు తిరుగుడు పువ్వు. సూర్యరశ్మిపై ప్రేమతో తదేకంగా ఆదిత్యుడినే చూస్తే అతను ఎటువైపు మళ్లితే ఆ దిశగా తిరుగుతూ తన ప్రేమను ప్రదర్శించే పొద్దు తిరుగుడు పువ్వు. సూరీడు కిందకు వాలేకొద్దీ సరిగా కనిపించట్లేదని అనుకుందో ఏమో ఇంకాస్త పైకి నిక్కి నిక్కి చూసింది. అలా అలా పైపైకి ఎదిగింది. ఆపకుండా ఎదుగుతూ ఏకంగా 35.9 అడుగుల ఎత్తుకు పెరిగింది. అమాంతం అంతెత్తుకు పెరిగి నేరుగా గిన్నిస్ ప్రపంచ రికార్డుల పుస్తకంలోకి ఎక్కేసింది. ఉక్రెయిన్ నుంచి అమెరికాకు వలసవచ్చిన 47 అలెక్స్ బాబిక్ ఈ మొక్కను కంటికి రెప్పలా కాపాడుతూ దాని బాగోగులు చూసుకుంటున్నారు. టెలిఫోన్ స్తంభం అంత ఎత్తుకు పెరిగిన ఈ మొక్కకు బుధవారమే గిన్నిస్ ప్రపంచ రికార్డ్ అధికారులు అధికారిక రికార్డ్ ధృవీకరణ పత్రాన్ని జారీచేశారు. దీంతో దీని పెంపకం దారు అలెక్స్ ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. మొక్కకు ముద్దుగా 'క్లవర్'అని పేరు పెట్టుకున్నారు. అనుకోకుండా మొదలైన ఈ మొక్క పోషణపర్వాన్ని అలెక్స్ ఆనందంగా మీడియాతో పంచుకున్నారు.

"ఉక్రెయిన్‌లో చెర్నోబిల్ అణు విద్యుత్ కేంద్రంలో భారీ పేలుడు, దారుణమైన రేడియోధార్మికత విషాదం కారణంగా 14 ఏళ్ల వయసులో నేను 1991లో అమెరికాకు వలసవచ్చా. అయినాసరే నాకు స్వదేశం ఉక్రెయిన్ అంటే ఎంతో ఇష్టం. అందుకే ఉక్రెయిన్ జాతీయ పుష్పం అయిన పొద్దు తిరుగుడు పువ్వులను పెంచాలని నిర్ణయించుకున్నా. అందుకే ఏడేళ్ల క్రితం సన్‌ఫ్లవర్ మొక్కల పెంపకాన్ని మొదలెట్టా. నేను పెంచిన మొట్టమొదటి పొద్దుతిరుగుడు మొక్క 13 అడుగుల ఎత్తు పెరిగింది. తర్వాతది 15 అడుగులు. ఆ తర్వాతది 19 అడుగులు. దీంతో అసలు ఈ మొక్కలు ఎంత ఎత్తు పెరుగుతాయి? ఇంకా ఎత్తు పెంచాలంటే ఏం చేయాలి? అనే కుతూహలం, ఉత్సాహం నాలో పెరిగాయి. ఆ ప్రేరణ నుంచి పట్టిందే ఈ మొక్క. నా పదేళ్ల కొడుకు సైతం మొక్క పెంపకంలో ఎంతో సాయపడ్డాడు. ఈ మొక్కకు క్లవర్ అని పేరు పెట్టింది కూడా వాడే. నాలుగు ఆకులు జతగా ఉండే క్లవర్ జాతి పెద్ద ఆకును ఈ మొక్క మీద పెట్టి మంచి జరగాలని రోజూ కోరుకునేవాడు. మేం ఏరో ఒకరోజు చనిపోతాం. కానీ ఈ మొక్క గురించి అందరూ మాట్లాడుకుంటారు. నా పిల్లలు వారి పిల్లలకూ ఈ మొక్క ఘనచరిత్రను చెబుతారు"అని అలెక్స్ అన్నారు.

ఇష్టంతో మొదలై..

అందరి సమక్షంలో కొలత

సెప్టెంబర్ మూడోతేదీన ఈ మొక్క ఎత్తును అందరి సమక్షంలో అధికారికంగా కొలిచారు. స్థానిక వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని తోటపని నిపుణులు, అలెన్ కౌంటీ తూనికలు, కొలత విభాగాధికారులు, గిన్నిస్ రికార్డ్ ప్రతినిధి, ఫోర్ట్ వేనీ కొమిట్స్ మైనర్ లీగ్ ఐస్ హాకీ బృంద మస్కట్ ఐసీ డీ ఈగల్ సహా చాలా మంది ఈ మొక్క ఎంత ఎత్తు పెరిగిందా? అని చూసేందుకు ఎగబడ్డారు. 35 అడుగుల 9 అంగుళాల ఎత్తు ఉందని తేల్చారు. "గిన్నిస్ రికార్డ్ బద్దలుకొట్టామన్న ఆనందానికి అంతేలేకుండా పోయింది. నా కుమారుడు ఎగిరి గంతేశాడు. ఈ మొక్క నేను వలసదేశంలో తలెత్తుకు తిరిగేలా చేసింది. రికార్డ్ అనేది నిజంగా ఎంతో భావోద్వేగంతో కూడింది" అని అలెక్స్ ఆనందం వ్యక్తంచేశారు.

పొడవ్వకుండా చుట్టూ కంచె

ఎవరూ ఈ మొక్కను తాకకుండా చుట్టూ కంచె ఏర్పాటుచేశారు. ఈ మొక్క పడిపోకుండా 35 అడుగుల పొడవునా చుట్టూ తోడ్పాటుగా మూడు నిచ్చెల నిర్మాణాన్ని సిద్ధంచేశారు. ఇది సరిగా పెరుగుతుందో లేదో తెల్సుకోవడానికి మరో భారీ నిచ్చెనను దీనిని బిగించారు. ఇంటి పెరట్లో అంతెత్తున పెరుగుతున్న మొక్క అలెక్స్ కుటుంబంలో భాగంగా మారిపోయింది. "2022లో ఉక్రెయిన్‌పై రష్యా దురాక్రమణ మొదలయ్యాక స్వదేశంపై ప్రేమ మరింత పెరిగింది. మారణహోమం అంతమవ్వాలని మేం కోరుకుంటున్నాం"అని అలెక్స్ అన్నారు.

చరిత్రలో సన్‌ఫ్లవర్ మొక్క..

ఉక్రెయిన్‌లో పొద్దుతిరుగుడు సాగు ఎక్కువ. అక్కడి నుంచి భారత్‌కు సైతం సన్‌ఫ్లవర్ నూనె దిగుమతులు ఎక్కువే. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధంలోనూ పొద్దుతిరుగుడు పువ్వు ప్రస్తావన వచ్చింది. యుద్ధం మొదట్లో ఉక్రెయిన్ శివారుభూభాగంలోకి రష్యా సైనికులు చొరబడినప్పుడు అక్కడి ఒక ఉక్రెయిన్ మహిళ అడ్డుకుంది. రష్యా సైనికుడితో.. "కొన్ని పొద్దుతిరుగుడు గింజలు నీ జేబులో వేసుకో. ఇక్కడ నువ్వు చచ్చిపోయి పాతిపెడితే ఆ గింజలు మొలకెత్తి మొక్కగానైనా మళ్లీ పుడతావు"అన్న వీడియో అప్పట్లో సామాజిక మాధ్యమాల్లో తెగ షేర్ అయింది. 1996లోనూ అణ్వస్త్ర నిరాయుధీకరణ కార్యక్రమంలో భాగంగా పెర్వోమిస్క్ క్షిపణి స్థావరంలో అమెరికా, రష్యా, ఉక్రెయిన్ మంత్రులు సన్‌ఫ్లవర్ మొక్కలనే నాటారు. చెర్నోబిల్ న్యూక్లియర్ ఘటన తర్వాత నేలలో రేడియోధార్మికత గాఢత తగ్గించే లక్ష్యంతో అక్కడ ఈ మొక్కలనే శాస్త్రవేత్తలు నాటారు. అలెక్స్ మొక్క కథ త్వరలో 'బ్లూమ్'పేరిట డాక్యుమెంటరీగా రానుంది.

– ఫోర్ట్ వేనీ



పొడుగ్గా పెరిగిన మొక్కను పరిశీలిస్తున్న అలెక్స్

శతసహస్ర జపాన్

1,00,000 చేరువకు శతాధిక వృద్ధులు

టోక్యో: 'శతమానం భవతి' అని పెద్దలు ఆశీర్వదిస్తారు. వందేళ్లు దీర్ఘాయుష్షుతో హాయిగా జీవించాలని కోరుకుంటారు. క్రమశిక్షణతో హాయిగా జీవించే జపాన్‌వాసులకు ఈ 'శతమానం భవతి' ఆశీస్సులు తెలుసోలేదో మనకు తెలీదుగానీ నిజంగానే వాళ్లు వందేళ్లు జీవిస్తున్నారు. ఆరోగ్యవంతులకు చిరునామాగా నిలిచే జపాన్‌లో శతాధిక వృద్ధుల సంఖ్య రికార్డ్ స్థాయిలో పెరిగిందని తాజా గణాంకాల్లో తేలింది. ఇప్పుడు జపాన్ వ్యాప్తంగా వందేళ్ల వయసు పైబడిన పౌరుల సంఖ్య దాదాపు 1,00,000 అని అక్కడి ప్రభుత్వ గణాంకాలు తాజాగా పేర్కొన్నాయి. ఇలా శతాధిక వృద్ధుల సంఖ్య ప్రతి ఏటా పెరుగుతూ పోవడం ఇది వరసగా 55వ సంవత్సరం కావడం విశేషం. ఇది కూడా ఒక రికార్డే. "అత్యంత ఖచ్చితంగా చెప్పాలంటే శుక్రవారం నాటికి దేశంలో వందేళ్లుదాటిన వృద్ధుల సంఖ్య 99,763. అందులో 88 శాతం మంది మహిళలే" అని ప్రభుత్వ అధికారి ఒకరు వెల్లడించారు. ప్రపంచవ్యాప్తంగా చూస్తే మనిషి అత్యధిక ఆయుర్దాయం జపాన్‌లోనే నమోదవుతోంది. జపాన్‌వాసులు ఎక్కువ కాలం జీవిస్తున్నట్లు తేలింది. ప్రస్తుతం వయసుపరంగా ప్రపంచంలో అత్యంత వృద్ధుడు సైతం జపాన్‌పౌరుడే కావడం గమనార్హం. ఇంత ఆరోగ్యవంతులున్న జపాన్‌లో అత్యల్ప జననరేటు నమోదుకావడం విచిత్రం. జపాన్‌లో అత్యంత వృద్ధ మహిళగా నరా సిటీలోని యమటోకొరియమా ప్రాంతానికి చెందిన షిగెమో కగవా రికార్డులకు ఎక్కారు. ఈమె వయసు 114 సంవత్సరాలు. ఇవాటా తీరపట్టణంలో జీవించే కియోటమా మిజినోను పురుషుల్లో అత్యంత వృద్ధుడిగా పేర్కొంటారు. ఈయన వయసు 111 సంవత్సరాలు.

87,784 మంది మహిళలే

మొత్తం 99,763 మంది శతాధిక వృద్ధుల్లో 87,784 మంది మహిళలే కావడం విశేషం. "వందేళ్లు పైబడిన వారిలో 11,979 మంది పురుషులు ఉన్నారు. తమ జీవనకాలమంతా జపాన్ అభివృద్ధి కోసం పాటుపడుతున్న వీళ్లందరినీ చూస్తుంటే నాకెంతో గర్వంగా ఉంది" అని జపాన్ ఆరోగ్య శాఖ మంత్రి తకమరో ఫుకోకా వ్యాఖ్యానించారు. జపాన్‌లో ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 15వ తేదీన జరిపే "వృద్ధుల దినోత్సవం"ను పురస్కరించుకుని 'సెంచరీ' కొట్టిన పౌరుల జాబితాను ప్రభుత్వం ప్రకటించింది. ఎల్డర్స్ డేను జపాన్ జాతీయ దినోత్సవంగా నిర్వహిస్తోంది. ఇందులోభాగంగా ఈ ఏడాది సెంచరీ కొట్టిన వాళ్లకు స్వయంగా దేశ ప్రధాని నుంచి ప్రశంసా పత్రం, వెండి కప్ బహుమతిగా అందనుంది. ఈ ఏడాది ఏకంగా 52,310 మందిని సత్కరించి ఈ పత్రం, కప్‌ను బహూకరించనున్నారు.

గతంతో పోలిస్తే మెరుగైన సంఖ్య

1960వ దశకంలో వందేళ్లుపైబడిన పౌరుల సంఖ్య జపాన్‌లో చాలా అత్యల్పంగా ఉండేది. 1963లో చేసిన ఒక సర్వే ప్రకారం దేశంలో కేవలం 153 మంది మాత్రమే 'సెంచరీ' కొట్టారు. 1981 ఏడాదికి వచ్చేసరికి ఈ సంఖ్య తొలిసారిగా వేయి దాటింది. 1998 ఏడాదికల్లా ఈ సంఖ్య 10,000 దాటింది. దీంతో జపాన్‌లో ఆయుర్దాయం పెరిగిన విషయం ఆధారసహితంగా స్పష్టమైంది. ప్రపంచవ్యాప్తంగా మారిన జీవనశైలి, కాలుష్యం ఇతరత్రా కారణాలతో ప్రజలకు హృద్రోగం, క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, ప్రోస్టేట్ క్యాన్సర్‌ల ముప్పు ఎన్నో రెట్లు పెరిగింది. ఈ వ్యాధుల బారినపడి ప్రాణాలు కోల్పోతున్న ప్రజల సంఖ్య అనూహ్యంగా ఎక్కువైంది. కానీ జపాన్‌లో ఈ వ్యాధుల బెడద చాలా తక్కువ. దీంతో మరణాల సంభవం తగ్గిపోయింది.

ఆరోగ్యమయ విధానాలకు జై

సంప్రదాయ ఆహారం, వ్యాయామం వంటి ఆరోగ్యమయ పద్ధతులను జపాన్‌వాసులు తూ.చ.తప్పకుండా పాటిస్తూ వ్యాధుల బారిన పడకుండా తప్పించుకుంటూ హాయిగా వందేళ్లు జీవిస్తున్నారు. క్యాన్సర్లు, గుండె జబ్బులకు అధిక బరువుతో అవినాభావ సంబంధం ఉంది. ఈ సంబంధం ఏర్పడకుండా జపాన్ వాసులు ఒబెసిటీకి ఆమడదూరంలో ఉండిపోతున్నారు. మేక, గొర్రె, వేటమాంసం తక్కువ తింటూ ఆకుకూరలు, కూరగాయలు, చేపలు అధికంగా తీసుకుంటున్నారు. ముఖ్యంగా మహిళల్లో ఒబెసిటీ సమస్యలు చాలా తక్కువగా ఉన్నాయి. అందుకే శతాధిక వృద్ధుల్లో 88 శాతం వాళ్లే ఉన్నారు. ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాల ప్రజలను చక్కెర, ఉప్పు చుట్టేసి చుక్కలు చూపిస్తుంటే జపాన్ ప్రభుత్వం మాత్రం ప్రజలు ఉప్పు వాడకాన్ని తగ్గించాలని ప్రచారం భారీ ఎత్తున మొదలెట్టి దాదాపు సఫలీకృతమైంది. అధిక ఉప్పు అనర్థాలపై జపాన్‌వాసుల్లో ప్రభుత్వం అవగాహన పెంచింది. వృద్ధాప్యఛాయలు వచ్చాక కూడా అక్కడి ప్రజలు విశ్రాంతి తీసుకోరు. వ్యక్తిగత, వృత్తిగత వ్యాపకాలతో ఎప్పుడూ బిజీగా ఉంటారు. దీంతో అధిక కొవ్వు ఈ అధిక శ్రమతో కరిగిపోయి అధికబరువు సమస్యల వలయంలో చిక్కుకుపోరు.

1928 నుంచి దైనందినం..

1928 నుంచి జపాన్‌లో దైనందిన బృంద సాధన అనేది అక్కడ నిత్యకృత్యమైంది. రేడియో టైసో అనే కార్యక్రమం అక్కడ విశేష ఆదరణ పొందింది. సమాజం సమూహంగా బతకాలని, ప్రజారోగ్యంపై దృష్టిపెట్టాలని బోధిస్తూ సాగే టీవీ కార్యక్రమం అది. రోజూ కేవలం మూడు నిమిషాలపాటు సాగే ఈ టెలివిజన్ కార్యక్రమాన్ని జపాన్‌వాసులు తప్పక ఆచరిస్తారు. చేతులు,కాళ్లు ముందుకు వెనక్కి చాపడం వంటి చిన్న చిన్న వ్యాయామాలను అందులో సూచిస్తారు. రోజూ వాటిని చేసి, మళ్లీ ఖాళీ సమయాల్లోనూ వ్యాయామం చేయడంతో అక్కడి ప్రజల్లో ఆరోగ్యస్పృహ పెరిగిపోయింది. ఇలా జపాన్ వాసులు ఎన్నో దేశాలకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. "లేజీగా ఒళ్లు పెంచుకోక, నాజుగ్గా ఉండు తీగలాగ" అనే సినీకవి వ్యాఖ్యలను ఇకనైనా మెజారిటీ భారతీయులు ఆచరిస్తారేమో చూడాలిమరి.

జాలీగా 'జోలోఫ్ రైస్'

గిన్నిస్ ప్రపంచ రికార్డ్ దిశగా భారీ వంటకం

4,000 కేజీల బియ్యం, 1,200 కిలోల టమాట పేస్ట్, 600 కేజీల ఉల్లిగడ్డల వినియోగం

గిన్నిస్ ప్రపంచ రికార్డ్ సృష్టించాలంటే అద్వితీయ, అసాధారణ ఫీట్ చేయాల్సిందే. అతిభారీ వంటకంతో గిన్నిస్ పుస్తకంలోకి నేరుగా ఎక్కేయాలని నైజీరియా పాకశాస్త్ర ప్రవీణురాలు హిల్డా బకీ సిద్ధమయ్యారు. అనుకున్నదే తడవుగాజోలోఫ్ రైస్‌వంటకానికి కావాల్సి దినుసులన్నీ సమకూర్చుకుని అతి భారీ వంటకాన్ని తయారుచేశారు. ఇప్పటికే నమోదైన రికార్డ్‌తో పోలిస్తే ఇది పెద్దది కావడంతో అనధికారికంగా ఈ రికార్డ్‌ను బద్దలుకొట్టినట్టేలెక్క. ఇక ఈ రికార్డ్‌ను గిన్నిస్ పుస్తకం ప్రతినిధులు అధికారికంగా ధృవీకరించడమే తరువాయి. ఈ రికార్డ్ ఫీట్‌కు నైజీరియాలోని విక్టోరియా ద్వీపంలోని ఎకో హోటల్స్ అండ్ సూట్స్ వేదికైంది. ఈ భారీ వంటకాన్ని కళ్లారా చూసేందుకు, నోరారా రుచి చూసేందుకు వందలాది మంది భోజన ప్రియులు బారులుతీరారు. శుక్రవారం ఈ కార్యక్రమం జరిగింది.

సమన్వయంతో.. సమపాళ్లలో..

హిల్డా బకీ గతంలోనే ఏకధాటిగా 93 గంటలకుపైగా వంటచేసి గిన్నిస్ ప్రపంచ రికార్డును సృష్టించారు. కానీ అవన్నీ వేర్వేరు చిన్నపాటి వంటకాలు. కానీ ఇది వేలకేజీల ఒకే వంటకం. అదికూడా నైజీరియా దేశ సంప్రదాయ 'జోలోఫ్ రైస్'వంటకం. మేకమాంసం, బియ్యం, టమాటా పేస్ట్‌తో చేసే స్థానిక వంటకం. ఫుడ్ ఇన్‌ఫ్లూయెన్సర్‌గా, సెలబ్రిటీగా హిల్డా ఇప్పటికే మహా క్రేజ్ సంపాదించుకున్నారు. దీంతో ఈమె చేసే వంటకంపై స్థానికంగా అంచనాలు భారీగా పెరిగాయి. అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా ఆమె ఏకంగా 300 మంది సహాయకులు పేద్ద బృందాన్ని ఏర్పాటుచేసుకున్నారు. కనీసం ఏడాది క్రితమే ఈ భారీ వంటకం కోసం ప్రణాళికలు సిద్ధంచేశారు. కనీసం రెండు నెలలుగా ఈమె బృందం అహర్నిశలు కష్టపడి అన్ని రకాల మేలుజాతి సరకులను తెప్పించి వంటకోసం సిద్ధంచేసుకుంది. 4,000 కేజీల బియ్యం, 1,200 కేజీల టమాట పేస్ట్, 600 కేజీల ఉల్లిగడ్డలు, 6,000 లీటర్ల మంచినీరు, 168 కేజీల మేకమాంసం, 700 కేజీల వంటనూనెలతో వంటకాన్ని సిద్ధం చేశారు. ఇంతపెద్ద వంట వండేందుకు అదే స్థాయి అతిపెద్ద స్టీల్ పాత్ర అవసరం. అందుకే 23,000 లీటర్ల సామర్థ్యముండే స్టీల్ పాత్రనూ ప్రత్యేకంగా తయారుచేయించారు. "వంటకోసం అన్ని సిద్ధమైనా అంతటి దినుసులు, బియ్యాన్ని తిప్పే గరిటెలు లేవు. అందుకే భారీ దుంగలను గరిటెల్లాగా తయారుచేశాం"అని పాకశాస్త్ర ప్రవీణురాలు హిల్డా బకీ చెప్పారు. "నాలుగేళ్ల క్రితం ఒక వంటల పోటీలో ఇదే జోలోఫ్ రైస్ వంటకం అద్భుతంగా వండి ఫస్ట్ ప్రైజ్ గెల్చుకున్నా. ఆ తర్వాత 2023 ఏడాదిలో ఏకబిగిన 93 గంటల 11 నిమిషాలు ఆగకుండా పలురకాల వంటటుచేసి గిన్నిస్ ప్రపంచ రికార్డ్ బద్దలుకొట్టా"అని ఆమె చెప్పారు. "ఎకో హోటల్స్ అండ్ సూట్స్‌లో వంటకం వండట్లేరు. రికార్డ్‌ను వండుతున్నారు. చూసొద్దాం. కుదిరితే మన ఫేవరెట్ జోలోఫ్ రైస్ తినొద్దాం"అంటూ పలువురు నెటిజన్లు ఈమెకు ఆన్‌లైన్‌లో తెగ మద్దతు ప్రకటించారు. అన్ని దినుసులు సిద్ధంచేసుకుని వంట మొదలెట్టాక కేవలం 9 గంటల్లోనే వంట పూర్తిచేయడం విశేషమని పలువురు పొగిడారు. "ఈమె క్రమశిక్షణ, సృజనాత్మకత నుంచి యువత ఎంతో నేర్చుకోవాలి. దేశ సంప్రదాయ వంటకానికి ప్రపంచస్థాయి గుర్తింపు తెస్తున్న ఈమెకు నా ఆశీస్సులు"అని నైజీరియా సమాచార శాఖ మంత్రి మొహమ్మద్ ఇద్రీస్ అన్నారు.

– సాక్షి, నేషనల్ డెస్క్



జోలోఫ్ రైస్ తయారీ ప్రక్రియలో నిమగ్నమైన వంటగాళ్లు

ఆ ఆరోపణలను వ్యక్తిగత రికార్డుల్లో చూపాలి

పశ్చిమ బెంగాల్ వర్సిటీ వీసీకి సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ: తప్పు చేసిన వ్యక్తిని క్షమించడం మంచిదే కానీ, తప్పును మాత్రం మర్చిపోరాదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న పశ్చిమబెంగాల్‌లోని ఓ వర్సిటీ వైస్ చాన్సెలర్(వీసీ) ఆ విషయాన్ని వ్యక్తిగత వివరాల్లో పొందపర్చాలని ఆదేశించింది. తద్వారా తాను చేసిన తప్పు ఆయన్ను ఎప్పటికీ వెంటాడుతూనే ఉంటుందని పేర్కొంది. జస్టిస్ పంకజ్ మిట్టల్, జస్టిస్ ప్రసన్న బీ వరాలేల ధర్మాసనం ఈ మేరకు శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. బెంగాల్‌లోని ఓ వర్సిటీ వీసీ 2019 సెప్టెంబర్‌లో ఫ్యాకల్టీ సభ్యురాలు ఒకరికి తనతోపాటు డిన్నర్ చేస్తే వ్యక్తిగతంగా చాలా లాభాలుంటాయని చెప్పారు. కాదంటే తీవ్ర పరిణామాలుంటాయని బెదిరించారు. 2023 ఏప్రిల్ వరకు పలుమార్లు బెదిరింపులకు గురిచేశారు. అదే ఏడాది ఆగస్టులో ఆమెను విధుల్లోంచి తొలగించారు. అయితే, వీసీ తనపై అత్యాచారానికి పాల్పడ్డారంటూ 2023 డిసెంబర్‌లో బాధితురాలు వర్సిటీ కంప్లెయింట్ కమిటీకి ఫిర్యాదు చేశారు. నిర్ణీత మూడు నెలల కాలపరిమితి ముగిసినందున ఫిర్యాదు చెల్లదంటూ కమిటీ స్పష్టం చేసింది. దీన్ని సవాల్ చేస్తూ బాధితురాలు హైకోర్టును ఆశ్రయించగా అక్కడే ఇదే తీర్పు వచ్చింది. దీంతో, ఆమె సుప్రీంలో పిటిషన్ వేశారు. విచారించిన ధర్మాసనం వర్సిటీ కంప్లెయింట్ కమిటీ, హైకోర్టు నిర్ణయాలను సమర్థించింది. అయితే, వీసీ అత్యాచారం చేయడం తప్పేనని పేర్కొంది. ఆయన తన తప్పును వ్యక్తిగత రికార్డుల్లో నమోదు చేయాలని తెలిపింది. పిటిషనర్‌ను విధుల నుంచి తొలగించడానికి, లైంగిక వేధింపులకు ఎటువంటి సంబంధం లేదని కూడా ధర్మాసనం స్పష్టం చేసింది.

లండన్‌లో భారీ వలసవ్యతిరేక ర్యాలీ

లండన్: ఇటీవలికాలంలో బ్రిటన్ చరిత్రలోనే తొలిసారిగా వలసదారులకు వ్యతిరేకంగా లండన్‌లో శనివారం భారీ నిరసన ప్రదర్శన జరిగింది. తమ దేశంలోకి వలసలను అడ్డుకోవాలంటూ ఏకంగా 1,00,000 మందికిపైగా నిరసనకారులు ఆందోళనకు దిగారు. వలస అనుకూల ప్రభుత్వ విధానాలను తప్పుబడుతూ ఆందోళనకారులు చేసిన నినాదాలతో లండన్ వీధులు మార్మోగిపోయాయి. ప్రధాన రహదారి గుండా సాగిన ఈ భారీ నిరసన ర్యాలీలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరక్కుండా చూసేందుకు పోలీసులు సైతం పెద్దమొత్తంలో మొహరించారు.

రాతప్రతులకు రాజయోగం

పురాతన రాతప్రతులను పరిరక్షించాలంటూ 'జ్ఞానభారతం' సదస్సులో తీర్మానం

న్యూఢిల్లీ: పురాతన తాళపత్ర గ్రంథాలు, పుస్తకాలు, లేఖనాలు, స్వదస్తూరీలు, వస్త్ర శాసనాలు, రాతప్రతుల్లో నిక్షిప్తమైన భరతజాతి చరిత్రను పరిరక్షించాలని ఢిల్లీలో ముగిసిన 'జ్ఞానభారతం' విశ్వ సదస్సులో తీర్మానించారు. 'ప్రాచీన గ్రంథాలు మన భవిష్యత్తుకు దారిదీపాలు. అలాంటి అపురూప, అమూల్యమైన గ్రంథ, రచన సంపదను సజీవంగా నిలపాల్సిన బాధ్యత మనపై ఉంది. ఇప్పటికే అందుబాటులో ఉన్న రాతప్రతులు జీర్ణమై అంతర్ధానమైపోకుండా కాపాడుకుందాం. నాటి మహానుభావుల కృషి, జీవనసారం, జ్ఞానసంపదకు తమలో ఇముడ్చుకున్న ఈ రాతప్రతులను డిజిటైజ్ చేయాలి'అని విద్యావేత్తలు, పరిశోధకులు, నిపుణులు ఉద్ఘాటించారు. ఢిల్లీలోని విజ్ఞాన్‌భవన్‌లో మూడ్రోజులుగా జరుగుతున్న 'జ్ఞానభారతం' సదస్సు శనివారం ముగిసిన సందర్భంగా ఈ తీర్మానం చేశారు. 'ఈ ఉత్కృష్టమైన జ్ఞానభాండాగారాలు మన భారతదేశ ఉనికి సజీవ సాక్ష్యాలు. ప్రాచీన నాగరికతకు పట్టుగొమ్మలు. ఇలాంటి రాతప్రతులు దేశంలోనేకాదు విదేశాల్లో ఎక్కడున్నాసరే అన్నింటినీ తెప్పించి పరిరక్షించాలి. వాటినన్నింటినీ డిజిటైజ్‌చేసి డిజిటల్ కాపీలుగా భద్రపరచాలి. దీంతో భవిష్యత్ తరాల పరిశోధనకు బాటలు పడతాయి' అని తీర్మానించారు. దేశ, విదేశాల్లో విద్యాసంస్థలు, మ్యూజియంలు, గ్రంథాలయాలు, ప్రైవేట్ వ్యక్తుల అధీనంలోఇని కోటికిపైగా రాతప్రతులపై సర్వే, డాక్యుమెంటేషన్, డిజిటైజ్‌తోపాటు భావి తరాలు వాటిని చూసి కొత్త విషయాలు తెల్సుకునేలా అందరికీ అందుబాటులోకి తెచ్చే సదుద్దేశంతో మోదీ సర్కార్ ఇటీవల జ్ఞానభారతం మిషన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం తెల్సిందే.

రష్యాలో మరోసారి భూకంపం

మాస్కో: రష్యాలోని తూర్పు తీర ప్రాంత కమ్‌చట్కాను శనివారం ఉదయం భారీ భూకంపం కుదిపేసింది. దీని తీవ్రత రిక్టర్ స్కేలుపై 7.4గా నమోదైందని యూఎస్ జియలాజికల్ సర్వే తెలిపింది. పెట్రోపావ్‌లోవ్స్క్- కమ్‌చట్‌స్కీలకు తూర్పున 111.7 కిలోమీటర్ల దూరంలో భూమికి 39 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం ఉందని వివరించింది. ఆస్తి, ప్రాణనష్టానికి సంబంధించిన సమాచారం ఇప్పటి వరకు లేదు. ఈ భూకంపం ప్రభావంతో సునామీ సంభవించే అవకాశముందని పసిఫిక్ సునామీ వార్నింగ్ సిస్టమ్ తెలిపింది. కొద్దిసేపటి తర్వాత ఆ హెచ్చరికను ఉపసంహరించుకుంది. సముద్ర నీటి మట్టాలు స్వల్పంగా పెరిగే అవకాశముందని తమ తీర ప్రాంతాలకు హెచ్చరికలు జారీ చేశామని జపాన్ వాతావరణ విభాగం కూడా తెలిపింది. అయితే, దీని వల్ల ఎలాంటి నష్టం వాటిల్లే అవకాశాలు లేవని పేర్కొంది. కమ్చట్కా ద్వీపంలో జూలై 20వ తేదీన ఐదు శక్తివంతమైన భూకంపాలు సంభవించడం తెల్సిందే.

పాక్ సైన్యం, టీటీపీ మధ్య భీకరపోరు

19 మంది జవాన్లు, 45 మంది ఉగ్రవాదులు మృతి

పెషావర్: పాకిస్తాన్‌లో ఖైబర్ పఖ్తూన్‌ఖ్వా ప్రావిన్స్‌లో సైన్యానికి, నిషేధిత తెహ్రీక్-ఇ-తాలిబాన్‌పాకిస్తాన్(టీటీపీ) ఉగ్రవాదులకు మధ్య భీకరపోరు కొనసాగుతోంది. నాలుగు రోజులుగా జరుగుతున్న పోరాటంలో కనీసం 19 మంది సైనికులు, 45 మంది ఉగ్రవాదులు చనిపోయారని ఆర్మీ తెలిపింది. బజౌర్ జిల్లాలో ఆర్మీ చేపట్టిన ఆపరేషన్ సందర్భంగా చోటుచేసుకున్న ఎదురుకాల్పుల్లో 22 మంది ఉగ్రవాదులు హతమయ్యారు. దక్షిణ వజీరిస్తాన్‌లో జరిగిన మరో ఎన్‌కౌంటర్‌లో 13 మంది టెర్రరిస్టులు మృతి చెందారు. ఉగ్రవాదుల ఆత్మాహుతి దాడిలో 12 మంది సైనికులు ప్రాణాలు కోల్పోయారు. గురువారం లాల్ ఖిల్లా మైదాన్ ప్రాంతంలో జరిగిన ఎదురుకాల్పుల్లో ఏడుగురు సైనికులు, 10 మంది ఉగ్రవాదులు మృతి చెందారు. ఎన్‌కౌంటర్‌ల అనంతరం ఆయా ప్రాంతాల్లో భారీగా ఆయుధాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.

మేఘాలయ మాజీ సీఎం లపాంగ్ కన్నుమూత

షిల్లాంగ్: సీనియర్ రాజకీయ నాయకుడు, మేఘాలయ మాజీ ముఖ్యమంత్రి డొన్వా డెత్‌వెల్సన్ లపాంగ్ కన్నుమూశారు. ఆయన వయస్సు 93 ఏళ్లు. మహెహ్‌గా అందరూ పిలుచుకునే డీడీ లపాంగ్ మేఘాలయకు నాలుగు పర్యాయాలు సీఎంగా సేవలందించారు. మేఘాలయ ప్రభుత్వం సోమవారం అధికారిక లాంఛనాలతో ఆయన అంత్యక్రియలను నిర్వహించనుంది. వయో సంబంధ ఆరోగ్య సమస్యలతో ఆయన చాలా కాలంగా ఇబ్బందిపడుతున్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం కన్నుమూశారని కుటుంబ సభ్యులు తెలిపారు. డీడీ లపాంగ్‌కు భార్య, ఇద్దరు సంతానం. అన్ని రంగాలకు చెందిన వారు నాంగ్‌పోహ్‌లోని లపాంగ్ నివాసానికి వెళ్లి నివాళులర్పించారు. 1932లో జన్మించిన లపాంగ్ చిన్నతనంలో తల్లి నడిపే టీకొట్టులో పనిచేశారు. కార్మికుడిగా, ఉపాధ్యాయుడిగా, ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేశారు. 1972లో రాజకీయ రంగ ప్రవేశం చేశారు. అదే ఏడాది స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచి నాంగ్‌పోహ్ అసెంబ్లీ స్థానాన్ని గెలుచుకున్నారు. 1992-2010 సంవత్సరాల మధ్య నాలుగు పర్యాయాలు సీఎంగా పనిచేశారు. మొదట్నుంచీ కాంగ్రెస్‌లోనే కొనసాగిన లపాంగ్ 2018లో నేషనల్ పీపుల్స్ పార్టీలో చేరారు. రాష్ట్ర ప్రభుత్వానికి ప్రధాన సలహాదారుగా పనిచేశారు.

హిమాచల్‌లో మళ్లీ గర్జించిన మేఘం

సిమ్లా: హిమాచల్‌ప్రదేశ్‌లో శనివారం ఉదయం మరోసారి మేఘ విస్ఫోటం సంభవించింది. నైనాదేవి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని ఉగ్రహాస్ గ్రామంలో తెల్లవారు జామున 3 గంటల వేళ క్లౌడ్ బరస్ట్ చోటుచేసుకుంది. ఆకస్మిక వరదలతో భారీగా మట్టి, బురద, వ్యర్థాలు కొట్టుకుపోయి పంటపొలాల్లో మేటలు వేశాయి. నాలుగు వాహనాలు బురదలో కూరుకుపోయాయి. అదేవిధంగా, చంబా జిల్లాలోని కమ్లారి, ఘటాస్ని గ్రామాల్లో ఆరు ఇళ్లు, హమీర్‌పూర్ జిల్లా దళిత్‌బస్తీలో మూడిళ్లు దెబ్బతిన్నాయి. రాజధాని సిమ్లాలో దట్టంగా మంచు కురియడంతో దృగ్గోచరత సరిగా లేక వాహనదారులు ఇబ్బందిపడ్డారు. మూడోనంబర్ జాతీయ రహదారిలోని అట్టారీ-లేహ్ సెక్షన్‌ను, 305వ నంబర్ జాతీయ రహదారిలోని ఔట్-సయింజ్ సెక్షన్, 503ఏ జాతీయ రహదారిలోని అమృత్‌సర్-భోటా సెక్షన్ సహా రాష్ట్రంలోని 561 రహదారులను దెబ్బతిన్న కారణంగా మూసివేశారు.

గంటకు 160 కి.మీ. వేగంతో 'నమో భారత్'

సాక్షి, న్యూఢిల్లీ: 'నమో భారత్'రైలు గంటకు రూ.160 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించి రికార్డు నెలకొల్పింది. ఈ రైలు స్పీడ్‌లో వందేభారత్‌ను అధిగమించినట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఢిల్లీ-మీరట్ మధ్య 84 కిలోమీటర్ల కారిడార్‌లో 'నమో భారత్'గంటకు 160 కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్లి, దేశంలోనే అత్యంత వేగవంతమైన రైలుగా రికార్డు నెలకొల్పింది. ఇప్పటి వరకు 'గతిమాన్ ఎక్స్‌ప్రెస్, వందేభారత్'రైళ్లు హైస్పీడ్‌గా నడుస్తాయని ఉన్న పేరును నమో భారత్ చెరిపేసినట్లయింది.

మధ్యప్రదేశ్ సీఎంకు తప్పిన ప్రమాదం

సాక్షి, న్యూఢిల్లీ: మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి డాక్టర్ మోహన్ యాదవ్‌కు పెనుప్రమాదం త్రుటిలో తప్పింది. ఓ కార్యక్రమంలో భాగంగా శనివారం మంద్‌సౌర్‌లోని గాంధీనగర్ ఫారెస్ట్ రిట్రీట్ వద్ద ఆయన హాట్ ఎయిర్ బెలూన్‌ను ఎక్కేందుకు సిద్ధపడ్డారు. ఈ బెలూన్‌లో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. భద్రత సిబ్బంది స్పందించి ఆ మంటలను అదుపు చేయడంతో ముఖ్యమంత్రికి ప్రమాదం తప్పింది. బెలూన్‌ను పరిశీలించేందుకు అక్కడకు సీఎం వచ్చారని, అక్కడేమీ మంటలు రాలేదని మంద్‌సౌర్ కలెక్టర్ అదితి గర్గ్ వివరణ ఇవ్వడం గమనార్హం.

చిరుతపులి దాడిలో చిన్నారి మృతి

కొట్‌ద్వార్(ఉత్తరాఖండ్): చిరుతపులి దాడిలో నాలుగేళ్ల చిన్నారి ప్రాణాలు కోల్పోయింది. ఉత్తరాఖండ్‌లోని పౌడీ జిల్లా చౌబట్టఖల్ ప్రాంతంలో ఈ విషాదం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన నాలుగేళ్ల బాలిక ఇంటి ముందు ఆడుకుంటుండగా అటవీ ప్రాంతం నుంచి వచ్చిన చిరుత దాడి చేసింది. ఆమెను నోట కరిచి ఎత్తుకెళ్తుండగా గమనించిన తల్లి కేకలు వేస్తూ చిరుత వెంట పరుగెత్తింది. ఇంటి నుంచి బాలికను 50 మీటర్ల దూరంలోని పొలాల్లోకి లాక్కెళ్లింది. గ్రామస్తులు, కుటుంబసభ్యులు కేకలు వేస్తూ వెంటపడటంతో చిరుత చిన్నారిని వదిలేసి అడవిలోకి పారిపోయింది. కుటుంబసభ్యులు వెళ్లే సరికే చిన్నారి ప్రాణాలు కోల్పోయిందని గఢ్వాల్ సర్కిల్ అటవీ అధికారి ఆకాశ్ వర్మ తెలిపారు. ఈ నెల 17వ తేదీన ఆ చిన్నారి పుట్టిన రోజు వేడుక జరిపేందుకు ముంబై నుంచి వచ్చిన తండ్రి జితేంద్ర సింగ్ రావత్ ఏర్పాట్లు చేస్తుండగా ఈ విషాదం చోటుచేసుకుందన్నారు.

భారతదేశం.. రాష్ట్రాల యూనియన్

భారత భూభాగం – భారత యూనియన్

రాష్ట్రాల ఏర్పాటు-పునర్ వ్యవస్థీకరణ

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

పాలిటీ

భారత దేశంలో సమాఖ్య వ్యవస్థ ఉంది. కేంద్ర, రాష్ట్రాలు రాజ్యాంగ పరంగా అధికార విభజన సూత్రం ఆధారంగా పనిచేస్తాయి. సమాఖ్య, రాష్ట్రాల ఏర్పాటు, పునర్ వ్యవస్థీకరణ తదితర అంశాలను ఒకటో భాగంలో ప్రకరణలు 1 నుంచి 4 వరకు ప్రస్తావించారు.

భారత భూభాగం

ప్రకరణ-1

ఈ ప్రకరణ ప్రకారం, భారత భూభాగం అంటే రాష్ట్రాల సరిహద్దులు, కేంద్రపాలిత ప్రాంతాలు, కేంద్ర ప్రభుత్వం సముపార్జించిన ఇతర భూభాగాలు ఉంటాయి.

భారత భూభాగం అనే భావన విస్తృతమైంది. భారత సార్వభౌమాధికారం ఏ విధంగా విస్తరించి ఉంటుందో తెలుపుతుంది. భారత సార్వభౌమాధికారం భౌగోళిక ప్రాంతాలకే పరిమితం కాదు. భారత సముద్ర ప్రాదేశిక జలాలు 12 నాటికల్ మైళ్ల వరకు, విశిష్ట ఆర్థిక మండళ్లు 200 నాటికల్ మైళ్ల వరకు, అలాగే భారత అంతరిక్ష సరిహద్దులకూ సార్వభౌమాధికారం వర్తిస్తుంది.

భారత యూనియన్

ఇందులో రాష్ట్రాలు మాత్రమే ఉంటాయి. రాష్ట్రాలు సమాఖ్యలో అంతర్భాగంగా ఉంటూ నిర్ణీత అధికారాలను కలిగి ఉంటాయి. ఈ పదం కేంద్ర రాష్ట్ర సంబంధాలను సూచిస్తుంది.

రాష్ట్రాల సమ్మేళనం

భారత రాజ్యాంగం, ఒకటో ప్రకరణలో భారతదేశాన్ని రాష్ట్రాల యూనియన్‌గా పేర్కొంది. సమాఖ్య అనే పదాన్ని ఎక్కడా ప్రస్తావించలేదు. కెనడా సమాఖ్యను స్ఫూర్తిగా తీసుకుని యూనియన్ అనే పదాన్ని రాజ్యాంగంలో చేర్చారు.

భారత సమాఖ్య అమెరికాలా రాష్ట్రాల మధ్య ఒప్పందం ద్వారా ఏర్పడలేదు. అలాగే కెనడా మాదిరిగా ఏకకేంద్ర రాజ్యం సమాఖ్యగా విభజితమవలేదు. భారత సమాఖ్య ఒక ప్రత్యేక పద్ధతిలో ఏర్పడింది.

కేంద్ర రాష్ట్రాల మధ్య ఒప్పందం లేదు. కాబట్టి యూనియన్ నుంచి రాష్ట్రాలు విడిపోలేదు. అమెరికా సమాఖ్యలో ప్రారంభంలో రాష్ట్రాలకు కేంద్రం నుంచి విడిపోయే హక్కు ఉండేది. అయితే ఆ హక్కును తర్వాత రద్దు చేశారు.

కాబట్టి భారత సమాఖ్యను విచ్ఛిన్నం కాగల రాష్ట్రాల, అవిచ్ఛిన్న యూనియన్ (ఇన్ డెస్ట్రక్టిబుల్ యూనియన్ ఆఫ్ డెస్ట్రక్టిబుల్ స్టేట్స్)గా పేర్కొంటారు. అమెరికాను ఇన్‌డెస్ట్రక్టిబుల్ యూనియన్ ఆఫ్ ఇన్‌డెస్ట్రక్టిబుల్ స్టేట్స్‌గా పేర్కొంటారు.

ప్రకరణ-2

ఈ ప్రకరణ ప్రకారం పార్లమెంటు ఒక చట్టం ద్వారా కొత్త ప్రాంతాలను చేర్చుకోవచ్చు, ఇతర దేశాలకు బదిలీ చేయవచ్చు. ఈ అధికారం భారత భూభాగంలో లేని అంశాలకు వర్తిస్తుంది. ఈ అధికారం పార్లమెంటుకు సంబంధించినదైనా అంతర్జాతీయ ఒప్పందాలకు లోబడి ఉంటుంది.

వివరణ..

విదేశీ భూభాగాలను భారతదేశంలో చేర్చుకున్నప్పుడు పార్లమెంటు ప్రత్యేక మెజారిటీతో రాజ్యాంగ సవరణ చేయాలి.

ఉదాహరణ: 1961లో గోవాను భారత్‌లో కలిపినప్పుడు 12వ రాజ్యాంగ సవరణ చేశారు. అలాగే పాండిచ్చేరికి సంబంధించి 1962లో 14వ రాజ్యాంగ సవరణ చేశారు. 1975లో 36వ రాజ్యాంగ సవరణ ద్వారా సిక్కింను భారత రాష్ట్రంగా చేర్చుకున్నారు.

ప్రకరణ-3

ఇందులో కింది అంశాలు ఉన్నాయి.

- కొత్త రాష్ట్రాన్ని ఏర్పాటు చేయడం.
- రెండు లేదా అంతకంటే ఎక్కువ రాష్ట్రాలను కలిపి నూతన రాష్ట్రం ఏర్పాటు.(ఆంధ్ర రాష్ట్రం, హైదరాబాద్ కలయికతో 1956లో ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు). అలాగే రాష్ట్రాన్ని విడగొట్టి కొత్త రాష్ట్రం ఏర్పాటు చేయడం. (2014 జూన్‌లో ఏర్పడిన తెలంగాణ)
- రాష్ట్ర విస్తీర్ణాన్ని పెంచవచ్చు.
- రాష్ట్ర విస్తీర్ణాన్ని తగ్గించవచ్చు.
- రాష్ట్ర సరిహద్దులను సవరించవచ్చు.
- రాష్ట్రాల పేర్లను మార్చవచ్చు.

రాష్ట్రాల ఏర్పాటు - ప్రక్రియ- పద్ధతి

ప్రకరణ 3లో పేర్కొన్న అన్ని అంశాలకు ఒకే ప్రక్రియ ఉంటుంది.

- పై అంశాలకు సంబంధించిన బిల్లును పార్లమెంటులోని ఏ సభలోనైనా ప్రవేశపెట్టవచ్చు.

వివరణ..

రాష్ట్ర పునర్ వ్యవస్థీకరణ బిల్లులో ఆర్థిక వనరుల పంపకాలు ఉంటే అది స్పెషల్ కేటగిరీ బిల్లు అవుతుంది. అలాంటి సందర్భాల్లో బిల్లును లోక్‌సభలోనే ప్రతిపాదించాలి. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు విషయంలో ఈ వివాదాన్ని గమనించవచ్చు.

- పై బిల్లులను రాష్ట్రపతి పూర్వ అనుమతితోనే ప్రవేశపెట్టాలి.
- ఈ షరతును 1955లో అయిదో రాజ్యాంగ సవరణ ద్వారా చేర్చారు.
- సంబంధిత బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టడానికి ముందే ప్రభావితమవుతున్న రాష్ట్ర శాసనసభల అభిప్రాయాన్ని రాష్ట్రపతి కోరతారు.
- సంబంధిత రాష్ట్ర శాసనసభ రాష్ట్రపతి సూచించిన నిర్ణీత సమయంలోనే తమ అభిప్రాయాన్ని తెలపాలి.
- రాష్ట్ర శాసనసభలు వ్యక్తీకరించిన అభిప్రాయాలను పార్లమెంటు పరిగణలోకి తీసుకోవచ్చు లేదా తీసుకోకపోవచ్చు.

వివరణ..

1966లో పంజాబ్ నుంచి హర్యానా రాష్ట్రాన్ని ఏర్పాటు చేసినప్పుడు పంజాబ్‌లో రాష్ట్రపతి పాలన, విధానసభ సుప్తచేతనావస్థలో ఉండటం వల్ల పునర్‌వ్యవస్థీకరణ బిల్లును రాష్ట్ర శాసనసభ అభిప్రాయానికి నివేదించలేదు. ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ బిల్లును శాసనసభ తిరస్కరించింది.

- పార్లమెంటు ఉభయసభలు సంబంధిత బిల్లును సాధారణ మెజారిటీతో వేర్వేరుగా ఆమోదించాలి. ఉభయసభల మధ్య ప్రతిష్టంభన ఏర్పడితే, సంయుక్త సమావేశానికి ఆస్కారం లేదు. బిల్లు వీగిపోతుంది.
- బిల్లును రాష్ట్రపతి తప్పని సరిగా ఆమోదించాలి. పునఃపరిశీలనకు అవకాశం లేదు.
- రాష్ట్రపతి ఆమోదం తెలిపితే బిల్లు చట్టంగా మారుతుంది. దీంతో ప్రక్రియ పూర్తి అవుతుంది.
- కొత్త రాష్ట్రం ఎప్పటి నుంచి అమల్లోకి వస్తుందనేది కేంద్ర ప్రభుత్వం ప్రకటిస్తుంది. దీన్ని అపాయింటెడ్ డేట్ అంటారు.

ప్రకరణ-4

ఈ ప్రకరణ సంబంధిత తదుపరి పరిణామాలను వివరిస్తుంది. ప్రకరణ 2, 3 ప్రకారం ఏదైనా సవరణ చేసినప్పుడు 1, 4 షెడ్యూల్‌లో పేర్కొన్న అంశాలను కూడా తదనుగుణంగా మార్చాలి. దీనికోసం పార్లమెంటు ప్రత్యేక చట్టం చేయాల్సిన అవసరం లేదు. ప్రకరణ 2, 3 ప్రకారం ఏ సవరణ చేసినా, తదనుగుణంగా 1, 4 షెడ్యూల్‌లోని అంశాలు కూడా మార్పునకు గురవుతాయి.

వివరణ

ప్రకరణ 2, 3 ప్రకారం ఏ సవరణ చేసినా దాన్ని రాజ్యాంగ సవరణగా పరిగణించరు. ఈ అంశాన్ని ప్రకరణ 4(2)లో స్పష్టంగా పేర్కొన్నారు. రాష్ట్రాల ఏర్పాటు, పునర్‌వ్యవస్థీకరణ, ఇతర అంశాలకు రాజ్యాంగ సవరణ తప్పనిసరి కాదు.

వివాదాలు- సుప్రీంకోర్టు తీర్పులు

బెరుబారి యూనియన్ వివాదం-1960

ప్రకరణ 3 ప్రకారం, రాష్ట్రాల సరిహద్దును కుదించే అధికారం పార్లమెంటుకు ఉంది. అయితే ఒక రాష్ట్ర భూభాగాన్ని ఇతర దేశాలకు బదిలీ చేసే అధికారం ఉందా? అనే వివాదం తలెత్తింది. దీనికి సంబంధించి రాష్ట్రపతి సుప్రీంకోర్టు సలహాను కోరారు. ఈ వివాదంలో సుప్రీంకోర్టు తీర్పు చెబుతూ, రాష్ట్ర భూభాగాన్ని ఇతర దేశాలకు బదిలీ చేయాలంటే ప్రకరణ 368 ప్రకారం పార్లమెంటు ప్రత్యేక మెజారిటీతో రాజ్యాంగ సవరణ చేయాలని పేర్కొంది. అయితే, అంతర్గతంగా బదిలీ చేసేందుకు సాధారణ మెజారిటీ సరిపోతుంది.

గమనిక:

బెరుబారి అనేది పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని ఒక ప్రాంతం. 9 చదరపు మైళ్ల విస్తీర్ణంతో ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం ఒక ఒప్పందం ద్వారా పాకిస్తాన్‌కు కొంత భాగాన్ని బదిలీ చేసింది.

బాబూలాల్ మారాండి వర్సెస్ ముంబై స్టేట్ కేస్ (1960)

రాష్ట్రాల పునర్‌వ్యవస్థీకరణ బిల్లును ఒక్క పర్యాయం మాత్రమే సంబంధిత రాష్ట్ర శాసనసభల అభిప్రాయానికి నివేదిస్తారు. ఒక వేళ ఆ బిల్లులో తర్వాత చేసిన మార్పులకు సంబంధించి మరోసారి రాష్ట్ర పరిశీలనకు పంపాల్సిన అవసరం లేదని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. **ఉదాహరణ:** తెలంగాణ రాష్ట్రం, ఖమ్మం జిల్లాలోని పోలవరం కింది 7 ముంపు మండలాలను ఆంధ్రప్రదేశ్‌కు బదలాయించడం.

స్టేట్ ఆఫ్ పంజాబ్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా (1982)

భారత రాజ్యాంగం నిర్దిష్టమైన సమాఖ్య వ్యవస్థను ఏర్పరచలేదు. నిర్మాణపరంగా సమాఖ్య అయినప్పటికీ ఇది సమాఖ్య, ఏక కేంద్ర ప్రభుత్వాల మిశ్రమంగా పేర్కొంది.

ముళ్ల పెరియార్ పర్యావరణ వివాదం (2006)

నదీజలాల పంపిణీ విషయంపై చట్టాలను చేసే అధికారం రాష్ట్ర శాసనసభకు ఉండదు. ఈ అధికారం పార్లమెంటుకు మాత్రమే ఉంటుందని సుప్రీంకోర్టు ఈ కేసులో తీర్పు చెప్పింది.



ఆంధ్ర రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి	- టంగుటూరి ప్రకాశం
మొదటి ఉప ముఖ్యమంత్రి	- నీలం సంజీవరెడ్డి
ఆంధ్రరాష్ట్ర మొదటి గవర్నర్	- సి.ఎం.త్రివేది
హైకోర్టు మొదటి ప్రధాన న్యాయమూర్తి	- జస్టిస్ కోకా సుబ్బారావు
ఆంధ్ర రాష్ట్ర చివరి ముఖ్యమంత్రి	- బెజవాడ గోపాలరెడ్డి

భాషా ప్రయుక్త రాష్ట్రాలు

దేశానికి స్వాతంత్ర్యం వచ్చే నాటికి రెండు రకాల రాజకీయ భాగాలు ఉండేవి.

1. నేరుగా బ్రిటిష్ ప్రభుత్వ నియంత్రణలో ఉన్న భాగాలు.
2. బ్రిటిష్ సార్వభౌమాధికారం కింద పనిచేసే సంస్థానాలు (స్వదేశీ సంస్థనాలు).

ఆనాడు దేశంలో 552 స్వదేశీ సంస్థానాలు ఉండేవి. బ్రిటిషువారు ప్రకటించిన విలీన ఒప్పందం ప్రకారం 549 స్వదేశీ సంస్థానాలు భారత యూనియన్‌లో విలీనం అయ్యాయి కానీ హైదరాబాద్, జునాగఢ్, కశ్మీర్ సంస్థానాలు విలీనాన్ని వ్యతిరేకించాయి. కశ్మీర్ భారత్‌లో విలీన ఒప్పందం ద్వారా అంతర్భాగం అయింది. ప్రజాభిప్రాయం ద్వారా జునాగఢ్ భారత్‌లో కలిసిపోయింది. ప్రజాభిప్రాయం ద్వారా కలిసిన మొదటి, చివరి సంస్థానం ఇదే. హైదరాబాద్ సంస్థానాన్ని 1948 సెప్టెంబర్ 17న ఆపరేషన్ పోలో అనే పోలీసు చర్య (సైనిక చర్య) ద్వారా విలీనం చేశారు.

1950 నాటికి రాజ్యాంగం ప్రకారం నాలుగు రకాల రాష్ట్రాలు అమలులో ఉండేవి. వీటిని పార్ట్-ఎ, బి, సి, డిగా వర్గీకరించారు. పార్ట్-ఎలో బ్రిటిష్ పాలిత గవర్నర్ ప్రావిన్స్‌లు 9 ఉండేవి. పార్ట్-బిలో శాసన సభ కలిగిన స్వదేశీ సంస్థానాలు 9, పార్ట్-సిలో చీఫ్ కమిషనర్ ప్రాంతాలు 10, పార్ట్-డిలో అండమాన్ నికోబార్ దీవులు ఉండేవి.

నేపథ్యం..

భాషా ప్రాతిపదికన రాష్ట్రాలు ఏర్పాటు చేయాలనే డిమాండ్ స్వాతంత్ర్యోద్యమ కాలంలోనే ఉండేది. ఈ డిమాండు మొట్టమొదటి సారి తెరపైకి తెచ్చింది తెలుగువారే.

గమనిక: స్వాతంత్ర్యం రాక ముందు భాషా ప్రాతిపదికన ఏర్పడిన మొదటి రాష్ట్రం ఒడిశా.

- 1913లో బాపట్లలో జరిగిన ఆంధ్రమహాసభ ప్రత్యేక ఆంధ్ర ఏర్పాటుకు డిమాండ్ చేసింది.
- 1927లో కాంగ్రెస్ సమావేశం భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటును సమర్థిస్తూ తీర్మానం చేసింది.
- 1931లో జరిగిన రెండో రౌండ్ టేబుల్ సమావేశానికి గాంధీ హాజరైన సందర్భంలో ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర డిమాండుపై చర్చించాలని భోగరాజు పట్టాభి సీతారామయ్య ప్రతిపాదించారు.

1937లో రాయలసీమ, ఆంధ్ర నాయకుల మధ్య కాశీనాథుని నాగేశ్వరరావు నివాసంలో ఒక ఒప్పందం కుదిరింది. కాశీనాథుని నివాసం పేరు శ్రీభాగ్ కాబట్టి దీన్ని శ్రీభాగ్ ఒప్పందం అంటారు. స్వాతంత్ర్యానంతరం రాష్ట్రాల్లో ప్రభుత్వాలు ఏర్పాటు చేసే సందర్భంలో మద్రాసు, ఆంధ్ర నాయకుల మధ్య తలెత్తిన వివాదాలు ప్రత్యేక ఆంధ్ర ఏర్పాటుకు బలమైన కారణాలుగా చెప్పొచ్చు.

థార్ కమిషన్ -1948

భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుపై పరిశీలనకు రాజ్యాంగ పరిషత్తు 1948లో ఉత్తరప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి ఎస్.కె.థార్ నాయకత్వంలో ఇద్దరు సభ్యులతో (పన్నాలాల్, జగత్ నారాయణ్‌లాల్) ఒక కమిషన్‌ను నియమించింది. ఈ క మిషన్ కేవలం భాషా ప్రాతిపదిక పైన రాష్ట్రాలు ఏర్పాటు చేయడాన్ని తిరస్కరించింది. పరిపాలనా సౌలభ్య ప్రాతిపదికపైనే రాష్ట్రాలను ఏర్పాటు చేయాలని సూచించింది.

జె.వి.పి. కమిటీ

థార్ కమిషన్ నివేదికకు వ్యతిరేకంగా చెలరేగిన ఆందోళనను విరమింపజేయడానికి అఖిల భారత కాంగ్రెస్ కమిటీ 1948 డిసెంబర్‌లో జవహర్‌లాల్ నెహ్రూ, వల్లభ్‌భాయ్ పటేల్, పట్టాభి సీతారామయ్య సభ్యులుగా ఒక కమిటీని నియమించింది. ఈ కమిటీ కూడా దేశం మొత్తం మీద రాష్ట్రాల పునర్‌నిర్మాణాన్ని వాయిదా వేయాలని, ఆంధ్ర రాష్ట్రాన్ని మాత్రం దానికి మినహాయింపుగా భావించాలని నివేదించింది.

1952 ఆగస్టు 15 నుంచి 35 రోజుల పాటు గొల్లపూడి సీతారామయ్య శాస్త్రి ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర ఏర్పాటు కోసం ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. 35 రోజుల తర్వాత ఆచార్య వినోభా భావే అతడి నిరాహారదీక్షను విరమింపజేశారు.

1952 అక్టోబర్ 19 నుంచి మద్రాసులో బులుసు సాంబమూర్తి ఇంట్లో పొట్టి శ్రీరాములు ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం ఆమరణ నిరాహారదీక్ష చేపట్టారు. దీక్ష 50వ రోజుకు చేరుకున్న సందర్భంగా మద్రాసును సందర్శించిన జవహర్‌లాల్ నెహ్రూ ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుకు హామీ ఇచ్చారు. కానీ పొట్టి శ్రీరాములు తన దీక్షను కొనసాగించారు. 58వ రోజున డిసెంబర్ 15న ఆయన అమరుడయ్యారు. పొట్టి శ్రీరాములు మృతితో హింసాత్మక సంఘటనలు చెలరేగాయి. దీంతో 1952 డిసెంబర్ 19న పార్లమెంటులో నెహ్రూ ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర ఏర్పాటును ప్రకటించారు.

ప్రాజెక్ట్ పద్ధతిలో చివరి సోపానం?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

సోషల్ మెథడాలజీ

1. 'ఒక పరిశోధకుడు ప్రజ్ఞ ఎక్కువ ఉన్న వారిలో నైతిక విలువలు ఎక్కువ, ప్రజ్ఞ తక్కువ ఉన్న వారిలో నైతిక విలువలు తక్కువ అని పేర్కొన్నాడు'
పై పరిశోధనలో ప్రజ్ఞ?
ఎ) స్వతంత్ర చరాన్ని ప్రభావితం చేసే మధ్యస్థ చరం
బి) పరతంత్ర చరాన్ని ప్రభావితం చేసే స్వతంత్ర చరం
సి) మధ్యస్థ చరాన్ని ప్రభావితం చేసే స్వతంత్ర చరం
డి) పరతంత్ర చరాన్ని ప్రభావితం చేసే మధ్యస్థ చరం

2. బహుముఖ కోణాల్లో ఆలోచించగల శిశువు పియాజే సంజ్ఞానాత్మక వికాస దశల్లో ఏ దశకు చెందుతాడు?
ఎ) సంవేదన చాలక దశ
బి) పూర్వ ప్రచాలక దశ
సి) మూర్త ప్రచాలక దశ
డి) నియత ప్రచాలక దశ

3. ఒక ఉపాధ్యాయుడు ముందు లేఖనం తర్వాత పఠనం తర్వాత భాషణం ఆ తర్వాత శ్రవణం అనే భాషా సూత్రాలను అనుసరించాడు. ఆ ఉపాధ్యాయుడు అనుసరించని వికాస నియమం?
ఎ) వికాసం క్రమానుగతమైంది
బి) వికాసం సాధారణ అంశాల నుంచి నిర్దిష్ట అంశాలకు దారితీస్తుంది
సి) వికాసం సంచితమైంది
డి) వికాసం ఏకీకృత మొత్తం

4. రాము బొమ్మలకు స్నానం చేయిస్తాడు. ఆ బొమ్మకు సీసాతో పాలు తాగిస్తాడు. జోలపాడి నిద్రపుచ్చుతాడు. రాము పియాజే సంజ్ఞానాత్మక వికాసంలో ఏ దశలో ఉంటాడు?
ఎ) జ్ఞానేంద్రియ చాలక దశ
బి) పూర్వ ప్రచాలక దశ
సి) మూర్త ప్రచాలక దశ
డి) అమూర్త ప్రచాలక దశ

5. రాజు ఒక సగటు విద్యార్థి. తాను పాఠశాల్లో బంగారు పతకం సాధించుకున్నట్లు ఊహించుకుంటూ ఉంటాడు. రాజు దశ?
ఎ) శైవ దశ బి) బాల్య దశ
సి) కౌమార దశ డి) వయోజన దశ

6. కింది వాటిలో శాబ్ది కేతర సామూహిక పరీక్ష?
ఎ) బీనేసైమన్ పరీక్ష
బి) ఆర్మీ అల్ఫా పరీక్ష
సి) ఆర్మీ బీటా పరీక్ష
డి) బాలియా నిష్పాదన పరీక్ష

7. కింది వాటిలో అంతర వ్యక్తిగత విభేదాలను సూచించేది?
ఎ) రాజు శారీరకంగా బలవంతుడు, ఉద్వేగంగా అస్థిరుడు
బి) రాజు స్నేహితులకంటే వ్యవహారిక దక్షత గలవాడు
సి) రాజు చదవడం, రాయడం రెండూ ఇష్టపడతాడు
డి) రాజు గణితం కంటే, సాంఘిక శాస్త్రాన్ని ఇష్టపడతాడు

8. మానసిక ఆరోగ్యం ఉండే ఉపాధ్యా యుడిలో ఉండని లక్షణం?
ఎ) విషయ యోజనం బి) ఉద్వేగ స్థిరత్వం
సి) సర్దుబాటు తత్వం
డి) అనుకూల దృక్పథం

9. ప్రతిభావంతుడికి అనుసరించవలసిన పద్ధతి?
ఎ) అంతఃపరీక్ష బి) కేస్ స్టడీ
సి) పరిశీలనా పద్ధతి డి) ప్రయోగ పద్ధతి

10. ఏ రకమైన రక్షక తంత్రంలో వ్యక్తి తన కంట్లో దూలము నుంచి ఎదుటి వ్యక్తి కంట్లో నలుసును ఎత్తి చూపుతాడు?
ఎ) హేతుకి కారణం బి) విస్థాపనం
సి) ప్రక్షేపణం డి) ప్రతిగమనం

11 రాజు కంప్యూటర్ కోర్సులో చేరి విజయ వంతంగా పూర్తి చేశాడు. కోర్సు సమయంలో అతని నిష్పాదనలో ఎన్నో మార్పులు జరిగాయి. ఈ నిష్పాదనను గ్రాఫ్ రూపంలో చూపించే అభ్యసన రేఖ?
ఎ) పుటాకార వక్ర రేఖ
బి) కుంభాకార వక్ర రేఖ
సి) లాక్షణిక అభ్యసన రేఖ
డి) అవరోహణ వక్ర రేఖ

12. థారన్‌డైక్ ప్రాథమిక నియమాల ప్రకారం కింది అంశాల్లో ముఖ్యమైంది?
ఎ) అవధానం కొనసాగేలా ప్రశ్నలు వేయడం
బి) అభ్యసన ప్రక్రియలో ప్రోత్సాహకాలు ఇస్తూ ఉండడం
సి) అభ్యసనాంశంపై మౌఖికంగా ప్రశ్నలు అడగడం
డి) చదివే అలవాటును పెంపొందించడం

13. వాట్సన్ ప్రయోగంలో అల్‌బర్ట్ అనే బాలుడు పునర్బలనం (ఊచశబ్దం) చెందిన ఎలుకకు మాత్రమే స్పందించి తెల్లని కుక్కపిల్లకు, పక్షి ఈకకు ప్రతిస్పందించక పోవడం ఏ నియమం?
ఎ) ఉద్దీపన సామాన్యీకరణం
బి) ఉద్దీపన విచక్షణ
సి) ఉన్నత స్థాయి నిబంధనం
డి) విలుప్తీకరణం

14. పెన్ అనే పదానికి పెన్స్ అని నేర్చుకున్న విద్యార్థి బుక్ అనే పదానికి బుక్స్ అని రాయడం ఏ రకమైన బదలాయింపు?
ఎ) అనుకూల బదలాయింపు
బి) ప్రతికూల బదలాయింపు
సి) శూన్య బదలాయింపు
డి) ద్విపార్శ్వ బదలాయింపు

15. రాజు తరగతిలో తెలివైన విద్యార్థి. కానీ రాజుకు స్టేజిఫియర్ ఎక్కువ ఈ బలహీనతను తగ్గించడానికి ఉపాధ్యా యుడు ఉపయోగించే నియమం?
ఎ) పునర్బలన నియమం
బి) ఆయత్న సిద్ధస్వాస్థ్యం
సి) విరమణ నియమం
డి) విచక్షణా నియమం

16. బహిర్గత ప్రేరణకు సంబంధించనిది?
ఎ) గుంజీలు తీయించడం
బి) పొగడ్త సి) దండన
డి) అభిరుచి

17. ఆహా నేను కనుగొన్నాను అని అభ్యాసకుడు ఏ సిద్ధాంతం ఆధారంగా అభ్యసిస్తాడు?
ఎ) యత్నదోష అభ్యసనం
బి) కార్య సాధక నిబంధనం
సి) శాస్త్రీయ నిబంధనం
డి) అంతర్ దృష్టి అభ్యసనం

18. కింది వాటిలో సంకల్పిత అవధానం?
ఎ) కదిలే సర్కస్ లైట్ చూడడం
బి) బడిగంట మోగగానే చూడడం
సి) ఉపాధ్యాయుడు బోధించే పాఠం వినడం
డి) అలారం మోగిన వెంటనే చూడడం

19. హైస్కూల్ విద్యార్థి క్రికెట్‌లో ప్రతిభ చూపడం, కంప్యూటర్‌లో కూడా ప్రతిభ చూపడం ఏ రకమైన అభ్యసన బదలాయింపు?
ఎ) శూన్య బదలాయింపు
బి) అనుకూల బదలాయింపు
సి) ప్రతికూల బదలాయింపు
డి) ద్విపార్శ్వ బదలాయింపు

20. ZOK,TUX ఒక?
ఎ) అర్థసహిత పదాలు
బి) అర్థరహిత పదాలు
సి) ద్వంద్వ సంసర్గాలు
డి) కొండ గుర్తులు

21. కింది వాటిలో లోపం – వైకల్యతకు సంబంధించి సరైన ప్రవచనాన్ని గుర్తించండి?
ఎ) లోపం కృత్యం చేసేటప్పుడు కనిపిస్తుంది, వైకల్యత కృత్యం చేయడంలో అశక్తత
బి) లోపం అవయవాలకు సంబంధించి, వైకల్యత కృత్యం చేయడంలో అశక్తత
సి) లోపం ఉన్న పిల్లలందరూ, వైకల్యత కలిగి ఉంటారు
డి) వైకల్యత కలిగిన పిల్లలందరిలో తప్పనిసరిగా లోపం కలిగి ఉండాలని లేదు

22. కింది వాటిలో అభ్యసన వైకల్యతకు సంబంధించి పఠన వైకల్యానికి సంబంధించినది?
ఎ) డిస్ గ్రాఫియా బి) డిస్ లెక్సియా
సి) డిస్ ఫేసియా డి) డిస్ కాల్క్యులియా

23. ఉపాధ్యాయుడు ప్రజాస్వామ్య విలువలను ఏ రకమైన నాయకత్వంలో పెంపొం దిస్తాడు?
ఎ) నిర్దేశిత నాయకత్వం
బి) అనుజ్ఞ నాయకత్వం
సి) సహభాగి నాయకత్వం
డి) సాధనోన్ముఖ నాయకత్వం

24. 302ను 32 అని చదివే గణితపరమైన అసామర్థ్యం?
ఎ) డిస్ ఫేసియా
బి) డిస్ కాల్కులియా
సి) డిస్ గ్రాఫియా డి) డిస్ లెక్సియా

25. ప్రాజెక్ట్ పద్ధతిలో చివరి సోపానం?
ఎ) ప్రాజెక్ట్ మూల్యాంకనం చేయడం
బి) ప్రాజెక్ట్ నివేదించడం
సి) ప్రాజెక్ట్ లక్ష్యాలు పరిశీలించడం
డి) కార్యకలాపాలు సమీక్షించడం

26. బ్లూప్రింట్ పరిధిలోలేని అంశం?
ఎ) విలువ బి) లక్ష్యం
సి) ప్రశ్నలు డి) విషయం

27. హెర్బర్ట్ రూపొందించిన బోధనా ప్రణాళి కలో వరుస క్రమం?
ఎ) సన్నాహం – సంసర్గం – ప్రదర్శనం – సాధారణీకరణం – అన్వయం – సింహావలోకనం
బి) సన్నాహం – ప్రదర్శనం – సాధారణీకరం – సంసర్గం – అన్వయం – సింహావలోకనం
సి) సన్నాహం – ప్రదర్శనం – సంసర్గం – సాధారణీకరణం – అన్వయం – సింహావలోకనం
డి) సన్నాహం – ప్రదర్శనం – సాధారణీకరణం – అన్వయం – సంసర్గం – సింహావలోకనం

28. ప్రణాళిక బోధన పరిపుష్టి తర్వాత సూక్ష్మ బోధనా వలయంలో వచ్చే సోపానం?
ఎ) పునఃబోధన బి) పునఃపరిపుష్టి
సి) పునఃప్రణాళిక డి) సమీక్ష

29. అకస్మాత్తుగా జరిగే సంఘటనలు ఉన్నది ఉన్నట్లుగా నమోదు చేసి వ్యక్తి ప్రవర్తనను అంచనావేసే రికార్డు?
ఎ) కేస్‌స్టడీ రికార్డ్
బి) క్యుములేటివ్ రికార్డ్
సి) ఎనక్డోటల్ రికార్డ్
డి) ప్రాజెక్ట్ రికార్డ్

30. బహుళైచ్ఛిక ప్రశ్నలు ప్రధానంగా?
ఎ) జ్ఞానం-పునఃస్మరణకు సంబంధించింది
బి) జ్ఞానం గుర్తించడానికి సంబంధించింది
సి) అవగాహన-వర్గీకరణకు సంబంధించింది
డి) వినియోగం – ఊహించడానికి సంబంధించింది

సమాధానాలు

1) బి; 2) డి; 3) ఎ; 4) బి; 5) సి;
6) సి; 7) బి; 8) ఎ; 9) బి; 10) సి;
11) సి; 12) బి; 13) బి; 14) ఎ; 15) సి;
16) డి; 17) డి; 18) సి; 19) ఎ; 20) బి;
21) బి; 22) బి; 23) సి; 24) సి; 25) బి;
26) ఎ; 27) సి; 28) సి; 29) సి; 30) బి.

విద్య, ఉద్యోగ సమాచారం

ఎల్ఐసీ-హెచ్ఎఫ్ఎల్‌లో 192 అప్రెంటిస్‌లు

ఎల్ఐసీ-హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్(హెచ్ఎఫ్ఎల్)దేశంలోని అన్ని రాష్ట్రాలలో ఖాళీగా ఉన్న అప్రెంటిస్‌ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 192.
» **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. 01.06.2021 నాటికి డిగ్రీ పూర్తి చేసి ఉండాలి.
» **వయసు:** 20 నుంచి 25 ఏళ్ల ఉండాలి.
» **స్టైపెండ్:** నెలకు రూ.12,000.
» **శిక్షణా కాల వ్యవధి:** 12 నెలలు.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష ఆధారంగా ఎంపికచేస్తారు.
» **పరీక్ష ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.944, ఎస్సీ, ఎస్టీ, మహిళా అభ్యర్థులకు రూ.708, పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు రూ.472.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **పరీక్ష ఫీజు చెల్లించడానికి చివరితేది:** 24.09.2025.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 22.09.2025.
» **ప్రవేశ పరీక్ష తేది:** 01.10.2025.
» **శిక్షణ ప్రారంభతేది:** 01.11.2025.
» **వెబ్‌సైట్:** www.lichousing.com

ఎయిమ్స్ రాజ్‌కోట్‌లో సీనియర్ రెసిడెంట్ పోస్టులు

ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్) రాజ్‌కోట్ ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో సీనియర్ రెసిడెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి డిగ్రీ, పీజీ(పబ్లిక్ హెల్త్, బయో స్టాటిస్టిక్స్)లో ఉత్తీర్ణులవ్వాలి.
» **వయసు:** 35 ఏళ్ల ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.30,600.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష/ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**24.09.2025
» **పరీక్ష/ఇంటర్వ్యూ తేది:** 25.09.2025.
» **వెబ్‌సైట్:** https://aiimsrajkot.edu.in

శరీరంలో యూరియా ఏ భాగంలో ఉత్పత్తి అవుతుంది?

మాదిరి ప్రశ్నలు

1. కింది వాటిలో పోలియో వ్యాధి లక్షణం ఏది?
   1) తలనొప్పి 2) జలుబు
   3) ఒళ్లునొప్పులు 4) కండరాల పక్షవాతం
2. కింది వాటిలో వైరస్ ద్వారా వ్యాప్తి చెందే వ్యాధులేవి?
   1) పోలియో, తట్టు
   2) గవదబిళ్లలు, జలుబు
   3) కలరా, టైఫాయిడ్ 4) 1, 2
3. పెన్సిలిన్ అనేది ఒక:
   1) సూక్ష్మ జీవి నాశకం 2) కీటక నాశకం
   3) బయోఫెర్టిలైజర్ 4) పైవేవీకాదు
4. మానవుడిలో ఆల్కహాల్ దేనిపై ప్రభావం చూపుతుంది?
   1) హృదయం 2) కండరాలు
   3) చర్మం 4) నాడీ మండలం
5. అయోడిన్ ఎక్కువ మొత్తంలో దేనిలో లభిస్తుంది?
   1) పాలు 2) మాంసం
   3) సముద్ర చేపలు 4) కూరగాయలు
6. సెల్యూలోజ్‌కు సంబంధించి కింది వాటిలో సరికానిది ఏది?
   1) ఆహారానికి బరువునిస్తుంది
   2) ఖనిజ లవణం
   3) ఆహార నాళంలో ఆహారం సులువుగా కదలడానికి తోడ్పడుతుంది
   4) ఆహారంలో సెల్యూలోజ్ లేకపోతే పూర్తిగా జీర్ణం కాదు
7. ఆహార వాహికలోని కండరాలు..?
   1) నియంత్రిత కండరాలు
   2) అనియంత్రిత కండరాలు
   3) హృదయ కండరాలు
   4) నియంత్రిత – అనియంత్రిత కండరాలు
8. కింది వాటిలో ఇనుము, ఇతర ఖనిజ మూలకాలు అధికంగా కలిగి ఉండేవి ఏవి?
   1) పప్పు ధాన్యాలు 2) ఆకుకూరలు
   3) మాంసం 4) బంగాళాదుంప
9. శ్వాసక్రియ కింది వాటిలో దేని సమక్షంలో జరుగుతుంది?
   1) కాంతి 2) పత్రహరితం
   3) సరైన ఉష్ణోగ్రత 4) తేమ
10. మానవుడి దేహంలో ఉండే కేంద్రక రహిత సజీవకణాలు ఏవి?
    1) ఎర్ర రక్తకణాలు 2) తెల్ల రక్త కణాలు
    3) నాడీకణాలు 4) కండర కణాలు
11. ఊపిరితిత్తులకు ఆమ్లజని రహిత రక్తాన్ని తీసుకొని వెళ్లే రక్తనాళం?
    1) పుపుససిర 2) పుపుస ధమని
    3) పూర్వ మహాసిర 4) దైహిక ధమని
12. దేనిలో అడ్డంకి ఏర్పడినప్పుడు గుండెపోటు సంభవిస్తుంది?
    1) పుపుస ధమని
    2) హృదయ/కరోనరీ ధమని
    3) హృదయ సిర 4) పుపుస సిర
13. కింది వాటిలో సరికానిది ఏది?
    1) రక్తం గడ్డకట్టకుండా ప్లాస్మా సేకరించవచ్చు
    2) రక్తం గడ్డకట్టిన తరువాతే సీరమ్‌ను సేకరిస్తారు
    3) ప్లాస్మాలో ఉండే కొన్ని ప్రోటీన్లు సీరమ్‌లో ఉండవు
    4) ప్లాస్మా నీలం రంగులో ఉండే ద్రవం
14. రక్త వర్గాలకు సంబంధించి కింది వాటిలో సరైంది ఏది?
    1) రక్త వర్గాలను మొదట గుర్తించిన శాస్త్రవేత్త – కార్ల్ లాండ్ స్టీనర్
    2) ఆర్‌బీసీలపై ఉండే ప్రతిజనకాలు ఎ, బి ఆధారంగా ఎ, బి, ఎబి, ఒ అనే నాలుగు రకాల వర్గాలను గుర్తించారు
    3) ప్రతిజనకాలు లేని రక్త వర్గం – 'ఒ', ప్రతిరక్షకాలు లేని వర్గం – 'ఎబి'
    4) పైవన్నీ సరైనవే



15. కింది వాటిలో కొంత మంది శిశువులు పుట్టిన వెంటనే మరణించడానికి కారణం ఏది?
    1) ఆర్‌హెచ్ కారకానికి ప్రతిరక్షకాలు ఏర్పడడం
    2) ఆర్‌హెచ్ కారకానికి ప్రతి జనకాలు ఏర్పడడం
    3) పైరెండూ 4) ఏదీకాదు
16. డయాలసిస్ యంత్రం ఒక:
    1) కృత్రిమ గుండె
    2) కృత్రిమ ఊపిరితిత్తులు
    3) కృత్రిమ కాలేయం
    4) కృత్రిమ మూత్రపిండం
17. శరీరంలో యూరియా ఏ భాగంలో ఉత్పత్తి అవుతుంది?
    1) మూత్రపిండాలు 2) ఊపిరితిత్తులు
    3) కాలేయం 4) పెద్దపేగు
18. హృదయ కండరం ఏ ప్రత్యేక లక్షణాన్ని కలిగి ఉంటుంది?
    1) గ్లానీ 2) లయ బద్ధత
    3) సార్కొలెమ్మా 4) ఆకారం
19. అరేఖిత (నునుపు) కండరాలు ఏ భాగంలో ఉంటాయి?
    1) మెడ 2) కాళ్లు–చేతులు
    3) జీర్ణాశయం–మూత్రాశయం
    4) వేళ్లు
20. వరి నారు మొక్కలో 'తెలివి తక్కువ మొలక' (Foolish Seedling Disease) వ్యాధికి కారణమయ్యేది?
    1) వైరస్ 2) బ్యాక్టీరియా
    3) శైవలం 4) శిలీంధ్రం
21. ఆల్ఫా, బీటా–ఇంటర్ ఫెరాన్‌లను ఉత్పత్తి చేసేవి ఏవి?
    1) వైరల్ సాంక్రమిక కణాలు
    2) మైక్రోఫేజ్‌లు 3) వైరస్‌లు
    4) టి–కణాలు
22. పారిశ్రామికంగా ఇథనాల్‌ను ఉత్పత్తి చేయడానికి ఉపయోగించే పదార్థాలు?
    1) కార్న్‌స్టార్చ్, మొలాసిస్
    2) షుగర్ బీట్‌లు, దుంపలు
    3) ద్రాక్ష 4) పైవన్నీ
23. చమురు కాలుష్యాన్ని నివారించడానికి ఉపయోగించే బ్యాక్టీరియా?
    1) ట్రైకోమోనాస్ 2) సుడోమోనాస్
    3) రైనోసీరాస్ 4) జాంతోమోనాస్
24. కింది వాటిలో సరికాని జత?
    1) గ్లియోబ్లాస్టోమా – మెదడు
    2) ఏంజియోసార్కోమా – రక్తం
    3) లింఫోమా – ప్లీహం
    4) ఎడినో సార్కోమా – గ్రంథి కణజాలం
25. ప్రకృతి వరణాన్ని ప్రయోగాత్మకంగా పరిశీలించిన వారెవరు?
    1) డార్విన్ 2) వీజ్‌మన్
    3) బెర్నార్డ్ కెటిల్‌వెల్ 4) సింప్సన్
26. మొక్కలతో సంశ్లేషణ చేయని విటమిన్?
    1) బి$_{12}$ 2) బి$_{6}$ 3) బి$_{1}$ 4) ఇ
27. కింది వాటిలో అత్యధిక జీవ వైవిధ్యాన్ని ప్రదర్శించే ఆవాసం ఏది?
    1) ఎడారులు 2) సమశీతోష్ణ అడవులు
    3) ఉష్ణమండల వర్షారణ్యాలు
    4) గడ్డి మైదానాలు
28. జీవ అనుఘటకాలు అంటే..?
    1) వినియోగదారులు మాత్రమే
    2) వినియోగదారులు, ఉత్పత్తిదారులు, విచ్ఛిత్తికారులు
    3) ఉత్పత్తి, వినియోగదారులు
    4) ఉత్పత్తి దారులు మాత్రమే
29. 'జీవుల నిర్మాణాత్మక, క్రియాత్మక ప్రమాణం -కణం' అని పేర్కొన్న శాస్త్రవేత్త?
    1) అరిస్టాటిల్ 2) రాబర్ట్ హుక్
    3) ష్లైడన్–ష్వాన్ 4) జార్జ్ మెండల్
30. కేంద్రక పూర్వ జీవుల కణంలో లోపించిన కణాంగాలు ఏవి?
    1) క్రోమోజోమ్స్ 2) మైటోకాండ్రియా
    3) ప్లాస్మామెంబ్రేన్ 4) రైబోజోమ్స్
31. 'అల్లం' మనం ఆహారంగా ఉపయోగించే భూగర్భకాండ రూపాంతరం. దీన్ని శాస్త్రీయంగా ఏమని పిలుస్తారు?
    1) రైజోమ్ 2) కందం
    3) దుంప 4) లశునం
32. జలగల పోషణ విధానం ఏది?
    1) హెర్బివోరస్ 2) ఇన్‌సెక్టివోరస్
    3) కార్నివోరస్ 4) సాంగ్వివోరస్
33. లివర్ సిర్రోసిస్‌కి కారణం?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

బయాలజీ

    1) కొకైన్ 2) ఎల్ఎస్‌డీ
    3) ఆల్కహాల్ 4) మార్ఫిన్
34. జనటిక్ ఇంజినీరింగ్ ప్రయోగాల్లో చాలా ఎక్కువగా ఉపయోగించే రెండు బ్యాక్టీరియాలు?
    1) నైట్రసోమోనాస్, క్లెబ్సియెల్లా
    2) ఎశ్చరీషియా, అగ్రోబ్యాక్టీరియమ్
    3) నైట్రోబాక్టర్, అజటో బాక్టర్
    4) రైజోబియం, డిప్లోకోకస్
35. జతపరచండి.

శాస్త్రవేత్త	సిద్ధాంతం
i) డార్విన్	a) ఉపయుక్త- నిరుపయుక్త సూత్రం
ii) లామార్క్	b) జాతుల ఉత్పత్తి
iii) హ్యూగోడీవ్రీస్	c) జీవం ఆవిర్భావం
iv) ఎ.ఐ. ఒపారిన్	d) ఉత్పరివర్తన సిద్ధాంతం

    1) i-a, ii-b, iii-c, iv-d
    2) i-c, ii-a, iii-b, iv-d
    3) i-b, ii-a, iii-d, iv-c
    4) i-d, ii-c, iii-b, iv-a
36. కింది వాటిలో సరైంది?
    ఎ) అధిక కిరణజన్య సంయోగక్రియ సామర్థ్యం ఉండటం వల్ల క్లోరెల్లా శైవలాన్ని వ్యోమగాములు ఆక్సిజన్ కోసం అంతరిక్షానికి తీసుకెళతారు
    బి) శైవలాలన్నీ స్వయం పోషకాలే కానీ, సిఫాల్యురాస్ పరాన్న జీవి శైవలం
    సి) కణజాల వర్ధనంలో పోషక యానకాన్ని అర్ధ-ఘనస్థితికి మార్చడానికి ఉపయోగించే ఆగార్-అగార్ శైవలాల నుంచి సంగ్రహిస్తారు
    1) ఎ, సి 2) బి, సి
    3) ఎ, బి 4) ఎ, బి, సి
37. మిగతా జీవులతో పోల్చినప్పుడు మానవ మెదడులో ఏ భాగం బాగా అభివృద్ధి చెందింది?
    1) మెడుల్లా అబ్లాంగేటా
    2) అనుమస్తిష్కం 3) మస్తిష్కం
    4) దృష్టి లంబికలు
38. శ్వాసక్రియ, హృదయ స్పందన, పెరిస్టాలిక్ చలనం మెదడులో ఏ భాగం అధీనంలో ఉంటుంది?
    1) మెడుల్లా అబ్లాంగేటా
    2) మెడుల్లా అబ్లాంగేట, మస్తిష్కం
    3) మెడుల్లా అబ్లాంగేటా, అనుమస్తిష్కం
    4) అనుమస్తిష్కం
39. సాధారణంగా వార్షిక వలయాలను లెక్కించి వృక్షాల వయసు చెప్పవచ్చు. కానీ, కింది ఏ వృక్షాల్లో వార్షిక వలయాలు ఏర్పడకపోవడం వల్ల వయసు లెక్కించలేం?
    1) సమశీతోష్ణ ఆకురాల్చు అడవులు
    2) సమశీతోష్ణ సతత హరిత అడవులు
    3) ఉష్ణమండల ఆకురాల్చు అడవులు
    4) ఉష్ణమండల సతత హరిత అడవులు
40. అసురక్షిత లైంగిక సంపర్కం వల్ల సంక్రమించే వ్యాధులు ఏవి?
    1) సిఫిలిస్, గనేరియా
    2) హెర్పిస్, ఎయిడ్స్
    3) వైజైనెటిస్, ట్రైకోమోనియాసిస్
    4) పైవన్నీ
41. కింది వాటిలో తెల్ల రక్త కణాలు కానివి?
    1) న్యూట్రోఫిల్ 2) బెసోఫిల్
    3) త్రాంబోసైట్ 4) ఇసినోఫిల్
42. వివృత రక్త ప్రసరణ వ్యవస్థ దేనిలో ఉంటుంది?
    1) చేప 2) బొద్దింక
    3) ఆక్టోపస్ 4) నాటిలస్
43. వినత్రీకరణ బ్యాక్టీరియా ఏది?
    1) రైజోబియం 2) అనబీనా
    3) నాస్టాక్ 4) సూడోమోనాస్
44. జతపరచండి.
    కల్చర్స్
    i) ఆర్బోరికల్చర్ ii) టిష్యూకల్చర్
    iii) పోమీకల్చర్ iv) ఒలెరికల్చర్
    వివిధ రకాల మొక్కల పెంపకం
    a) కూరగాయలు
    b) కలపనిచ్చే మొక్కలు
    d) ఉద్యానవన మొక్కలు
    c) ఫలాలిచ్చే మొక్కలు
    e) పరీక్ష నాళికలో మొక్కలు
    1) i-b, ii-e, iii-c, iv-a
    2) i-b, ii-e, iii-a, iv-c
    3) i-e, ii-b, iii-a, iv-c
    4) i-a, ii-b, iii-c, iv-d
45. గ్లూకోజ్‌ను ఏమని పిలుస్తారు?
    1) గ్రేప్ షుగర్ 2) ఫ్రూట్ షుగర్
    3) లెవ్యులోజ్ 4) ఫ్రక్టోజ్
46. ద్వివార దంత విన్యాసం, థీకోడాంట్, విషమ దంతస్థితి సాధారణంగా ఏ జీవుల్లో ఉంటుంది?
    1) చేపలు 2) సరీసృపాలు
    3) ఉభయచరాలు 4) క్షీరదాలు
47. శరీర జీవ క్రియారేటును నియంత్రించే ముఖ్యమైన అంతస్రావ గ్రంథి ఏది?
    1) పీనియల్ గ్రంథి 2) థైరాయిడ్ గ్రంథి
    3) పిట్యూటరీ గ్రంథి
    4) ఎడ్రినల్ గ్రంథి
48. ప్రొకారియేట్ జీవుల్లో ఉండే 70S రైబోసోమ్‌ల ఉపప్రమాణాలు?
    1) 40S - 40S 2) 60S - 40S
    3) 50S - 30S 4) 50S - 50S
49. అవయవదానం చేసే సమయంలో గ్రహీతకు ఇచ్చే సైక్లోస్పోరిన్ ఔషధాన్ని దేని నుంచి తయారు చేస్తారు?
    1) బ్యాక్టీరియా 2) ఫంగస్
    3) వైరస్ 4) మొక్కలు
50. కింది గృహ సంబంధ కాలుష్య కారణాల్లో ఎక్కువ రసాయన కాలుష్యాన్ని కలుగజేసేది ఏది?
    1) బొగ్గును మండించడం
    2) వంటగ్యాస్ మండించడం
    3) మస్కిటోకాయిల్స్‌ను మండించడం
    4) రూమ్ స్ప్రేలు
51. ప్రపంచవ్యాప్తంగా ధ్వని కాలుష్యానికి అతి ముఖ్యమైన కారణం?
    1) సంస్థల పరికరాలు
    2) రవాణా వ్యవస్థ
    3) చెరుకు, వస్త్రాలు, పేపర్ మిల్లులు
    4) నూనె శుద్ధి కర్మాగారాలు, థర్మల్ పవర్ ప్లాంట్స్
52. సిగరెట్ పొగలోని పాలిసైక్లిక్ ఆరోమాటిక్ హైడ్రోకార్బన్లు ఎలాంటి ప్రభావం చూపిస్తాయి?
    1) ఆక్సిజన్ రవాణాను తగ్గిస్తాయి
    2) రక్తపీడనం పెంచుతాయి
    3) కేన్సర్‌కు కారకమవుతాయి
    4) పిండం పెరుగుదల తగ్గిస్తాయి
53. 'వాతావరణ కాలుష్య సూచికలు' అని వేటిని పిలుస్తారు?
    1) లైకెన్లు, మాస్ మొక్కలు
    2) డాప్నియా 3) ఖైరోనోమస్ లార్వా
    4) పైవన్నీ
54. ఆహారంగా ఉపయోగపడే మొక్కలోని భాగాలకు సంబంధించి కింది వాటిలో సరైన జత ఏది?
    ఎ) క్యారెట్ – భూగర్భకాండం
    బి) అల్లం – ఫలం
    సి) కాఫీ – పరిచ్ఛదం
    డి) శాఫ్రాన్ (కుంకుమ పువ్వు)– కీలాగ్రం
    1) ఎ, డి 2) ఎ, బి
    3) సి, డి 4) ఎ, బి, సి, డి
55. కింది వాటిలో సరికాని జత?

ఎముక పేరు	ఉండే భాగం
ఎ) హ్యూమరస్	– భుజాస్థి
బి) రేడియస్ అల్నా	– మోకాలు
సి) పాలింజెస్	– కపాలం
డి) ఫీమర్	– తొడ ఎముక

    1) ఎ, బి, సి, డి 2) ఎ, బి
    3) బి, డి 4) బి, సి
56. కింది వాటిలో సరైన జత ఏది?
    ఎ) పేలినాలజీ – పరాగ రేణువుల అధ్యయన శాస్త్రం
    బి) పేలియెంటాలజీ – శిలాజాల అధ్యయన శాస్త్రం
    సి) డెండ్రాలజీ – వృక్షాల అధ్యయన శాస్త్రం
    డి) డెండ్రోక్రోనాలజీ – వృక్షాల వయసు నిర్ధారించే శాస్త్రం
    1) ఎ, డి 2) బి, సి
    3) ఎ, సి, డి 4) ఎ, బి, సి, డి

సమాధానాలు

1) 4	2) 4	3) 1	4) 4	5) 3
6) 2	7) 4	8) 2	9) 3	10) 1
11) 2	12) 2	13) 4	14) 4	15) 1
16) 4	17) 3	18) 2	19) 3	20) 4
21) 1	22) 4	23) 2	24) 4	25) 3
26) 1	27) 3	28) 2	29) 3	30) 2
31) 1	32) 4	33) 3	34) 2	35) 3
36) 4	37) 3	38) 1	39) 4	40) 4
41) 3	42) 2	43) 4	44) 1	45) 1
46) 4	47) 2	48) 3	49) 2	50) 1
51) 2	52) 3	53) 4	54) 3	55) 4
56) 4				

At least some pens are books

Model Questions

Directions (Q. No. 1-10): In each question below are given two statements followed by two conclusions numbered I and II. You have to take the given statements to be true even if they seem to be at variance with commonly known facts. Read the following statements and then decide which of the given conclusions logically follows from the given statements, disregarding commonly known facts.

Give answer
1) If only conclusion I follows.
2) If only conclusion II follows.
3) If either conclusion I or II follows.
4) If neither conclusion I nor II follows.
5) If both conclusions I and II follow.


1. **Statements:** No bird is a crow. Some crows are black.
   Conclusions:
   I) At least some birds are black.
   II) Some black which are crows are definitely not birds.
2. **Statements:** No pastry is a cake. No cake is tasty.
   Conclusions:
   I) All pastries are tasty.
   II) Some pastries being tasty is a possibility.
3. **Statements:** All towns are cities. Some cities are urban.
   Conclusions:
   I) At least some towns are urban.
   II) No town is urban.
4. **Statements:** All cars are black. All blacks are beautiful.
   Conclusions:
   I) All cars are beautiful.
   II) At least some beautiful things are black.
5. **Statements:** Some parrots are green. Some birds are parrots.
   Conclusions:
   I) At least some birds are green.
   II) All parrots being bird is a possibility.
6. **Statements:** Some cats are dogs. All dogs are foxes.
   Conclusions:
   I) At least some cats are foxes.
   II) All foxes being cats is a possibility.
7. **Statements:** All books are pens. No pen is a pencil.
   Conclusions:
   I) Some books being pencils is a possibility.
   II) At least some pens are books.
8. **Statements:** All students are teachers. All teachers are readers.
   Conclusions:
   I) All readers may be teachers.
   II) Some readers can never be teachers.
9. **Statements:** No cup is a plate. No plate is a coin.
   Conclusions:
   I) No cup is a coin.
   II) Some coins are cups.
10. **Statements:** Some boys are honest. Some intelligent are boys.
    Conclusions:
    I) All honest being intelligent is a possibility.
    II) All boys are not intelligent.
11. If 'R' denotes '–'; 'Q' denotes '×'; 'W' denotes '÷'; and 'A' denotes '+', then 42 W 7 R 8 A 6 Q 4 = ?
    1) –22 2) –168 3) 22
    4) 28 5) None of these
12. Mohan walked 30 metres towards South, took a left turn and walked 15 metres. He then took a right turn and walked 20 metres. He again took a right turn and walked 15 metres. How far is he from the starting point?
    1) 95 metres 2) 50 metres
    3) 70 metres
    4) Cannot be determined
    5) None of these

BANK EXAMS
REASONING

13. What should come next in the following letter series based on English alphabet?
    CEA IKG OQM ?
    1) STW 2) WUS 3) SWU
    4) UWS 5) None of these
14. The positions of how many digits in the number 59164823 will remain unchanged after the digits are rearranged in descending order within the number?
    1) None 2) One 3) Two
    4) Three 5) More than three
15. What should come next in the following letter series?
    P Q R S T A B C D E P Q R S A B C D E P Q R S A B C D P Q
    1) R 2) T 3) A
    4) B 5) None of these
16. In a certain code language, 'how can you go' is written as 'ja da ka pa', 'can you come here' is written as 'na ka sa ja' and 'come and go' is written as 'ra pa sa'. How is 'here' written in that code language?
    1) ja 2) na 3) pa
    4) Data inadequate
    5) None of these
17. How many such pairs of letters are there in the word TRIBUNAL each of which has as many letters between them in the word as in the English alphabet?
    1) None 2) One 3) Two
    4) Three 5) More than three
18. In a certain code DOWN is written as '5@9#' and NAME is written as '#6%3'. How is MODE written in that code?
    1) %653 2) %@63
    3) %5@3 4) %@53
    5) None of these
19. How many meaningful English words can be formed with the letters 'LGEU' using each letter only once in each word?
    1) None 2) One 3) Two
    4) Three 5) More than three
20. In a certain code THRIVES is written as SIUHRDU. How is SOULFUL written in that code?
    1) VPTKKTE 2) VPTKETK
    3) TPVKKTE 4) TNRKMVG
    5) None of these


Explanation

1. 2;



Only II follows.

2. 2; Possible Venn-diagram is




Thus only II follows.

3. 3; Possible Venn-diagrams are




Thus, either I or II follows.

4. 5;




Thus, both I and II follow.

5. 2; Possible Venn-diagram are



Or




Thus, only II follows.

6. 5; A possible venn-diagram is




Both I and II follow.

7. 2; A possible venn-diagram is




Only II follows.

8. 1; A possible venn-diagram is




Thus, only I follows.

9. 3;



Thus, either I or II follows.

10. 1; A possible Venn-diagram is



Thus, I follows.

11. 3; $42 \div 7 - 8 + 6 \times 4 = 6 - 8 + 24 = 22$
12. 2;
13. 4; Move six letters forward respectively.
14. 3; digits 4 and 2
    The number: 5 9 1 6 4 8 2 3
    In descending
    Order: 9 8 6 5 4 3 2 1
15. 1; PQRST/ABCDE/PQRS/ABCDE/PQRS /ABCD/PQR
16. 2; how can you go = ja da ka pa ... (i)
    can you come here = na ka sa ja ... (ii)
    come and go = ra pa sa ... (iii)
    From (i) and (ii), can you = ja ka .... (iv)
    From (ii) and (iii), come = sa ... (v)
    Using (iv) and (v) in (ii), we get here = na.
17. 5;
    T R I B U N A L
18. 4;
    D O W N A M E
    5 @ 9 # 6 % 3
    ∴ MODE ⇒ % @ 5 3
19. 2; GLUE
20. 1;

